సోమవారం
28•1•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 8 • సంచిక 213
• పేజీలు : 16 + 16

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD



జొకోవిచ్ విజయం

ఏడోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ కైవసం

ఫైనల్లో నాదల్‌పై అలవోకగా గెలుపు • 15 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లతో మూడోస్థానంలోకి

సెర్బియా సూపర్‌స్టార్ నొవాక్ జొకోవిచ్ మళ్లీ మెరిశాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో తనకు తిరుగులేదని చాటిచెప్పాడు. ఆదివారం ఏకపక్షంగా సాగిన పురుషుల సింగిల్స్ తుదిపోరులో ప్రపంచ నంబర్‌వన్ జొకోవిచ్ 6-3, 6-2, 6-3 తేడాతో స్పెయిన్ బుల్ రఫెల్ నాదల్‌పై అలవోక విజయం సాధించాడు. రాడ్ లీవర్ ఎరీనాలో రెండు గంటల పాటు జరిగిన పోరులో జొకో మొదటి సెట్ నుంచే ఆధిపత్యం ప్రదర్శించాడు. కోర్టు నలువైపులా పాదరసంలా కదులుతూ నాదల్‌కు చుక్కలు చూపించాడు. బలమైన సర్వీస్‌లకు తోడు బ్యాక్‌హ్యాండ్, ఫోర్‌హ్యాండ్ షాట్లతో పాయింట్లు కొల్లగొట్టాడు. ఓ దశలో నాదల్ పుంజుకునే ప్రయత్నం చేసినా లాభంలేకపోయింది. ఎక్కడా జోరు తగ్గించని జొకో..మూడో సెట్ గెలిచి అభిమానులతో కలిసి గెలుపు సంబురాల్లో మునిగిపోయాడు. చిరస్మరణీయ విజయంతో సీజన్‌లో ఘనమైన బోణీ కొట్టాడు. ఈ విజయంతో రికార్డు స్థాయిలో ఏడోసారి ఆస్ట్రేలియన్ గ్రాండ్‌స్లామ్ దక్కించుకుని రాయ్ ఎమర్సన్, రోజర్ ఫెదరర్(6 టైటిళ్లు)లను అధిగమించాడు. ఓవరాల్‌గా 15 గ్రాండ్‌స్లామ్ టైటిల్‌తో ఫెదరర్(20), నాదల్(17) తర్వాత మూడో స్థానానికి చేరుకున్నాడు.



విజేత సైనా

ఇండోనేషియా మాస్టర్స్ టైటిల్ కైవసం

భారత బ్యాడ్మింటన్ క్వీన్ సైనా నెహ్వాల్ ఇండోనేషియా మాస్టర్స్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో స్పెయిన్ స్టార్ కరోలినా మారిన్ కాలి గాయంతో అర్ధంతరంగా వైదొలగడంతో సైనా విజేతగా నిలిచింది. 2017 తర్వాత సైనాకు ఇదే తొలి బీడబ్ల్యూఎఫ్ టైటిల్.

వివరాలు ఆటలో

ముంచెత్తిన వాన

రాష్ట్రమంతటా కమ్ముకొన్న కారుమబ్బులు.. ఎడతెరిపిలేని జల్లులు

- కరీంనగర్‌లో అధికంగా 5.89 సెంటీమీటర్ల వర్షం
- మిర్చి, పత్తి, మొక్కజొన్న పంటలకు నష్టం
- అపరాలసాగు రైతుల్లో ఆనందం
- రాష్ట్రమంతటా కొనసాగుతున్న వానలు
- మరో 24 గంటలు ఇదే పరిస్థితి
- 1500 మీటర్ల ఎత్తున ఉపరితల ద్రోణి
- హిందూమహాసముద్రంలో మరో ఆవర్తనం

ప్రత్యేక ప్రతినిధి, హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:

చలిపోయి.. ఎండలు రావాల్సిన సమయంలో రాష్ట్రాన్ని వానలు ముంచెత్తాయి. కాలంకాని కాలంలో కురిసిన అకాల వర్షంతో రైతన్న చేతికందివస్తున్న యాసంగి పంట దెబ్బతిన్నది. రాజధాని హైదరాబాద్ సహా అన్ని జిల్లాల్లో వాన జనజీవనంపై తీవ్ర ప్రభావంచూపింది. ప్రధానంగా మిర్చి, పత్తి, మొక్కజొన్న, కందులు, వేరుశనగ పంటలు నీటిలో మునిగిపోయాయి. పలు జిల్లాల్లో మార్కెట్ యార్డ్‌లకు అమ్మకానికి వచ్చిన దిగుబడి కూడా తడిసిముద్దయింది. శనివారం నుంచి రాష్ట్రమంతటా కారుమబ్బులు కమ్ముకునే ఉన్నాయి. రెండురోజులుగా హైదరాబాద్ సహా అన్ని జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. కరీంనగర్ జిల్లాలో సగటున 5.89 సెంటీమీటర్ల వర్షపాతం నమోదుకాగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తేలికపాటి జల్లులు కురిశాయి. తూర్పు విదర్భ పరిసర ప్రాంతాల్లో సముద్రమట్టానికి 1500 మీటర్ల ఎత్తున ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రభావంతో వాతావరణంలో ఒక్కసారిగా మార్పువచ్చింది. రాత్రి, పగలు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. ఉత్తర ఇంటీరియర్ కర్ణాటక వరకు ఏర్పడిన ఈ ద్రోణి ప్రస్తుతానికి స్థిరంగా కొనసాగుతున్నది. దీని కారణంగానే రాష్ట్రంలో పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. కొన్నిచోట్ల ఉరుములతోకూడిన వానలు పడుతున్నాయి. మరో 24 గంటల్లో ఈ ఉపరితల ద్రోణి బలహీనపడుతుందని వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. దీంతో సోమవారం కూడా పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వానలు పడే

మిగతా 2వ పేజీలో



వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట మండలం కమ్మపల్లిలో వర్షానికి తడిసిన మిర్చి

అప్రమత్తమైన జీహెచ్‌ఎంసీ

కమిషనర్‌కు సీఎం కేసీఆర్ ఫోన్
ఎమర్జెన్సీ బృందాలు సంసిద్ధం
రోడ్ల మరమ్మతులకు కమిషనర్ ఆదేశం



నల్లగొండ జిల్లా కేంద్రంలో వర్షంతో జలమయమైన రోడ్లు



రైతన్నలకు కేంద్రం భారీ తాయిలాలు!

- నిర్ణీత సమయంలో పంట రుణాలు చెల్లించినవారికి వడ్డీ మాఫీ
- ఆహార పంటలపై చెల్లిస్తున్న బీమా ప్రీమియం రద్దు
- తెలంగాణ రైతుబంధు తరహాలో ఖాతాల్లోకి నేరుగా నగదు
- నేడు కేంద్ర క్యాబినెట్ భేటీలో నిర్ణయాలు!

న్యూఢిల్లీ, జనవరి 27: లోక్‌సభ ఎన్నికల వేళ రైతుల్ని ప్రసన్నం చేసుకునే పనిలో కేంద్రం నిమగ్నమైంది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ దారుణ ఓటమి నేపథ్యంలో అన్నదాతల సమస్యల పరిష్కారానికి, వారిలో గూడుకట్టుకున్న అసంతృప్తిని రూపుమాపేందుకు వేగంగా చర్యలు ఆరంభించింది. సోమవారం జరిగే కేంద్ర క్యాబినెట్ సమావేశంలో రైతుల శ్రేయస్సుకు సంబంధించి కీలక నిర్ణయాలు వెలువడే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. రైతుల ఆదాయాల్ని రెట్టింపు చేసే దిశగా భారీ ప్యాకేజీలను కేంద్రం ప్రకటించనున్నట్లు తెలుస్తున్నది. 'కేంద్ర క్యాబినెట్ భేటీ సోమవారం జరుగనున్నది. చిన్న, సన్నకారు రైతుల సంక్షేమమే ప్రధాన అజెండాగా సమావేశంలో చర్చించనున్నారు. రైతులకు ప్రకటించే ప్యాకేజీలపై ఇప్పటికే

మిగతా 5వ పేజీలో

చర్చిలో పేలుళ్లు

ఫిలిప్పీన్స్‌లో బాంబుదాడులకు పాల్పడ్డ మిలిటెంట్లు
20 మంది దుర్మరణం

5

• మూడోవిడుత పంచాయతీ పోరు

ప్రచారానికి నేటితో తెర

9

- బుధవారం 3,533 పంచాయతీలకు పోలింగ్
- బరిలో 11,667 మంది సర్పంచ్ అభ్యర్థులు
- 27,543 వార్డులకు 67,316 మంది పోటీ

31 నుంచి 13 దాకా పార్లమెంట్ సమావేశాలు



30న లోక్‌సభ స్పీకర్, 31న రాజ్యసభ చైర్మన్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశాలు
1న తాత్కాలిక బడ్జెట్
మోదీ సర్కారుకు ఇవే చివరి పార్లమెంట్ సమావేశాలు

5

కొత్త నోట్ల రూపంలో నల్లధనం తిరిగొచ్చింది!

4

ఇండియాటుడే-కార్వీ సర్వేలో 46% మంది అభిప్రాయం



చందా కొచ్చర్

11


ఐసీఐసీఐ బ్యాంక్-వీడియోకాన్ కేసులో సమాచారం లీకు! సీబీఐ అధికారి ఔట్

పేదల గుండెకు సర్కారు అండ

గుండెసంబంధ చికిత్సలకు 825 కోట్లు వెచ్చించిన ప్రభుత్వం

విస్తరిస్తున్న గుండెసంబంధ వ్యాధులు

తలసరి ఆదాయంలో 20% వైద్యానికే ఖర్చుచేస్తున్న ప్రజలు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

గుప్పెడంత గుండెకు ప్రమాదం పొంచి ఉంటున్నది. దేశంలో అధికశాతం మరణాలకు గుండెసంబంధ వ్యాధులే ప్రధాన కారణమవుతున్నాయి. గుండెసంబంధిత చికిత్సలు, మందుల కొనుగోలు కోసం తెలంగాణలో ఏటా రూ.450 కోట్ల వరకు ఖర్చవుతున్నట్లు అంచనా. ఆరోగ్యశ్రీ, సీఎంఆర్‌ఎఫ్ ద్వారా గడచిన నాలుగేండ్లలో ఏటా సగటున రూ.206 కోట్ల వరకు ఖర్చుచేయగా.. మెడికల్ ఇన్సూరెన్సు సంస్థలు అందించే బీమా, ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులకు ఆయా సంస్థలు ఇచ్చే మెడికల్ రీయింబర్స్‌మెంటు, వ్యక్తులు సొంతంగా చేసే ఖర్చు మొత్తం రూ.200 కోట్ల వరకు ఉన్నట్లు తెలుస్తున్నది. తెలంగాణలో ప్రజల తలసరి ఆదాయం రూ.1,58,360 కాగా.. ఆ మొత్తంలో వైద్యానికి చేస్తున్నఖర్చు 20 శాతం వరకు ఉన్నట్లు అంచనా. ఇందులో అధికశాతం గుండెసంబంధ సమస్యలకు వెచ్చిస్తున్నారు. నానాటికి విస్తరిస్తున్న గుండెసంబంధ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు

మిగతా 2వ పేజీలో



నీలకంఠ రొయ్యలు

నీలకంఠ.. కోట్ల పంట!

గతేడాది 11 రిజర్వాయర్లలో 1.08 కోట్ల రొయ్యపిల్లల సాగు

- రూ.1.33 కోట్ల పెట్టుబడితో మత్స్యకారులకు రూ.8.06 కోట్లు లాభం
- ఈ ఏడాది 24 రిజర్వాయర్లలో 3.19 కోట్ల రొయ్యలు సాగు
- ఫిబ్రవరి, ఏప్రిల్ మధ్య మార్కెట్లోకి నీలకంఠ రొయ్యలు
- 25 వేల మంది మత్స్యకారులకు లబ్ధిచేకూరే అవకాశం

3

పెద్దపులి హంతకుల అరెస్ట్

- పోలీసుల అదుపులో నలుగురు, పరారీలో మరో ఐదుగురు
- విద్యుత్ తీగలకు తగిలి పెద్దపులి మృతిచెందినట్టు నిర్ధారణ



నిందితులు మేకల నర్సయ్య, బీచుపల్లి కొమురయ్య, దండవేణి సాయిలు, నర్సింగోజుల రవీందర్

మంచిర్యాల రూరల్: మంచిర్యాల జిల్లా మందమర్రిలోని రామన్‌కాలనీలో దొరికిన పెద్దపులి చర్మం కేసు చిక్కుముడి వీడింది. మంచిర్యాల జిల్లా శివ్వారం గ్రామానికి చెందిన దండవేణి సాయిలు పెద్దపులిని హతమార్చినట్టు అటవీ అధికారులు తేల్చారు. అతడితోపాటు సహకరించిన మరో ముగ్గురిని కూడా ఆదివారం రిమాండ్‌కు తరలించారు. మంచిర్యాల ఫారెస్ట్ డివిజనల్ అధికారి జేవీ రావు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపులిని హతమార్చిన కేసులో శుక్రవారం దండవేణి సాయిలును అదుపులోకి తీసుకొని విచారించారు. పులి అవశేషాలను సేకరించిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు, అటవీశాఖ అధికారులు సంయుక్తంగా విచారణ చేపట్టి కేసు గుట్టు విప్పారు. వన్యప్రాణులను హతమార్చేందుకు విద్యుత్ తీగలను అమర్చగా.. ఆ తీగలకు పెద్దపులి చిక్కుకొని మరణించింది. సాయిలుకు అదే గ్రామానికి చెందిన తోకల బుచ్చిరాజం, తోకల మల్లయ్య సహకరించారు. పులి చర్మాన్ని విక్రయించేందుకు మందమర్రి రామన్‌కాలనీకి చెందిన అయిలవేణి అంజయ్య.. మంచిర్యాలకు చెందిన నర్సింగోజుల రవీందర్, పెద్దపల్లి జిల్లాకు చెందిన మేకల నర్సయ్య, మంథని మండలం నాగారానికి చెందిన బీచుపల్లి కొమురయ్య, గోదావరిఖని తిలక్‌నగర్ నివాసి పూర్ణ, మందమర్రి రామన్‌కాలనీకి చెందిన అయిలవేణి సాగర్ సహకారం తీసుకొన్నాడు. నిందితుడు సాయిలును వెంట తీసుకెళ్లిన పోలీసులు.. పెద్దపులి చర్మం వలిచిన ప్రదేశం, కరెంట్ తీగలు అమర్చిన స్థలం, పులి కాళ్లు పడేసిన, పులిగోర్లను దాచిన స్థలాన్ని గుర్తించారు. ప్రధాన నిందితుడు దండవేణి సాయిలుతోపాటు మేకల నర్సయ్య, బీచుపల్లి కొమురయ్య, నర్సింగోజుల రవీందర్‌ను రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న మరో ఐదుగురిని పట్టుకొనేందుకు గాలింపు ముమ్మరంచేశారు.



ఈ నెల 25న శివ్వారం అటవీ ప్రాంతంలో పులి ఎముకలను పరిశీలిస్తున్న అటవీ అధికారులు

అటవీ చెక్‌పోస్టుల్లో పోలీసులు

- రెండుశాఖల సమన్వయంతో స్మగ్లింగ్‌కు చెక్
- అటవీనేరాలపై ఉన్నతస్థాయి సమావేశంలో నిర్ణయం
- నేడు అన్ని జిల్లాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

హైదరాబాద్,నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో కలప స్మగ్లింగ్‌ను పూర్తిగా అరికట్టడంతోపాటు అటవీనేరాలను అదుపుచేయడానికి అటవీ చెక్‌పోస్టుల్లో అటవీశాఖ సిబ్బందితోపాటు పోలీసులను కూడా విధుల్లో ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి కార్యాలయం ముఖ్య కార్యదర్శి నర్సింగ్‌రావు అధ్యక్షతన ఆదివారం జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో పోలీసులు, అటవీశాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో అడవిని రక్షించడానికి చేపట్టాల్సిన ఉమ్మడి వ్యూహంపై చర్చ జరిగింది. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికను ఖరారుచేయాలని సమావేశంలో నర్సింగ్‌రావు ఆదేశించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి కార్యాలయం ప్రత్యేక కార్యదర్శి భూపాల్‌రెడ్డి, ఓఎస్డీ ప్రియాంక వర్గీస్, డీజీపీ మహేందర్‌రెడ్డి, అటవీశాఖ పీసీసీఎఫ్ ప్రశాంత్‌కుమార్ ఝా, రఘువీర్, మునీంద్ర తదితరులు పాల్గొన్నారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి అధ్యక్షతన సచివాలయం నుంచి వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించాలని నిర్ణయించారు. ఇందులో అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, అటవీ, పోలీస్‌శాఖలకు చెందిన అన్నిస్థాయిల అధికారులు పాల్గొంటారు.

కలప స్మగ్లర్‌పై పీడీ యాక్టు.. జైలుకు తరలింపు

ఆదిలాబాద్ టౌన్: ఆదిలాబాద్ జిల్లాలోని సిరికొండ మండలం కేశవపట్నం గ్రామానికి చెందిన కలప స్మగ్లర్ షేక్ షబ్బీర్‌పై పోలీసులు శనివారం పీడీ యాక్టు కింద కేసు నమోదు చేసి హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఆదిలాబాద్ జిల్లాలో యథేచ్ఛగా కలప స్మగ్లింగ్ జరిగిన విషయం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. అటవీ సంపదను పరిరక్షించడానికి కలప స్మగ్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఎస్పీ విష్ణు వారియర్ కలప స్మగ్లర్‌పై పీడీ యాక్టు కేసు నమోదు చేశారు. త్వరలో మరికొందరిపై పీడీ యాక్టు కేసులు నమోదు చేయనున్నట్టు ఎస్పీ పేర్కొన్నారు. అటవీ, పోలీసు అధికారులు సంయుక్తంగా ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సాయుధ పోలీసులతో అటవీ ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టి కలప అక్రమ రవాణాను అడ్డుకుంటామని పేర్కొన్నారు.

ముంచెత్తిన వాన

మొదటిపేజీ తరువాయి...

అవకాశమున్నదని పేర్కొన్నారు. మరోవైపు ఆగ్నేయ బంగాళాఖాతంలో మరో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. హిందూ మహాసముద్రంలో అండమాన్ నికోబార్ మీదుగా ఏర్పడిన ద్రోణి ప్రభావం తెలంగాణపై నామమాత్రంగానే ఉంటుందని అధికారులు చెప్తున్నారు. రాయలసీమ, మహబూబ్‌నగర్‌లో తేలికపాటి వానలు కురుస్తాయని పేర్కొన్నారు. రాజధాని హైదరాబాద్‌లో శనివారం రాత్రినుంచి ఎడతెరిపి లేకుండా వర్షం పడటంతో జీహెచ్‌ఎంసీ అప్రమత్తమైంది. మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలను సంసిద్ధంచేశారు. 24 గంటలపాటు మూడు షిఫ్టుల్లో పనిచేయాలని కమిషనర్ దానకిశోర్ అధికారులను ఆదేశించారు.



ఆదివారం వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం కుడుగుంటలో నేలకొరిగిన పసుపు పంట

రైతన్నకు ఆందోళన

ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లిలో 0.72 సెం.మీ. వర్షం కురిసింది. ఖమ్మం నగరంతోపాటు పలుమండలాల్లో ఎడతెరపిలేకుండా కురిసిన వానలకు మక్కజొన్న పంట స్వల్పంగా నష్టపోయింది. అపరాల సాగు రైతులు ఈ వానల పట్ల సంతోషం వ్యక్తంచేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మిర్చి పంట తీవ్రంగా నష్టపోగా మామిడిపూత పెద్ద ఎత్తున రాలిపోయింది. మహబూబ్‌నగర్ జిల్లాలో సగటున 2.2 సెం.మీ. వర్షపాతం నమోదైంది. జిల్లాలో ఆరుతడి పంటలకు ఈ వానల మూలంగా మేలు జరిగిందని రైతులు అంటున్నారు. నర్వమండలంలో విక్రయానికి సిద్ధంగా ఉంచిన కందులు తడిసిపోయాయి. కొల్లాపూర్ మార్కెట్‌లోనూ 5300 బస్తాల కందులు నీటమునిగాయి. వనపర్తిలో అకాల వర్షానికి వేరుశనగపంట పూర్తిగా దెబ్బతిన్నది. ఎమ్మెల్యే సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సహకారంతో రైతులను ఆదుకొంటామని మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ కుమార్‌యాదవ్ భరోసా ఇచ్చారు. గద్వాలలో 1.18 సెం.మీ. వర్షపాతం నమోదైంది. పలు మండలాల్లో ఇటుకబట్టీలు కరిగిపోయాయి. మిర్చి, పొగాకు, వేరుశనగ పంటలు దారుణంగా నష్టపోయాయి. వరంగల్ అర్బన్ జిల్లాలో సగటున 2.73 సెం.మీ. వర్షపాతం నమోదైంది. చేనుమీదున్న పత్తి నష్టపోయింది. అక్కడక్కడా ఏరి ఆరబోసిన మిర్చి పంట తడిసిపోయింది. వరంగల్ గ్రామీణ జిల్లాలోని 14 మండలాల్లోనూ అకాల వర్షంతో మిర్చి, మక్కజొన్న, పత్తి పంటలు తీవ్రంగా నష్టపోయాయి. జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లాలో 4.24 సెం.మీ. వర్షం పడినట్లు అధికారులు వెల్లడించారు. అకాలవర్షంతో పత్తికాయలు తడిసిపోయి పనికిరాకుండాపోయాయి. 30 వేల ఎకరాల్లో సాగుచేసిన మిర్చి పంట వానల్లో తడిసి నానిపోయింది. పలుచోట్ల కళ్లాల్లో ఆరబోసిన మిర్చి శనివారం రాత్రి కురిసిన వానకు కొట్టుకుపోయింది. జనగామ జిల్లాలో 1.95 సెం.మీ. వర్షపాతం నమోదైంది. జిల్లాలో మిర్చి, పుచ్చతోటలు దెబ్బతిన్నాయి. సంగారెడ్డి జిల్లాలో తేలికపాటి వర్షమే పడింది. మెదక్ జిల్లాలో 0.58 సెం.మీ. వర్షపాతం నమోదుకాగా ఎలాంటి పంటనష్టం జరుగలేదని అధికారులు చెప్పారు. సిద్దిపేట అర్బన్ మండలంలో 9.84 సెం.మీ. వర్షం కురిసింది. వికారాబాద్ జిల్లాలో 1.5 సెం.మీ. వర్షం కురిసింది. ఈ జిల్లాలో పసుపుపంటకు నష్టం వాటిల్లింది. కరీంనగర్ జిల్లాలో సగటున 5.89 సెం.మీ. వర్షపాతం నమోదుకాగా 170 ఎకరాల్లో పంటనష్టం జరిగింది. పెద్దపల్లిలో 168.2 ఎకరాల్లో పంటలు నష్టపోయాయి. ఇక్కడ 2.92 సెం.మీ. వర్షపాతం నమోదైంది. మంచిర్యాలలో 0.93 సెం.మీ. వర్షపాతం నమోదుకాగా ఎలాంటి పంటనష్టం జరుగలేదని అధికారులు తెలిపారు. నల్లగొండ జిల్లాలో తేలికపాటి జల్లులు పడ్డాయి. సూర్యాపేట జిల్లాలో నాలుగు మండలాల్లో నాలుగు సెంటీమీటర్ల వర్షం నమోదైంది. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఎడతెరిపిలేకుండా పడుతున్న వానలకు యాదాద్రి క్షేత్రంలో భక్తులు ఇక్కట్లు పడ్డారు. రాజాపేట మండలంలో అత్యధికంగా 4.54 సెం.మీ. వర్షం కురిసింది.



ఆదివారం సూర్యాపేట జిల్లా నడిగూడెంలో కురుస్తున్న వర్షం

హైదరాబాద్ అప్రమత్తం

శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం 8 గంటల వరకు హైదరాబాద్‌లో సగటున 1.01 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణశాఖ అధికారులు చెప్పారు. నగరంలోని చాలా ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకోవడంతో హైదరాబాద్ మహానగరపాలక సంస్థ అప్రమత్తమైంది. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అవసరమైన అన్నిచోట్ల తగిన ఏర్పాట్లు చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ దానకిశోర్ అధికారులను ఆదేశించారు. దానకిశోర్‌కు ముఖ్యమంత్రి కేసీఆర్ ఫోన్‌చేసి అప్రమత్తం చేయడంతో జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సిస్టం ద్వారా నగరంలోని పరిస్థితులను కమిషనర్ సమీక్షించారు. వానలవల్ల దెబ్బతిన్న రోడ్లను వెంటనే పునరుద్ధరించాలని ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి రోడ్ల మరమ్మతు పనులను వెంటనే చేపట్టాలని చెప్పారు. మళ్లీ వర్షం రావచ్చని హైదరాబాద్ వాతావరణశాఖ హెచ్చరించడంతో అధికారులు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలని.. పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వర్షపునీరు సజావుగా వెళ్లడానికి మ్యాన్‌హోల్స్‌లో చెత్తను తొలిగించాలని ఆదేశించారు. అన్ని సహాయక బృందాలు రాత్రి కూడా క్షేత్రస్థాయిలో వర్షం వల్ల ఏర్పడే ఎటువంటి సవాలునైనా స్వీకరించేందుకు సంసిద్ధంగా ఉండాలని సూచించారు. ఎస్‌ఈలు, ఈఈలు, డిప్యూటీ ఈఈ, ఏఈఈ, ఏఈలు అత్యవసర పరిస్థితుల్లో సేవలందించడానికి అవసరమైన ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలన్నారు. ప్రతీ ఒక్కరూ తమ పరిధిలోని పరిస్థితులను నిశితంగా గమనించాలని సూచించారు. ఈ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేదిలేదని హెచ్చరించారు. జీహెచ్‌ఎంసీ విపత్తుల నివారణ డైరెక్టర్ విశ్వజిత్ కంపాటితో కలిసి పలు ప్రాంతాలను పరిశీలించారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ అంజనీకుమార్ ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించారు.

'స్మగ్లింగ్' పోలీసులపై వేటు

- కలప అక్రమరవాణాకు సహకరించిన ఎస్సై, సీఐ సస్పెన్షన్

హైదరాబాద్/ఆదిలాబాద్ అర్బన్, నమస్తే తెలంగాణ: కలప అక్రమ రవాణా వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఇద్దరు పోలీసు అధికారులపై వేటుపడింది. ఇటీవల ఇచ్చోడ నుంచి వ్యాన్‌లో రూ.16 లక్షలు విలువచేసే కలపను నిజామాబాద్ తరలిస్తుండగా నిర్మల్ పోలీసులు పట్టుకున్న సంగతి తెలిసిందే. కలప అక్రమ రవాణాలో ఇచ్చోడ సీఐ సతీశ్‌కుమార్, నేరడిగొండ ఎస్సై హరిశేఖర్ ప్రమేయం ఉన్నట్టు ఆరోపణలు వచ్చాయి. దీంతో ఈ ఇద్దరిని కరీంనగర్ రేంజ్ డీఐజీ ప్రమోద్‌కుమార్‌కు అటాచ్‌చేశారు. ఉన్నతాధికారుల విచారణలో వీరిద్దరూ కలప అక్రమరవాణాకు సహకరిస్తున్నట్టు తేలింది. దీంతో వీరిని కరీంనగర్ రేంజ్ డీఐజీ సస్పెండ్ చేశారు.

పేదల గుండెకు సర్కారు అండ

మొదటిపేజీ తరువాయి...

చేపడుతున్నది. పేదలకు ఉచిత వైద్యసేవలు అందించడంతోపాటు జిల్లాస్థాయిలో అధునాతన సౌకర్యాల కల్పనపై దృష్టిసారించింది. రాష్ట్ర ప్రభుత్వం గడచిన నాలుగేండ్లలో గుండెసంబంధ వ్యాధుల చికిత్స కోసం రూ.825కోట్లు వెచ్చించింది. ఇందులో ఆరోగ్యశ్రీ ద్వారా రూ.665.17 కోట్లు, ప్రభుత్వ దవాఖానలు, ఈహెచ్‌ఎస్, సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.159.83 కోట్ల వరకు ఖర్చుచేశారు.

గుండె జబ్బులకు కారణాలు

- జన్యుపరంగా వచ్చే మార్పులతో ఎక్కువమంది గుండెపోటుకు గురవుతున్నారు.
- ప్రతి వెయ్యిమందిలో 15-20మంది వరకు గుండెజబ్బు బారినపడుతున్నారు.
- కొందరికి 25ఏండ్లకే గుండె జబ్బు వస్తున్నది. ఒత్తిడి, మధుమేహం, ధూమపానం, మద్యపానం, రక్తపోటు వంటివి దీనికి ఆజ్యం పోస్తున్నాయి.

నివారణమార్గాలు

- పొగతాగడం మానెయ్యాలి. ఇల్లు, ఇంటి పరిసరాల్లో సిగరెట్, ఇతర పొగాకు ఉత్పత్తుల వాడకాన్ని నిషేధించాలి. దీంతో కుటుంబ సభ్యులు ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చు.
- రోజులో రెండుగంటలకు మించి టీవీ ముందు కూర్చో కూడదు.
- పార్కుల్లో ఆటలు, విహారాలు వంటివి కుటుంబసమేతంగా తరచూ నిర్వహించాలి.
- బీఎంఐ ప్రకారం ఉండాల్సిన బరువును, ఒంట్లోని కొవ్వులను, రక్తపోటును, గ్లూకోజ్‌స్థాయిలను తరచుగా పరీక్షించుకుంటూ ఉండాలి.
- ఒకేచోట ఎక్కువసేపు కదలకుండా కూర్చోవడం తగదు.
- సమతుల ఆహారం తీసుకోవాలి.
- కొలెస్ట్రాల్ పెరుగకుండా చూసుకోవాలి.
- రక్తపోటును అదుపులో ఉంచుకోవాలి.
- మధుమేహాన్ని నియంత్రణలో ఉంచుకోవాలి.
- తగినంత నిద్రపోవాలి.

వ్యాయామంతో ఆరోగ్యం

- ప్రతిరోజు వ్యాయామంచేస్తే ఆరోగ్య సమస్యలు తగ్గిపోతాయని వైద్యులు సూచిస్తున్నారు. ఈ-మెయిల్, వాట్సప్ తదితర చాటింగ్‌లు మానేసి ఒకరితో ఒకరు నేరుగా మాట్లాడుకునే పరిస్థితులు కల్పించుకోవాలని సూచిస్తున్నారు. గుండెపోటు వచ్చిన తర్వాత కంటే.. రాకముందే జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు.

ముహూర్తం



సూర్యోదయం: 6.53 గంటలకు



సూర్యాస్తమయం: 6.05 గంటలకు

విళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, కృష్ణపక్షం, అష్టమి మధ్యాహ్నం 2.31 వరకు, తదుపరి నవమి, నక్షత్రం: స్వాతి మధ్యాహ్నం 2.29 వరకు, తదుపరి విశాఖ, అమృతఘడియలు: తె. 5.39 నుంచి ఉదయం 7.15 వరకు, రాహుకాలం ఉదయం 8.17 నుంచి 9.41 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 12.07 నుంచి 12.51 వరకు, తిరిగి మధ్యాహ్నం 3.06 నుంచి 3.51 వరకు, వర్జ్యం: రాత్రి 8.16 నుంచి 9.52 వరకు.

లోకం పోకడ



అల్లుడి కట్నంగా ఓట్లు డిమాండ్ చేయండి సార్!

రిజిస్ట్రేషన్ ఆఫీసుల్లో నగదుకు చెక్

- రూ. వెయ్యికి మించితే ఆన్‌లైన్‌లో చెల్లింపు
- నిధుల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు పకడ్బందీ విధానం
- ఈ-స్టాంపుల తరహాలోనే అన్ని వ్యవహారాలు

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ: సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఒక్కపైసా కూడా దుర్వినియోగం కాకుండా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కట్టుదిట్టమైన చర్యలను తీసుకుంటున్నది. ఒక వ్యవహారంలో వేయి రూపాయలకు మించి లావాదేవీలుండరాదని ఆ శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్, కమిషనర్ చిరంజీవులు ఆదేశాలు జారీచేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా లక్సెట్టిపేట, భైంసా రిజిస్ట్రార్ కార్యాలయాలతోపాటు, తాజాగా హైదరాబాద్‌లోని మూసాపేట, వెస్ట్ మారేడ్‌పల్లి రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లోనూ అక్రమాలు వెలుగుచూశాయి. ఈ నేపథ్యంలో రూ. వేయికి మించిన నగదు వ్యవహారాలను నిలిపివేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. రెండేండ్ల కిందట రిజిస్ట్రేషన్‌శాఖలో అమల్లోకి వచ్చిన ఈ-స్టాంపుల విధానం తరహాలో స్టాంప్ కౌంటర్లలో ఇతర లావాదేవీలు నిర్వహించాలని నిర్ణయించారు. స్టాంప్ పేపర్లు అవసరం ఉన్నవారు సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయాలలోని స్టాంప్ కౌంటర్లలో డబ్బులు చెల్లించి పొందవచ్చు. ఆ కౌంటర్‌లో జమ అయిన సొమ్మును సబ్‌రిజిస్ట్రార్లు ట్రెజరీకి జమచేస్తారు. దీంతోపాటు ఏదైనా ఆస్తి దస్తావేజుకు సంబంధించి రిజిస్ట్రేషన్ జరిగేటప్పుడు ఈ-చలానాలో ఏదైనా తక్కువ మొత్తం చెల్లిస్తే అత్యవసర పరిస్థితుల్లో కొనుగోలుదారులకు ఇబ్బంది లేకుండా సబ్‌రిజిస్ట్రార్లు మిగిలిన సొమ్మును నగదురూపంలో తీసుకొనే అవకాశం ఉన్నది. మరోవైపు బ్యాంకు రుణాలు, వాహనాల రిజిస్ట్రేషన్‌లు, ఫైనాన్స్ సంస్థల అప్పులు, ఇతర ఒప్పందాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ కార్యాలయాలలో ఫ్రాంకింగ్ చేయించాల్సి ఉంటుంది. ఒక్కోరోజు పదివేల రూపాయలకు పైగా ఫ్రాంకింగ్ ద్వారా వసూలవుతుంటాయి. ఇకపై స్టాంప్ వెండర్లకు స్టాంపులు అమ్మినా వారివద్ద నుంచి నగదు రూపంలో వేయి రూపాయల కంటే ఎక్కువ వసూలు చేయడానికి వీలుండదు. రిజిస్ట్రేషన్ రుసుంకు కూడా అదే వర్తిస్తుంది. మిగతా మొత్తాన్ని ఆన్‌లైన్‌లో కానీ ఈ-స్టాంపుల విధానంలో చలానా ద్వారా కానీ చెల్లించాల్సి ఉంటుంది. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రూ. వేయి కంటే ఎక్కువ మొత్తంలో నగదు వ్యవహారాలు జరుగకుండా జిల్లా రిజిస్ట్రార్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కమిషనర్ చిరంజీవులు ఆదేశాలు జారీచేశారు. ప్రతీ నెలాఖరులో జిల్లా రిజిస్ట్రార్, సబ్‌రిజిస్ట్రార్లు సంయుక్తంగా నగదు వ్యవహారాలపై నివేదికను సమర్పించాలని సూచించారు.



ఈ-స్టాంపుల ద్వారా రూ.16వేల కోట్లు

సులభతరహా వాణిజ్య విధానంలో స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ ప్రవేశపెట్టిన ఎలక్ట్రానిక్ స్టాంపుల విధానం దేశంలో ఇతర రాష్ర్టాలకు ఆదర్శంగా నిలిచింది. దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్రభుత్వమే పూర్తి పారదర్శకంగా అమలుచేస్తున్న ఈ-స్టాంపుల విధానం మంచి ఫలితాలనిచ్చింది. అక్రమాలకు, మోసాలకు పూర్తిగా అడ్డుకట్ట వేయడమే కాకుండా రిజిస్ట్రేషన్‌ల ద్వారా వచ్చే రాబడి నేరుగా సర్కార్ ఖజానాలో చేరుతున్నది. స్థానిక సంస్థలకు వెంటనే బదిలీ అవుతున్నది. చలానాల ట్యాంపరింగ్, దుర్వినియోగం వంటి అక్రమాలకు పూర్తిగా తెరపడింది. రెండేండ్లలో ఈ-స్టాంపుల విధానంలో భూములు ఇతర స్థిరాస్తుల క్రయ, విక్రయాల వల్ల సుమారు రూ. 16 వేల కోట్లు వసూలయ్యాయి. ఎలక్ట్రానిక్ స్టాంపుల విధానం ఇతర రాష్ర్టాలకు మార్గదర్శకంగా నిలిచిందని స్టాంపులు,రిజిస్ట్రేషన్‌శాఖ జాయింట్ కమిషనర్ వేముల శ్రీనివాస్ తెలిపారు. చలానాల విధానాన్ని ఏజెన్సీలకు అప్పగించకపోవడం వల్ల ప్రభుత్వానికి భారం కూడా తప్పిందని చెప్పారు.

జిల్లా పరిశ్రమల కేంద్రాలు బలోపేతం

- నిధుల కేటాయింపునకు కేంద్రం సుముఖత
- కేంద్రం లేఖతో ప్రతిపాదనలు సిద్ధంచేసిన అధికారులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జిల్లా పరిశ్రమల కేంద్రాలను (డీఐసీ) బలోపేతం చేసే దిశగా నిధుల కేటాయింపునకు కేంద్రం ముందుకొచ్చింది. అవసరమైన ప్రతిపాదనలు పంపించాల్సిందిగా రాష్ర్టాలకు కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వశాఖ (ఎమ్మెస్‌ఎంఈ)లేఖ రాసింది. జిల్లాస్థాయిలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన సమాచారాన్ని, సలహాలు, సూచనలు, అందుబాటులో ఉన్న వనరులను వివరించడం, ప్రోత్సాహకాలు, తనిఖీలు.. ఇలా అన్నింటికీ కీలకమైనవి డీఐసీలు. వీటిని బలోపేతం చేయడం ద్వారా జిల్లాస్థాయిలో పటిష్ఠమైన వ్యవస్థ తయారవుతుందనేది కేంద్రం ఆలోచన. కొన్నేండ్లు గా డీఐసీలకు కేంద్రం నుంచి ఎలాంటి నిధులు అందడంలేదు. తెలంగాణతోపాటు అనేక రాష్ర్టాలు డీఐసీల బలోపేతానికి నిధులు కేటాయించాలని కేంద్రాన్ని కోరాయి. ఇటీవల ఎమ్మెస్‌ఎంఈలపై దృష్టిపెట్టిన కేంద్రం.. డీఐసీలకు నిధులు కేటాయింపుపై సానుకూలత వ్యక్తంచేసింది. కేంద్రం లేఖ నేపథ్యంలో రాష్ట్రంలోని డీఐసీలకు అవసరమైన సాయంపై తెలంగాణ అధికారులు ప్రతిపాదనలు సిద్ధంచేశారు. కొత్త జిల్లాల్లో కలెక్టరేట్ భవనాల్లో డీఐసీలు కొనసాగుతుండగా.. పాత జిల్లాల్లో అద్దె భవనాల్లో ఉన్నాయి. అధ్వాన్నస్థితితో అద్దె ఇండ్లల్లో నడుస్తున్న కార్యాలయాల నిర్వహణ, మరమ్మతుతోపాటు ఫర్నీచర్, కంప్యూటర్ల కొనుగోలు, కనీసం ఇద్దరు సిబ్బందికి వేతనాలు చెల్లించేందుకు అవసరమైన నిధులు మంజూరుచేయాలని ప్రతిపాదనలు చేసినట్టుగా సమాచారం.



రెడ్డి జనసంఘం ఆధ్వర్యంలో విద్యార్థినికి స్కాలర్‌షిప్ పంపిణీచేస్తున్న స్పీకర్ పోచారం, మాజీ మంత్రి నాయిని

పేదలకు సాయంలో ముందుండాలి

- రెడ్డి జనసంఘం కార్యక్రమంలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పిలుపు
- ఇతరులకూ సాయపడటం అభినందనీయం: మాజీ హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి

బేగంబజార్: పేదలకు సాయం అందించడంలో ప్రతి ఒక్కరూ ముందుండాలని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. పేద విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం ఆర్థికసాయం అందించడం ముదావహమన్నారు. ఆదివారం అబిడ్స్‌లోని రాజా బహదుర్ వెంక్రటామిరెడ్డి హాస్టల్ ఆవరణలో రెడ్డి జనసంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీచేశారు. ఇందుకు సహకరించిన పలువురు దాతలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పోచారం మాట్లాడుతూ.. ఎంతో మంది పేద విద్యార్థులకు రెడ్డి జనసంఘం సేవలందిస్తుండటం అభినందనీయమన్నారు. ఉపకారవేతనాలు పొంది చదువుకొన్నవారు తిరిగి సమాజానికి ఉపయోగపడేలా ఎదుగాలని ఆకాంక్షించారు. విద్యతోపాటు వ్యవసాయాభివృద్ధికి సీఎం కేసీఆర్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషిచేస్తున్నదని చెప్పారు. మాజీ హోంమంత్రి, ఎమ్మెల్సీ నాయిని నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. రెడ్డి సామాజిక వర్గానికే కాకుండా ఇతర నిరుపేద విద్యార్థులకు కూడా ఉపకారవేతనాలు అందించడం అభినందనీయమన్నారు. తొలిసారి సివిల్స్ ప్రిపేర్ అవుతున్న ఐదుగురికి స్కాలర్‌షిప్ అందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, టామ్‌కామ్ చైర్మన్ బీ రంగారెడ్డి, రెడ్డి జనసంఘం సలహాదారు ప్రొఫెసర్ కంచర్ల దశరథ్‌రెడ్డి, అధ్యక్షుడు వేంరెడ్డి నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షులు సుకన్యారెడ్డి, స్వరూపారాణి, తీగల బాల్‌రెడ్డి, గౌరి వెంకటరామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కాశిరెడ్డి పాండురంగారెడ్డి, కోశాధికారి వీ వీరారెడ్డి, కార్యదర్శి బీ మధుసూదన్‌రెడ్డి, సభ్యులు ఎంబీ మోహన్‌రెడ్డి, మర్రి ప్రభాకర్‌రెడ్డి, ఎన్ సుధాకర్‌రెడ్డి, ఎం భారతి, జైపాల్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లిలో పోలీసులు స్వాధీనం చేసుకున్న జింక కొమ్ములు

పెగడపల్లిలో జింక కొమ్ములు లభ్యం

కాల్వశ్రీరాంపూర్: పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లిలో ఆదివారం జింక కొమ్ములు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై షేక్‌మస్తాన్ తెలిపారు. పెగడపల్లి గ్రామానికి చెందిన పిక్కల కుమార్ ఇంట్లో జింక కొమ్ములు ఉన్నట్టు సమాచారం అందడంతో అతడి ఇంటిని సోదా చేయగా జింక కొమ్ములు దొరికాయన్నారు. జింక కొమ్ములు, నిందితుడు కుమార్‌ను అటవీశాఖ అధికారులకు అప్పగించినట్టు పేర్కొన్నారు. ఈ విషయంపై విచారణ జరుపుతున్నామన్నారు.



ఆదివారం యాదాద్రి కొండపైన స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లలో వేచివున్న భక్తులు

యాదాద్రికి భారీగా తరలివచ్చిన భక్తులు

- శ్రీవారి ఖజానాకు రూ.28,86,050 ఆదాయం

యాదాద్రి భువనగిరి జిల్లాప్రతినిధి, నమస్తే తెలంగాణ: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రంలో తిరు వీధులన్నీ భక్తజనసంద్రంగా మారాయి. సత్య నారాయణస్వామి వ్రతాలు ఆచరించేందుకు వేల మంది భక్తులు తరలిరావడంతో మండపాలు కిక్కిరిసిపోయాయి. తెలుగురాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. భక్తులు కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి.. విష్ణుపుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. స్వామివారి ఖజానాకు రూ. 28,86,050 ఆదాయం సమకూరింది. తెలంగాణ ఫిలిం చాంబర్ అధ్యక్షుడు రామకృష్ణ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేకపూజలు చేశారు. ఆయనకు ఆలయ అర్చకులు ఆశీర్వచనం చేసి శ్రీవారి ప్రసాదం అందజేశారు. ముసురుతో భక్తులు ఇబ్బంది పడ్డారు.



సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల్లో లష్కర్‌వారం సందర్భంగా ఆదివారం బోనాలు సమర్పించేందుకు వెళ్తున్న భక్తులు

మైమరపించిన కావ్యధార







బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో మూడురోజులుగా జరుగుతున్న హైదరాబాద్ లిటరరీ ఫెస్ట్‌లో ఆదివారం ముగింపు కార్యక్రమంలో కవితను వినిపిస్తున్న ప్రముఖ హిందీ కవి కైఫీ ఆజ్మీ కుమార్తె షబానా ఆజ్మీ, ప్రముఖ నటి, గాయని ఇలా అరుణ్.. మాట్లాడుతున్న రాష్ట్ర ఐటీశాఖ కార్యదర్శి జయేశ్‌రంజన్, ప్రముఖ నృత్యకారిణి మల్లికా సారాభాయి.. కార్యక్రమానికి హాజరైన సాహితీప్రియులు

- ముగిసిన హైదరాబాద్ లిటరరీ ఫెస్ట్
- కళలు, సాహితీ, సంస్కృతులపై కొనసాగిన అతి పెద్ద పండుగ
- సాహిత్య పండుగలో వెల్లివిరిసిన కవితాశోభ
- రాక్, హెరిటేజ్, ట్రీ వాక్‌లతో సందర్శకులకు అవగాహన
- పలు రకాల ప్రదర్శనలతో కిటకిటలాడిన హైదరాబాద్ సాహిత్యోత్సవం - 2019

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: కళలు, సాహితీ, సంస్కృతుల మేళవింపే ప్రధానంగా కొనసాగిన హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ – 2019 ఆదివారం ఘనంగా ముగిసింది. హైదరాబాద్ (బేగంపేట) పబ్లిక్ స్కూల్ వేదికగా మూడురోజులుగా సాగిన ఉత్సవం అన్ని రకాల కళలకు సంబంధించి సృజనాత్మకతకు అధిక ప్రాధాన్యమిచ్చింది. కళలు, కళాకారులు, నైపుణ్యం, సృజనశక్తి, సాహితీ సంస్కృతులపై దేశవిదేశాలనుంచి కవులు, కళాకారులు, రచయితలు, ఔత్సాహికులు, స్కాలర్లు, పబ్లిషర్లు, విద్యార్థులు ఈ పండుగలో పాల్గొన్నారు. వివిధ సాహితీ ప్రక్రియలపై చర్చలు, కళా ఖండాలు, ఫొటోగ్రఫీ ప్రదర్శనలు, పుస్తకావిష్కరణలు, అవగాహనాకార్యక్రమాలు, డాక్యుమెంటరీలు, పలు కళాత్మక సినిమాల ప్రదర్శనలు, సాహిత్యం, కళలు, సంస్కృతికి హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ వేదికైంది. ఇందులో ప్రధానంగా హైదరాబాద్ లిటరరీ ఫెస్ట్‌వాక్, రాళ్లను, గుట్టలను రక్షించుకునే నేపథ్యంలో ఏర్పాటైన రాక్‌వాక్, సహజ సంపదను రక్షించుకునే దిశలో 'హెరిటేజ్ వాక్', మొక్కలు, వృక్షాలను సంరక్షించుకునే మార్గంలో వెలసిన 'ట్రీ వాక్' అంశాలు పలువురిని ఆలోచింపజేశాయి. ఆదివారం సాయంత్రం తెలంగాణ టూరిజం పెవిలియన్‌పై ముగింపు కార్యక్రమం జరిగింది. ముగింపు వేడుకల్లో ఐటీశాఖ కార్యదర్శి జయేశ్‌రంజన్, ప్రముఖ నృత్యకారిణి మల్లికా సారాభాయి, ప్రముఖ నటి, గాయని ఇలా అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కావ్యధార

హైదరాబాద్ సాహిత్య పండుగలో కవితా ఝరి ఉప్పొంగింది. ఆదివారం 'కావ్యధార' వేదికపై జరిగిన సకల భాషల కవితా సమ్మేళనం సాహితీప్రియులను రంజింపజేసింది. ప్రముఖ సినీనటి షబానా ఆజ్మీ, బాలీవుడ్ కవి, రచయిత హుసేన్ హైదరీ, అసిస్టెంట్ ప్రొఫెసర్ జీలం చటర్జీ, తెలుగు కవి యాకూబ్, ఇతర భాషల కవులు లాల్తె సింగ్, రెబెక్కా వేదవతి, జర్నలిస్ట్ సైమా అఫ్రీన్, మల్టీ లింగ్వల్ పబ్లిషర్ సరబ్జీత్ గర్చా, అనన్యా పటేల్, అనని శర్మ, అసద్ సిద్దిఖీ, చంద్రశేఖర్‌వర్మ, దేవాంగ్ ప్రతాప్‌సింగ్, నిఖిల్‌శర్మ, ఆర్జే హర్షీ, రైటర్స్ హబ్ – లక్నో వైస్ ప్రెసిడెంట్ శాశ్వత్ శుక్లదేవ్, శివర్గ్ భట్టాచార్య, లక్నో – కాన్పూర్‌కు చెందిన సామాజిక రచయిత తరుణ్ జాల కవితా పఠనం చేశారు. ప్రముఖ హిందీ కవి కైఫీ ఆజ్మీ రచించిన 'కైఫీ యాదే' కవితా సంపుటాన్ని ఈ వేదికపై ఆయన కూతురైన షబానా ఆజ్మీ విడుదలచేశారు. కైఫీ ఆజ్మీ పదకొండేండ్ల వయసు నుంచే కవితలు రాసేవారని, స్వాతంత్రోద్యమంపై ఆయన రచించిన కవితలు స్ఫూర్తినిచ్చాయని ఆమె వివరించారు. అనంతరం తన తండ్రి కవితలను వినిపించారు. ప్రముఖ సినీ రచయిత, కవి హుసేన్ హైదరీ గాంధీజీ, హిందుస్తానీ ముసల్మాన్, చాయ్ – కాఫీలపై తన కవితలను అద్భుతంగా వినిపించారు. ఆయన కవితలకు మురిసిపోయిన షబానా 'జీతే రహో బేటా' అంటూ హుసేన్ దగ్గరకు వెళ్లి ఆశీర్వదించారు. ఆ తర్వాత కవి యాకూబ్ తన రచనల్లోంచి కొన్ని కవితలను వినిపించారు. యాకూబ్ కవిత్వం విన్న సాహితీప్రియులు కరతాళ ధ్వనులతో అభినందనలు తెలిపారు.

హైదరాబాద్ లిట్ ఫెస్టివల్‌లో దేశభక్తిపై కవి యాకూబ్ చదివిన కవిత



'విరిగిపోతున్నాను
నాలో బీటలు వారుతున్న దేహం
కదులుతున్న మూలాలు, వేర్లు,
పెళపెళలాడుతున్న మందిరాలు
మసీదులు, కమానులు; రంగు,
జాతి, తెగ, భాష
విరిగి, ఆపై కూలి చీలుతున్న దేశం
ఆ మండుతున్న మంటల్లోంచి
మీ కోసం నిప్పులను తెచ్చాను
పరీక్షించండి.. చేతనైతే.. చల్లార్చండి'

లష్కర్‌వారానికి పోటెత్తిన భక్తజనం

- జనసంద్రమైన కొమురెల్లి మల్లన్న క్షేత్రం
- పట్నాలు వేసి బోనాలు సమర్పించిన భక్తులు

చేర్యాల, నమస్తే తెలంగాణ: సిద్దిపేట జిల్లాలో కొమురవెల్లి మల్లికార్జునస్వామి క్షేత్రానికి లష్కర్‌వారం సందర్భంగా ఆదివారం భక్తులు పోటెత్తారు. రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. బ్రహ్మోత్సవాల్లో రెండో వారమైన లష్కర్‌వారానికి సికింద్రాబాద్ భక్తులతో పాటు వివిధ జిల్లాల నుంచి 40 వేల మంది స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు వేకువజామునే నిద్రలేచి కోనేటిలో పవిత్రస్నానం ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. పట్నాలు వేసి, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సినీనటుడు చంద్రశేఖర్ క్యూలైన్లో వేచిఉండి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేకపూజలు చేశారు. ఉత్సవాల్లో ఆలయ పాలక మండలి చైర్మన్ సెవెల్లి సంపత్, డిప్యూటీ కమిషనర్ టీ వెంకటేశ్, పునరుద్ధరణ కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు పాల్గొన్నారు.



ఆదివారం సిద్దిపేట జిల్లా కొమురవెల్లిలో మల్లికార్జునస్వామివారి దర్శనం కోసం బారులుతీరిన భక్తులు


మద్యం డబ్బుల కోసం దోపిడీలు

- గత నవంబర్ 25న హైదరాబాద్‌లో దోపిడీలు
- ముగ్గురు యువకులను అరెస్టుచేసిన పోలీసులు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: మద్యానికి బానిసలై దారి దోపిడీలకు పాల్పడుతున్న ముగ్గురు యువకులను హైదరాబాద్ ఉత్తర మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. తాగుడుకు అలవాటుపడి మత్తును ఎంజాయ్ చేసేందుకు డబ్బు సరిపోకపోవడంతో నిందితులు దోపిడీలకు పాల్పడినట్టు పోలీసుల విచారణలో తేలింది. మల్కాజిగిరికి చెందిన సీతావిఘ్నేశ్‌యాదవ్, నాచారం ప్రాంతానికి చెందిన పోరిక మహర్షి, యూసుఫ్‌గూడ వాసి కోట శివారెడ్డి స్నేహితులు. వీరిలో ఇద్దరు చదువుతుండగా, శివారెడ్డి చిన్న బడ్జెట్ సినిమాలకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేస్తున్నట్టు పోలీసుల విచారణలో తెలిసింది. గతేడాది నవంబర్ 25న అర్ధరాత్రి దాటాక ఒంటిగంట, మూడుగంటల సమయంలో గోపాలపురం, తుకారంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నడుచుకుంటూ వెళ్తున్న ఒంటరి వ్యక్తులను ముగ్గురు నిందితులు అడ్డగించి, కొట్టి మొబైల్ ఫోన్లు, నగదును దోచుకున్నారు. ఘటన జరిగిన పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించి నిందితులు ఉపయోగించిన హోండా యాక్టివా బైక్‌ను పోలీసులు గుర్తించారు. దాని ఆధారంగా దోపిడీలకు పాల్పడింది విఘ్నేశ్‌యాదవ్, మహర్షి, శివారెడ్డిలుగా నిర్ధారించుకొని అరెస్టుచేశారు. ద్విచక్రవాహనం, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని తదుపరి విచారణ కోసం నిందితులను గోపాలపురం పీఎస్ అధికారులకు అప్పగించారు.

నీలకంఠ రొయ్య.. కాసుల పంట

- గతేడాది 11 రిజర్వాయర్లలో 1.08 కోట్ల రొయ్య పిల్లలసాగు
- రూ.1.33 కోట్ల పెట్టుబడితో మత్స్యకారులకు రూ.8.06 కోట్లు లాభం
- ఈ ఏడాది 24 రిజర్వాయర్లలో 3.19 కోట్ల రొయ్యలు సాగు
- ఫిబ్రవరి, ఏప్రిల్ మధ్య మార్కెట్లోకి నీలకంఠ రొయ్యలు
- 25 వేల మంది మత్స్యకారులకు లబ్ధిచేకూరే అవకాశం



నీలకంఠ రొయ్య

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మంచినీటి (నీలకంఠ) రొయ్యల సాగు గత ఏడాది కోట్లల్లో లాభాలను తెచ్చిపెట్టింది. ఈ ఏడాది కూడా నీలకంఠ రొయ్యలు మత్స్యకారులకు కాసులు కురిపించనున్నాయి. మంచినీటి రొయ్యలు కావడంతో పొరుగు రాష్ట్రాలతోపాటు ఐరోపావంటి దేశాల్లోనూ వీటికి మంచి డిమాండ్ ఉన్నది. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆలోచనతో గతేడాది రాష్ట్రవ్యాప్తంగా 11 రిజర్వాయర్లలో ప్రయోగాత్మకంగా చేపట్టిన నీలకంఠ రొయ్యల సాగు సత్ఫలితాలనివ్వడంతో మత్స్యశాఖ ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 24 రిజర్వాయర్లలో ఈ రొయ్య పిల్లలను వదిలింది. గతేడాది రూ.1.33 కోట్ల పెట్టుబడితో 1.08 కోట్ల రొయ్య పిల్లలను జలాశయాల్లోకి వదలగా మత్స్యకారులకు రూ.8.06 కోట్ల మేర లాభం చేకూరింది. దీంతో ఈసారి రొయ్యల సాగుకు మత్స్యశాఖ రూ.6.28 కోట్లు వెచ్చించింది. రాష్ట్రవ్యాప్తంగా 24 రిజర్వాయర్లలో గత అక్టోబర్‌లో 3.19 కోట్ల పిల్లలను వదిలింది. ఫిబ్రవరి చివరివారం నుంచి ఏప్రిల్ వరకు ఇవి మార్కెట్‌లోకి రానున్నాయి.

నీలకంఠ రొయ్యలకు డిమాండ్

నీలకంఠ రొయ్య పిల్లలు నాలుగు నుంచి ఆరునెలల్లో 100 గ్రాముల వరకు బరువు పెరుగుతాయి. రెండు పొడవైన కాళ్లు కలిగి, 1.5 అంగుళాల సైజులో ఉంటాయి. మంచినీటిలో పెరిగిన రొయ్యలు కావడంతో పక్కరాష్ట్రాలతోపాటు ఐరోపా దేశాల్లోనూ వీటికి మంచి డిమాండ్ ఉంటుదని అధికారులు చెప్తున్నారు. తొలుత 4.07 కోట్ల రొయ్యపిల్లలు పంపిణీ చేయాలనుకున్నా జలాశయాల్లో అనుకున్న మేర నీరు లేకపోవడంతో సంఖ్య తగ్గిందని మత్స్యశాఖ అధికారులు వెల్లడించారు. కిలో రొయ్యల ధర రూ.250 నుంచి రూ.300 వరకు పలుకుతుంది. ఇది మత్స్యకారులకు ఎంతో మేలుచేస్తున్నదని మత్స్యశాఖ ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. గతేడాది ప్రయోగాత్మకంగా 11 రిజర్వాయర్లలో రొయ్యల పెంపకాన్ని చేపట్టారు. ఒక్కో రొయ్యకు రూ.1.29 చొప్పున 1.08 కోట్ల పిల్లలు కొనుగోలు చేయగా, రూ.8.06 కోట్ల లాభాలు వచ్చాయి. సుమారు 10 వేల మంది మత్స్యకారులు లబ్ధిపొందారు. ఈసారి ఒక్కో రొయ్యపై రూ.1.96 ఖర్చుచేశారు. దీంతో 24 రిజర్వాయర్ల పరిధిలో 25 వేల మందికిపైగా మత్స్యకారులకు లబ్ధిచేకూరే అవకాశాలున్నాయి. ఎస్సారెస్పీ ప్రాజెక్టులో అత్యధికంగా 1.25 కోట్ల రొయ్య పిల్లలను వదిలారు. లోయర్ మానేరులో 29.50 లక్షలు, ఎల్లంపల్లిలో 29.15 లక్షలు, సింగూరులో 28.09 లక్షల రొయ్యలు వదిలారు. వీటితోపాటు బొగులాంపల్లి, కడెం, మిడ్ మానేరు, అప్పర్ మానేరు, పోచారం, సత్నాల, మత్తడివాగు, కుమ్రంభీం, మూసీ, డిండి, పాలేరు, వైరా, లంకసాగర్, పెద్దవాగు, ఘన్‌పూర్, రామప్ప, లక్నవరం, శనిగరం, తపాస్‌పల్లి ప్రాజెక్టుల్లో ఈ రొయ్యలను పెంచుతున్నారు.





బంజారాహిల్స్‌లోని మంత్రుల నివాస ప్రాంగణంలో ఆదివారం తెలంగాణ ప్రైవేటు ఉద్యోగుల సంఘం డైరీని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర హోంమంత్రి మహమూద్‌అలీ, ఎమ్మెల్యే హరీశ్‌రావు. చిత్రంలో ఎంపీ బీబీ పాటిల్, ప్రైవేటు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంధం రాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి కరుణాకర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పత్యానాయక్, మహిళా అధ్యక్షురాలు ప్రభారెడ్డి తదితరులు కూడా ఉన్నారు.

ప్రైవేటు ఉద్యోగులకు అండగా ప్రభుత్వం

తెలంగాణ ప్రైవేటు ఉద్యోగుల సంఘం డైరీ ఆవిష్కరణలో హోంమంత్రి మహమూద్ అలీ, మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రైవేటు ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉండి వారి హక్కులను కాపాడేందుకు కృషిచేస్తున్నదని రాష్ట్ర హోం మంత్రి మహమూద్‌అలీ, మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధనలో ప్రైవేట్ రంగ ఉద్యోగుల పాత్ర మరువలేనిదన్నారు. బంజారాహిల్స్‌లోని మంత్రుల నివాస ప్రాంగణంలో ఆదివారం తెలంగాణ ప్రైవేటు ఉద్యోగుల సంఘం 2019 డైరీని వారు వేర్వేరుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహమూద్ అలీ, హరీశ్‌రావు మాట్లాడుతూ.. బంగారు తెలంగాణ నిర్మాణంలో ప్రైవేటు ఉద్యోగులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రైవేటు ఉద్యోగుల పట్ల కూడా రాష్ట్ర ప్రభుత్వం స్నేహపూర్వకంగా ఉంటున్నదని అన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, ప్రైవేటు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంధం రాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి కరుణాకర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పత్యానాయక్, మహిళా అధ్యక్షురాలు ప్రభారెడ్డి, నాయకులు భాస్కర్, బంగి లక్ష్మణ్, శాంతిభూషణ్‌గౌడ్, అశీల శివ, కటకం రామ్, నిఖిల్, శివశంకర్, అనిత, గీతాంజలి, తులసి, శ్రావణిరెడ్డి, రాధిక, లక్ష్మి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో ప్రియాంకలాంటి అందగత్తెలు లేరు

- హేమామాలిని డ్యాన్స్‌ను చూపించి వాళ్లు ఓట్లు అడగాల్సిందే
- కాంగ్రెస్ సీనియర్ నేత, మధ్యప్రదేశ్ మంత్రి సజ్జన్‌వర్మ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, జనవరి 27: కాంగ్రెస్ యువ మహిళానేత ప్రియాంక గాంధీ అందంపై ఇప్పటివరకూ బీజేపీ నేతలు వివాదాస్పద వ్యాఖ్యలు చేయగా, తాజాగా ఆ జాబితాలోకి సొంత పార్టీ నేతలే చేరారు. మధ్యప్రదేశ్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత, మంత్రి సజ్జన్‌సింగ్ వర్మ ఆదివారం మీడియాతో మాట్లాడుతూ..బీజేపీలో ప్రియాంక లాంటి అందగత్తెలు లేరని, అది వారి దురదృష్టమని వ్యాఖ్యానించారు. 'బీజేపీకి ఉన్నది కేవలం హేమామాలిని మాత్రమే. ఆమె చేసే సంప్రదాయ నృత్యాన్ని దేశవ్యాప్తంగా ప్రదర్శించి బీజేపీ వాళ్లు కొన్ని ఓట్లు అడగాల్సిందే' అని ఎద్దేవా చేశారు. బీజేపీలో అందమైన ముఖం ఒక్కటి కూడా లేదంటూ మంత్రి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'ప్రియాంకను ఇంత అందంగా సృష్టించినందుకు దేవుడికి మనం ధన్యవాదాలు చెప్పుకోవాలి. ప్రజల పట్ల తనకు గల గౌరవం, ప్రేమను ఆమె సౌందర్యం ప్రతిబింబిస్తుంది. కైలాస్ వర్గీయ తదితర బీజేపీ నేతలు ప్రియాంకపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసి తమ స్థాయిని దిగజార్చుకోకూడదు' అని వర్మ పేర్కొన్నట్లు సదరు మీడియా తెలిపింది.

ప్రియాంకకు మానసిక రుగ్మతలున్నాయి..!

- చుట్టూ ఉన్న వారిని ఆమె కొడుతుంటారు
- ఇలాంటి వారు ప్రజా జీవితంలో పనిచేయలేరు
- బీజేపీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, జనవరి 27: కాంగ్రెస్ యువనేత ప్రియాంకగాంధీని లక్ష్యంగా చేసుకుని వరుసగా విమర్శలు చేస్తున్న బీజేపీ నేతల్లో తాజాగా ఆ పార్టీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి చేరారు. బై పోలార్ డిజార్డర్ అనే రుగ్మతతో ప్రియాంక బాధపడుతున్నారని, ఇది ఆమె హింసాత్మక స్వభావాన్ని తెలియజేస్తుందంటూ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. ఆదివారం ఓ మీడియా సంస్థతో సుబ్రహ్మణ్యస్వామి మాట్లాడుతూ.. 'ఆమె (ప్రియాంక) బై పోలార్ డిజాస్టర్ అనే వ్యాధితో బాధపడుతున్నారు. దీని ప్రభావంతో ఆమె తన చుట్టూ ఉన్న వారిని కొడుతుంటారు. ఈ రుగ్మతతో బాధపడేవారు ప్రజా జీవితంలో పనిచేయలేరు. సంతోషం మరీ ఎక్కువైతే తీవ్ర భావోద్వేగానికి లోనుకావడం, బాధగా ఉన్నప్పుడు తీవ్రంగా కుంగిపోవడం వంటివి చేస్తారు. ఒక్కోసారి మానసిక సమతుల్యాన్ని కోల్పోతారు. ఈ విషయాన్ని ప్రజలు తెలుసుకోవాలి' అని వ్యాఖ్యానించారు.

మహిళా ఖైదీల కోసం బహిరంగ జైళ్లు

పంజాబ్ ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్ నిర్ణయం



పాటియాలా, జనవరి 27: మహిళా ఖైదీల కోసం రాష్ట్రవ్యాప్తంగా బహిరంగ జైళ్లు ఏర్పాటు చేయాలని పంజాబ్ సీఎం అమరీందర్ సింగ్ నిర్ణయించారు. ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు సమర్పించాలని జైళ్ల శాఖను సీఎం ఆదేశించినట్లు అధికారులు వెల్లడించారు. బహిరంగ జైళ్ల ద్వారా మహిళా ఖైదీలు జైలు పరిసరాల్లో పనిచేసేందుకు వీలవుతుందని, జైలు నుంచి విడుదల అయిన అనంతరం వారి పునరావాసానికి ఆ సంపాదన ఉపయోగపడుతుందని తెలిపారు. పాటియాలా సెంట్రల్ ఖైలులో ఖైదీల కుటుంబ సభ్యుల కోసం నిర్మించిన వెయిటింగ్ హాల్‌ను సీఎం అమరీందర్ సింగ్ ఆదివారం ప్రారంభించారు. అలాగే ఖైదీలు స్మార్ట్ కార్డుల ద్వారా నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసేందుకు వీలు కల్పించే 'ఈ- పర్స్' విధానాన్ని కూడా ప్రారంభించారు.

యూరి స్ఫూర్తికి జై..



బెంగళూరు: రక్షణమంత్రి నిర్మల సీతారామన్ మాజీ సైనికాధికారులు, జవాన్లతో కలిసి ఆదివారం బెంగళూరులో 'యూరి: ద సర్జికల్ స్ట్రైక్' సినిమా చూశారు. సినిమా ముగిసిన తర్వాత థియేటర్‌లోని ప్రేక్షకులతో కలిసి భారత్‌మాతా కీ జై, వందే మాతరం అంటూ నిర్మల నినాదాలు చేశారు. సర్జికల్ స్ట్రైక్ సినిమా దర్శకుడిని, నటీనటులను ప్రశంసిస్తూ ట్వీట్ చేశారు. కశ్మీర్‌లోని యూరి సైనికశిబిరంపై పాక్ ఉగ్రమూకలు దాడి చేసి 17 మంది సైనికులను పొట్టనపెట్టుకున్న నేపథ్యంలో, 2016లో పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాదుల శిబిరాలపై భారత సైన్యం సర్జికల్ స్ట్రైక్‌ను నిర్వహించిన విషయం తెలిసిందే.



నాజీల నుంచి విముక్తికి 75 ఏండ్లు

రెండో ప్రపంచయుద్ధంలో హిట్లర్ నాజీ మూకల కబంధహస్తాల నుంచి లెనిన్‌గ్రాడ్ నగరం విముక్తిని సాధించి 75 ఏండ్లయిన సందర్భంగా నాటి యుద్ధంలో అమరులైన 8 లక్షలమందికి రష్యా ఘనంగా నివాళి అర్పించింది. ఆదివారం సైనికులు పరేడ్ నిర్వహించారు. లెనిన్‌గ్రాడ్‌ను ప్రస్తుతం సెయింట్ పీటర్స్‌బర్గ్ అని పిలుస్తున్నారు.

ఒక్కో జడ్జి ముందు 4,500 కేసులు!

హైకోర్టుల్లో పేరుకుపోతున్న పెండింగ్ కేసులు

న్యూఢిల్లీ, జనవరి 27: దేశ వ్యాప్తంగా న్యాయస్థానాల్లో పెండింగ్ కేసుల సంఖ్య నానాటికీ గణనీయంగా పెరుగుతున్నది. ప్రతి హైకోర్టు న్యాయమూర్తి సగటున 4,419 పెండింగ్ కేసులతో సతమతమవుతున్నారని, కిందిస్థాయి కోర్టుల్లో ఒక్కో జడ్జి ఎదుట సగటున 1,288 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని న్యాయ శాఖ పేర్కొన్నది. కోర్టుల్లో ఉండాల్సిన మొత్తం న్యాయమూర్తుల సంఖ్య, పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్యను ఆధారంగా చేసుకుని ఈ సగటు గణాంకాలను వెల్లడించింది. నేషనల్ జ్యుడిషియల్ గ్రిడ్ వివరాల ప్రకారం 2018 చివరి నాటికి జిల్లా కోర్టులు, దిగువస్థాయి కోర్టుల్లో 2.91 కోట్ల కేసులు, 24 హైకోర్టుల్లో 47.68 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నెల 1 నుంచి తెలంగాణ, ఏపీలకు ప్రత్యేక హైకోర్టులు ఏర్పడటంతో దేశంలో మొత్తం హైకోర్టుల సంఖ్య 25కు పెరిగింది. దీంతో ప్రస్తుతం హైకోర్టుల్లో ఒక్కో న్యాయమూర్తి ఎదుట సగటున 4,419 కేసులు, కిందిస్థాయి కోర్టుల్లో ఒక్కో జడ్జి ఎదుట సగటున 1,288 కేసులు పెండింగ్‌లో ఉన్నట్టు న్యాయశాఖ తెలిపింది.

భారతరత్నపై జగడం

సాధువులు అర్హులు కారా అని బాబా రాందేవ్ ప్రశ్న ■ క్రిస్టియన్ కావడం వల్లే మదర్‌థెరెసాకు ఆ అవార్డు ఇచ్చారని వ్యాఖ్య

- దిగువ మధ్య స్థాయి శాస్త్రవేత్తకు పద్మభూషణ్ ఇచ్చారని కేరళ మాజీ డీజీపీ విమర్శ
- ఇదిలాగే కొనసాగితే నేరగాళ్లకూ పద్మ పురస్కారాలు వస్తాయని ఎద్దేవా



ప్రయాగ్‌రాజ్, గువాహటి, తిరువనంతపురం: కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన దేశ అత్యున్నత పౌర పురస్కారాలపై వివాదాలు రాజుకుంటూనే ఉన్నాయి. స్వాతంత్ర్యం సిద్ధించి 70 ఏండ్లయినా ఇప్పటివరకూ ఒక్క సాధువును కూడా భారతరత్న పురస్కారానికి ఎంపిక చేయలేదని యోగా గురువు బాబా రాందేవ్ విమర్శించగా, దిగువ మధ్య స్థాయి శాస్త్రవేత్తకు పద్మభూషణ్ ఇచ్చారని నంబి నారాయణన్‌ను ఉద్దేశిస్తూ కేరళ మాజీ డీజీపీ టీపీ సేన్‌కుమార్ వ్యాఖ్యానించారు. ఆదివారం ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళాకు వచ్చిన బాబా రాందేవ్ మీడియాతో మాట్లాడుతూ.. 'దయానంద మహర్షి, స్వామి వివేకానంద వంటి మహనీయులు దేశం కోసం చేసిన సేవలకంటే.. రాజకీయ నాయకులు, క్రీడాకారులు చేసిన సేవ ఎక్కువా? క్రైస్తవ మతానికి చెందిన వారు కావడం వల్లే మదర్ థెరెసాకు ఈ అవార్డు లభించింది. హిందువులైన కారణంగానే ఇతర సాధువులకు పురస్కారాలను తిరస్కరిస్తున్నారా? దేశంలో హిందువుగా ఉండడమే నేరమా?' అని నిలదీశారు. మరోవైపు గూఢచర్య అభియోగాల నుంచి గతేడాదే బయటపడ్డ ఇస్రో మాజీ శాస్త్రవేత్త నంబి నారాయణన్‌కు పద్మభూషణ్ ఇవ్వడంపై 1994లో ఆయనపై విచారణ చేపట్టిన కేరళ మాజీ డీజీపీ సేన్ కుమార్ విమర్శలు గుప్పించారు. నంబి నారాయణన్‌ను దిగువ మధ్య స్థాయి శాస్త్రవేత్తగా పేర్కొన్న ఆయన.. అత్యున్నత పురస్కారాన్ని పొందేందుకు ఆయన ఏం సాధించారని ప్రశ్నించారు. ఇదిలాగే కొనసాగితే వచ్చే ఏడాది నుంచి నేరగాళ్లకు కూడా పద్మ పురస్కారాలు వస్తాయని వ్యాఖ్యానించారు. నారాయణన్‌పై సుప్రీంకోర్టు కమిటీ విచారణ పూర్తయిన తర్వాత ఆయన నిర్దోషిగా తేలితే భారతరత్న ఇచ్చినా అభ్యంతరం లేదని చెప్పారు. కాగా, అసోంకు చెందిన ప్రముఖ గాయకులు భూపేన్ హజారికాపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించి కాంగ్రెస్ లోక్‌సభా పక్ష నేత మల్లికార్జున్ ఖర్గేపై కేసు నమోదైంది. గాయకుడు (భూపేన్ హజారికా), ఆరెస్సెస్ వ్యక్తికి (నానాజీ దేశ్‌ముఖ్) బదులు ఇటీవల కన్నుమూసిన ఆధ్యాత్మిక వేత్త శివకుమార స్వామికి భారతరత్న ఇవ్వాల్సిందని ఖర్గే వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు అసోం ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని ఆరోపిస్తూ ఆర్టీఐ కార్యకర్త ఒకరు ఖర్గేపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరోవైపు భారతరత్న పురస్కారాలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అసోం గాయకుడు జుబీన్ గార్గ్‌పైనా కేసు నమోదైంది.

ప్రధానికి కావల్సిన లక్షణాలన్నీ రాహుల్‌కు ఉన్నాయి: తేజస్వి

న్యూఢిల్లీ, జనవరి 27: కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీపై రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) నేత తేజస్వి యాదవ్ ప్రశంసల వర్షం కురిపించారు. మంచి ప్రధాని అయ్యేందుకు కావల్సిన లక్షణాలన్నీ రాహుల్‌కు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. రాహుల్‌పై బురద చల్లేందుకు బీజేపీ ప్రచారదళం రూ.వేల కోట్లు ఖర్చు చేసిందని ఆరోపించారు. ప్రధానిగా ఎవరిని ఎంపిక చేయాలన్న దానిపై లోక్‌సభ ఎన్నికల తర్వాతే మహాకూటమి నేతలు సమిష్టిగా నిర్ణయం తీసుకుంటారని ఆయన చెప్పారు. రాహుల్ నాయకత్వంపై ఎలాంటి అనుమానాలు లేవని, బీజేపీ నేతలు దుష్ప్రచారం చేసినప్పటికీ ఆయన ప్రజల మనసును గెలుచుకున్నారని ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

మృతదేహాన్ని తరలిస్తూ.. ఎనిమిది మంది మృత్యువాత

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లో ఆదివారం ఓ మృతదేహాన్ని అంత్యక్రియలకు తరలిస్తున్న వాహనం లోతైన గోతిలో పడిపోవడంతో అందులో ప్రయాణిస్తున్న ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 10 మంది గాయపడినట్టు పోలీసులు వెల్లడించారు. చంపావత్ జిల్లాలోని లోహఘాట్ ప్రాంతంలో ఈ దుర్ఘటన జరిగింది. బారాకోట్ నుంచి లోహఘాట్‌లోని స్మశానవాటికకు మృతదేహాన్ని తరలిస్తున్న ఈ వాహనం 300 మీటర్ల లోతైన గోతిలో పడిపోవడంతో ఆరుగురు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఇద్దరు దవాఖానలో చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచారు.



కొత్త నోట్ల రూపంలో నల్లధనం తిరిగొచ్చింది

ఇండియాటుడే-కార్వీ సర్వేలో 46 శాతం మంది అభిప్రాయం

న్యూఢిల్లీ, జనవరి 27: దేశంలోని నల్ల ధనం కొత్త కరెన్సీ నోట్ల రూపంలో మార్కెట్లలోని తిరిగొచ్చిందని 46 శాతం మంది అభిప్రాయపడుతున్నారు. నల్లధనానికి సంబంధించి ఇండియాటుడే- కార్వీ సంస్థ 'మూడ్ ఆఫ్‌ది నేషన్' పేరుతో సంస్థ ఇటీవల సర్వే నిర్వహించింది. దీని ప్రకారం నల్లధనం కొత్త కరెన్సీ నోట్లుగా మారిపోయిందని 46 శాతం మంది పేర్కొనగా, అలా జరుగలేదని 37 శాతం మంది చెప్పారు. కాగా నల్లధనం ఏమైందో తమకు తెలియదని 17 శాతం మంది పేర్కొన్నారు. విదేశాల్లో దాచి ఉంచిన నల్లధనాన్ని వెనుకకు తీసుకొస్తామని ప్రధాని మోదీ గత లోక్‌సభ ఎన్నికల ముందు వాగ్దానం చేసిన సంగతి తెలిసిందే. ఆ సొమ్ము ఏ మేరకున్నదన్న దానిపై స్పష్టత లేదు. దేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో 20 శాతం ఉండొచ్చుని కొన్ని సంస్థలు అంచనా వేశాయి. నల్లధనాన్ని వెలికి తీసే ఉద్దేశంతోనే ప్రధాని మోదీ పెద్ద నోట్లను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. కానీ రద్దుచేసిన నోట్లన్నీ తిరిగి బ్యాంకులకు రావడంతో ప్రభుత్వం తీసుకున్న నోట్లరద్దు నిర్ణయంపై సందేహాలు వ్యక్తమయ్యాయి. రద్దయిన నోట్లలో 99.3 శాతం కరెన్సీ తిరిగి బ్యాంకులకు చేరిందని రిజర్వు బ్యాంకు ప్రకటించింది. నోట్ల రద్దు వల్ల నల్లధనం రూపంలో ఉన్న రూ.3 లక్షల కోట్ల – రూ.4 లక్షల కోట్ల వరకు బ్యాంకులకు రాకుండాపోతాయన్న ఊహాగానాలు చెల్లాచెదురయ్యాయి.



డిజిటల్ గావ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

సాంకేతిక అక్షరాస్యత పెంచేందుకే 'డిజిటల్ గావ్'

- వనపర్తి ఎమ్మెల్యే సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్/వనపర్తిరూరల్, నమస్తే తెలంగాణ: గ్రామాల్లో సాంకేతిక అక్షరాస్యతను పెంచేందుకు 'డిజిటల్ గావ్' (డిజిటల్ గ్రామం) కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. టీటా-సీఎస్‌సీ (తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్- కామన్ సర్వీస్ సెంటర్) సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో చేపడుతున్న డిజిటల్ గావ్ కార్యక్రమాన్ని ఆదివారం వనపర్తి జిల్లా రాజనగరం గ్రామ పంచాయతీలో ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో నగదురహిత వ్యవహారాల కోసం డిజిటల్ గావ్ కార్యక్రమం ప్రారంభించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా డిజిటల్ లిటరసీ, టెలి మెడిసిన్, డిజిటల్ ఫైనాన్షియల్ లిటరసీ, ట్యాలీ, అకౌంట్స్ వంటి విషయాలను నేర్పిస్తారని చెప్పారు. కార్యక్రమంలో టీటా గ్లోబల్ ప్రెసిడెంట్ సందీప్ మక్తాలా మాట్లాడుతూ.. డిజిటల్ గావ్ కార్యక్రమంతో సాంకేతిక అక్షరాస్యత పెంచడంతోపాటు స్టార్టప్‌లను కూడా ప్రోత్సహించనున్నట్టు చెప్పారు. తెలంగాణ ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ సెంటర్‌ను ఏర్పాటుచేసి దాని ద్వారా దత్తత గ్రామాలను ఆదర్శగ్రామాలుగా తీర్చిదిద్దనున్నామని పేర్కొన్నారు. డిజిటల్ గావ్ కార్యక్రమాన్ని ప్రారంభించడానికి సహకరించిన అధికారులకు, కలెక్టర్ శ్వేతామహంతికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



ఆదివారం ములుగులోని ఉద్యానవర్సిటీలో ఆర్నమెంటల్ గార్డెన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న రాష్ట్ర వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి తదితరులు

ఉద్యాన వర్సిటీలో 'సోలార్ వెలుగులు'

అంచనాలు రూపొందించాలని వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సిద్దిపేట జిల్లా ములుగులోని కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం ప్రధాన కార్యాలయానికి సోలార్ వెలుగులు అందించాలని వ్యవసాయశాఖ నిర్ణయించింది. దీనికి సంబంధించిన అంచనాలు రూపొందించాలని రాష్ట్ర వ్యవసాయ, సహకారశాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి ఇంజినీర్లను ఆదేశించారు. ఉద్యాన విశ్వవిద్యాలయం ప్రధాన భవనం పనుల పురోగతిని ఆయన ఆదివారం అధికారులతో కలిసి పరిశీలించారు. విద్యార్థులు రూపొందించిన ఆర్నమెంటల్ గార్డెన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం తన కార్యాలయంలో పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యాన వర్సిటీ ప్రధాన కార్యాలయంతోపాటు రాజేంద్రనగర్, మోజర్లలోని ఉద్యాన కళాశాల క్యాంపస్‌లలో అంతర్గత రోడ్లు, వసతిగృహాలు, తరగతి గదులు, ప్రయోగశాలలు.. అన్నింటిని మార్చి నెలాఖరుకల్లా పూర్తిచేయాలన్నారు. ప్రయోగశాలల్లో మౌలిక సదుపాయాలు, పరికరాలు అంతర్జాతీయ ప్రమాణాలతో ఉండేట్టుగా చూడాలని సూచించారు. ఇందుకోసం రిజిస్ట్రార్ నేతృత్వంలో పరిశోధన సంచాలకులు, కంట్రోలర్, ఎస్టేట్ ఆఫీసర్లతో కూడిన బృందం హర్యానాలోని సోనేపట్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్‌ను సందర్శించి.. అక్కడి పరిశోధన పరికరాల ప్రమాణాలపై అధ్యయనం చేసి నివేదిక అందించాలన్నారు. మార్చి చివరికల్లా ఆర్నమెంటల్ గార్డెన్‌ను కూడా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

నాణ్యతే గీటురాయి

- ఇంజినీరింగ్‌లో ప్రమాణాలు పెంచేందుకు ఏఐసీటీఈ ప్రణాళిక
- 2020 నుంచి కొత్త కాలేజీలకు అనుమతి నిరాకరణ
- దేశవ్యాప్తంగా తగ్గుతున్న ఇంజినీరింగ్ ప్రవేశాలు
- ఆర్ట్స్, సైన్స్ విద్యార్థులకు పెరిగిన ఉద్యోగావకాశాలు



హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఇంజినీరింగ్ కాలేజీల్లో బోధన ప్రమాణాలను పెంచడంలో భాగంగా 2020 నుంచి కొత్త ఇంజనీరింగ్ కాలేజీలకు అనుమతి ఇచ్చేది లేదని ఏఐసీటీఈ స్పష్టంచేసింది. ప్రస్తుతం ఉన్న కాలేజీల్లోనే ప్రమాణాలను మెరుగుపరుచుకోవాలని, డిమాండ్‌లేని కోర్సులను రద్దు చేసుకోవాలని సూచిస్తున్నది. పదేండ్ల కిందటితో పోల్చితే ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశాలు విపరీతంగా పెరిగినా.. కాలేజీల్లో నాణ్యత లేకపోవడంతో ఇంజినీరింగ్ పూర్తిచేసినవారికి అంతేస్థాయిలో ఉద్యోగాలు దక్కడం లేదు. ఆర్ట్స్, సైన్స్ విద్యార్థులకు మంచి వేతనాలతో ఉద్యోగాలు దక్కుతున్నాయి. గతంలో ఇంజినీరింగ్, మెడిసిన్, సీఏ మినహా ఇతర సబ్జెక్టులు చదివిని వారికి మంచి ఉద్యోగావకాశాలు ఉండేవి. రానురాను వారికి అవకాశాలు తగ్గాయి. కిందిస్థాయి ఉద్యోగాలకు పోటీపడితే ఇంజినీరింగ్ చేసి.. ఈ ఉద్యోగం ఎందుకంటూ రిక్రూటర్లు మొహం మీద చెప్పేస్తున్నారు. సేల్స్, మార్కెటింగ్, ఇతర ప్రైవేటు రంగాల్లో ఆర్ట్స్, సైన్స్ విద్యార్థులకే ఎక్కువగా అవకాశాలు వస్తున్నాయి. దీంతో ఈ సబ్జెక్టులకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. ఏకంగా ఐఐటీల్లో ఆర్ట్స్ గ్రూప్‌లను ప్రవేశపెట్టారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

తగ్గుతున్న ప్రవేశాలు

దేశవ్యాప్తంగా 903 వర్సిటీలు, 39,050 కాలేజీలు, 10,011 స్వతంత్ర విద్యాసంస్థలు ఉన్నాయి. ఆర్ట్స్ విద్యార్థులు 95 లక్షల మంది ఉండగా, సైన్స్ చదివే వారి సంఖ్య 48.5 లక్షలు. ఇంజినీరింగ్ చేసే సంఖ్య 40.19లక్షలుగా ఉంది. దేశవ్యాప్తంగా మూడువేల ఇంజినీరింగ్ కాలేజీలు ఉంటే.. 800 కాలేజీల్లో 30 శాతం కంటే తక్కువ ప్రవేశాలు ఉన్నాయి. గత రెండు మూడేండ్లుగా ఇంజినీరింగ్ కాలేజీల్లో ప్రవేశాలు తగ్గుతున్నాయి. ఓవైపు కాలేజీల్లో సరైన నాణ్యత ప్రమాణాలు లేకపోవడం, మరోవైపు ఆర్ట్స్, సైన్స్, వృత్తివిద్యాకోర్సులతో ఉపాధి అవకాశాలు పెరుగడంతో ఇంటర్ పూర్తయిన విద్యార్థులు డిగ్రీవైపు మళ్లుతున్నారు. మూడేండ్లలోనే కోర్సు పూర్తవుతుండటం, డిగ్రీ కాలేజీల్లోనూ క్యాంపస్ ప్లేస్‌మెంట్లు జరుగుతుండటం కూడా మరో కారణం. కచ్చితంగా ఇంజినీరింగ్‌లో చేరాలనుకుంటున్న విద్యార్థులు నాణ్యతా ప్రమాణాలు ఉన్న కాలేజీలనే ఎంచుకుంటున్నారు. వాటిల్లో చదివినవారికే ఉద్యోగాలు దక్కుతున్నాయి. దీంతో సమీప భవిష్యత్తులో ప్రమాణాలు ఉన్న కాలేజీలే మనుగడ సాగించగలుగుతాయి.

తెలంగాణలో పెరిగిన నాణ్యత

తెలంగాణ ప్రభుత్వ చర్యలతో రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీల్లో నాణ్యత పెరిగింది. ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ (ఎఫ్‌ఎఫ్‌సీ) తనిఖీలతో బోధనా ప్రమాణాలు మెరుగయ్యాయి. దీంతో విద్యార్థుల సామర్థ్యం పెరిగి, క్యాంపస్ రిక్రూట్‌మెంట్లలో పెద్దఎత్తున ఉద్యోగాలు లభించాయి. ఫలితంగా రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కాలేజీల్లో ఈ విద్యాసంవత్సరం ప్రవేశాలు పెరిగాయి. 81 కాలేజీల్లో వంద శాతం అడ్మిషన్లు జరుగడమే ఇందుకు నిదర్శనం. ఇందులో 14 ప్రభుత్వ కాలేజీలు కాగా, 67 ప్రైవేటు కాలేజీలు. ఉమ్మడి పాలనలో టాప్ 10 కాలేజీల్లో మినహా ఎక్కడా పూర్తిస్థాయి ప్రవేశాలు జరిగిన దాఖలాల్లేవు.

ఆరేండ్లలో దేశవ్యాప్తంగా ఇంజినీరింగ్ ప్రవేశాల తీరు

సంవత్సరం	విద్యార్థులు (లక్షల్లో)
2011-12	32.7
2012-13	37.7
2013-14	43.3
2014-15	42.5
2015-16	42
2016-17	40.19

చరిత్రపై శాస్త్రీయ పరిశోధనలు జరుగాలి

'తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్' సదస్సులో ఓయూ మాజీ వీసీ ప్రొఫెసర్ తిరుపతిరావు పిలుపు



ఆదివారం కేయూలో 'తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్' సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ టీ తిరుపతిరావు

హన్మకొండ, నమస్తే తెలంగాణ: చరిత్రపై శాస్త్రీయమైన పరిశోధనలు జరుగాలని ఉస్మానియా విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ టీ తిరుపతి రావు అన్నారు. వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయం చరిత్ర, పర్యాటక విభాగం ఆధ్వర్యంలో సెనేట్ హాలులో రెండురోజులపాటు నిర్వహిస్తున్న 'తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్' నాలుగో వార్షిక సదస్సు ఆదివారం ప్రారంభమైంది. కేయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఆర్ సాయన్న అధ్యక్షతన జరిగిన సదస్సులో తిరుపతిరావు మాట్లాడుతూ.. పురాతన, మధ్యయుగ చరిత్రలపై నాణ్యమైన పరిశోధనలు విస్తృతంగా జరుగాలని, చరిత్రను నిర్లక్ష్యం చేయొద్దని పేర్కొన్నారు. చరిత్ర పరిశోధనల పరిరక్షణకు సాంకేతిక నిపుణుల సహకారం తీసుకోవాలని సూచించారు. విదేశాల్లో చరిత్రకు చాలా ప్రాధాన్యం ఉన్నదని, చరిత్రను డిజిటలైజేషన్ చేయాలని ఆయన కోరారు. ఉమ్మడి ఏపీలో తెలంగాణ చరిత్రకు తగిన ప్రాధాన్యం దక్కలేదని, ప్రస్తుతం విశేష కృషిచేసి కొత్త విషయాలను వెలికి తీయాలని పేర్కొన్నారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రిసెర్చ్ (ఐసీహెచ్‌ఆర్) న్యూఢిల్లీ సభ్యుడు ఆచార్య వీ కిషన్‌రావు మాట్లాడుతూ చరిత్ర ఆధారాల పరిశోధనలు గ్రామ, జిల్లా, ప్రాంతాలవారీగా క్రమపద్ధతిలో జరుగాలని చెప్పారు. ఈ సమావేశంలో తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ రాజిరెడ్డి, కేయూ చరిత్ర విభాగాధిపతి ప్రొఫెసర్ విజయబాబు, డాక్టర్ ఎస్ఎస్ రాంచంద్రమూర్తి, హైమావతి, శేషన్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల ఫిర్యాదులపై విచారణ

- నేటినుంచి ఫిబ్రవరి 8వరకు అవకాశం
- జాతీయ కమిషన్ చైర్మన్ ఆర్కే అగర్వాల్‌తో అకున్ సబర్వాల్ భేటీ



ఎన్సీడీఆర్సీ చైర్మన్ ఆర్కే అగర్వాల్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న అకున్ సబర్వాల్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ, ఏపీ రాష్ర్టాల వినియోగదారుల కమిషన్లలో పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల అప్పీల్, రివిజన్ పిటిషన్లపై విచారణకు సర్వంసిద్ధమైంది. జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కారాల కమిషన్ (ఎన్సీడీఆర్సీ).. హైదరాబాద్ ఆదర్శనగర్‌లోని రాష్ట్ర ఫుడ్ కమిషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో తాత్కాలికంగా ఏర్పాటుచేసిన సర్క్యూట్ బెంచ్ సోమవారం ఉదయం నుంచి ఫిబ్రవరి 8వరకు పెండింగ్ ఫిర్యాదులతోపాటు కొత్త ఫిర్యాదులు, రివిజన్ పిటిషన్లపై విచారణ చేపట్టనుంది. తెలంగాణ వినియోగదారుల కమిషన్‌లో దాదాపు 2,685 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. కేసుల విచారణ కోసం ఆదివారం హైదరాబాద్‌కు వచ్చిన ఎన్సీడీఆర్సీ చైర్మన్ జస్టిస్ ఆర్కే అగర్వాల్‌ను తెలంగాణ వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి అకున్ సబర్వాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం రాష్ట్ర వినియోగదారుల కమిషన్ చైర్మన్ జస్టిస్ ఎంఎస్కే జైస్వాల్‌తో కలిసి జిల్లా ఫోరాల బలోపేతంపై ఆయా ఫోరం అధ్యక్షులు, సభ్యులతో భేటీ అయ్యారు.

బడ్జెట్ సమావేశాలకు ముందు
అఖిలపక్ష భేటీలు

- 30న లోక్‌సభ స్పీకర్, 31న రాజ్యసభ చైర్మన్ అధ్యక్షతన..
- 31 నుంచి వచ్చే నెల 13 వరకు పార్లమెంట్.. 1న తాత్కాలిక బడ్జెట్
- మోదీ సర్కారుకు ఇవే చివరి పార్లమెంట్ సమావేశాలు



న్యూఢిల్లీ, జనవరి 27: ఈ నెల 31వ తేదీ నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో రాజ్యసభ చైర్మన్ ఎం వెంకయ్యనాయుడు, లోక్‌సభ స్పీకర్ సుమిత్ర మహాజన్ వేర్వేరుగా అఖిలపక్ష సమావేశాలను నిర్వహించనున్నారు. 30న స్పీకర్ సుమిత్ర మహాజన్ అన్ని పార్టీలతో సమావేశం కానున్నారు. 31న ఉదయం పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కావడానికి ముందు వెంకయ్యనాయుడు అఖిలపక్ష భేటీని నిర్వహించనున్నారు. త్వరలో లోక్‌సభ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వానికి ఇవే చివరి పార్లమెంటు సమావేశాలు.మరోవైపు ప్రభుత్వం కూడా ఈ నెల 30వ తేదీన అన్ని పార్టీలతో సమావేశం నిర్వహించే అవకాశం ఉందని అధికారులు చెప్పారు. దీనికి ప్రధాని మోదీ హాజరుకానున్నారు. ఫిబ్రవరి 1న ప్రభుత్వం తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ఫిబ్రవరి 13 వరకు బడ్జెట్ సమావేశాలు కొనసాగుతాయి.

ప్రధాని బహుమతులకు ఆన్‌లైన్ వేలం
వచ్చిన సొమ్ము గంగ ప్రక్షాళనకు వినియోగం



న్యూఢిల్లీ, జనవరి 27: ప్రధానమంత్రి నరేంద్రమోదీకి వివిధ సందర్భాల్లో బహుమతిగా లభించిన వివిధ జ్ఞాపికల ఆన్‌లైన్ వేలం ఆదివారం ప్రారంభమైంది. వీటి ద్వారా వచ్చే నిధులను 'నమామి గంగే' (గంగానది ప్రక్షాళన)కు ఉపయోగించనున్నారు. ఢిల్లీలోని నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడర్న్ ఆర్ట్‌లో ప్రధాని జ్ఞాపికలను వేలం వేస్తున్నారు. ఈ జ్ఞాపికలను 'pmmementos.gov.in' అనే వెబ్‌సైట్‌లో చూడవచ్చు. మెమెంటోల కనీస ధరలు రూ.100 నుంచి రూ.30వేల వరకు ఉన్నాయి. జ్ఞాపికల్లో కొన్ని దుస్తుల రూపంలో ఉండగా, మరికొన్ని గాజు, పింగాణీ, ఇతర లోహాలతో తయారు చేసినవి ఉన్నాయి. బంగారం పూతపూసిన ఏకైక జ్ఞాపిక రాధాకృష్ణుల విగ్రహం కాగా, దాని కనీస ధరను రూ.20వేలుగా నిర్ణయించారు. ఈ విగ్రహాన్ని సూరత్‌లోని మాండ్వీ నగరపాలక సంస్థ బహూకరించింది. బీజేపీ ఎంపీ సీ నరసింహన్ బహూకరించిన 2.22 కిలోల బరువున్న ఓ వెండి పలక ధరను రూ.30 వేలుగా నిర్ణయించారు. ఈ వేలం 31వ తేదీ వరకు కొనసాగనుంది.

'అయోధ్య'పై రేపు జరుగాల్సిన
విచారణ రద్దు
జస్టిస్ బోబ్డే అందుబాటులో లేకపోవడమే కారణం



న్యూఢిల్లీ, జనవరి 27: అయోధ్యలోని రామ జన్మభూమి-బాబ్రీ మసీదు స్థల వివాదం కేసుపై మంగళవారం జరుగాల్సిన విచారణను సుప్రీంకోర్టు ఆదివారం రద్దు చేసింది. ఈ కేసును విచారించాల్సిన రాజ్యాంగ ధర్మాసనంలోని ఐదుగురు సభ్యుల్లో ఒకరు (జస్టిస్ ఎస్‌ఏ బోబ్డే) అందుబాటులో లేకపోవడమే ఇందుకు కారణం. ఈ కేసుపై ఈ నెల 29వ తేదీన చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం జరుపాల్సిన విచారణ రద్దయిందని, ఈ ధర్మాసనంలో సభ్యుడైన జస్టిస్ ఎస్‌ఏ బోబ్డే 29న అందుబాటులో ఉండకపోవడమే ఇందుకు కారణమని పేర్కొంటూ సుప్రీంకోర్టు రిజిస్ట్రీ ఓ నోటీసును జారీచేసింది. అయోధ్య స్థల వివాద కేసును విచారించాల్సిన రాజ్యాంగ ధర్మాసనంలో చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ ఎస్‌ఏ బోబ్డేతోపాటు జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ ఎస్‌ఏ నజీర్ సభ్యులుగా ఉన్నారు. ఈ కేసు విచారణకు కొత్త తేదీని ఇంకా నిర్ణయించలేదు.

ఓటు పవిత్ర కర్తవ్యం

- ఓటు వేయలేకపోతే విచారపడాలి
- నవ భారత నిర్మాణంలో అందరూ పాత్రధారులే
- 30న గాంధీతోపాటు అమరవీరులందరికీ శ్రద్ధాంజలి ఘటించాలి
- మన్‌కీబాత్ కార్యక్రమంలో ప్రధాని మోదీ పిలుపు



న్యూఢిల్లీ, జనవరి 27: ఓటు హక్కును వినియోగించుకోవడం ఎంతో పవిత్రమైన కర్తవ్యమని, ఆ ప్రజాస్వామిక హక్కును వినియోగించుకోలేనివారు విచారపడాలని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. తన నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్'లో భాగంగా ఆదివారం ఆయన దేశ ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణలో అపూర్వ సామర్థ్యం కనబరుస్తున్న ఎలక్షన్ కమిషన్ (ఈసీ)ను ప్రశంసలతో ముంచెత్తారు. 21వ శతాబ్దంలో పుట్టినవారు వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మొదటిసారి తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని ప్రధాని తెలిపారు. 'దేశానికి సంబంధించిన బాధ్యతలను తమ భుజాలపై ఎత్తుకొనే అవకాశం వారికి లభించనుంది. జాతి నిర్మాణంలో వారు భాగస్వాములు కానున్నారు. యువత కనే కలలు.. ఈ దేశ స్వప్నాలతో మిళితమయ్యే సమయం ఆసన్నమైంది' అని వ్యాఖ్యానించారు. అర్హులైన యువతీయువకులందరూ ఓటర్లుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. 'ఓటు వేయడం మన పవిత్ర కర్తవ్యం అన్న భావన మనలోనే ఉద్భవించాలి. ఏ కారణం వల్లనైనా ఎవరైనా ఓటు వేయలేకపోతే.. ఆ భావన వారిని బాధ పెట్టేలా ఉండాలి. 'ఓటు వేయలేకపోయిన వారు దేశంలో జరుగుతున్న తప్పిదాలను చూడాల్సివచ్చినప్పుడు విచారపడాలి. ఓటు హక్కుకున్న ప్రాధాన్యాన్ని ప్రజలు గ్రహించాలి. ఓటర్లుగా పేర్ల నమోదు, ఓటు హక్కు వినియోగించుకోవడంపై నిర్వహించే అవగాహన కార్యక్రమాలకు సమాజంలోని ప్రముఖులు, పెద్దలు తమవంతుగా సాయమందించాలి అని ఆయన విజ్ఞప్తి చేశారు. దేశం గణతంత్రంగా మారడానికి ఒక రోజు ముందు, 1950, జనవరి 25న ఎన్నికల సంఘం ఏర్పడిందని ప్రధాని గుర్తు చేశారు. భారత్‌లో ఎన్నికలు జరిగే తీరును చూసి ప్రపంచం ఇప్పటికీ అబ్బురపడుతుందని అన్నారు. ఇక ఇటీవల జరిగిన ఖేలో ఇండియా క్రీడల గురించి ప్రధాని ప్రస్తావిస్తూ, స్థానికంగా పరిస్థితులు అనుకూలించాలని లేదా క్రీడలకు బలమైన పునాది ఉన్నప్పుడే యువత తమ సామర్థ్యం మేరకు రాణిస్తారని చెప్పారు. నవ భారత నిర్మాణం బాధ్యత కేవలం మహానగరాలలో నివసించేవారిపై మాత్రమే కాకుండా.. చిన్న నగరాలు, పట్టణాలు, గ్రామాల నుంచి వచ్చే యువత, బాలలు, యువ క్రీడాకారులపై కూడా ఉంటుందని పేర్కొన్నారు. యువత – అంతరిక్ష పరిజ్ఞానం గురించి మాట్లాడుతూ, దేశంలోని ప్రతిభావంతులైన యువ శాస్త్రవేత్తల కారణంగా భారత అంతరిక్ష కార్యక్రమం విజయవంతమవుతున్నదని ప్రధాని పేర్కొన్నారు. విద్యార్థులు తయారుచేసిన ఉపగ్రహాలు అంతరిక్షం చేరాయని ఆయన గుర్తు చేశారు. ఈ నెల 30న మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా అమరవీరులందరికీ శ్రద్ధాంజలి ఘటించాలని ప్రధాని దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. వచ్చే నెల 19న రవిదాస్ జయంతిని కూడా ప్రధాని ప్రస్తావిస్తూ, 'మనిషి మతాల వారీగా విడిపోయాడు.. అతనిలోని మానవత్వం కనుమరుగైంది' అన్న ఆయన మాటలను గుర్తుచేశారు.

వాచ్‌మన్‌ను తొలిగించేందుకు
ఒక్కటవుతున్నారు

అవినీతిని, నియంతృత్వాన్ని అడ్డుకుంటున్నందుకు వారిలో వణుకు పుడుతున్నది
స్వార్థ రాజకీయాల కోసమే ఈబీసీ రిజర్వేషన్లపై తప్పుడు ప్రచారం
ప్రతిపక్షాల మహాకూటమిపై మోదీ విమర్శ.. ■ తమిళ నాడు, కేరళలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం



మదురైలో పార్టీ కార్యకర్తలు, నేతలు బహూకరించిన జ్ఞాపికతో ప్రధాని మోదీ

మదురై/కొచ్చి జనవరి 27: ప్రధాని నరేంద్రమోదీ లోక్‌సభ ఎన్నికల శంఖారావం పూరించారు. తమిళనాడు, కేరళలలో ఆదివారం పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించిన ప్రధాని ఈ సందర్భంగా ప్రతిపక్ష పార్టీలపై విమర్శలు సంధించారు. మదురైలో జరిగిన ఒక బహిరంగ సభలో మాట్లాడుతూ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి 10శాతం రిజర్వేషన్ కల్పించడాన్ని కొందరు రాజకీయ ప్రయోజనాల కోసమే వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు. ఆర్థిక నేరగాళ్ల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నామని, వారు విదేశాలకు పారిపోయినా వదిలిపెట్టడం లేదని చెప్పారు. ప్రతిపక్ష పార్టీలు మహాకూటమిగా ఏర్పడటాన్ని ఆయన ప్రస్తావిస్తూ 'వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఈ వాచ్‌మామన్‌ను (తనను) తొలిగించేందుకు వారంతా తమ విభేదాలను పక్కన పెట్టి ఒక్కటవుతున్నారు' అని అన్నారు. కేరళలోని త్రిచూర్‌లో జరిగిన సభలో మోదీ మాట్లాడుతూ, రాష్ట్రంలోని కమ్యూనిస్టు పాలకులకు దేశ సంస్కృతిపై గౌరవం లేదన్నారు.

దళిత, బీసీ రిజర్వేషన్లపై ప్రభావం పడదు

ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి విద్య, ఉద్యోగాలలో 10శాతం రిజర్వేషన్ కల్పించడం వల్ల దళితులు, గిరిజనులు, ఓబీసీలకు అంతకుముందున్న రిజర్వేషన్లపై ఎలాంటి ప్రభావం ఉండబోదని ప్రధాని చెప్పారు. తమిళనాడులోని కొంతమంది తమ స్వార్థ ప్రయోజనాల కోసం 10శాతం రిజర్వేషన్లపై అనుమానాలు రేకెత్తిస్తున్నారని ధ్వజమెత్తారు. తమిళనాడులోని ప్రతిపక్ష డీఎంకే సహా పలు పార్టీలు ఈ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్నాయి. అవినీతికి వ్యతిరేకంగా తాము తీసుకుంటున్న చర్యల వల్ల ఢిల్లీ నుంచి చెన్నై దాకా వణుకు ప్రారంభమైందని చెప్పారు. 'ప్రభుత్వ కాంట్రాక్టుల్లు, రక్షణ ఒప్పందాలు, సంక్షేమ పథకాలలో అక్రమ ఒప్పందాలు చేసుకొనేవారు ఇప్పుడు కఠిన పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. అందుకే వారంతా ఏకమవుతున్నారు' అని ప్రతిపక్షాల మహాకూటమిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా మాజీ సీఎం జయలలితకు ప్రధాని నివాళులర్పించారు. అంతకు ముందు ఆయన తొప్పూర్ వద్ద ఎయిమ్స్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తమను ఎస్సీల జాబితా నుంచి తొలిగించి ఓబీసీలుగా పరిగణించాలన్న 'దేవేంద్ర కుల వేలలర్' వారి డిమాండ్ పట్ల సానుకూలంగా స్పందిస్తామని ప్రధాని చెప్పారు.

సైంటిస్ట్ నంబి నారాయణన్‌పై తప్పుడు కేసు పెట్టిన కాంగ్రెస్

నిజాయితీపరుడైన ఇస్రో శాస్త్రవేత్త ఎస్ నంబి నారాయణన్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు కేసు పెట్టి ఇబ్బందులకు గురిచేసిందని ప్రధాని మోదీ ఆరోపించారు. తమిళనాడు పర్యటన అనంతరం కేరళకు వచ్చిన ప్రధాని కొచ్చి, త్రిచూర్‌లలో పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. నంబి నారాయణన్‌ను పద్మ భూషణ్ అవార్డుతో సత్కరించడం తమ ప్రభుత్వానికి దక్కిన గౌరవమన్నారు. 'రెండు దశాబ్దాల క్రితం దేశభక్తుడు, కష్టపడి పనిచేసే ఇస్రో శాస్త్రవేత్త నంబినారాయణన్‌పై కక్ష సాధించేందుకు కొందరు కాంగ్రెస్ నేతలు తప్పుడు కేసు పెట్టారు. వారు దేశ ప్రయోజనాలను పణంగా పెట్టి ఓ శాస్త్రవేత్తను ఇబ్బందులకు గురిచేశారు' అని ప్రధాని విమర్శించారు. శబరిమల అంశాన్ని ప్రధాని ప్రస్తావిస్తూ కేరళలోని వామపక్ష ప్రభుత్వం దేశ సంస్కృతిని, లింగ సమానత్వాన్ని అగౌరపరుస్తున్నదని ఆరోపించారు. కొచ్చిలో భారత్ పెట్రోలియం సంస్థకు చెందిన రిఫైనరీని ప్రధాని జాతికి అంకితం చేశారు. అక్కడే పెట్రోకెమికల్ కాంప్లెక్స్ శంకుస్థాపన చేశారు.

నల్లజెండాలు చూపిన ఎండీఎంకే కార్యకర్తలు



ప్రధాని మోదీ తమిళనాడు ప్రయోజనాలకు భంగం కలిగిస్తున్నారని ఆరోపిస్తూ ఎండీఎంకే కార్యకర్తలు తమ పార్టీ అధినేత వైగో నాయకత్వంలో ప్రధాని మోదీ రాక సందర్భంగా నల్లజెండాలతో ప్రదర్శన నిర్వహించారు. మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేసిన కార్యకర్తలు గాలిలోకి నల్ల బెలూన్లను విడిచిపెట్టారు. ఈ సందర్భంగా పోలీసులు వందమందికి పైగా ఆందోళనకారులను అరెస్టు చేసి ఆ తరువాత విడుదల చేశారు.



చర్చిలో బాంబు పేలుడు ధాటికి చెల్లాచెదురైన బెంచీలు

ఫిలిప్పీన్స్‌లో
బాంబు పేలుళ్లు

- 20 మంది దుర్మరణం.. 111 మందికి గాయాలు
- చర్చి లక్ష్యంగా దారుణానికి పాల్పడ్డ ఉగ్రవాదులు

జోలో (ఫిలిప్పీన్స్), జనవరి 27: ఫిలిప్పీన్స్‌లో ఉగ్రవాదులు ఘాతుకానికి పాల్పడ్డారు. ఆదివారం దక్షిణ ఫిలిప్పీన్స్ దీవి అయిన జోలోలో రోమన్ క్యాథలిక్ కేథడ్రల్ చర్చిని లక్ష్యంగా చేసుకుని నిమిషాల వ్యవధిలో రెండు వరుస బాంబు పేలుళ్లకు పాల్పడ్డారు. ఈ దుర్ఘటనలో 20 మంది దుర్మరణం చెందగా, 111 మంది గాయపడ్డారని పోలీసులు వెల్లడించారు. చర్చి లోపల మొదటి బాంబు పేలుడు సంభవించిందని, దీంతో చర్చి ప్రధాన ద్వారం వద్ద తొక్కిసలాట జరగడంతో పలువురు గాయపడ్డారని ప్రత్యక్ష సాక్షి ఒకరు తెలిపారు. బాంబు పేలుడు సంభవించిన వెంటనే చర్చి బయట విధులు నిర్వహిస్తున్న సైనిక బలగాలు, పోలీసులు లోపలకు వచ్చారని, అదే సమయంలో ప్రధాన ద్వారం సమీపంలో రెండో బాంబు పేలుడు సంభవించడంతో భారీగా ప్రాణనష్టం సంభవించిందని వివరించారు. మొదటి బాంబు పేలుడుతో చర్చి లోపల చెక్క బెంచీలు, గాజు కిటికీలు చెల్లాచెదురుగా ఎగిరిపడ్డాయని చెప్పారు. రెండో పేలుడుతో చర్చి ఆవరణ మొత్తం మానవ శరీర భాగాలతో భీతావహంగా మారిందని చెప్పారు. మృతిచెందిన వారిలో ఐదుగురు భద్రతా సిబ్బంది కూడా ఉన్నారని పోలీసులు వెల్లడించారు.. బాంబు పేలుళ్ల నేపథ్యంలో చర్చికి వచ్చే దారులను మూసివేశారు. క్షతగాత్రులను పట్టణంలోని దవాఖానకు తరలించారు. తీవ్రంగా గాయపడ్డ వారిని హెలికాప్టర్‌లో జాంబోంగా నగరానికి తీసుకెళ్లారు. ప్రభుత్వ భద్రతా సామర్థ్యాలపై ప్రత్యర్థులు సవాల్ విసిరారని, ఈ క్రిమినల్లను అణచివేస్తామని దేశ అధ్యక్షుడు రోడ్రిగో డుటెర్టే కార్యాలయం హెచ్చరించింది. అబు సయ్యాఫ్ ఉగ్రవాదుల ప్రభావంతో జోలో దీవి సతమతమవుతున్నది. ఈ ఉగ్రవాద సంస్థను అమెరికా నిషేధిత జాబితాలో ఉంచింది. బాంబు దాడులు, కిడ్నాప్‌లు, శిరచ్ఛేదనలతో ఈ సంస్థ మారణకాండకు పాల్పడుతున్నది. తాజా ఘటనకు ఇప్పటివరకు ఏ సంస్థా బాధ్యత వహించలేదు. లక్షా 50 వేల మంది మరణానికి కారణమైన ఐదు దశాబ్దాల వేర్పాటువాద తిరుగుబాటుకు ముగింపు పలికే దిశగా దక్షిణ ఫిలిప్పీన్స్‌లో ఓ ప్రాంతానికి స్వయం ప్రతిపత్తి కల్పించే ఒప్పందానికి మైనార్టీ ముస్లింలు ఆమోదం తెలిపిన వారానికే తాజా దుర్ఘటన సంభవించింది. ఈ ఒప్పందానికి దాదాపు అన్ని ముస్లిం ప్రాంతాలు ఆమోదం తెలుపగా, జోలో ప్రాంతం ఉన్న సులు ప్రావిన్స్ మాత్రం వ్యతిరేకించింది.

బ్రెజిల్‌కు మరో మైనింగ్ డ్యామ్ ముప్పు!


- ప్రమాదకర స్థాయిలో నీటిమట్టం
- హెచ్చరికలు జారీ చేసిన అధికారులు
- శుక్రవారం నాటి దుర్ఘటనలో 37కు చేరిన మృతుల సంఖ్య



డ్యాం బద్ధలైన అనంతరం బ్రెజిల్‌లోని బ్రుమాదిన్హో పట్టణాన్ని ముంచెత్తిన బురద ప్రవాహం

బ్రుమాదిన్హో, జనవరి 27: బ్రెజిల్‌లోని మినాస్ గేరియాస్ రాష్ట్రం బ్రుమాదిన్హో పట్టణంలో మరో మైనింగ్ డ్యామ్‌లో నీటి మట్టం ప్రమాదకర స్థాయిలో పెరగడంతో ఆదివారం అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని హెచ్చరించారు. శుక్రవారం ఇదే పట్టణంలో దిగ్గజ మైనింగ్ కంపెనీ వాలేకు చెందిన వాడుకలో లేని టైలింగ్స్ డ్యామ్ (మైనింగ్ వ్యర్థాల నిర్వహణ కోసం నిర్మించినది) కూలడంతో సుమారు 300 మంది గల్లంతైన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ఇప్పటివరకు 37 మంది మృతదేహాలను వెలికితీశారు. మృతులు ఇంకా వందల సంఖ్యలో ఉండే అవకాశం ఉందని స్థానిక అగ్నిమాపక సిబ్బంది, మైనింగ్ కంపెనీ అధికారులు తెలిపారు. తాజాగా ఇదే గని వద్ద మరో మైనింగ్ డ్యామ్‌లో నీటి మట్టం ప్రమాదకర స్థాయిలో పెరిగిన నేపథ్యంలో ఆదివారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలు ఎత్తైన ప్రదేశాలకు తరలివెళ్లాలని సూచించారు. శుక్రవారం నాటి దుర్ఘటనకు సంబంధించి సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. బురద భారీగా పేరుకుపోవడంతో రహదారులు మూసుకుపోయాయి. దీంతో హెలికాప్టర్ల ద్వారా సహాయక చర్యలు చేపడుతున్నారు. దుర్ఘటనలో ఇప్పటివరకూ 170 మంది రక్షించామని, 23 మందిని చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించామని అధికారులు వెల్లడించారు. కూలిన డ్యామ్ 40 ఏండ్ల కిందట నిర్మించినదని, అది 86 మీటర్ల ఎత్తు ఉన్నట్లు వాలే కంపెనీ తెలిపింది. దాన్ని తొలిగించాల్సి ఉండగా, ఇంతలోనే కూలిందని పేర్కొంది. ఇటీవలే దేశ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన జైర్ బోల్సోనారో శనివారం ఘటనా స్థలాన్ని సందర్శించారు. ప్రమాద స్థలిని చూసి భావోద్వేగాన్ని ఆపుకోలేకపోయానని, సహాయక చర్యలకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆయన ట్వీట్ చేశారు. 1000 మంది సైనికులు సహాయక చర్యల్లో పాల్గొంటున్నట్లు మిలిటరీ వెల్లడించింది. బాధితులను రక్షించేందుకు ఇజ్రాయెల్ కూడా సహాయక సామగ్రితో పాటు 30 మంది సైనికులను పంపింది. దుర్ఘటన నేపథ్యంలో వాలే కంపెనీకి దేశ వాతావరణ పరిరక్షణ సంస్థ 66.5 కోట్ల డాలర్ల జరిమానా విధించింది. మినాస్ గేరియాస్ రాష్ట్ర ప్రభుత్వం కూడా మరో జరిమానా విధించేందుకు సిద్ధమైంది. వాలే కంపెనీకి చెందిన బ్యాంకు ఖాతాల్లో ఉన్న 27 కోట్ల డాలర్లను జప్తు చేసేందుకు ఇప్పటికే కోర్టు అనుమతులు పొందినట్లు అధికారులు తెలిపారు. దీనిని బాధితుల సహాయనిధికి జమచేయనున్నట్లు వెల్లడించారు.

హామీలను నెరవేర్చకపోతే
జనం తరిమికొడతారు
సహచర నాయకులకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ హెచ్చరిక



న్యూఢిల్లీ, జనవరి 27: కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మరోసారి తన సొంత పార్టీకి (బీజేపీకి) ఇబ్బంది కలిగించే వ్యాఖ్యలు చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రతి రాజకీయ నాయకుడు కృషిచేయాలని ఆయన హితవు పలికారు. తమ ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసే నాయకులను ప్రజలు ఆరాధిస్తారని, లేకపోతే తరిమికొడతారని గడ్కరీ హెచ్చరించారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని నెరవేర్చగలిగే హామీలను మాత్రమే ఇవ్వాలని సూచించారు. తనవరకైతే చెప్పిన పని చేస్తానని, ప్రజల ముందు రంగుల కలలు చూపించే అలవాటు తనకు లేదని అన్నారు. గతేడాది కూడా ఆయన ఇదేవిధమైన వ్యాఖ్యలుచేసి బీజేపీకి ఇరకాటంలో పడేసిన విషయం తెలిసిందే. బీజేపీలోని కొంతమంది నేతలు చాలా తక్కువగా మాట్లాడాల్సిన అవసరం ఉన్నదని, ముఖ్యంగా మీడియాతో మాట్లాడేటప్పుడు ఎంత పొదుపుగా వ్యవహరిస్తే అంత మంచిదని ఆయన ఓ కార్యక్రమంలో అన్నారు. తద్వారా ఆయన 2014లో లోక్‌సభ ఎన్నికల సందర్భంగా బీజేపీ ఉద్దేశపూర్వకంగానే తప్పుడు హామీలిచ్చినట్టు సూచనప్రాయంగా తెలిపారు. 'ఎన్నటికీ అధికారంలోకి రాలేమన్న నమ్మకంతో శుష్క వాగ్దానాలు చేయాల్సిందిగా కొందరు సూచించారు. ఇప్పుడు మేము అధికారంలో కొనసాగుతుండటంతో ఆ హామీల గురించి ప్రజలు గుర్తుచేస్తున్నారు. దీంతో మేము నవ్వుకుని పక్కకు వెళ్లిపోతున్నాం' అని గడ్కరీ నాటి కార్యక్రమంలో పేర్కొన్నారు.

ట్రెయిన్-18కు
'వందే భారత్ ఎక్స్‌ప్రెస్'గా నామకరణం
రైల్వేశాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడి



న్యూఢిల్లీ, జనవరి 27: దేశీయంగా తయారు చేసిన ట్రెయిన్-18కు 'వందే భారత్ ఎక్స్‌ప్రెస్'గా నామకరణం చేసినట్టు రైల్వేశాఖ మంత్రి పీయూష్ గోయల్ ఆదివారం వెల్లడించారు. గంటకు 160 కి.మీ. గరిష్ఠ వేగంతో పరుగులు తీసే ఈ రైలు ఢిల్లీ-వారణాసి మధ్య నడిచేందుకు సిద్ధమైంది. ప్రధాని మోదీ త్వరలో ఈ రైలును ప్రారంభించనున్నట్టు తెలుస్తున్నది. 16 బోగీలు ఉండే ఈ రైలును రాయ్‌బరేలీలోని మోడ్రన్ కోచ్ ఫ్యాక్టరీ రూ.97 కోట్ల ఖర్చుతో 18 నెలల్లో తయారు చేసింది. దీంతో ఇది ట్రెయిన్-18గా పేరు పొందింది. 30 ఏండ్ల నుంచి నడుస్తున్న శతాబ్ది ఎక్స్‌ప్రెస్‌కు 'వారసురాలి'గా పరిగణిస్తున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్.. దేశంలో తొలి ఇంజిన్ రహిత రైలుగా రికార్డులకెక్కింది. పూర్తిగా ఏసీ రైలైన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రెండు ఎగ్జిక్యూటివ్ చైర్‌కార్‌లను కలిగి ఉంటుంది. కాన్పూర్, అలహాబాద్ స్టేషన్లలో ఆగే ఈ రైలుకు ప్రజలు అనేక పేర్లను సూచించినప్పటికీ అంతిమంగా వందే భారత్ ఎక్స్‌ప్రెస్ అని నామకరణం చేయాలని నిర్ణయించామని పీయూష్ గోయల్ తెలిపారు.

ఓ ఇంటివాడైన హార్దిక్ పటేల్
బాల్య స్నేహితురాలు కంజల్‌తో వివాహం




న్యూఢిల్లీ, జనవరి 27: పాటీదార్ రిజర్వేషన్ ఉద్యమ నేత హార్దిక్ పటేల్ ఓ ఇంటివాడయ్యాడు. ఆదివారం ఆయన గుజరాత్‌లోని సురేంద్రనగర్‌లో తన బాల్య స్నేహితురాలు కంజల్ పరీఖ్‌ను సాంప్రదాయబద్ధంగా వివాహమాడాడు. మౌలి తాలూకాలోని దిగ్సర్‌లో గల ఓ దేవాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి కొద్దిమంది సన్నిహితులు మాత్రమే హాజరయ్యారు. అతిథులకు అహ్మదాబాద్‌లో విందు ఇవ్వనున్నట్టు సమాచారం. దేశద్రోహ కేసులో హార్దిక్ పటేల్ 2016 మార్చిలో సూరత్ జైలులో ఉన్నప్పుడు కంజల్‌తో వివాహానికి నిశ్చితార్థం జరిగింది. సామాజిక ప్రయోజనాల కోసం పోరాడుతున్న తనకు ఇప్పుడు కంజల్ కూడా అండగా నిలిచిందని హార్దిక్ పటేల్ తెలిపారు. అహ్మదాబాద్‌లోని వీరంగాంకు చెందిన కంజల్ ప్రస్తుతం తన కుటుంబ సభ్యులతో కలిసి సూరత్‌లో నివసిస్తున్నారు. హార్దిక్ పటేల్ సోదరి మోనికాకు ఆమె క్లాస్‌మేట్.

రైతన్నలకు కేంద్రం భారీ తాయిలాలు!

మొదటిపేజీ తరువాయి...

వ్యవసాయ మంత్రిత్వశాఖ పలు ప్రతిపాదనలు రూపొందించింది. వీటిపై ఒక నిర్ణయం వెలువడే అవకాశం ఉంది' అని ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. రైతుల సమస్యల పరిష్కారానికి స్వల్పకాలిక, దీర్ఘకాలిక పరిష్కారాలను వ్యవసాయ శాఖ ఇప్పటికే ప్రతిపాదించింది. మరో నెల రోజుల్లో ఎన్నికల నియమావళి అమల్లోకి రానుండడం, ఆ తర్వాత కొద్దిరోజుల్లోనే లోక్‌సభ ఎన్నికలు జరుగనుండడంతో సోమవారం జరిగే క్యాబినెట్ భేటీ అనంతరం పలు కీలక నిర్ణయాలు ప్రకటించే అవకాశం ఉంది. వీటిలో ప్రధానంగా మూడు తాయిలాలు ప్రకటిస్తారని భావిస్తున్నారు. వ్యవసాయ పంట రుణాల్ని నిర్ణీత గడువు లోపల చెల్లించిన రైతుల వడ్డీని పూర్తిగా మాఫీ చేయడం ఇందులో ఒకటి. తద్వారా ఖజానాపై రూ.15 వేల కోట్ల భారం పడనున్నట్లు అంచనా. ఆహారధాన్యాల పంటలపై ప్రస్తుతం రైతులు చెల్లిస్తున్న బీమా ప్రీమియాన్ని పూర్తిగా మాఫీ చేయడం రెండో ప్రతిపాదన. తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ మార్గనిర్దేశకత్వంలో అమలు చేస్తున్న రైతుబంధు తరహాలో నేరుగా అన్నదాతల బ్యాంకు ఖాతాల్లోకి నగదు బదిలీ చేయడం మూడో ప్రతిపాదన. ఒడిశా సర్కారు కూడా ఇదే తరహాలో రైతుల ఖాతాల్లోకి నగదు బదిలీ చేస్తున్నది. ఈ మూడు ప్రత్యామ్నాయాలపై కేంద్రం గట్టిగా కసరత్తు చేస్తున్నది. ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టే కేంద్ర బడ్జెట్‌లో భారీ వ్యవసాయ ప్యాకేజీలు ప్రకటించే అవకాశం ఉందని వ్యవసాయశాఖ మంత్రి రాధామోహన్ సింగ్ ఇటీవలే సంకేతాలిచ్చారు. లోక్‌సభ ఎన్నికలకు సమయం దగ్గరపడడంతో రైతు ప్యాకేజీలు ప్రకటించి వాటిని వీలైనంత తొందరగా అమలు చేయాలనేది కేంద్రం వ్యూహం. తద్వారా ఎన్నికల్లో లబ్ధి పొందాలనేది వారి ఎత్తుగడ.



జీవితమంటే అనుభవం. గొప్ప అనుభవం వైపు ప్రయాణించటమే జీవిత లక్ష్యం

చలం

ఏదైనా.. భర్పూర్‌గానే ఉండాలి!

ఇదొక్కటే కాదు..,
ఈ వెన్నెల్లో కూర్చొని
ఇద్దరం కళ్లల్లో చూసుకోవడం
ఒకరిమీద ఒకరం పూలు చల్లుకొని
నవ్వుల్లో మునిగిపోవడం!
ప్రేమించుకోవడమంటే
మనుషుల్ని మరిచిపోయే
మత్తులాంటి పరవశాలేంకాదు
ఎన్నో గరుకు స్పర్శలు కూడా ఉంటాయి..!
ఈ ప్రయాణంలో ..
చిలువలు పలువలుగా
తెలియని మలుపులుంటాయి!

బాధ్యతలూ.. బరువులూ..
బంధాలూ.. బాంధవ్యాలూ..
కష్టాలూ, సుఖాలూ.. కన్నీళ్లూ, కనికరాలూ
ఆకలీ, దూపా.. సేవలూ, స్నేహాలూ
తోవలు, తుఫానులూ..

ఇవన్నీకూడా
నీకూ నాకూ సంబంధించినవే..!

ఇన్నిటినీ పట్టించుకోకుండా
పల్లకీలో తిరుగుతూ
కొలనులో నీడలు చూసుకోలేను
ఇంద్రధనుస్సు రంగుల చాటున
జీవితాన్ని మరిచిపోలేను

నేను మామూలు మనిషిని
సాదా సీదా ప్రేమికుణ్ణి
ఎవర్ని ఇష్టపడినా
ఏ కర్తవ్యాన్ని స్వీకరించినా
భర్పూర్ గానే ఉండాలనికొంటాను..!

– ఆశారాజు, 93923 02245

('భర్పూర్' అంటే సంపూర్ణంగా. ఇక్కడ గుండెనిండా అని అర్థం)

క్షణాల క్షణికం

దుర్భేద్యమైన అహంకార కుడ్యాల నడుమ
ఏ అస్త్రమూ ఛేదించలేని ఉన్మాద ఛత్రాల నీడన
గోడలకు భేదంలేని సహస్ర నినాదాల మధ్య
నాదే ప్రపంచమని విర్రవీగే అజ్ఞాన తిమిరాల చెంత
ఎన్ని ప్రపంచాలు, ఎన్ని కంచెలు, ఎన్ని యుద్ధాలు..!

కాలం అనంత క్షణాల క్షణికం
దాని ఆది తెలియదు.. అంతు తెలియదు
కొలుస్తున్నామనుకుంటాం, జీవిస్తున్నామనుకోం
జయిస్తున్నామనుకుంటాం, క్షయిస్తున్నామనుకోం!

శాశ్వతమని పోతపోసిన వేనవేల కలలు
భళ్లున బద్దలవుతాయి
సర్వం నాదే అనుకున్నది.. మరుక్షణం
చిద్రుపలై కళ్లముందే కళ్లమవుతుంది
అజేయం అనుకున్నది అంతలోనే
క్షీణమై హీనమై అంతానికి చేరువవుతుంది!

కొండలు దూది పింజలయితే
దూది పింజలు కొండలు కావా!
భ్రమ బ్రహ్మరాక్షసిగా మారి
మనసును మాయ చేస్తోంది
కాలు నిలువనీయదు
కాలం మరువనీయదు
ఖాళీ సలుపుతున్నది..!

దేనికోసమో వెదుకుతూ ఉంటాం
కళ్ళముందు ఉన్నది చూడలేం
అవి ఎండమావులని తెలిసేసరికి
జీవితం గడప దాటిపోతుంది
కళ్ళు తెరిచే సరికి కాలం కనుమరుగవుతుంది
భయమూ అభయమూ గుర్తించలేని అసమర్థత
మార్మికత వాస్తవికతల అంతరం పసిగట్టలేని సందిగ్ధత..!!

– రాచకొండ సిద్ధార్థ

తెలంగాణ ఓ సాంస్కృతిక విజయం

***తె**లుగు సాహిత్యంలో పరిచయం అక్కర లేని పేరు అఫ్సర్. కవిగా, కథకులుగా, విమర్శకులుగా చేయి తిరిగిన రచయిత ఆయన. అంతర్జాతీయంగా తెలుగు వాణిని బలంగా వినిపించే గొంతు ఆయనది. సబాల్టర్న్ స్టడీస్ మీద మరింత స్పృహ పెరుగుతున్న దశలో, అంతర్జాతీయంగా, దేశీయంగా హిందుత్వ శక్తులు బలపడి ముస్లింల ఉనికికే ప్రమాదం ఏర్పడిన సందర్భంలో 'సాహిల్ వస్తాడు' కథల సంపుటితో ఒక ధిక్కార స్వరంతో పాఠకుల ముందుకు వస్తున్న సీనియర్ రచయిత డాక్టర్ అఫ్సర్‌తో ముఖాముఖి..*

ప్రశ్న. తెలుగు సాహిత్య ప్రపంచంలో ఎంతో పేరున్న మీరు ఇప్పటి దాకా కథా సంపుటి వేయలేదంటే ఆశ్చర్యం. మీరు ఎలా ఫీలవుతున్నారు?

సమాధానం. పుస్తకం అనేది నా అజెండాలో ఎప్పుడూ చివరే! నిజానికి ఇప్పటి దాకా ప్రచురించిన నా ఏ పుస్తకం కూడా నా చొరవ వల్ల అచ్చయింది కాదు. మొదటి కవిత్వ పుస్తకం ఖమ్మంలో సీతారాం వల్ల, ఇప్పుడు ఈ కథల పుస్తకం కేవలం 'ఛాయా' మోహన్ బాబు గారి పట్టుదల మాత్రమే! కాని, పుస్తకం కోసం కథలు సేకరించడం మొదలు పెట్టినప్పుడు నాకూ ఆశ్చర్యమే అనిపించింది.



కథల సంఖ్య తక్కువే కాని, ప్రతి కథా అది అచ్చయిన సందర్భంలో విస్తృతమైన చర్చకు దారి తీసిందే. 2002నాటి 'గోరీమా' నుంచి నిన్నమొన్నటి 'వచ్చేపోయే వాన' దాకా! నా కథల్ని చదువరులు సీరియస్‌గా తీసుకున్నారనడానికి అదొక దాఖలా. అంతవరకూ తృప్తి. కథ వర్తమాన సామాజిక సందర్భంలోంచి వచ్చినప్పుడు దాని ప్రభావం అమితంగా వుంటుందనడానికి అదొక ఉదాహరణ.

ప్ర. 'గోరీమా' కథ నుంచి 'సాహిల్ వస్తాడు' కథ దాకా బలమైన ముస్లిం రాజకీయ స్వరాన్ని మీ కథలు వినిపిస్తున్నాయి. ఈ రాజకీయ స్వరం దేనికి ప్రతినిధి?

సమా. కాలేజీ విద్యార్థి సంఘ నాయకుడిగా వున్నప్పటి నుంచీ నేను వామపక్ష రాజకీయాలవైపే. అయితే, అస్తిత్వ వాదాలు నా మీద బాగా ప్రభావం చూపించాయి. దళిత, స్త్రీవాద వివాదాల్లో నేను క్రియాశీలంగా పాల్గొన్నాను, రాశాను, చర్చించాను. ఆ ప్రభావం నా సృజనాత్మక రచనలపైన కూడా బలంగా కనిపిస్తుంది. అయితే, వ్యక్తిగా నావైన అభిప్రాయాలూ, స్వతంత్ర దక్కోణం కూడా అంతే బలంగా కనిపిస్తాయి. కథల్లోనూ ఆ స్వేచ్ఛ కనిపిస్తుంది. ఆ మాటకొస్తే, స్వేచ్ఛ సాధించడానికే కదా అన్ని రాజకీయ సిద్ధాంతాలూ అనుకుంటా.

ప్ర. మీరు కవిగా ప్రసిద్ధులు. కథాశిల్పంలో మీ అనుభవాలూ సవాళ్లు ఏమిటి?

సమా. కవిగా నలుగురికి తెలిసినా, నేను కథకుడిగానే సాహిత్య యాత్ర మొదలు పెట్టాను. సాహిత్యంలోకి అడుగుపెట్టిన తొలి రోజుల్లో ఎక్కువగా కథలే రాశాను. కథల అనువాదాలు కూడా చేశాను. కవిత్వంలోకి నాది లేట్ ఎంట్రీ! అట్లాగే, జర్నలిజంలో చాలా కాలం పనిచేయడం వల్ల వచన రచన నా రోజువారీ జీవితంలో కూడా పెద్ద భాగమైంది. జర్నలిజంలో నాకున్న అనుభవాన్ని బట్టి చూస్తే, నేను కవిగా బతికి బట్ట కట్టడమే గొప్ప. జర్నలిజం అంటే రోజుకు కనీసం పది గంటల పాటు వచనం రాయడమే కదా! అయితే, మిగిలిన వచన రచనలు వేరు, కథ వేరు. ఇంకో కోణం నుంచి బాగా సునిశితంగా చూస్తే, కథాశిల్పం కవిత్వానికి దగ్గిరగా వుంటుంది. అంటే, కవిత్వంలోని క్లుప్తతా, సాంద్రతా, భాషా సౌందర్యం కథకు కూడా అవసరమే. కొద్దిపాటి స్పేస్‌లో అనేక విషయాలు తదేక దృష్టితో చెప్పాల్సిన బాధ్యత కథకుడికీ, కవికీ ఒకేలాంటిది. కథాశిల్పంలో నేను మధ్యే మార్గంలో వెళ్లాను. వాటిల్లో కవిత్వ తీవ్రత ఎక్కువే వుంటుంది.

ప్ర. తెలంగాణ కథా సముద్రంలోకి పాత నీరు పోయి కొత్త నీరు వస్తున్న ఈ సంధి యుగంలో తెలంగాణ కథ మీద మీ అభిప్రాయం ఏమిటి?

సమా. ముందు– తెలంగాణ కథలో ఇది మీరన్నట్టు 'సంధియుగం'కాదు. అత్యంత నిర్దిష్టమైన దశ. తెలంగాణ కథకు అనేక వన్నెలు అమరిన దశ. 1940ల నుంచి ఇప్పటిదాకా తెలంగాణ కథకు ఒక కొనసాగింపు వుంది. పాతనీరు –కొత్త నీరు అని సాహిత్యంలో స్పష్టంగా గిరిగీసి చెప్పలేం. అవి ఎప్పుడూ కలగలసి ప్రవహిస్తూ వుంటాయి. ఇప్పుడు వస్తున్న తెలంగాణ కథల్లో వైవిధ్యం ఎక్కువగా వుంది. అనేక రకాల జీవన మూలాల్లోకి తెలంగాణ కథకులు ప్రయాణిస్తున్నారు. కథ కొత్తగా చెప్పాలన్న తపన బాగా కనిపిస్తున్నది. తెలంగాణ ముస్లిం కథ ఒక ప్రత్యేక ధోరణిగా బలపడుతున్నది. ఒక్కోసారి మన ప్రయాణం ప్రపంచ ముస్లిం సాహిత్య మలుపులకు దీటుగా కూడా వుంది.

ప్ర. తెలుగు కథా సాహిత్యంలో ముస్లింలకు వాళ్ళ వాటా వాళ్లకి దక్కలేదన్న విమర్శ నిజమేనా?

సమా. అవును. కథా సాహిత్యం అనే కాదు, మొత్తంగా సాహిత్యంలోనే ముస్లింల పాత్రను సరిగా బేరీజు వేయడంలో విఫలమయ్యాం. యూనివర్సిటీ స్థాయి పరిశోధనల్లో తూమాటి దోణప్ప, బిరుదురాజు రామరాజు, షేక్ మస్తాన్‌లాంటి పెద్దలు చేసినంత కషి కూడా ప్రధాన స్రవంతి సాహిత్య విమర్శ రంగంలో జరుగలేదు. ఒకటి రెండు చిన్న పుస్తకాలు రాసిన వాళ్ళ మీద మోనోగ్రాఫులు వచ్చాయి కానీ, ఒక్క ముస్లిం రచయిత గురించి కూడా చిన్న మోనోగ్రాఫ్ లేదు. ఇది తెలంగాణ విషయం మాత్రమే కాదు. అటు రాయలసీమ, ఆంధ్ర ప్రాంతంలోనూ జరుగుతున్న అన్యాయమే. ఇక అవార్డుల విషయానికి వస్తే, ముస్లింలకు లాబీయింగ్ చేసే వాళ్ళు లేనే లేరు. అవార్డుల జాబితాలో ముస్లిం ఎప్పుడూ చివరే! ముస్లిం రచయితలలో కూడా ఒక విధమైన బెరుకు వుందనే చెప్పాలి. అది మన సాహిత్య సామాజిక సంస్కృతిలోని ఆధిపత్య భావన వల్ల ఇతరులు పెంచిన బెరుకే. ఉర్దూ సాహిత్యంలో హిందూ పేర్లను ఎంత గౌరవంగా తలుచుకుంటారో, అంతటి ఉదారత త్వం తెలుగు సాహిత్యంలో ముస్లిం రచయితల పట్ల లేకపోవడం ఐరనీ.

ప్ర. ముస్లింవాద సాహిత్యానికి సంబంధించి మీరు ఎలాంటి మార్పును చూస్తున్నారు?

సమా. కనీసం కొన్ని ముస్లిం పేర్లు ఇప్పుడు కొత్త వెలుగుతో వినిపిస్తున్నాయి. అది ముస్లిం వాదం సాధించిన విజయమే. కాని, ఎంతో పెద్ద పోరాటం చేస్తే తప్ప, ఈ మాత్రం వెలుగు చూడలేకపోవడం విషాదం. అయితే, ముస్లిం వాదానికి ఇంకా సిద్ధాంత పునాది బలపడాలి. ఆఫ్రికా, మధ్య ఆసియా, అరబ్ దేశాల్లోనూ, చివరికి అమెరికన్, బ్రిటన్ సాహిత్య రంగాల్లో ముస్లింలు బలమైన ముద్ర వేశారు. అమెరికన్, బ్రిటన్, యూరప్ సాహిత్య రంగాల్లో ముస్లింలు సాధించిన విజయాలు మనకు ఆదర్శం కావాలి. అది అనేక దశాబ్దాల కృషి అని నాకు తెలుసు. కాని, కనీసం ఒక బలమైన కుదుపు తెలుగు ముస్లింవాద సాహిత్యానికి రావాలి. సృజన, విమర్శ రెండూ బలం పుంజుకుంటే తప్ప ఇది సాధ్యపడదు.

ప్ర. మిమ్మల్ని మీరు ఎలా గుర్తింపబడాలనుకుంటారు? మెయిన్ స్ట్రీం సాహిత్యకారుడిగానా? లేదా ఒక ముస్లిం సాహిత్యకారుడిగానా? ఎందుకు?

సమా. మెయిన్ స్ట్రీం సాహిత్యం అనేది లేనే లేదని, అది కేవలం కృత్రిమ సృష్టి అని సాహిత్య చరిత్రల మీద ఆసక్తి వున్న పరిశోధకుడిగా నా కచ్చితమైన అభిప్రాయం. ఉదాహరణకు తెలుగు సాహిత్యమే తీసుకుందాం. నన్నయను ఆదికవి అనుకుని, అక్కడి నుంచి మెయిన్ స్ట్రీం సాహిత్య చరిత్ర రాసుకుంటూ వచ్చాం. అట్లా చేస్తున్నప్పుడు ఎంతో విస్తారమైన మౌఖిక సాహిత్యాన్ని పక్కన పెట్టేశాం. ఆ తప్పును ఇప్పుడు సాహిత్య చరిత్రకారులు దిద్దుకుంటున్నారు. అట్లాంటి దిద్దుబాటు ఆధునిక సాహిత్యంలో అడుగడుగునా జరుగాలి. లేకపోతే, పాక్షిక సాహిత్య చరిత్రలే అసలైన సాహిత్య చరిత్రలుగా చెలామణి చేసి, వాస్తవికతకు అన్యాయం చేసిన వాళ్ళం అవుతాం. ఇక నా విషయానికి వస్తే.. నేను రచయితగా మొదలైన 1980లలో ముస్లిం వాదం లేదు. దళిత వాదం, స్త్రీవాదం కూడా లేవు. రచయితగా నన్ను పోషించిన చరిత్ర వేరు. ఆ మూలాలు నాలో ఎప్పటికీ వుంటాయి. కేవలం ముస్లింవాద కోణం నుంచే చూస్తే, నేను మొదట్లో రాసిన రచనలకు అన్యాయం జరుగుతుంది. ఇవాళ కూడా చాలా మంది 'రక్తస్పర్శ' 'ఇవాళ' వంటి నా కవిత్వ సంపుటాల గురించి మాట్లాడే వాళ్ళు న్నారు. ఆ పుస్తకాల చరిత్రను నేను నిరాకరించలేను. అట్లాగే, నా చరిత్రనూ నిరాకరించలేను. అవన్నీ నాలో భాగంగానే చూడాలి.

ప్ర. ఇటీవల తెలుగులో ప్రేమ కథలు విరివిగా వస్తున్నాయి. దీన్ని కొంతమంది కమర్షియల్ సాహిత్యానికి కొనసాగింపుగా భావిస్తున్నారు. సమాజం ఎంతో సంక్లిష్టంగా ఉన్న ఈ సమయంలో సాహిత్యం మరోసారి ప్రేమ వైపు పయనించడం ఎంత వరకు సమంజసం? దీన్ని మీరెలా చూస్తారు?

సమా. ప్రేమ, కరుణ లాంటివి గొప్ప భావనలు. ఎప్పటికైనా సాంస్కృతిక సాహిత్య రూపాలు చేరుకోవాల్సిన అంతిమ మజిలీలు. వాటి చుట్టూ ఎంత సాహిత్యం వస్తే అంత మంచిది. అయితే, ఆ రెండు భావనలు సామాజికతకు భిన్నంగా నైరూప్యంగా ఎప్పుడూ ఉండవని గుర్తించాలి. పైగా, విద్వేషం పెరిగిపోతున్న సామాజిక సందర్భంలో ప్రేమ అవసరమే. అయితే, అది కమర్షియల్ సాహిత్యంలో ఉండేలాంటి అమ్మాయి– అబ్బాయి ప్రేమ మాత్రమే కాకూడదని నా అభిప్రాయం.

ప్ర. ఇప్పుడు కవిత్వం కంటే కథలే ఎక్కువగా వస్తున్నాయంటున్నారు. దీని మీద మీ అభిప్రాయం?

సమా. కవిత్వం కూడా బాగానే వస్తున్నది కదా! అయితే, కథల్లో వున్న శక్తి వాటిల్లో వుండడం లేదు. ఎందుకంటే, తెలుగు సమాజం మళ్ళీ క్రాస్ రోడ్స్‌లో వుంది. స్థానికత బలమైన భావనగా మారింది. అంతకుముందు ఆ భావన లేదని కాదు. కాని, తెలంగాణ నినాదం వచ్చిన తరువాత స్థానికతకు సిద్ధాంత బలం దక్కింది. అట్లాంటి స్థానికతని వివిధ పొరల నుంచి విప్పి చెప్పే కథలు రావాలి, వస్తున్నాయి. అది ఈ కాలానికి సాహిత్య ధర్మం.

ప్ర. తెలంగాణ రాష్ట్ర అనంతర సాహిత్యం మీద మీ అభిప్రాయం ఏమిటి?

సమా. అనేక విధాలుగా తెలంగాణ సాధన గొప్ప విజయం. ఇది కేవలం రాజకీయ సామాజిక విజయం కాదు. నా మటుకు నేను దాన్ని ఎక్కువగా సాంస్కృతిక విజయంగా భావిస్తాను. తెలంగాణ కేంద్రంగా ఇప్పుడు జరుగుతున్నంత కృషి మామూలు సందర్భంలో అయితే సాధ్యపడేది కాదు. ఇప్పుడు తెలంగాణ సాధించాక రచయితల బాధ్యత ఇంకా పెరిగింది. రచయితల వైపు చూసే జనం పెరిగారు. అవసరమైతే, తెలంగాణ రచయిత అధికార వ్యవస్థల్ని విమర్శించే స్థితి కూడా వుండాలి. రచయితలలో అంత బలమైన వ్యక్తిత్వం వుంటేనే, తెలంగాణ నిలుస్తుంది. లేకపోతే, ఇతర అధికార వ్యవస్థల మాదిరిగానే ప్రజలకు దూరమవుతుంది.

(అఫ్సర్ మొట్టమొదటి కథల సంపుటి **'సాహిల్ వస్తాడు'** ఆవిష్కరణ జరిగిన సందర్భంగా.. **డాక్టర్ వెల్దండి శ్రీధర్** ఇంటర్వ్యూ...)

ప్రపంచ కవిత

మేరీ ఆలివర్

(1935, సెప్టెంబర్ 10-2019, జనవరి 17)



'అత్యంత ప్రజాదరణ పొందిన అమెరికన్ కవయిత్రి'గా 2007లోనే ప్రఖ్యాత న్యూయార్క్ టైమ్స్ పత్రిక ప్రశంసలు పొందిన సృజనమూర్తి మేరీ జేన్ ఆలివర్! ఒక కవి తన జీవితంలో ఇన్ని పుస్తకాలు రాయగలుగుతారా? అని ఆశ్చర్యపడేంతగా సంఖ్యాపరంగా అన్ని పుస్తకాలు రాసి, ప్రచురించిన సంపూర్ణ సాహితీ స్రష్ట ఆమె. ఒక ఉపాధ్యాయుడి కూతురిగా జన్మించిన మేరీ, బాల్యంలో లైంగిక వేధింపులకు గురై, దాని తాలూకు పీడకలలతోనే జీవిత పర్యంతం బాధపడింది. గ్రామీణ జీవితం నుంచి రావడం వల్ల ఆమె, జన సమూహంలో కన్నా ప్రకృతి సమక్షంలో గడుపడాన్నే ఎక్కువగా ఇష్టపడేది. తన 14వ ఏటనే కవితా రచనను ప్రారంభించిన ఆమె, తన 17వ ఏట ప్రముఖ కవి Edna Vincent Millay రచనల చేత ప్రభావితమైంది. ఆ తర్వాత Thoreau, Walt Whitman సాహిత్యాన్ని ఎంతగానో ఇష్టపడిన ఆమె, తన 28వ ఏట 1963లో No Voyage and Other Poems పేరుతో తొలి కవితా సంకలనం ప్రచురించింది. ఆ తర్వాత The River Styx (1972), The Night Traveller(1978), Twelve Moons (1979), Dream Work (1986), House of Light(1990), The Blue Partners (1995), The Leaf and Cloud (2000), Why I Wake Early (2004), Red Bird (2008) వంటి ఎన్నో కావ్యాలను ప్రచురించింది.

ఆమె రాసిన American Primitive కావ్యానికి 1984లో ప్రతిష్టాత్మక పులిట్జర్ బహుమతిని, New and Selected Poemsకి 1992 National Book Awardను గెల్చుకుంది. Prose Poems పేరిట వినూత్న ప్రయోగాలు చేసిన మేరీ, ఈ శైలిలో White Pine (1994), West Wind(1997), Winter Hours (1999), Swan (2010) వంటి కావ్యాలను కూడా రాసింది.

యాత్ర!

చివరికి ఒకానొక రోజు..
అసలు నువ్వు చేయాల్సిందేమిటో
నువ్వు తెల్సుకుంటావు
అప్పుడు నువ్వు నీ యాత్రను ఆరంభిస్తావు
నీ చుట్టూ ఉండే గొంతులన్నీ
అరుపులు, కేకలతో నిన్ను వారిస్తాయి
మొత్తం ఇల్లు ఇల్లంతా
ప్రకంపించడం మొదలెడ్తుంది
అప్పుడు ప్రాచీన బంధనమేదో
నీ కాళ్ళను కట్టి పడేసినట్టనిపిస్తుంది
ప్రతి స్వరమూ..
'నా జీవితాన్నిచక్కదిద్దు' అని ఆక్రందిస్తుంది
అయినా నువ్వు ఆగవు!

నువ్వేం చేయాల్సి ఉండిందో
ఇప్పుడు నీకు తెల్సిపోయింది
మూలాల నుంచే నిన్ను పెకిలించడానికి
గాలి తన బలిష్టమైన చేతి వేళ్ళను ప్రయోగించి
విషాదంలోని బీభత్సాన్ని ప్రత్యక్షం చేస్తుంది !
ఇప్పటికే చాలా ఆలస్యమైంది, ఇక చాలు
ఇక్కడంతా..
కాల రాత్రి, గమ్యం తెలియని దారి
విరిగిపడ్డ చెట్లు కొమ్మలు..
దారి అంతటా జారిపడ్డ రాళ్ళు–కొండలు..

కొంచెం కొంచెంగా నువ్వు
ఆ గొంతుల ఆదేశాలను వదిలించుకుంటూ
దూరంగా జరుగుతూ వెళుతున్న క్షణాన–
మబ్బుల దొంతరలోంచి
నక్షత్ర జ్వలనం రాజుకుంటుంది
నెమ్మది నెమ్మదిగా
ఓ కొత్త స్వరం పలుకేదో దగ్గరవడం నీకు తెలుస్తుంది
అనతికాలంలోనే
ఆ స్వరం నీదే అని కూడా నీకు ఎరుకవుతుంది
ప్రపంచం లోలోతుల లోతుల్లోకి
నువ్వు పెద్ద పెద్ద అంగలతో దూసుకెళ్తూ
నువ్వు చేయగల్గిన ఒకే ఒక్క పనిని
నువ్వు చేయాలని నిర్ధారించుకున్న నిమిషాన
నీకు నువ్వే, నీ స్వరం మాత్రమే తోడు అని
నీకు ఖుల్లమ్ ఖుల్లాగా సమజవుతుంది!

ఆఖరికి ఒకానొక రోజు ..
నువ్వు రక్షించాలని నిశ్చయించుకున్న జీవితం..
నువ్వు మాత్రమే కాపాడగలిగిన జీవితం..
రెండూ ఒక్కటే అని నీకు జ్ఞానోదయమవుతుంది.. ..!

మూలం: మేరీ ఆలివర్

స్వేచ్ఛానువాదం: మామిడి హరికృష్ణ, 80080 05231

ప్రకటనలు

'లైఫ్ ఈజ్ ఏ మూవ్‌మెంట్' ఆవిష్కరణ

ప్రొఫెసర్ ఎస్వీ రచించిన 'లైఫ్ ఈజ్ ఏ మూవ్‌మెంట్' ఆవిష్కరణ సభ 2019 జనవరి 29న మధ్యాహ్నం 3 గంటలకు, హైదరాబాద్ నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయం సమావేశ మందిరంలో జరుగుతుంది. ప్రొఫెసర్ పి. లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరుగు సభలో నందిని సిధారెడ్డి, దేశపతి శ్రీనివాస్, ప్రొఫెసర్ అలేఖ్య పుంజాల, డాక్టర్ పత్తిపాక మోహన్ పాల్గొంటారు.

- ప్రొఫెసర్ రెడ్డిశ్యామల, ప్రొఫెసర్ జి.ఎస్. గాబ్రియల్


చలినెగళ్లు (కాలుష్యంపై కవిత్వ సమరం)

చలినెగళ్లు (కాలుష్యంపై కవిత్వ సమరం) కార్యక్రమంలో భాగంగా తమ్మనబోయిన వాసు అధ్యక్షతన బొంతపల్లి జిల్లాపరిషత్ పాఠశాల ఆవరణలో 2019 ఫిబ్రవరి 3న ఉదయం 10 గంటల నుంచి జరుగు సభలో మొదట కవిత్వశ్వాస, రచనల చెరువు, మేడ్చల్ సాహిత్య వేదిక కవుల కరచాలన కార్యక్రమం ఉంటుంది. వడ్డె ముద్దంగుల ఎల్లన్న రచన 'నా పల్లె తీరు'పర్యావరణ పాటల సంకలనం పరిచయ కార్యక్రమం. ఎలక్ట్రో హోమియోపతి వైద్య విధానంలో డాక్టరేట్ పొందిన డాక్టర్ చెమన్ అభినందన సభ ఉంటుంది.

- ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్, తెలంగాణ సాహిత్య సమాఖ్య

కొత్త పుస్తకాలు


సాహిత్యమే శ్వాసగా



తెలుగు సాహితీ ప్రపంచంలో పరిచయం అక్కర లేని పేరు ద్వా.నా.శాస్త్రి. సుదీర్ఘ అనుభవం, సామాజిక పరిశీలనాశక్తి, అనుభవంతో, తనదైన స్పందనతో రాసిన రచనల కూర్పే ఈ పుస్తకం.

రచన: డాక్టర్ ద్వా.నా.శాస్త్రి, వెల: రూ. 300,
ప్రతులకు: డాక్టర్ ద్వా.నా. శాస్త్రి,
ఇంటి నెం:1-1-428, గాంధీనగర్, హైదరాబాద్-80

అసీఫా కోసం.. (కవితా సంకలనం)



రక్తమోడుతున్న బాలికల జీవితాలను చూసి, ఆవేదనతో, ఆగ్రహంతో వెల్లువెత్తిన స్పందనలే ఈ కవితా సంకలనం. దేశంలో నానాటికీ పెచ్చరిల్లుతున్న లైంగిక దాడుల నేపథ్యంలో మానవీయ సమాజం కోసం, భద్రమైన బాలికల జీవితాల కోసం ఆకాంక్షలే ఈ కవితలు.

సంపాదకులు: వురిమళ్ల సునంద (భోగోజు)
వెల: రూ. 150, ప్రతులకు: భోగోజు ఉపేందర్‌రావు
ఇంటి నెం:11-10-694/5, బురహాన్‌పురం
ఖమ్మం. సెల్: 9441815722

మనసుకు ఏడ్పు నేర్పాలె..

ఈ **కవిత్వమొక తీరని దాహం..** ఈ వాక్యం పోలిక సరిగ్గా ఇలాంటి సందర్భంలోనే సరిపోతుంది. ఎందుకంటే ఈ కవి చేను గట్టును పియానో చేసి పంట కాల్వ లాంటి పదాలను గలగల పారించగలడు. పూలండోయ్ పూలు అంటూ తన కవిత్వ వాక్యసుమాలను పరిచయం చేయగలడు. అమ్మను వాస్తు శిల్పిని చేసి నాన్నను చెట్టుతో పోలుస్తాడు. స్నేహాన్ని అపురూపంగా రాస్తూ మిత్రుడొచ్చిన వేళ అంటాడు. ఇదిగో ఇప్పుడేమో ఇలా.. 'దేశం లేని ప్రజలు' అంటూ నిరసన గంప తలకెత్తుకున్నాడు. ఈయనే ప్రసాదమూర్తి.

ఈయన కవిత్వం ఏడు రంగుల భావాల కలనేత. ఈయన ప్రతి వస్తువుతోను మాట్లాడతారు, ఇప్పుడు తన తాజా కవిత్వంలో అలలకు కలలకు శిరసు వంచి వినమ్రంగా ఆయన కవిత్వాన్ని అంకితమిచ్చారు.



'Things dont go away
They become you
There is no end..'
T.S.Eliot

డాక్టర్ బి.ప్రసాదమూర్తి పంచే అక్షరాలన్నీ కళ్ళకద్దుకోవలసినవే. భక్తితో కాదు ప్రేమతో..

ఇదిగో ఇందాక గుడికాడ కలిసి ఆయన ప్రసాదం పెట్టిన నా పిడికిలి పొట్లం విప్పుతున్నాను.. ఈ కవితా సంపుటి **'దేశం లేని ప్రజలు'**లో ఎవరెవరు ఎలా ఎందుకు నిరాశ్రయులయ్యారో వారికి ఈయన హృదయ దేశంలో ఎలా ఆశ్రయం కల్పించారో చూద్దాం రండి..

ముందుగా టైటిల్ కవిత.. ఈ ఒక్క కవిత చాలు ఈయనకు ఒక గొప్ప అవార్డు దక్కటానికి. కొన్ని కులాలు జాతులకు జాతీయంగా అంతర్జాతీయంగా ఎదురవుతున్న అభద్రతా భావం గురించి నిఘా చూపులు నింద మాటలు దిగబడి అల్లాడుతున్న ఆ బాధితుల పక్షాన ఈ కవి తన గొంతుక వినిపించారు..**'అక్కర్లేని మిగులు జనం.. గుండెల్ని చీల్చి దేశ పటాన్ని చూపించినా.. మొలకెత్తిన చోటు నాదే అని మొక్క మొరాయిస్తే కుదరదు..'** ఈ వాక్యాల్లో అభాగ్యుల దుస్థితిని ఎలా ఎరుక చేశారో కదా! చదువుతున్నంత సేపు రొహింగ్యాలు , సిరియాలు సముద్రాలను ఈదుతూ కనిపించారు.

'కళ్ళారా ఏడిస్తే ఎంత బావుంటుందో.. మనసారా స్నానం చేసినట్టు..' వహ్ ఇంతకన్నా గొప్ప రిలీఫ్ వాక్యమేముంటుంది. **'పిల్లలకు చేయిపట్టి నడవటం నేర్పినట్టు మనసుకు ఏడుపు నేర్పాలి..'** ఇక ఒక్క సారన్నా ఈ వాక్యం కోసం ఏడవకుండా ఉంటారా చదివిన వారెవరైనా. కొండంత బాధను గుండెల్లో ఒంపుకొని సముద్రమంత దుఖాన్ని కళ్ళలో నింపుకొని ఉంటే ఆ బరువు కుంగదీస్తుంది మనిషిని. కానీ ఆ కష్టాన్ని తలుచుకొని ఒక్కసారి ఏడిస్తే మనసు వాన వెలిసిన ఆకాశంలా మారుతుంది. ఎందుకంటే అప్పటి వరకూ ఆవరించిన వేదనపేరు దిగులు మబ్బు కనుక.

కొంచెం స్వేచ్ఛ అనే కవితలో..

'కొంచెం స్వేచ్ఛ చాలు ప్రాణాలదేముంది.. నేను నడవకూడదంటే కాళ్లు, రాయ కూడదంటే చేతులు నరుక్కోండి.. నేను చూడ కూడదా! నా కళ్ళు పీకండి.. మాట్లాడ కూడదా నా నాలుక చీల్చండి.. పిడికెడు స్వేచ్ఛ మిగిలిన చాలు..'

ప్రతి జంటలో ఒకరు తప్పక బందీలవుతున్న మాట వాస్తవం. కలిసి ఉన్న ఒకరినొకరు అర్థం చేసుకుంటూ ఎవరి భావాలను కించపరచకుండా వారి వారి భావాల్లో బతుకనిస్తే అందమైన జీవితమవుతుందని చెప్పడమే కవి ఉద్దేశం.

స్వేచ్ఛ కోసం ఈ కవి ఎక్కడ దాకా అయినా వెళ్లేందుకు సిద్ధపడుతారు. ప్రాణంపోతే ఏ తల్లి కడుపులోన మళ్లీ ఊపిరి పోసుకుంటానంటూ ప్రాణాలదేముంది అంటారు. స్వేచ్ఛ కోసం చిట్టి చివరి నిద్ర బొట్టు దాకా శ్రమిస్తాం అంటారు. నిజమే కదా స్వేచ్ఛ లేని జీవితం కటకటాల చీకటి గుహ. ఆ గుహలో ఎవరైనా ఉండడానికి ఇష్టపడరు. ఉన్నవాళ్లంతా బానిస బతుకు బతుకుతున్నవారే అలాంటి బానిస బతుకు తనకొద్దు అంటారు కవి ఇక్కడ.

చెరువు కేరింత చూపుతూ..

'నన్ను చూస్తే మా ఊరి చెరువు నిక్కరు విప్పి గంతులేసేది.. నాకు తెలుసు తనతో పాటు తనలో ఆటలు ఆడుకుందాం రమ్మని ఆ కవ్వింపు..'

చెరువు గురించి మాట్లాడేందుకు ప్రతి కవి ఇష్టపడతారు. కానీ ఈ కవి ఏకంగా చెరువు నిక్కర్ విప్పి గంతులేస్తుంది అంటారు. కానీ చెరువు చూస్తే మొత్తం మారిపోయినట్టు అనిపిస్తుంది అంటూ నాస్టాల్జియా చేస్తారు. ఒకప్పుడు పెద్ద పెద్ద తామరాకుల మీద సూర్యుడు నడిచేవాడనీ పదిలపరుచుకున్న జ్ఞాపకం అలా లేదని వాపోతారు.

'నేనే దారి తప్పానో మా ఊరే దారి తప్పిందో కొంచెం తికమక..' ఈ మాటల్లో ఎంత బాధ కల్లాకపటం లేని చెరువు చెల్లాచెదురైందన్న దిగులు.

షేరింగ్ ఆటోకవితలో..

'వచ్చిన ప్రతి ఆటో ఎక్కను, ఏదో రా బాబు ఆటోలో ఆమె ఉండాలి ఆమె ఉంటే బతుకు వాసన వేస్తుంది..' గొప్ప కవిత.

హ్యాండ్ బ్యాగ్‌లో సంసారం సర్దుకుని అంటూ తాగుబోతు భర్త బెదిరింపు మాటల తో సెల్‌ఫోన్‌కు చెమటలు పడతాయి అంటూ పనికి వెళ్లే ప్రతి సామాన్య స్త్రీ మూర్తిని ప్రస్ఫుటిస్తారక్కడ. మౌనం చెప్పే కథలు గొప్పవంటారు.

'చీకటి తలుపులు తోసుకొని ఇంట్లో అడుగు పెడుతుంది పిల్లలు భర్త ఆమెను వాటేసుకుంటారు ఎవరి ఆకలి వారిది..' అంటారు ఇంకో కవితలో.

చాలు ఈ మాటలు చాలు ఆమెను ఆమెగా చూసే మనుషులెందరో తెలియదు కానీ ఆమెను చూసిన కవి మాత్రం ప్రసాదమూర్తి గారే. ఎవరాకలి వారిదే అంటూ గొప్ప సత్యాన్ని మరొకసారి మనందరికీ గుర్తు చేస్తారు.

'ఒప్పందం' కవితలో..

'నీతో నడక నాకిష్టమే నువ్వు చెప్పినట్టు అంటే నడుచుకో లేను నీతో పంచుకున్న క్షణాలు మధురమే..నా గుండెల్లో భద్రంగా దాచుకున్న క్షణాలన్నీ నీవి కావు..'

కండిషన్స్ అప్లై ఇప్పటి తరం స్వేచ్ఛగా చెప్పగల్గుతున్న,కొంతమంది చెప్పలేక మనసులోనే దాచుకున్న మాటల్ని ఎంతో రియలిస్టిక్‌గా చెప్పారు ఇక్కడ కవి.

'నీతో బంధం ముద్దే అదే బంధనమైతే వద్దు..'

ప్రతి జంటలో ఒకరు తప్పక బందీలవుతున్న మాట వాస్తవం. కలిసి ఉన్న ఒకరినొకరు అర్థం చేసుకుంటూ ఎవరి భావాలను కించపరచకుండా వారి వారి భావాల్లో బతుకనిస్తే అందమైన జీవితమవుతుందని చెప్పడమే కవి ఉద్దేశం. జరుగుతున్న విషయాలను సందర్భానుసారంగా అసంబద్ధ ప్రక్రియల జోలికి పోకుండా మనల్ని ఆ కవిత్వంలోకి తీసుకెళుతారీ కవి.

– సుభాషిణి తోట

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

గ్రేటర్ హైదరాబాద్‌లో..

ద్రోణి ప్రభావంతో గ్రేటర్ హైదరాబాద్‌లో శనివారం రాత్రి నుంచి ఆదివారం రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా అకాల వర్షం కురిసింది. ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పడిపోవ డంతో నగరవాసులు చలికి గజగజ వణికిపోయారు. వర్షం తాకిడికి టీఎస్ నగర్‌లో చెట్టు కూలి పాక్షికంగా ఇండ్లు ధ్వంసం కాగా, మణికొండలో పాఠశాల గోడ కూలింది. గడిచిన 24గంటల్లో అత్యధికంగా కుత్బుల్లాపూర్‌లో 54.7 మి.మీ., శేరిలింగంపల్లిలో 53.8, ఆసిఫ్‌నగర్ 46.3, గోల్కొండలో 40. 8, బహదూర్‌పుర 34.8, బండ్లగూడ 34.0, చార్మినార్ 32.8, ఖైరతాబాద్ 31. 5మి.మీ., అంబర్‌పేటలో 27.8, హిమాయత్‌నగర్‌లో 26.5, పటాన్‌చెరులో 25.5, సికింద్రాబాద్‌లో 20.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదై నట్టు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. ముషీరాబాద్ 24.2 మీ.మీ., సరూర్ నగర్‌లో 24.0, నాంపల్లిలో 22.5, షేక్‌పేట్‌లో 18.8, అమీర్‌పేట్‌లో 16.0, మల్కాజి గిరిలో 15.0, మారేడ్‌పల్లిలో 14. 2, ఉప్పల్‌లో 13. 8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైం ది. సోమ, మంగళవారాల్లోనూ మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.



ఖమ్మం నగరంలో ఆదివారం రాత్రి కురుస్తున్న వర్షం



పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండల కేంద్రంలో వర్షానికి తడిసిన పత్తి పంట



వనపర్తి జిల్లా పామిరెడ్డిపల్లిలో తడిసిన వేరుశనగ పంట

వర్షం.. పంటలకు నష్టం

రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు

ఒక్కసారిగా చల్లబడ్డ వాతావరణం.. తడిసిన మిర్చి, వేరుశనగ, పత్తి

నాగర్‌కర్నూల్ జిల్లాలో 2వేల హెక్టార్లలో దెబ్బతిన్న వేరుశనగ

కరీంనగర్, పెద్దపల్లిలోనూ భారీగా నష్టం



నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మార్కెట్ యార్డులో తడిసిన కందుల బస్తాలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: భూఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం కరీంనగర్, పెద్దపల్లి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో భారీ వర్షం కురిసింది. మరికొన్ని జిల్లాల్లో జల్లుల నుంచి ఓ మోస్తరు వాన పడింది. శని, ఆదివారాల్లో కురిసిన అకాల వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. మిర్చితోపాటు వేరుశనగ, పసుపు తదితర పంటలు తడిసి ముద్దయ్యాయి. కొన్ని చోట్ల పత్తి పంట రంగు మారింది. నాగర్‌కర్నూల్ జిల్లాలో 2వేల హెక్టార్లలో వేరుశనగకు నష్టం జరిగింది. కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లోనూ రైతులు పంటలను పెద్ద ఎత్తున నష్టపోయారు.

ఖమ్మంలో..

ఖమ్మం నగరంలో భారీగా వర్షం కురవడంతో ప్రధాన వీధుల్లోకి వరద నీరు చేరడంతో ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. ఖమ్మం రూరల్ మండలం, కూసుమంచి, ముదిగొండ, నేలకొండపల్లి, రఘునాథపాలెం, కామేపల్లి, కారేపల్లి మండలాలతోపాటు వైరా, మధిర నియోజకవర్గాల్లో అక్కడక్కడ చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం, ఇల్లెందు, పినపాక, భద్రాచలం, అశ్వారావుపేట నియోజకవర్గాల్లోని 23 మండలాలు, నాలుగు మున్సిపాలిటీల పరిధిలో సాధారణ స్థాయిలో జల్లులు కురిశాయి. రాకపోకలకు స్వల్పంగా ఆటంకం ఏర్పడింది.

పాలమూరులో..

మహబూబ్‌నగర్‌తోపాటు దేవరకద్ర, జడ్చర్ల, మక్తల్, నారాయణపేట నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో ముసురుకున్నది. జిల్లా సగటు వర్షపాతం 20.2 మిల్లీ మీటర్లు నమోదైంది. నాగర్‌కర్నూల్ జిల్లావ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. వనపర్తి జిల్లాలో కురిసిన వర్షం ఇటుకబట్టీల యజమానులను నిండా ముంచేసింది. పెద్దమందడి మండలం జగత్‌పల్లి, పెద్దమందడి తదితర గ్రామాల్లో రూ.లక్షల విలువ చేసే ఇటుకలు తడిసి ముద్దయ్యాయి. జోగుళాంబ గద్వాల జిల్లావ్యాప్తంగా 11.82 మీ.మీ. వర్షపాతం నమోదైంది. గద్వాల జిల్లాలో ధరూర్, గట్టు, గద్వాల మండలంలో ఇటుక బట్టీలు దెబ్బతిన్నాయి.

కరీంనగర్‌లో..

కరీంనగర్ జిల్లా మానకొండూర్‌లో రేకుల షెడ్డు కూలిపోయింది. రామడుగు మండలం తిర్మలాపూర్‌లో కోళ్ల ఫారం కూలిపోవడంతో రూ. 20లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని స్థానికులు తెలిపారు. హుజూరాబాద్‌లోని రోడ్లు జలమయమయ్యాయి. పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా 29.2 మిల్లిమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. మంచిర్యాల జిల్లాలో 9.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

నల్లగొండలో..

నల్లగొండ జిల్లావ్యాప్తంగా తేలికపాటి నుంచి ఓ మోస్తరు జల్లులు కురిశాయి. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో ఉదయం జల్లులుగా ప్రారంభమై.. మధ్యాహ్నం వరకు కొద్దిమేర వర్షం కురిసింది. మునుగోడు, దేవరకొండ, నకిరేకల్ నియోజకవర్గాల్లో ఎడతెరిపిలేని జల్లులు కురిశాయి. సూర్యాపేట జిల్లాలో మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా సూర్యాపేట, నడిగూడెం, మునగాల మండలాల్లో 4 సెంటీ మీటర్లు వర్షం కురువగా.. అత్యల్పంగా చివ్వేంల, చిలుకూరు, హుజూర్‌నగర్, మేళ్లచెర్వు ప్రాంతాల్లో 5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. యాదాద్రిభువనగిరి జిల్లాలో ఈదురుగాలులు వీచాయి. ముసురు కారణంగా చలి తీవ్రత ఎక్కువైంది. మేడ్చల్ జిల్లాలో సెంటీమీటర్ వర్షపాతం నమోదైంది. సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో చిరుజల్లులు కురిశాయి. సిద్దిపేట జిల్లాలో వర్షంతో వాతావరణం చల్లబడింది. వికారాబాద్ జిల్లాలో 15.01మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదైంది.

ఉమ్మడి వరంగల్‌లో గజగజ..

వరంగల్ అర్బన్ జిల్లాలో శనివారం రాత్రి అకాల వర్షం కురవగా, ఆదివారం పొద్దంతా బలమైన ఈదురుగాలు వీచాయి. చలిగాలుల తీవ్రతతో ప్రజలు వణికిపోయారు. జిల్లా సగటున 27.3 మీ.మీటర్ల వర్షపాతం నమోదైంది. వరంగల్ రూరల్ జిల్లాలో అకాల వర్షంతో అన్నదాతలకు తీవ్రనష్టం వాటిల్లింది. వరంగల్ రూరల్ జిల్లాలోని రాయపర్తి, పర్వతగిరి మండలాల్లో వర్షం లేకపోగా మిగతా 14 మండలాల్లో వర్షపాతం నమోదైంది. ఆదివారం ఈదురు గాలులతో ప్రజలు వణికిపోయారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో శనివారం ప్రారంభమైన వర్షం ఆదివారం రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా కురిసింది. జనగామ జిల్లాలో ఓ మోస్తరు వర్షం కురిసింది. నర్మెట మండలంలో ఇటుక బట్టీలు ధ్వంసమయ్యాయి. చిరుజల్లులకు తోడు పొగమంచు, చల్లని గాలులతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది.

వేల ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు

నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో కొనుగోలు చేసిన కందులు కొంతమేర తడిసింది. కొల్లాపూర్ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్, సింగిల్‌విండో ద్వారా రైతుల నుంచి 7500 బస్తాల కందులను కొనుగోలు చేశారు. ఇందులో 1,770 బస్తాలను కాంట్రాక్టర్ రవాణా చేయగా మిగతాది యార్డులోనే ఉండటంతో తడిపోయాయి. మండలంలో సింగవట్నం, ఎల్లూరు, నార్లాపూర్, రామాపూర్, అంకిరావుపల్లి గ్రామాల శివారుల్లో కోసి ఆరబెట్టిన వేరుశనగ పంట పనికి రాకుండాపోయింది. కోడేరు మండలంలో కురిసిన వర్షానికి రెండు వేల హెక్టార్లలో వేరుశనగ పంటకు తీవ్ర నష్టం వాటిల్లినట్టు అధికారులు చెబుతున్నారు. తాడూరు మండలం ఎంగంపల్లి, మేడిపూర్, అల్లాపూర్, ఆకునెల్లికుదురు, ఇంద్రకల్, యాదిరెడ్డిపల్లి, పాపగల్, సిర్సవాడ, భలాన్‌పల్లి గ్రామాల్లో వర్షం కురియడంతో మిర్చి పంట దెబ్బతిన్నది.

కరీంనగర్‌లో 170 ఎకరాల్లో..

కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం మంగళపల్లి, చిట్యాలపల్లి, చొప్పదండితోపాటు పలు గ్రామాల్లో 100 ఎకరాలకుపైగా మక్క, 20 ఎకరాల్లో కంది పంటకు నష్టం వాటిల్లింది. మానకొండూర్ మండలం వేగురుపల్లి, ఊటూరు, వెల్ది గ్రామాల్లో 30 ఎకరాల్లో మక్క నేలకొరిగింది. గంగాధర మండలం బూర్గుపల్లి, లక్ష్మీదేవిపల్లి, నారాయణపూర్, చెర్లపల్లి, గంగాధర, రామగుడు మండలం వెంట్రావుపల్లి, గోపాల్‌రావుపేట, గుండి తదితర గ్రామాల్లో 20 ఎకరాలకుపైగా పంట నష్టం జరిగింది.

పెద్దపల్లిలో 168.2 ఎకరాల్లో మొక్క జొన్నకు నష్టం..

పెద్దపల్లిలో డివిజన్‌లోని 23 గ్రామాల్లో 168.2 ఎకరాల మక్క జొన్న పంట వర్షం ధాటికి దెబ్బతిన్నట్టు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. పెద్దపల్లి, జూలపల్లి, ఎలిగేడు, సుల్తానాబాద్, ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాల్లో పంట దెబ్బతిన్నది. మంచిర్యాల జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఆరబెట్టిన వరి ధాన్యం, కంది, మిరప పంటకు కొంత మేర నష్టం జరిగింది.

☛ మహబూబ్‌నగర్ జిల్ల నర్వ మండలంలో విక్రయానికి సిద్ధంగా ఉంచిన కందులు తడిసిపోయాయి. మిగిలిన మార్కెట్లలోనూ నిల్వ ఉన్న ధాన్యం తడిసింది.

☛ వనపర్తి జిల్లాలో వేరుశనగ పంట పూర్తిగా దెబ్బతిన్నది. పెద్దమందడి మండలం జంగమాయిపల్లి, బలిజపల్లి, పామిరెడ్డిపల్లి, వీరాయపల్లి, పెద్దమందడి, దొడగుంటపల్లి, చిన్నమందడి, అల్వాలలో చేతికి వచ్చిన రెండు, మూడు రోజుల్లోనే పంట దెబ్బతిన్నది. పామిరెడ్డిపల్లి, దొడగుంటపల్లి ఆయా గ్రామాల్లో వేరుశనగ పంట నీటిలో మునిగి మొలకలెత్తుతున్నాయి.

తడిసిన మిర్చి..

జోగుళాంబ గద్వాల జిల్లాలో పొలాల్లో ఆరబెట్టిన మిర్చి పంట వర్షం ధాటికి తడిసింది. మల్దకల్, ధరూర్, మానవపాడ్, ఇటిక్యాల మండలాల్లోని అమ్మడానికి ఆరబెట్టగా నీటమునిగింది. గట్టు, అలంపూర్, మానవపాడు మండలాల్లో రైతులు పొగాకు కోసి మండె కట్టగా అదికూడ తడిసిపోయింది. జిల్లా మొత్తంగా మిర్చి, పొగాకుతోపాటు శనగ పంటకు నష్టం వాటిల్లింది.

☛ ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మార్కెట్‌లో నిల్వ ఉంచిన మక్కజొన్న పంట కొంతమేర తడిసిపోయింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పలు ప్రాంతాల్లో కల్లాల్లో ఉంచిన మిర్చి తడిసింది. మామిడిపూత రాలిపోయే పరిస్థితి ఏర్పడింది.

నేల వాలిన మక్కజొన్న..

వరంగల్ రూరల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో కల్లాల్లో ఆరబోసిన మిర్చి తడిసింది. గాలి వానకు మక్కజొన్న నేలవాలింది. ఆరబోసిన పసుపు తడిసి ముద్దయింది. పొలాల్లోనే ఉన్న పత్తి కూడా దెబ్బతిన్నది. అక్కడక్కడా పసుపు తడిసింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మిరప, పత్తి పంటలకు నష్టం కలిగింది. కోయకుండా ఉన్న పత్తికాయలు వర్షానికి తడిసి నల్లబడింది. మల్హర్, కాటారం, మహాదేవపూర్, పలిమెల, కన్నాయిగూడెం, ఏటూర్‌నాగారం, మంగపేట, వాజేడు, వెంకటాపురం, మొగుళ్లపల్లి తదితర మండలాల్లోని మిర్చి రైతులను నష్టాల్లోకి నెట్టింది. జనగామ జిల్లా తరిగొప్పుల మండలంలో కల్లంలో ఆరబోసిన మిర్చితోపాటు, పుచ్చతోటలు దెబ్బతిన్నాయి. వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం కుడుగుంటలో పసుపు పంట నేలకొరిగింది.

చెడ్డీ గ్యాంగ్ అరెస్ట్

గుజరాత్‌లో అదుపులోకి తీసుకున్న గద్వాల పోలీసులు

గద్వాల క్రైం: గద్వాల జిల్లాకేంద్రంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఈ నెల 4న దొంగతనానికి పాల్పడి ప్రజలను భయాందోళనకు గురిచేసిన చెడ్డీగ్యాంగ్ ముఠాలోని ఇద్దరిని ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గద్వాల డీఎస్పీ ఎండీ షాకీర్ హుస్సేన్ ఆదివారం వివరాలు వెల్లడించారు. సీసీ కెమెరాలు, సైబరాబాద్ పోలీసుల సహకారంతో గుజరాత్ రాష్ట్రంలోని దోహద్ జిల్లా దస్లా గ్రామంలో ముఠాసభ్యులను అరెస్ట్ చేసినట్టు చెప్పారు. దస్లా గ్రామానికి చెందిన సంగాడ వీర్‌సింగ్ భాయ్, సిమ్లియా కుర్ద్ కచలఫాలియా గ్రామానికి చెందిన మఖోడియా ఖనీష్ భాయ్, అదే రాష్ట్రానికి చెందిన కమల్, రాజు సంగాడ, సోముసింగ్ (మధ్యప్రదేశ్) వ్యసనాలకు బానిసై దొంగతనాలు చేసేందుకు ముఠాగా ఏర్పడ్డారు. ఈ నెల 4న గుజరాత్ నుంచి రాయచూర్ డెమోరైలులో గద్వాలకు చేరుకొని .. ఓ అపార్ట్‌మెంట్‌లోకి చొరబడి తాళం వేసి ఉన్న మధుబాబు ఇంట్లో తులం బంగారం, రూ. 12,000 నగదను చోరీచేశారు. కాగా పోలీసులు సంగాడ వీర్‌సింగ్ భాయ్, మఖోడియా ఖనీష్‌భాయ్ అనే ఇద్దరు ముఠాసభ్యులను అరెస్ట్‌చేశారు.

చిన్నారి కిడ్నాప్ కథ సుఖాంతం

24గంటల్లో ఛేదించిన పోలీసులు



తుంగతుర్తి పోలీస్‌స్టేషన్‌లో చిన్నారి కీర్తనను తండ్రికి అప్పగిస్తున్న సీఐ అయోధ్య, ఎస్సై శివకుమార్

తుంగతుర్తి: సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం చిన్ననెమిలలో శనివారం కిడ్నాప్‌కు గురైన కీర్తనను(5) పోలీసులు 24 గంటల్లోనే తల్లిదండ్రులకు అప్పగించారు. స్థానిక సీఐ అయోధ్య తెలిపిన వివరాల ప్రకారం.. చిన్ననెమిలకు చెందిన వెంకన్న, రేణుక దంపతులు పనికివెళ్తూ తమ కుమార్తె కీర్తనను బంధువుల ఇంటివద్ద వదిలివెళ్లారు. కొద్దిసేపటికే పాప ఇంట్లో నుంచి బయటకు రావడంతో ధరావత్ తండాకు చెందిన వీరన్న, శాంతి, రవి బిస్కెట్ ఎర చూపి పాపను కిడ్నాప్‌చేసి బస్సులో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న కీర్తన తండ్రి వెంకన్న పోలీసులకు ఫిర్యాదుచేయడంతో నూతనకల్ ఎస్సై శివకుమార్ రెండు బృందాలతో మామిళ్లమడవకు చేరుకొని గ్రామంలో విచారించగా ధరావత్ తండాకు చెందిన ముగ్గురు పాపను కిడ్నాప్‌చేసి హైదరాబాద్ బస్సు ఎక్కినట్టు తెలిపారు. వారంతా హైదరాబాద్ నగరంలోని మున్సూరాబాద్‌లో జీవనం సాగిస్తున్నట్టు చెప్పారు. దీంతో ఎస్సై శివకుమార్ ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించి విషయం చెప్పారు. అప్రమత్తమైన ఎల్బీనగర్ పోలీసులు మున్సూరాబాద్‌లో గాలించి కిడ్నాపర్లను పట్టుకున్నారు. నిందితులను, కిడ్నాప్‌కు గురైన చిన్నారిని తీసుకొని ఎల్బీనగర్ పోలీసులు తుంగతుర్తి పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. చిన్నారి కీర్తనను ఆదివారం సాయంత్రం పోలీసులు తండ్రికి అప్పగించారు. డబ్బు కోసమే దుండగులు కిడ్నాప్ చేసినట్టు తెలుస్తున్నది.

శునకానికి దశదిన కర్మ



సూర్యాపేట జిల్లా ఆచార్యులగూడెంలో శునకం ఫ్లెక్సీ ఏర్పాటుచేసి కర్మలు చేస్తున్న దృశ్యం

చిలుకూరు: పెంపుడు శునకానికి దశదిన కర్మ నిర్వహించిన వింత ఘటన సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలోని ఆచార్యుల గూడెంలో ఆదివారం చోటుచేసుకున్నది. అచార్యుల గూడెనికి చెందిన రామయ్య, వీరయ్య, లక్ష్మీనర్సయ్య, నర్సయ్య అన్నదమ్ములు 12 ఏండ్లుగా ఒక కుక్కను పెంచుకుంటున్నారు. 10 రోజుల క్రితం కుక్క చనిపోవడంతో ఆదివారం దానికి పెద్దకర్మ నిర్వహించారు.



త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మూడో రోజైన ఆదివారం సప్తస్వర సంగీత శిక్షణాలయం వారు ఆలపించిన భక్తిసంగీతం, హైదరాబాద్ బ్రదర్స్ కళారత్న రాఘవాచారి, శేషాచారిల శాస్త్రీయ సంగీత కచేరి, మాధవి బృందం చేసిన కూచిపూడి నృత్యం ఆకట్టుకున్నది. కార్యక్రమంలో ఆలయ ఈవో దూస రాజేశ్వర్, నగర పంచాయతీ వైస్‌చైర్మన్ ప్రతాప రామకృష్ణ, మాజీ ధర్మకర్త నందిపేట సుదర్శన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. - వేములవాడ కల్చరల్

ధర్మపురి నృసింహుడికి రూ.4లక్షల విరాళం

ధర్మపురి, నమస్తే తెలంగాణ: జగిత్యాల జిల్లా ధర్మపురి లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానంలో వివిధ పనుల కోసం మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన భక్తుడు విఠల్ గోవింగ్ కౌటిక్‌వార్ రూ.4లక్షల విరాళాన్ని ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అతడిని ఆశీర్వదించారు. అనంతరం దేవస్థానం చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి అతడికి స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలను అందించి సత్కరించారు.

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తాచాటుదాం

సర్పంచుల సన్మానసభలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ పిలుపు

మహబూబ్‌నగర్, నమస్తే తెలంగాణ ప్రతినిధి: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకుదామని ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని టీఆర్‌ఎస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో పంచాయతీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ మద్దతుతో గెలుపొందిన సర్పంచులను ఆయన సన్మానించి అభినందనలు తెలిపారు.



నూతనంగా ఎన్నికైన సర్పంచులతో ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్



ముగిసిన గంగాజలసేకరణ యాత్ర

జైనూర్: నాగోబా జాతరకు ముందు మెస్రం వంశీయులు నిర్వహించే గంగాజల సేకరణయాత్ర ఆదివారంతో ముగిసింది. పది రోజుల క్రితం వివిధ గ్రామాల నుంచి 150 మంది గంగాజల సేకరణకు కాలినడకన బయలుదేరిన విషయం తెలిసిందే. వీరు మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని ఇందన్‌పల్లి గోదావరినదిలో గంగాజలాన్ని సేకరించి.. శనివారం రాత్రికి కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలోని గౌరికి చేరుకున్నారు. గ్రామశివారులోని చెట్టుకు గంగాజలం సేకరించిన పా త్రను కట్టి ప్రత్యేకపూజలు చేశారు. వచ్చే నెల 4న నాగోబా జాతర ప్రారంభం కానున్నది

టీఆర్‌ఎస్‌లో చేరికల జోష్

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: టీఆర్‌ఎస్‌లోకి చేరికలు కొనసాగుతున్నాయి. ఆదివారం వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు భారీసంఖ్యలో టీఆర్‌ఎస్‌లో చేరారు. మేడ్చల్ జిల్లా దమ్మాయిగూడ గ్రామానికి చెందిన సర్పంచ్ పాండాల అనురాధ గౌడ్ ఆధ్వర్యంలో దాదాపు 500 మంది, శామీర్‌పేట సర్పంచ్ బాలమణితోపాటు కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు సుదర్శన్ వారి అనుచరులు 200 మంది ఎమ్మెల్యే మల్లారెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. నిజామాబాద్ జిల్లా వేల్పూరు మండలం పచ్చలనడ్కుడ సర్పంచ్ శ్వేత, ఉపసర్పంచ్ గంగారెడ్డి, ఎంపీటీసీ లక్ష్మి, సొసైటీ చైర్మన్ సంజీవ్, తదితరులు వారి అనుచరులతో కలిసి హైదరాబాద్‌లో బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో, పెద్దపల్లి జిల్లా ఓదెల, కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. వికారాబాద్ జిల్లాలో స్వతంత్ర అభ్యర్థులుగా గెలుపొందిన గోదంగూడ సర్పంచ్ అనితాగౌడ్, రాళ్లచిట్టంపల్లి సర్పంచ్ యాస్మిన్‌బేగం ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ సమక్షంలో, నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్, పెంట్లవెల్లి, పెద్దకొత్తపల్లి, పాన్‌గల్ మండలాలకు చెందన వివిధ గ్రామాల నుంచి ఏకగ్రీవంగా ఎన్నికైన పలువురు సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు.



నిజామాబాద్ జిల్లా పచ్చలనడ్కుడలో బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరిన వివిధపార్టీల నాయకులు



పెద్దపల్లిలో కాల్వశ్రీరాంపూర్ మండలం మడిపల్లికాలనీ సర్పంచ్, ఉపసర్పంచ్‌లను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



కొల్లాపూర్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీమంత్రి జూపల్లికృష్ణారావు

'పాలమూరు'పై కోర్టు తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టు

మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్, నమస్తే తెలంగాణ: పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కేంద్ర పర్యావరణ అనుమతులు దక్కడం కాంగ్రెస్ నాయకులు, కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డికి చెంపపెట్టు లాంటిదని మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, 12.30 లక్షల ఎకరాలకు నీరందించేందుకు సీఎం కేసీఆర్ పాలమూరు ప్రాజెక్టుకు రూపకల్పన చేశారన్నారు. బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఏ ఉద్దేశంతో ప్రాజెక్టుకు వ్యతిరేకంగా మద్రాస్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసువేశారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఏపీ సీఎం చంద్రబాబు ప్రోద్బలంతోనే కేసు వేశారా? అని ప్రశ్నించారు.



మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేటలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి


నారాయణపేటను అభివృద్ధిలో ముందుంచుతా

మార్నింగ్ వాక్‌లో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

నారాయణపేట, నమస్తే తెలంగాణ: నారాయణపేట పట్టణాన్ని అభివృద్ధిలో ముందుంచుతానని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన ఆదివారం నారాయణపేటలోని 8వ వార్డులో మార్నింగ్ వాక్ నిర్వహించారు. తెల్లవారు జామున 5 గంటల నుంచి 8:30 గంటల వరకు మున్సిపల్ అధికారులతోకలిసి భీమండి, బాబా కాలనీ, పర్మారెడ్డి కాలనీల్లో పర్యటించారు. ఆయా కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థను బాగుపర్చాలని ఆదేశించారు. మున్సిపల్ స్థలాలను ఆక్రమించి చేపట్టిన అక్రమ కట్టడాలను వెంటనే తొలగించాలని, ఇందులో ఎవరూ పైరవీలు, ఒత్తిడి చేసినా తలొగ్గొద్దని డ్రైనేజీలను ఆక్రమించి నిర్మించిన నిర్మాణాలను తొలగించాలని అధికారులకు సూచించారు.

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ వెల్లడి



మీడియాతో మాట్లాడుతున్న అల్లం నారాయణ

మయూరి సెంటర్: జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం ఖమ్మంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో బీసీ కమిషన్ సభ్యులు జూలూరి గౌరీశంకర్‌తోకలిసి మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో జర్నలిస్టులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్ర ఆవిర్భావం అనంతరం సీఎం కేసీఆర్ జర్నలిస్టుల సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. జర్నలిస్టుల ఇండ్ల స్థలాల అంశంలో భవిష్యత్‌లో న్యాయపరమైన చిక్కులు తలెత్తకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం పకడ్బందీగా ప్రణాళికలు రూపొందిస్తుందని చెప్పారు.

స్పెయిన్ బాలుడి కథ విషాదాంతం

బోరుబావి నుంచి 13 రోజుల తర్వాత రోసెల్లో మృతదేహం వెలికితీత



విలపిస్తున్న బాలుడి తల్లిదండ్రులు. పక్క చిత్రంలో జులెన్ రోసెల్లో

టోటలన్, జనవరి 27: స్పెయిన్‌లోని టోటలన్‌లో రెండు వారాల క్రితం బోరుబావిలో పడిపోయిన జులెన్ రోసెల్లో (2) అనే బాలుడి కథ విషాదంతో ముగిసింది. రోసెల్లో కోసం గాలించిన సహాయ సిబ్బంది శనివారం తెల్లవారుజామున అతని మృతదేహాన్ని వెలికితీయడంతో స్పెయిన్ అంతటా విచారం అలుముకున్నది. ఈ వార్త యావత్తు దేశ ప్రజలను తీవ్ర విచారంలో ముంచేసిందని, రోసెల్లోను రక్షించేందుకు అన్నివిధాలా కృషిచేసినా ఫలితం లేకపోయిందని స్పెయిన్ ప్రధాన మంత్రి పెడ్రో శాంచెజ్ ఆవేదన వ్యక్తం చేశారు. రోసెల్లో కోసం రోజుల తరబడి అలుపెరుగకుండా గాలించిన ప్రజలను ఆయన అభినందించారు.

ఐవోఈ జాబితాలోకి హైదరాబాద్ వర్సిటీ!

- ప్రతిపాదించిన కేంద్ర ప్రభుత్వ కమిటీ



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశంలోని విశ్వవిద్యాలయాలను ప్రపంచస్థాయికి అభివృద్ధి చేసే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఇన్‌స్టిట్యూషన్స్ ఆఫ్ ఎమినెన్స్ (ఐవోఈ) పరిధిని 20 నుంచి 30 వర్సిటీలకు విస్తరించాలని మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ (ఎంహెచ్చార్డీ) నియమించిన ఎంపవర్డ్ ఎక్స్‌పర్ట్ కమిటీ (ఈఈసీ) సిఫారసు చేసింది. ఈ సిఫారసులు అమలైతే హైదరాబాద్ యూనివర్సిటీకి దాదాపు రూ.వెయ్యి కోట్ల నిధులు వచ్చే అవకాశం ఉన్నది. ఈ ప్రతిపాదనలు యూజీసీ వద్దకు చేరాయని, ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఎంహెచ్చార్డీ సీనియర్ అధికారి ఒకరు పేర్కొన్నారు. దేశంలోని ప్రభుత్వ, ప్రైవేట్ యూనివర్సిటీల్లో ప్రపంచస్థాయి ప్రమాణాలు నెలకొల్పేందుకు ఎంహెచ్చార్డీ 2017లో ఐవోఈ ప్రాజెక్టును చేపట్టింది. ఈ ప్రాజెక్టు కింద ఎంపికైన ప్రభుత్వ వర్సిటీలకు కేంద్ర ప్రభుత్వం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ద్వారా రూ.వెయ్యి కోట్ల మేర నిధులు అందిస్తుంది. ప్రైవేట్ వర్సిటీలకు నేరుగా నిధులు అందించకపోయినా.. ఫీజు వసూలు, కోర్సుల విషయంలో పూర్తి స్వేచ్ఛ ఇస్తుంది. దేశవ్యాప్తంగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి 20 వర్సిటీలను ఎంపికచేసేందుకు యూజీసీ గత ఏడాది ఫిబ్రవరిలో నలుగురు సభ్యులతో కూడిన ఎంపవర్డ్ ఎక్స్‌పర్ట్ కమిటీ (ఈఈసీ)ని నియమించింది. ఈ కమిటీ ప్రతిపాదనల ప్రకారం గత ఏడాది జూన్‌లో మూడు ప్రభుత్వ, మూడు ప్రైవేట్ యూనివర్సిటీలను ఎంవోఈలుగా గుర్తించింది. ఈఈసీ కమిటీ గత ఏడాది డిసెంబర్‌లో మరో 19 వర్సిటీలను ఎంవోఈలుగా ప్రతిపాదించింది. ఇందులో ఏడు ప్రభుత్వ, 12 ప్రైవేట్ వర్సిటీలు ఉన్నాయి. హైదరాబాద్ వర్సిటీతో పాటు ఏపీలోని ఆంధ్రాయూనివర్సిటీ, బెనారస్ హిందూ యూనివర్సిటీ, అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ, పంజాబ్ యూనివర్సిటీ, తేజ్‌పూర్ యూనివర్సిటీ, సావిత్రీబాయి పూలే పుణె యూనివర్సిటీ ఉన్నాయి. అయితే 20 వర్సిటీల పరిధి దాటిపోవడంతో ఐదు వర్సిటీలపై ఎటూ తేల్చలేదు. తాజాగా భేటీ అయిన ఈఈసీ కమిటీ ఐవోఈ పరిధిని 30 వర్సిటీలకు విస్తరించాలని ప్రతిపాదించింది. ఈ సిఫారసులు అమలైతే హైదరాబాద్ యూనివర్సిటీకి దాదాపు రూ.వెయ్యి కోట్ల నిధులు వస్తాయి.



అమెరికాలో టీఆర్ఎస్ విజయోత్సవాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణలో టీఆర్ఎస్ పార్టీ రెండోసారి అధికారంలోకి వచ్చిన సందర్భంగా అమెరికాలోని ఆ పార్టీ ఎన్నారై విభాగం విజయోత్సవాలు ఘనంగా నిర్వహించింది. ఒహియా రాష్ట్రంలోని కొలంబస్‌లో జరిగిన కార్యక్రమానికి వివిధ నగరాల నుంచి భారీ ఎత్తున కేసీఆర్ అభిమానులు, టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. ముందుగా అమరవీరులను స్మరించుకొని, ప్రొఫెసర్ జయశంకర్‌కు నివాళి అర్పించారు. అనంతరం కేక్ కట్‌చేసి విజయోత్సవాలు జరుపుకొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అడ్వయిజరీ బోర్డు చైర్మన్ తన్నీరు మహేశ్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన పథకాలు ప్రజలకు చేరాయని, ప్రజలు రాష్ట్రం భవిష్యత్ దృష్ట్యా మరోసారి సీఎంగా కేసీఆర్ ఉండాలనే ఉద్దేశంతో టీఆర్ఎస్‌ను గెలిపించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కొలంబస్ ఇంచార్జి వేణు పామేర, మిడ్వెస్ట్ రీజినల్ ఇంచార్జి నవీన్ కానుగంటి, సెక్రటరీ నరసింహ నాగులవంచ, యువజన విభాగం డేవిడ్ విక్రమ్, నవీన్ గుడిపల్లి, అశోక్, ప్రమోద్ జంగమ పాల్గొన్నారు.



మలక్‌పేటలోని వికలాంగుల సహకార సంస్థ కార్యాలయంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్మన్ వాసుదేవరెడ్డి. చిత్రంలో ఎండీ శైలజ తదితరులు ఉన్నారు.

వికలాంగుల సహకార సంస్థ అభివృద్ధికి కృషి

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో సంస్థ చైర్మన్ వాసుదేవరెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని చైర్మన్ డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి చెప్పారు. మలక్‌పేటలోని సంస్థ కార్యాలయంలో అభివృద్ధి పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. హోంమంత్రి మహమూద్ అలీ మంజూరుచేసిన రూ.13.35 లక్షల నిధులతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించినట్టు వాసుదేవరెడ్డి తెలిపారు. సంస్థ కార్యాలయంతోపాటు ప్రాంగణం సుందరీకరణకు ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. ఆహ్లాదకర వాతావరణం ఉండేలా కార్యాలయాన్ని తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ ఎండీ బీ శైలజ, బ్రెయిలీ ప్రెస్ మేనేజర్ రమేశ్, ఎడిటర్ వెంకటేశ్వర్‌రావు, సంక్షేమశాఖ సిబ్బంది రాంగోపాల్‌రెడ్డి, సుభాష్, సంపత్, పీవో నాగేశ్వర్‌రెడ్డి, కాంట్రాక్టర్ సురేందర్ పాల్గొన్నారు.

వైసీపీలోకి దగ్గుబాటి తనయుడు

- జగన్‌తో భేటీ అయిన వెంకటేశ్వర్‌రావు, హితేశ్
- ఎప్పుడు చేరేది త్వరలో నిర్ణయం
- పురంధేశ్వరి బీజేపీలోనే ఉంటారన్న దగ్గుబాటి



హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్‌లో వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డితో సమావేశమైన దగ్గుబాటి వెంకటేశ్వరరావు, హితేశ్. చిత్రంలో వైసీపీ నేత విజయసాయిరెడ్డి ఉన్నారు.

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలుగు దేశంపార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ అల్లుడు, మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వర్‌రావు కుమారుడు హితేశ్ వైసీపీలో చేరాలని నిర్ణయించుకొన్నారు. వైసీపీతో కలిసి పనిచేయడానికి తన కుమారుడు నిర్ణయించుకొన్నారని వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ఆదివారం హైదరాబాద్ లోటస్‌పాండ్‌లోని వైసీపీ అధినేత జగన్ నివాసంలో..ఆయనతో దగ్గుబాటి, ఆయన కుమారుడు హితేశ్ చెంచురామ్ సమావేశమయ్యారు. పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ విజయసాయిరెడ్డి వారికి స్వాగతం పలికారు. జగన్‌తో భేటీ అనంతరం వెంకటేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ తన కుమారుడు వైసీపీతో కలిసి పనిచేసే అంశంపై జగన్‌తో చర్చించామని, పార్టీలో ఎప్పుడు చేరేది త్వరలో వెల్లడిస్తామని చెప్పారు. ప్రకాశం జిల్లా పర్చూరు టిక్కెట్ గురించి ఈ సమావేశంలో చర్చించినట్లు సమాచారం. దీనిపై విలేకరులు అడిగిన ప్రశ్నకు దగ్గుబాటి నేరుగా జవాబివ్వలేదు. పార్టీయే నిర్ణయం తీసుకొంటుందని చెప్పారు. తన భార్య పురంధేశ్వరి రాజకీయాల్లో ఉంటే బీజేపీలోనే ఉంటారని.. లేకుంటే రాజకీయాలనుంచి తప్పుకొంటారని తెలిపారు. ఏపీలో ప్రభుత్వ పనితీరు గాడి తప్పిందని, డబ్బుల్లేవంటూ దీక్షల పేరిట కోట్ల రూపాయలు ఖర్చుచేయడం సరికాదని దగ్గుబాటి అన్నారు.



బ్రాహ్మణ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 2019 డైరీని ఆవిష్కరిస్తున్న పుష్పగిరి శంకరాచార్య మహాసంస్థానాధిపతివిద్యాశంకర భారతీ మహాస్వామి

సనాతన ధర్మపరిరక్షణ మన బాధ్యత

- ప్రతివ్యక్తి సంకల్పంతో ముందుకుసాగాలి
- విద్యాశంకర భారతీమహాస్వామి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సనాతన ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత అని జగద్గురు పుష్పగిరి శంకరాచార్య మహాసంస్థానాధిపతి విద్యాశంకర భారతీ మహాస్వామి పేర్కొన్నారు. పద్మారావునగర్‌లోని కౌతామనోహర్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో బ్రాహ్మణ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 2019 డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత సంప్రదాయం, ధర్మపరిరక్షణ, బ్రాహ్మణ సంప్రదాయాన్ని వివరించారు. ఎవరు ఎంత విజయాన్ని సాధించారన్నది.. వాళ్ల జీవిత స్మృతిసూచిక ధర్మగ్రంథంగా డైరీని వినియోగించాలన్నారు. బ్రాహ్మణ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నావజ్ఝల సూర్యప్రకాశ్ మాట్లాడుతూ అసోసియేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఏఓయూ వీసీ కె.సీతారామారావు, బీఎస్ఎన్ఎల్ పీజీఎం ఐటీఎస్ కే రామ్‌చంద్, బ్రాహ్మణ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మాజేటి వేణుగోపాల్, ఉపాధ్యక్షురాలు కే గీతామూర్తి, కార్యదర్శి వెంకటసత్యనారాయణ, కోశాధికారి బీవీ శారద, ఏవోఎన్ నర్సింహశాస్త్రి, ప్రతినిధులు బీ వేణుగోపాల్, రమాశంకర్, ఎం చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి.

119 బీసీ గురుకులాలు

వచ్చే విద్యాసంవత్సరం నుంచి మనుగడలోకి

ఏర్పాటుపై అధికారుల కసరత్తు • హర్షం వ్యక్తం చేస్తున్న బీసీ సంఘాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ :

వచ్చే విద్యాసంవత్సరం నుంచి కొత్తగా 119 బీసీ గురుకులాలను ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. వీటి ఏర్పాటుకు అనువైన ప్రాంతాలు, అక్కడ కల్పించే వసతులు, భవనాల అందుబాటువంటి అంశాలపై అధికారులు దృష్టి సారించారు. తెలంగాణ ఆవిర్భావనాటికి రాష్ట్రంలో 20 బీసీ గురుకులాలే ఉండేవి. స్వరాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ ప్రభుత్వం 142 బీసీ గురుకులాలను ఏర్పాటు చేసి వెనుకబడిన వర్గాల విద్యాభివృద్ధికి అండగా నిలిచింది. ఈ విద్యా సంవత్సరం కొత్తగా బీసీ గురుకులాల ఏర్పాటుకు బీసీ సంక్షేమ శాఖ అధికారులు కసరత్తు చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం 162 బీసీ గురుకుల విద్యాలయాలు ఉండగా.. వచ్చే విద్యా సంవత్సరం 119 ప్రారంభిస్తే వాటి సంఖ్య 291కి చేరనుంది. వీటిలో కార్పొరేట్ స్థాయిలో విద్యాబోధన, వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నది. దీంతో జ్యోతిబా పూలే బీసీ గురుకులాల్లో చేర్చేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు.

ఏడేండ్ల వ్యూహం

రాష్ట్ర ప్రభుత్వం దూరదృష్టితో కేజీ టు పీజీ విద్యావిధానాన్ని అంకితభావంతో అమలు చేస్తున్నది. భవిష్యత్ తరాలు ప్రపంచ దేశాలకు దీటుగా వివిధ రంగాల్లో రాణించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నది. ఆంగ్ల మాధ్యమంలో గుణాత్మక విద్యను అందిస్తుండటం, నాణ్యమైన భోజనంతోపాటు వసతి కల్పిస్తున్నది. ఇందుకు గాను వచ్చే మూడేండ్లలో రాష్ట్రంలో 1200 రెసిడెన్షియల్ పాఠశాలలను నెలకొల్పి 7.60 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం కలిగించేలా ప్రణాళిక రూపొందించింది. ఏడేండ్లలో అంచెలంచెలుగా వీటిని విస్తరించి కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందించేలా తరగతులను అప్‌గ్రేడ్ చేసే కార్యాచరణతో ప్రభుత్వం ముందుకు సాగుతున్నది.







కేజీ నుంచి పీజీ అమలుకు నాంది..

సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి కారణంగా.. పేద విద్యార్థులకు కేజీ టు పీజీ ఉచిత విద్యావిధానం అమలుకు కృషి జరుగుతున్నది. వచ్చే విద్యాసంవత్సరం 119 బీసీ గురుకులాలను నెలకొల్పాలని నిర్ణయించడం హర్షణీయం. సరైన విద్యావకాశాలు లభిస్తే..నిరుపేద కుటుంబాల్లో ఆణిముత్యాలు వెలుగులోకి వస్తాయి.

- కిశోర్‌గౌడ్, టీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు



నిరుపేద విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలను కల్పించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం బీసీ గురుకులాలను తీర్చిదిద్దుతున్నది. గురుకులాల్లో సౌకర్యాలు, ఇంగ్లిష్ మీడియం ప్రధానంగా విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను వీటిల్లో చేర్చేందుకు ఆసక్తి చూపుతున్నారు.

- కుల్కచర్ల శ్రీనివాస్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు



సీఎం కేసీఆర్ ప్రభుత్వం ఆంగ్ల మాధ్యమంలో నాణ్యమైన విద్య అందించేలా బీసీ గురుకులాలను నిర్వహిస్తుండటం అభినందనీయం. వచ్చే విద్యాసంవత్సరం కొత్తగా 119 గురుకులాలు ఏర్పాటు చేయడం గొప్ప విషయం.

- మిట్టపల్లి జగ్గయ్య, వీరభద్రీయ సంఘం రాష్ట్ర నాయకుడు

ఐఎస్బీలో గ్రాడ్యుయేషన్ డే





ఐఎస్బీ గ్రాడ్యుయేషన్‌డేలో పట్టాలు అందిస్తున్న డీన్ రాజేంద్రశ్రీవాస్తవ, సైయంట్ సంస్థ చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి.. పట్టాలు అందుకున్న విద్యార్థుల ఆనందోత్సాహం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్బీ)లో ఆదివారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంబీఏ సమాన స్థాయి కోర్సుల్లో ఉత్తీర్ణులైన వారికి డీన్ రాజేంద్ర శ్రీవాస్తవ, సైయంట్ సంస్థ చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. అత్యుత్తమ విద్యానైపుణ్యాలతోపాటు మార్కెట్ అవసరాలకు తగ్గట్టుగా ఉన్నత విద్యనందిస్తున్న సంస్థగా ఐఎస్బీకి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉన్నదన్నారు. ఐటీ రంగంలో నూతన పోకడలను పసిగడుతూ తీసుకున్న కీలక నిర్ణయాల ఫలితంగా తన కంపెనీ సైయంట్ ప్రపంచస్థాయి కంపెనీగా ఎదిగిందని తెలిపారు. నాలుగోతరం పారిశ్రామిక విప్లవ ఫలితాలను సొంతం చేసుకునే దిశగా వేగంగా అడుగులు వేస్తున్నామని ప్రకటించారు. స్టూడెం ట్ ఆఫ్ ది ఇయర్ అవార్డులను పీజీపీఎంఏఎక్స్ కోర్సులో విజయ్ వెంకటేశ్‌మూర్తి, ఎంఎఫ్ఏబీలో కుషాగ్ర అగర్వాల్, పీజీపీ ప్రో స్కాలర్స్‌లో సుమిత్ గోగియకు, అకడమిక్ అసోసియేట్స్‌అవార్డును పీజీపీఎంఏఎక్స్‌లో సునీల్‌కుమార్, ఎంఎఫ్ఏబీ కోర్సులో జాన్‌బన్సాల్, పీజీపీ ప్రో స్కాలర్స్‌లో కల్యాణి, రేవతి సూర్యనారాయణకు ప్రదానం చేశారు.

ఎంపీ కవితకు పీఆర్టీయూ కృతజ్ఞతలు

- నిధుల మంజూరుపై హర్షం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పీఆర్టీయూ నిజామాబాద్ జిల్లా భవన మరమ్మతులకు ఎంపీ కవిత రూ.20 లక్షల నిధులు మంజూరుచేసినందుకు ఆ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం నిజామాబాద్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పీఆర్టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బీరెల్లి కమలాకర్ మాట్లాడుతూ.. ఏ ప్రభుత్వం చేయని విధంగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్న టీఆర్ఎస్ ప్రభుత్వానికి అన్నివిధాలా సహకరిస్తామని చెప్పారు. సమావేశంలో జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇల్తెపు శంకర్, పొద్దుటూరి మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఐపీఎస్ తరుణ్‌జోషిని అభినందించిన హోంమంత్రి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దక్షిణార్ధగోళంలో అత్యంత ఎత్తైన అకాన్కాగో పర్వతాన్ని అధిరోహించిన హైదరాబాద్ జాయింట్ సీపీ (ఎస్బీ) తరుణ్‌జోషిని హోంమంత్రి మహమూద్ అలీ అభినందించారు. తెలంగాణ పోలీస్‌శాఖ సైతం తరుణ్‌జోషి సాహసచర్యపై గర్వంగా ఉందని పేర్కొన్నారు.అర్జెంటినాకు సమీపంలో 22,837 అడుగుల ఎత్తున్న అకాన్కాగో మంచు పర్వతాన్ని తరుణ్‌జోషి గురువారం రాత్రి అధిరోహించారు. ఈ పర్వతాన్ని అధిరోహించిన రెండో భారతీయుడిగా ఆయన రికార్డు సృష్టించారు.


14 పాయింట్ల వద్దే ఆగిన సర్వే

నాలుగు టెలిమెట్రీ పాయింట్లను సర్వేచేయని సీడబ్ల్యూపీఆర్ఎస్ ■ పోతిరెడ్డిపాడు 1-3 కిలో మీటర్‌లోనే ఏర్పాటుకు మార్గం సుగమం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కృష్ణా ప్రాజెక్టులపై టెలిమెట్రీ ఏర్పాటుపై సెంట్రల్ వాటర్, పవర్ రీసెర్చి స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్ఎస్) సర్వే ఎట్టకేలకు పూర్తయింది. అయితే ముందుగా షెడ్యూల్‌లోఉన్న 18 పాయింట్లలో 14 పాయింట్ల వద్దే సర్వేను ముగించినట్టు తెలిసింది. ముఖ్యంగా ఏపీ పరిధిలోని నాలుగు ప్రదేశాలను పక్కనబెట్టినట్టు సమాచారం. మరోవైపు కీలకమైన పోతిరెడ్డిపాడు వద్ద 1-3 కిలోమీటర్ మధ్యనే టెలిమెట్రీ ఏర్పాటుకు సానుకూలంగా ఉన్నట్టు తెలుస్తున్నది. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు నేతృత్వంలో జరిగిన టెలిమెట్రీ పరికరాల ఏర్పాటు మొదటిదశ ప్రక్రియ పూర్తిగా విఫలమైన విషయం తెలిసిందే. రూ.2 కోట్లతో 18 చోట్ల టెలిమెట్రీని ఏర్పాటు చేయగా... కేవలం రిజర్వాయర్ల వద్ద ఉంచిన పరికరాలు మినహా, ప్రవాహాలను లెక్కించేందుకు ఏర్పాటుచేసిన ప్రదేశాలు, పరికరాలు డొల్ల అని బోర్డు నియమించిన నిపుణుల కమిటీ తేల్చింది. ఈ నేపథ్యంలో సీడబ్ల్యూపీఆర్ఎస్‌ను బోర్డు ఆశ్రయించగా.. ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు ఆ సంస్థ శాస్త్రవేత్తలు, బోర్డు ఇంజినీర్లతో పాటు రెండు రాష్ట్రాల ఇంజినీర్లు పర్యటించారు. 18 చోట్ల సీడబ్ల్యూపీఆర్ఎస్ సర్వేకు బోర్డు నిర్ణయించగా.. సర్వేలో నాలుగు పాయింట్లను పక్కనపెట్టినట్టు తెలుస్తున్నది. ప్రకాశం బరాజ్ సమీపంలో పోలవరం కాల్వ కలిసే ప్రదేశంతోపాటు తూర్పు, పడమర కాల్వలు, గుంటూరు చానల్ వద్ద టెలిమెట్రీ అవసరంలేదని ఏపీ ఇంజినీర్లు వాదించడం, అందుకు బోర్డు కూడా సహకరించిందనే ప్రచారం జరుగుతున్నది. అయితే వీటిని ఎందుకు పక్కనపెట్టారనేదానిపై సాంకేతిక వివరాలు మాత్రం వెల్లడి కావడం లేదు.

శవం లేచొస్తదంటూ క్షుద్రపూజలు

38 రోజులుగా శ్మశానం వద్ద కాపలా • రాత్రివేళల్లో పూజారి పూజలు • బాధిత కుటుంబంతో రూ.7లక్షలకు ఒప్పందం • పోలీసుల అదుపులో కాపలాదారులు



సమాధిపై వేసిన ముళ్లకంచె (ఇన్‌సెట్) మృతుడు శ్రీనివాసులు

అమరావతి: హైటెక్ యుగంలోనూ మూఢనమ్మకాలు రాజ్యమేలుతున్నాయి. ఇప్పటికీ చేతబడి, బాణామతి, క్షుద్రపూజలు, ఆత్మలు అంటూ కొందరు వాటిచుట్టే తిరుగుతూ ఉన్నారు. ఇటీవల ఏపీలోని నెల్లూరు జిల్లాలో జరిగిన ఘటనే ఇందుకు నిదర్శనం. చనిపోయిన వ్యక్తి సమాధి నుంచి లేచి వస్తాడని ఓ క్షుద్రపూజారి చెప్పిన మాటలు నమ్మి ఓ కుటుంబం రూ.7 లక్షలు సమర్పించుకున్నది. సమాధి వద్దే 38 రోజులు పడిగాపులు కాసింది. ఈ విషయం పోలీసులకు తెలియడంతో తాజాగా వారిని శ్మశానం నుంచి పంపించివేశారు. అసలేం జరిగిందంటే.. నెల్లూరు జిల్లా వెంకటగిరి మండలం పెట్లూరు గ్రామానికి చెందిన తుపాకుల రాము కుమారుడు శ్రీనివాసులు (26) బతుకుదెరువు కోసం 2014లో కువైట్ వెళ్లాడు. మూడునెలల క్రితం గ్రామానికి తిరిగివచ్చాడు. డిసెంబర్‌లో తిరుపతి దవాఖానలో శ్రీనివాస్ స్వైన్‌ఫ్లూ కారణంగా మరణించాడు. శ్రీనివాసులును చేతబడిచేసి చంపేశారని ఓ క్షుద్ర పూజారి మృతుడి కుటుంబసభ్యులను నమ్మించాడు. 41 రోజుల తర్వాత అదే మంత్రగాడు శ్మశానానికి చేరుకొని శవాన్ని లేపి మాట్లాడిస్తాడని, ఆ సమయంలో అతడిని చంపి అదే గుంతలో పూడ్చిపెట్టినట్లయితే శ్రీనివాసులు ప్రాణాలతో తిరిగి వస్తాడని పూజారి మభ్యపెట్టాడు. ఇదంతా చేసేందుకు రూ.7లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. అతడి మాటలు నమ్మిన మృతుడి కుటుంబసభ్యులు 38 రోజులుగా సమాధి వద్దే పడిగాపులు కాశారు. విషయం తెలుసుకున్న స్థానికులు శ్మశానం వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించగా రానివ్వలేదు. అటువైపు ఎవరువెళ్లినా కత్తులు, కర్రలతో భయపెట్టారు. ఈ విషయం బయటకు పొక్కడంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని కాపలాదారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తుచేస్తున్నారు.

బులంద్‌షెహర్ హింసాకాండ.. హత్యకు గురైన ఇన్‌స్పెక్టర్ మొబైల్ ఫోన్ నిందితుడి నివాసం నుంచి స్వాధీనం

న్యూఢిల్లీ, జనవరి 27: యూపీలో ఇటీవల హత్యకు గురైన సుబోధ్‌కుమార్ సింగ్ అనే ఇన్‌స్పెక్టర్ మొబైల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గత నెల 3న సుబోధ్‌ను కాల్చిచంపినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రశాంత్ నట్ అనే నిందితుడి నివాసం నుంచి ఈ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. బులంద్‌షెహర్‌లోని సియానా ప్రాంతంలో చెలరేగిన హింసాకాండలో సుబోధ్‌కుమార్ హత్యకు గురయ్యారు. ఆయన మృతదేహంపై రాళ్ల వల్ల తగిలిన ఆరు గాయాలు ఉన్నాయని, పుర్రెలోకి ఓ బుల్లెట్ చొచ్చుకెళ్లిందని పోస్టుమార్టం నివేదిక వెల్లడించింది. దీంతో కాల్పులు జరిపిన నిందితుడిని బులంద్‌షెహర్‌కు చెందిన ప్రశాంత్ నట్‌గా గుర్తించి అతడిని అరెస్టు చేశామని యూపీ పోలీసులు తెలిపారు. తానే కాల్పులు జరిపినట్టు నిందితుడు అంగీకరించాడని పోలీసులు చెప్తుండగా, తాను ఎన్నడూ ట్రిగ్గర్‌ను నొక్కలేదని ప్రశాంత్ నట్ న్యాయస్థానం వెలుపల మీడియాతో చెప్పడం గమనార్హం.

తుది అంకానికి పల్లె పోరు

నేటితో మూడోవిడుత ప్రచారానికి తెర ■ బుధవారం 3,533 పంచాయతీలకు పోలింగ్

బరిలో 11,667 మంది సర్పంచ్ అభ్యర్థులు ■ 27,543 వార్డులకు 67,316 మంది పోటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో గ్రామపంచాయతీ ఎన్నికలు తుది అంకానికి చేరుకున్నాయి. మూడువిడుతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేలా రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ నెల 1న నోటిఫికేషన్ జారీచేసిన విషయం విదితమే. ఇందులో భాగంగా రెండు విడుతల్లో పోలింగ్ ముగిసి, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులు వారికి ధ్రువీకరణ పత్రాలు సైతం అందజేశారు. ఇక తుదివిడుత పోలింగ్ బుధవారం జరుగనున్నది. పోలింగ్‌కు 44 గంటల ముందు ప్రచారం నిలిపివేయాలన్న ఎన్నికల సంఘం ఆదేశాలతో ఆఖరి విడుత ప్రచారపర్వానికి సోమవారం సాయంత్రం 5 గంటలకు తెరపడనున్నది. మూడో విడుతలో 4,116 పంచాయతీలకు ఎన్నికలు జరుగాల్సి ఉండగా, 573 గ్రామాలు ఏకగ్రీవమయ్యాయి. మరో 10 గ్రామాలకు రిజర్వేషన్లు కేటాయించిన సామాజికవర్గాలు లేకపోవడంతో ఎన్నికలు వాయిదాపడ్డాయి. బుధవారం 3,533 పంచాయతీలకు పోలింగ్ జరుగనుండగా, సర్పంచ్‌స్థానాలకు 11,667 మంది, 27,543 వార్డులకు 67,316 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు.

ఇటు కొప్పుల.. అటు రాజక్కపల్లె..

- గ్రామాలను విభజించిన రోడ్డు
- ఈ రెండు గ్రామాలు రెండు జిల్లాల పరిధిలో..

శాయంపేట: ఆ ఊరు ఒక్కటిగానే కనిపిస్తున్నది. కానీ అవి రెండు పంచాయతీలు. ఈ రెండు ఊళ్లను కేవలం ఒక్క రోడ్డు విభజిస్తున్నది. విచిత్రమేమిటంటే ఈ రెండు గ్రామాలు వేర్వేరు జిల్లాల్లో ఉన్నాయి. కొప్పుల గ్రామం వరంగల్ రూరల్ జిల్లా శాయంపేట మండలంలో, రాజక్కపల్లి గ్రామం జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలో ఉన్నాయి. కొప్పుల పంచాయతీ 1969లో ఏర్పడగా.. రాజక్కపల్లి గ్రామం 25 ఏండ్ల క్రితం రూపుదిద్దుకున్నది. రోడ్డుకు ఒకవైపు కొప్పుల పంచాయతీ భవనం.. మరోవైపు రాజక్కపల్లి పంచాయతీ భవనం ఉంటుంది. అధికారిక పనుల కోసం కొప్పుల ప్రజలు శాయంపేటకు, రాజక్కపల్లి గ్రామస్థులు రేగొండకు వెళ్తుంటారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రాజక్కపల్లి గ్రామ పంచాయతీ ఎన్నికలు మొదటివిడుతలో పూర్తికాగా.. కొప్పుల పంచాయతీకి రెండో విడుతలో ఎన్నికలు జరిగాయి.

సీక్రెట్ ఓటును బహిరంగం చేయొద్దు

- ఓటు వేస్తుండగా ఫొటోలు తీయడం నిషేధం
- అతిక్రమిస్తే కేసులు తప్పవు
- పంచాయతీ ఎన్నికల్లో 24 కేసులు నమోదు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఓటు అనేది అత్యంత గోప్యం. ఓటర్లు తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేసుకోవచ్చు. అయితే ఆ వేసిన ఓటును బహిరంగపర్చరాదు. దీనివల్ల అనేక అనర్థాలు తలెత్తుతాయని, కోపతాపాలకు దారితీస్తుందని భావించి ఎన్నికల కమిషన్ ఎవరికీ తెలియకుండా ఎన్నుకొనే అవకాశాన్ని కల్పించింది. అయితే ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో కొంతమంది యువకులు ఓటు వేసినప్పుడు సంబంధిత పోలింగ్ ఆఫీసర్‌కు తెలియకుండా ఫొటోలు తీసుకొన్నారు. పైగా వాటిని సోషల్ మీడియాలో పోస్ట్‌చేశారు. దీనిపై వచ్చిన ఫిర్యాదుల మేరకు రాష్ట్రవ్యాప్తంగా 24 కేసులు నమోదైనట్టు ఎన్నికల కమిషన్ పేర్కొన్నది. ఓటువేసే సందర్భంగా మొబైల్ ఫోన్‌తో ఫొటోలు తీయడంపై ఈసీ నిషేధం విధించింది. పోలింగ్ కేంద్రంలోకి కనీసం మొబైల్ ఫోన్‌ను కూడా అధికారులు అనుమతించరాదు. ఓటువేసిన చిత్రాలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్‌చేస్తే ఈసీ కేసులు నమోదుచేసి శిక్షిస్తుంది. కొంతమంది యువకులు తెలియక ఫొటోలు (సెల్ఫీ) తీసి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తున్నారు. సోషల్ మీడియా క్రేజ్‌లో పడి ప్రతి ఒక్కరూ ఏది పడితే అది ఫొటోలు తీసి పోస్ట్ చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు అనేక ఇబ్బందులు, అవాంతరాలను సృష్టిస్తున్నాయి.

ఓటేయకున్నా.. మేమిచ్చిన నోట్లైనా ఇవ్వండి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 'బుద్ధి తక్కువై వార్డు మెంబర్‌కు పోటీచేసిన. పైసలు తీసుకుంటిరి ఒక్కలు ఓటేయకపోతిరి.. నాకు ఇద్దరు బిడ్డలు.. వాండ్ల పెండ్లిళ్లు చేయాలే.. నా పైసలు నాకు ఇయ్యుండ్రి... ఓటు కోసం తీసుకున్న పైసలు నాయి నాకియిండ్రి.. మీ కాళ్లు మొక్కుతా' అంటూ సూర్యాపేట జిల్లాలో ఓ వార్డు సభ్యుడు చేతిలో సంచి పట్టుకుని ఇంటింటికీ తిరుగుతూ తిరుగు వసూళ్లు చేసుకుంటున్నాడు. పంచాయతీ ఎన్నికలు తుది అంకానికి చేరుకుంటున్న తరుణంలో పోలింగ్ ముగిసిన గ్రామాల్లో ఇలాంటి సంఘటనలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇటీవల సోషల్ మీడియాలో ఈ వసూళ్ల వీడియోలు వైరల్ అవుతున్నాయి. ఇలాగే ఓ గ్రామంలో కూడా.. ఇంటికి రెండు, మూడు వేలు తీసుకొని ఓటేయ లేదంటూ ఓడిన అభ్యర్థులు గొడవలకు దిగారు. నోటికొచ్చినట్టు తిడుతూ ఓటుకోసం ఇచ్చిన పైసలు తిరిగి ఇవ్వాలంటూ లొల్లిపెట్టారు.

గెలిచి పనిచేయకుంటే తప్పు.. ఇదిగో చెప్పు

పంచాయతీ ఎన్నికల ప్రచారం ఆసక్తిగా మారింది. ప్రస్తుతం మూడోవిడుత ప్రచారం తుది అంకానికి చేరుకొన్నది. ఈ నేపథ్యంలో పలువురు అభ్యర్థులు విచిత్రంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. తాజాగా ఓ గ్రామంలో అభ్యర్థి ఇంటింటికీ తిరుగుతూ ప్రతి ఓటరుకూ ఒక చెప్పు ఇస్తున్నాడు. తనకు ఓటేయాలని, గెలిచిన తర్వాత పనిచేయకుంటే అదే చెప్పుతో కొట్టాలంటూ సూచిస్తున్నాడు. ఇప్పటికే ఉంగరం, కత్తెర, గ్లాసు, జెగ్గు, బ్యాటు వంటి గుర్తులతో ఇంటింటా ప్రచారం చేస్తున్న అభ్యర్థులు.. ఇలా కొత్త తరహాగా వేడుకోవడం ఆసక్తిగా మారుతున్నది. ఇటీవల సిద్దిపేట జిల్లాలో ప్రతి ఓటరు కాళ్లు కడిగి నెత్తినపోసుకొంటూ అభ్యర్థులు ప్రచారం నిర్వహించారు. తాజాగా ఓటరుకో చెప్పు ఇచ్చి పనిచేయకుంటే చెప్పుతో కొట్టాలంటూ ఓటర్లను బతిమిలాడటం ఆసక్తిని కలిగిస్తున్నది.

సోషల్ మీడియా వేదికగా గ్రామ మ్యానిఫెస్టోలు

పంచాయతీ ఎన్నికల్లో సోషల్ మీడియాను విస్తృతంగా వినియోగిస్తున్నారు. తమను గెలిపిస్తే గ్రామానికి చేసే అభివృద్ధి పనులను ముందుగానే చెప్తూ గ్రామ మ్యానిఫెస్టోలను ఆయా గ్రామాల గ్రూపుల్లో పోస్టు చేస్తున్నారు. తాము చేసే పనులు, ఎన్నిరోజుల్లో చేస్తామనే విషయాలను వివరిస్తూ ప్రచారం చేసుకుంటున్నారు.



ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా పోల్కంపల్లిలో వర్షంలోనే గొడుగు పట్టుకొని ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



గద్వాల జిల్లా ఇటిక్యాలపాడు గ్రామంలో ఆదివారం జోరువానలోనే ప్రచారం చేపట్టిన ఎమ్మెల్యే అబ్రహం

పల్లెల్లో ప్రచారహోరు

- తుదివిడుత పంచాయతీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల ప్రచారం
- గులాబీ పార్టీ మద్దతుదారులను గెలిపించాలంటూ పిలుపు
- గ్రామ స్వరాజ్యానికి బాటలు వేయాలన్న నేతలు
- ఎడతెరిపిలేని వానలోనూ గ్రామాల్లో పర్యటన

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: రాష్ట్రంలో గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారం జోరుగాసాగుతున్నది. బుధవారం తుదివిడుత ఎన్నికలు జరుగనుండగా, సోమవారం సాయంత్రం 5 గంటలకు ప్రచారానికి తెరపడనున్నది. ఈ నేపథ్యంలో ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా పలువురు ప్రజాప్రతినిధులు ప్రచారంలో పాల్గొన్నారు. ముఖ్యంగా టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఆయా నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో తిరుగుతూ గులాబీ పార్టీ మద్దతుదారులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎడతెరిపి లేని వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఎమ్మెల్యేలు ప్రచారంలో పాల్గొన్నారు.

టీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి

టీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని, అప్పుడే గ్రామ స్వరాజ్యానికి బాటలు పడుతాయని దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లాలోని దేవరకద్ర, మూసాపేట, అడ్డాకుల, సీసీ కుంట మండలాల్లోని పలు గ్రామాల్లో టీఆర్‌ఎస్ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థులకు మద్దతుగా ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ముసురును సైతం లెక్కచేయకుండా ఎమ్మెల్యే ప్రచారానికి రావడంతో ఆయా గ్రామాల ప్రజలు, నాయకులు, కార్యకర్తలు గొడుగులు పట్టుకొని ఎన్నికల ప్రచారానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికల్లో గులాబీ పార్టీ మద్దతుదారులను గెలిపించాలని పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని అన్నివర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికే రెండువిడుతల్లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ బలపర్చిన అభ్యర్థులను ప్రజలు అధికంగా గెలిపించారని గుర్తుచేశారు. పంచాయతీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ మద్దతుదారులను ఆశీర్వదించాలని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు ఓటర్లను కోరారు. వనపర్తి జిల్లా పాన్‌గల్ మండల కేంద్రంతోపాటు బండపల్లి, వెంగళాయిపల్లి గ్రామాల్లో టీఆర్‌ఎస్ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ 500 జనాభా ఉన్న గ్రామాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. పంచాయతీ ఎన్నికల్లో సరైనా అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించారు. అనంతరం మండలంలోని కదిరేపాడు కాంగ్రెస్ పార్టీకి చెందిన కమ్మరి శేఖర్, శంకరయ్య, భాస్కర్‌తోపాటు మరో ఐదుగురు జూపల్లి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రవి, టీఆర్‌ఎస్ నాయకులు రామకృష్ణ, నాగేంద్రం తదితరులు పాల్గొన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం ఇటిక్యాలపాడు గ్రామంలో అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం టీఆర్‌ఎస్ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థి లోకేశ్వర్‌రెడ్డి తరఫున ప్రచారం నిర్వహించారు. అభ్యర్థికి కేటాయించిన కత్తెర గుర్తుకు అమూల్యమైన ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఉదయం జోరు వానను సైతం లెక్కచేయకుండా గొడుగులు పట్టుకొని ఎమ్మెల్యే, ఇతర నాయకులు ప్రచారంలో పాల్గొన్నారు. పంచాయతీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ మద్దతుదారులను గెలిపించాలని కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్ జిల్లా మద్దూరు మండలం కొమ్మూరు, వీరారం, పెద్దాపూర్, లింగాల్‌చేడ్, ఎక్కామేడ్, మన్నాపూర్, కొత్తపల్లి, గొర్లోనిబాయి, భూనీడు, నాగంపల్లి, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో టీఆర్‌ఎస్ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థులకు మద్దతుగా నరేందర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీఆర్‌ఎస్‌తోనే గ్రామాభివృద్ధి సాధ్యమన్నారు. గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆసరా పింఛన్లు, డబుల్ బెడ్‌రూం ఇండ్లు మంజూరు చేస్తామని హామీఇచ్చారు. కొడంగల్ నియోజకవర్గంలోని ప్రతి చెరువును నీటితో నింపుతామని తెలిపారు.



ఆదివారం వనపర్తి జిల్లా వెంగళాయిపల్లి గ్రామంలో టీఆర్‌ఎస్ కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు



మహబూబ్‌నగర్ జిల్లా మన్నాపూర్ గ్రామంలో ఆదివారం ఎన్నికల ప్రచారసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

పదవొచ్చింది.. మూడోబిడ్డకు జన్మనిచ్చింది

- మొదటివిడుత ఎన్నికల్లో సర్పంచ్‌గా ఎన్నికైన మహిళ
- జోగుళాంబ గద్వాల జిల్లా గువ్వల దిన్నెలో ఘటన



మహాదేవి, ఆదివారం జన్మించిన మూడోకూతురు

కేటీదొడ్డి: సర్పంచ్ అయిన వారానికే ఓ మహిళ మూడో బిడ్డకు జన్మనిచ్చింది. ఈ నెల 21న జరిగిన మొదటివిడుత పంచాయతీ ఎన్నికల్లో జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలంలోని గువ్వలదిన్నెకు చెందిన మహాదేవి సర్పంచ్‌గా పోటీచేసి విజయం సాధించింది. ఆదివారం పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఆమెకు ఇదివరకే ఇద్దరు పిల్లలున్నారు. ఎన్నికల్లో పోటీకి ఇద్దరికంటే ఎక్కువమంది పిల్లలు ఉండకూడదు. ఎన్నికలకు ముందే కాన్పు జరిగిఉంటే ఆమెను అధికారులు పోటీ నుంచి తప్పించేవారు. ఎన్నికల తర్వాత కాన్పు కావడంతో సర్పంచ్‌గా ఎన్నిక చెల్లుతుందని అధికారులు తెలిపారు. ప్రజా సేవచేసే అదృష్టం ఉన్నందుకే ఎన్నికల తర్వాత మూడోబిడ్డ పుట్టిందని మహాదేవి చెప్పారు.

90 ఏండ్ల వయసులోనూ తిరుగులేని విజయం

- ఖమ్మం జిల్లా మల్లవరం సర్పంచ్‌గా సామ్రాజ్యం గెలుపు



దుగ్గిదేవర సామ్రాజ్యం

తల్లాడ: ఖమ్మం జిల్లా తల్లాడ మండలంలోని మల్లవరం గ్రామ పంచాయతీకి చెందిన దుగ్గిదేవర సామ్రాజ్యం అనే మహిళ 90 ఏండ్ల వయసులోనూ సర్పంచ్‌గా తిరుగులేని విజయాన్ని కైవసం చేసుకున్నది. ఎంపీటీసీ సభ్యురాలిగా కొనసాగుతున్న ఆమె ప్రస్తుత పంచాయతీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ పార్టీ మద్దతుతో బరిలో నిలిచి సర్పంచ్ పదవిని దక్కించుకున్నది. తన ప్రత్యర్థి ప్రజాకూటమికి చెందిన కటికి భారతమ్మపై గెలుపొందింది. గత ఎంపీటీసీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థిని భారతమ్మపైనే సామ్రాజ్యం విజయం సాధించింది. 2001, 2014లో ఎంపీటీసీ సభ్యురాలిగా, 2006లో సర్పంచ్‌గా, 2013లో సొసైటీ డైరెక్టర్‌గా.. తాజాగా సర్పంచ్ పదవిని దక్కించుకొని వరుసగా ఐదు ఎన్నికల్లోనూ తిరుగులేని విజయాన్ని సొంతం చేసుకున్నది. సామ్రాజ్యం భర్త స్వాతంత్ర్య సమరయోధుడు దుగ్గిదేవర నర్సయ్య కూడా రెండు పర్యాయాలు మల్లవరం సర్పంచ్‌గా గెలుపొందారు.

సర్పంచ్ బరిలో అక్కాచెల్లెండ్లు

- నల్లగొండ జిల్లా ఉప్పలపహాడ్‌లో పోరు



రజిత




శశికళ

కేతేపల్లి: నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం ఉప్పలపహాడ్ గ్రామపంచాయతీలో తోబుట్టువులు సర్పంచ్ బరిలో నిలిచారు. ఈ నెల 30న జరుగనున్న ఎన్నికల్లో అక్కాచెల్లెండ్లు ప్రత్యర్థులుగా రంగంలోకి దిగారు. గ్రామానికి చెందిన సూదిని నర్సిరెడ్డి, జయమ్మ దంపతులకు ముగ్గురు కుమార్తెలు. పెద్ద కూతురు రజితను ఇదే గ్రామానికి చెందిన సోమసాని వెంకట్‌రెడ్డికి, చిన్న కూతురు శశికళను గుర్రం వెంకట్‌రెడ్డికి ఇచ్చి పెండ్లి జరిపించారు. పంచాయతీ ఎన్నికల్లో గ్రామం జనరల్ మహిళగా రిజర్వ్ కావడంతో అక్కాచెల్లెండ్లు ప్రత్యర్థులుగా బరిలో నిలిచారు. రజిత టీఆర్‌ఎస్, శశికళ కాంగ్రెస్ మద్దతుతో పోటీలో ఉన్నారు. గ్రామంలో 940 మంది ఓటర్లు ఉన్నారు. రజిత భర్త సోమసాని వెంకట్‌రెడ్డి 2001 నుంచి 2006 వరకు సర్పంచ్‌గా పనిచేశారు. అక్కాచెల్లెండ్లు బరిలో నిలువడంతో ఎవరికి ఓటేయాలో తేల్చేకోలేక వారి బంధువులు, సన్నిహితులు ఇబ్బందిపడుతున్నారు.

ముచ్చర్ల సర్పంచ్ అభ్యర్థి మృతి

- ఈ నెల 30న ఎన్నిక యథాతథం



వెంకటరమణ

కందుకూరు: రంగారెడ్డి జిల్లా కందుకూరు మండల పరిధిలోని ముచ్చర్ల పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి డేరంగుల వెంకటరమణ అకాలంగా మృతిచెందాడు. ముచ్చర్ల గ్రామాన్ని జనరల్‌కు కేటాయించిన ఎన్నికల సంఘం.. ఈనెల 30న ఎన్నిక నిర్వహణకు ఏర్పాట్లు చేసింది. వెంకటరమణ సీపీఎం మద్దతుతో బరిలో నిలిచారు. మూడురోజుల కిందట ప్రచారం నిర్వహిస్తుండగా అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబసభ్యులు ఆయనను హైదరాబాద్‌కు తరలించగా.. చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందాడు. వెంకటమణ మృతితో ఎన్నికలు వాయిదా పడవని, ఎన్నికలను యథాప్రకారం నిర్వహిస్తామని, పోలింగ్ అధికారులు కృష్ణకుమారి, ఈవోఆర్డీ విజయలక్ష్మి తెలిపారు.

గుండెపోటుతో ఉపసర్పంచ్ మృతి

- జడ్చర్ల మండలంలో ఏకగ్రీవమైన రెండురోజులకే విషాదం



పాత్లావత్ పాండు

జడ్చర్ల రూరల్: వార్డు సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికై ఉపసర్పంచ్ పదవి వరించిన రెండురోజులకే ఓ వ్యక్తి గుండెపోటుతో మృతిచెందాడు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం యాసకుంట తండాకు చెందిన పాత్లావత్ పాండు (55)ను రెండోవిడుత ఎన్నికల్లో 10వ వార్డు సభ్యుడిగా గ్రామస్థులు ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఆపై ఆయన ఉపసర్పంచ్‌గా ఎన్నికయ్యారు. పాండుకు ఆదివారం తెల్లవారుజామున ఛాతిలో నొప్పి వచ్చి దవాఖానకు తీసుకెళ్లేలోపే మృతిచెందాడు.



జగిత్యాల జిల్లా ఆత్మకూర్ గ్రామంలో ఆదివారం పోలింగ్ అధికారుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఓడిపోయిన సర్పంచ్ అభ్యర్థులు, మద్దతుదారులు

రిగ్గింగ్‌కు పాల్పడ్డారని ఆందోళన

- జగిత్యాల జిల్లా ఆత్మకూర్‌లో ఎన్నికల అధికారుల దిష్టిబొమ్మ దహనం

మెట్‌పల్లి రూరల్: రెండోవిడుత పంచాయతీ ఎన్నికల్లో భాగంగా జగిత్యాల జిల్లా ఆత్మకూర్ గ్రామంలోని 10వ వార్డు పోలింగ్ కేంద్రంలో రిగ్గింగ్ జరిగిందని ఆరోపిస్తూ ఓడిన ముగ్గురు సర్పంచ్ అభ్యర్థులు ఆదివారం ఆందోళనకు దిగారు. తమ మద్దతుదారులతో కలిసి ఎన్నికల అధికారుల దిష్టిబొమ్మను దహనం చేశారు. రీపోలింగ్ జరుపాలని డిమాండ్ చేశారు. గ్రామంలో పదివార్డులకు ఎన్నికలు జరుగగా.. తొమ్మిది బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ కేంద్రానికి ఒకేసారి తరలించారని, 10వ వార్డు బ్యాలెట్ బాక్సును తీసుకురావడంలో ఎందుకు ఆలస్యమైందని ప్రశ్నించారు. సంబంధిత బ్యాలెట్ బాక్సుకు సీలు సైతం లేదని, కౌంటింగ్ సమయంలో ప్రశ్నించినా అధికారులు పట్టించుకోలేదని మండిపడ్డారు. ఆ బ్యాలెట్ బాక్సులో గెలుపొందిన అభ్యర్థికి ఏకపక్షంగా ఓట్లు నమోదు కావడం మరిన్ని అనుమానాలకు తావిస్తున్నదన్నారు.

తండ్రి సర్పంచ్.. కొడుకు ఉపసర్పంచ్

- నల్లగొండ జిల్లా బచ్చన్నగూడెంలో ఏకగ్రీవం



రామలచ్చయ్య, వెంకటేశ్

కనగల్: నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని బచ్చన్నగూడెం గ్రామంలో తండ్రీకొడుకులు సర్పంచ్, ఉపసర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామానికి చెందిన గుండెబోయిన రామలచ్చయ్యను సర్పంచ్‌గా, మరో ఎనిమిది మంది వార్డు సభ్యులను గ్రామస్థులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మూడో వార్డు సభ్యుడిగా రామలచ్చయ్య కుమారుడు వెంకటేశ్ ఎన్నికయ్యాడు. ఆదివారం వార్డుసభ్యులంతా సమావేశమై వెంకటేశ్‌ను ఏకగ్రీవంగా ఉపసర్పంచ్‌గా ఎన్నుకున్నారు. వీరిద్దరూ టీఆర్‌ఎస్ బలపర్చిన అభ్యర్థులే.

"గ్రాండ్‌స్లామ్ ఫైనల్లో నేను ఆడిన ఉత్తమ మ్యాచ్ ఇది. ఇప్పటికీ మేం అతిపెద్ద టైటిల్స్ కోసం పోటీపడుతున్నామంటే నమ్మలేకపోతున్నా. ఈ సాయంత్రం అద్భుతంగా గడిచింది. నాదల్‌తో నేను ఆడిన అత్యుత్తమ టెన్నిస్ ఇదే కావచ్చేమో. 12 నెలల కిందట నా మోచేతికి శస్త్రచికిత్స జరిగింది. ఆటతో పాటు ర్యాంకింగ్స్ చేజారింది. అయినా నిరాశ చెందకుండా మళ్లీ మీ ముందు ఇలా నిలబడటం అమోఘంగా అనిపిస్తున్నది. హ్యాట్రిక్ స్లామ్ పూర్తి చేయడం అద్భుతం. ఆరంభం నుంచే దూకుడు చూపెట్టాలన్నది నా ప్రణాళిక. నేను ఏదైతే అనుకున్నానో దానిని సమర్థంగా అమలు చేశా. నాదల్‌కు పుంజుకునే అవకాశం ఇస్తే మ్యాచ్‌ను ఎక్కడికో తీసుకెళ్తాడు. అందుకే ఆ అవకాశం ఇవ్వకుండా నా పని పూర్తి చేశా." -జొకోవిచ్



'జై'కోవిచ్



ఆటలో ఇద్దరూ సమకాలికులే.. పోరాటం చేయడంలో ఇద్దరూ సమఉజ్జీలే.. చరిత్ర సృష్టించడంలోనూ ఇద్దరూ దిట్టలే.. ఘనతలు వాళ్లకు లెక్కలేదు.. పరస్పరం గెలువడమూ కొత్త కాదు.. దిగ్గజ ప్రత్యర్థులుగా జగాన్ని గెలిచారు.. జనాన్నీ మెప్పించారు. కానీ ఇప్పుడు సీన్ మారింది..! కొదమసింహాలా సమరంగా సాగుతుందనుకున్న ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ పోరు కాస్త ఏకపక్షమైంది. పోటీ ఎక్కువగా ఉంటుందని పోరాటాన్ని నమ్ముకున్న సెర్బియా స్టార్ నొవాక్ జొకోవిచ్ దెబ్బకు స్పెయిన్ బుల్ రాఫెల్ నాదల్ చేతులెత్తేశాడు. మూడుసెట్ల పోరాటంలో మునుపటి ఫామ్‌ను చూపలేక పోయాడు. ఫలితంగా అందివచ్చిన ప్రతి అవకాశాన్ని అద్భుతంగా ఒడిసిపట్టుకున్న సెర్బియన్ రికార్డు విజయంతో 'జైకొ'ట్టాడు. ఫైనల్ ఆడిన ప్రతిసారి తన మార్క్‌ను చూపెడుతూ దిగ్గజాలను అధిగమిస్తూ ఏడో సారి టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు.

ఏడోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ సొంతం

ఫైనల్లో రెండోసీడ్ నాదల్‌పై గెలుపు

ఫెదరర్, ఎమర్సన్ ఆరు టైటిళ్ల రికార్డు బద్దలు

15 గ్రాండ్‌స్లామ్స్‌తో మూడో స్థానంలో జొకో

విజేత జొకోవిచ్ రూ. 20.88 కోట్లు

రన్నరప్ నాదల్ రూ. 10.44 కోట్లు

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ప్రపంచ నంబర్‌వన్ జొకోవిచ్ సంచలనం సృష్టించాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో టాప్‌సీడ్ జొకోవిచ్ 6-3, 6-2, 6-3తో రెండోసీడ్ నాదల్ (స్పెయిన్)పై గెలిచాడు. దీంతో రికార్డు స్థాయిలో ఏడోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ఫలితంగా దిగ్గజాలు రోజర్ ఫెదరర్ (స్విట్జర్లాండ్), రాయ్ ఎమర్సన్ (ఆస్ట్రేలియా)ల చెరో ఆరు టైటిళ్ల రికార్డును బద్దలుకొట్టాడు. జొకోవిచ్ కెరీర్‌లో ఇది 15వ గ్రాండ్‌స్లామ్ ట్రోఫీ కావడం విశేషం. ఈ సందర్భంగా పీట్ సంప్రాస్ (14)ను అధిగమించాడు. ఓవరాల్ జాబితాలో జొకోవిచ్‌ది మూడోస్థానం కాగా, 20 టైటిళ్లతో ఫెదరర్, 17 టైటిళ్లతో నాదల్ తొలి రెండు స్థానాల్లో కొనసాగుతున్నారు. గతేడాది వింబుల్డన్, యూఎస్ ఓపెన్‌తో పాటు ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ నెగ్గిన జొకోవిచ్.. 'హ్యాట్రిక్ స్లామ్'ను పూర్తి చేసుకున్నాడు. ఒకవేళ మే నెలలో జరిగే ఫ్రెంచ్ ఓపెన్‌లోనూ గెలిస్తే.. ఓపెన్ శకంలో నాలుగు మేజర్ టైటిళ్లను రెండుసార్లు నెగ్గిన ఏకైక ప్లేయర్‌గా చరిత్ర సృష్టిస్తాడు.జొకోవిచ్ 2008, 2011, 2012, 2013, 2015, 2016లో ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్స్‌ను గెలుచుకున్నాడు. ఓపెన్ శకంలో జొకోవిచ్-నాదల్ తలపడినన్నిసార్లు ఇంకెవ్వరూ ఎదురుపడలేదు. వీరిద్దరి మధ్య ఇది 53వ మ్యాచ్. గతంలో 2012లో ఈ ఇద్దరి మధ్య జరిగిన ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో జొకోవిచ్ విజేతగా నిలిచాడు. సుదీర్ఘంగా 5 గంటల 53 నిమిషాల పాటు సాగిన ఆ పోరు.. గ్రాండ్‌స్లామ్ చరిత్రలో ఓ రికార్డు. ప్రతి పాయింట్ కోసం హోరాహోరీగా చేసిన పోరాటం.. ఈసారి కూడా పునరావృతం అవుతుందని భావించినా ఆ స్థాయిలో సాగలేదు.

ఏకపక్షంగానే: 2 గంటలా 4 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో జొకోవిచ్ పూర్తి ఆధిపత్యం చూపెట్టాడు. ఒత్తిడితో మ్యాచ్‌ను మొదలుపెట్టిన నాదల్ ఏ దశలోనూ జొకోకు పోటీ ఇచ్చేలా కనిపించలేదు. దీంతో ప్రతి పాయింట్‌ను తనదైన శైలిలో చేజిక్కించుకున్న టాప్‌సీడ్ ప్లేయర్ వెనుదిరిగి చూడలేదు. బంతిపై పూర్తి నియంత్రణ చూపెడుతూ తొలి సెట్‌లో తొలి నాలుగు సర్వీస్‌లను ఒక్క పాయింట్ కూడా కోల్పోకుండా సొంతం చేసుకున్నాడు. తర్వాతి గేమ్‌లో నాదల్ ఫోర్‌హ్యాండ్లను సంధించినా దీటుగా ఎదుర్కొంటూనే 36 నిమిషాల్లోనే సెట్‌ను ముగించాడు. ఇదే తరహాలో సాగిన రెండోసెట్‌లోనూ జొకోవిచ్ విజృంభణ చేశాడు. వేగంగా దూసుకువచ్చిన జొకో సర్వీస్‌లను అడ్డుకునే సాహసం చేయని నాదల్.. తన సర్వీస్‌ను సైతం కాపాడుకోలేకపోయాడు. సుదీర్ఘంగా సాగిన ఐదో గేమ్‌లో నాదల్ సంధించిన లోబ్ వ్యాలీని జొకోవిచ్ బ్యాక్‌హ్యాండ్ షాట్‌తో నిలువరించి సర్వీస్‌ను బ్రేక్ చేశాడు. ఏడో గేమ్‌లో మళ్లీ స్పెయిన్ ప్లేయర్ సర్వీస్‌ను అడ్డుకుని 5-2 ఆధిక్యంలోకి వెళ్లాడు. తన సర్వీస్ (8వ గేమ్)లో వరుసగా మూడు ఏస్‌లు సంధించి గంటా 16 నిమిషాల్లోనే రెండు సెట్ల ఆధిక్యంలో నిలిచాడు. ఈ రెండు సెట్లలో కలిపి జొకోవిచ్ 8 ఏస్‌లు సంధిస్తే, నాదల్ ఒక్కదానితో సరిపెట్టుకున్నాడు. జొకోవిచ్ నాలుగు అనవసర తప్పిదాలు చేయగా, నాదల్ 20సార్లు చేసి మూల్యం చెల్లించుకున్నాడు.

సర్వీస్ కోల్పోయి: అప్పటికే రెండు సెట్లు దక్కడంతో నాదల్‌కు పుంజుకునే అవకాశాన్ని ఇవ్వని జొకోవిచ్.. మ్యాచ్ తొందరగా ముగించాలనే పట్టుదలతో ఆడాడు. కోర్టు మొత్తం చురుకుగా కదులుతూ బలమైన క్రాస్‌కోర్టు షాట్లతో విరుచుకుపడ్డాడు. ఫలితంగా మూడోసెట్ మూడో గేమ్‌లో నాదల్ సర్వీస్‌ను బ్రేక్ చేసి 2-1 ఆధిక్యంలోకి వెళ్లాడు. అయితే నాలుగో గేమ్‌లో సర్వీస్ చేజార్చుకోవడంతో స్కోరు 2-2తో సమమైంది. ఇక ఇక్కడి నుంచి బేస్‌లైన్ గేమ్‌తో ర్యాలీలు ఆడిన జొకో.. నాదల్‌ను కట్టిపడేశాడు. ఐదు, తొమ్మిదో గేమ్‌లో నాదల్ సర్వీస్‌ను బ్రేక్ చేయడంతో పాటు ఆరు, ఎనిమిదో గేమ్‌లో తన సర్వీస్‌ను కాపాడుకుని చిరస్మరణీయ విజయాన్ని సొంతం చేసుకున్నాడు. తాజా విజయంతో జొకోవిచ్ ముఖాముఖి రికార్డును 28-25కు పెంచుకున్నాడు. గ్రాండ్‌స్లామ్ ఫైనల్ రికార్డు మాత్రం 4-4తో ఉంది.

"జొకోను ఓడించాలంటే ఈ ఆట సరిపోదు. గాయం కారణంగా ఐదు నెలలుగా ఆటకు దూరంగా ఉన్నా. కాబట్టి ఈ టోర్నీలో ఆడటం నాకు ఓ పెద్ద సవాలుగా నిలిచింది. 100 శాతం ఫిట్‌నెస్ లేకుండా అతన్ని ఓడించడం చాలా కష్టం. గతేడాది చాలా కష్టంగా గడిచింది. యూఎస్ ఓపెన్ తర్వాత కేవలం తొమ్మిది టోర్నీల్లోనే ఆడా. గాయం నుంచి పూర్తిగా కోలుకోకుండానే ఈ రెండు వారాలు మెరుగైన టెన్నిస్ ఆడాననే అనుకుంటున్నా. మరింత మ్యాచ్ ప్రాక్టీస్ కావాలి. ఇలాంటి టోర్నీల్లో మరింత మెరుగ్గా రాణించాలి. వయసును దృష్టిలో పెట్టుకుని టోర్నీలను ఎంపిక చేసుకోవాలి. నా క్యాలెండర్, నా ప్రాధమ్యాలు నాకు ఉన్నాయి. ప్రస్తుతానికైతే ఇంటికెళ్లి కొన్ని రోజులు విశ్రాంతి తీసుకోవాలి. ఆ తర్వాత నా ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తా." -నాదల్



పురుషుల డబుల్స్ ఫైనల్లో ఐదోసీడ్ పియరీ హెర్బెర్ట్-నికోలస్ మహుట్ (ఫ్రాన్స్) 6-4, 7-6 (7/1)తో 12వ సీడ్ హెన్రీ కొంటినెన్ (ఫిన్లాండ్)-జాన్ పీర్ (ఆస్ట్రేలియా)పై గెలిచి టైటిల్‌ను సొంతం చేసుకున్నారు.

భారత క్రికెటర్లతో జాగ్రత్త!



మౌంట్ మౌంగనూయి: ఈ మాట అంటున్నది ఎవరో తెలుసా న్యూజిలాండ్ పోలీసులు. అదేంటి మన క్రికెటర్లు ఏమైనా నేరం చేశారని అనుకుంటున్నారా. అదేం లేదండి బాబు.. ద్వైపాక్షిక వన్డే సిరీస్‌లో మనోళ్ల వరుస విజయాల జోరు చూసి న్యూజిలాండ్ ఈస్టర్న్ డిస్ట్రిక్ట్ పోలీసులు సరదాగా ఫేస్‌బుక్‌లో ఓ నోటీసు జారీచేశారు. ఆస్ట్రేలియన్ల తరహాలో గాకుండా క్రీడాస్ఫూర్తి ప్రదర్శిస్తూ క్రికెట్ పట్ల తమకున్న అభిమానాన్ని చాటుకుంటూ సోషల్‌మీడియాలో భారత జట్టు ఫొటోతో పాటు కామెంట్ పోస్ట్ చేశారు. 'అమాయక న్యూజిలాండ్ జట్టుపై నేపియర్, మౌంట్ మౌంగనూయిలో గత వారం ఈ గ్రూపు నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడింది. క్రికెట్ బంతి, బ్యాటుతో గనుక ఎవరైనా బయటికి వెళ్లాలంటే అదనపు జాగ్రత్తలు తీసుకోండి' అని హెచ్చరిక జారీ చేసింది. దీన్ని న్యూజిలాండ్ మాజీ ఆల్‌రౌండర్ స్కాట్ స్టైరిస్ తన ట్విట్టర్‌లో షేర్ చేశాడు.

సర్ఫరాజ్‌పై 4 మ్యాచ్‌ల నిషేధం



దుబాయ్: పాకిస్థాన్ కెప్టెన్ సర్ఫరాజ్ అహ్మద్‌పై వేటు పడింది. దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ అండైల్ ఫెల్కువాయోపై జాతి వివక్ష వ్యాఖ్యలు చేసిన కారణంగా ఐసీసీ నాలుగు మ్యాచ్‌ల సస్పెన్షన్ విధిస్తూ ఆదివారం నిర్ణయం తీసుకుంది. ఇది వెంటనే అమల్లోకి రానుంది. దీంతో దక్షిణాఫ్రికాతో మిగిలిన రెండు వన్డేలతో పాటు వచ్చే నెల 1న మొదయ్యే రెండు టీ20 మ్యాచ్‌లకు సర్ఫరాజ్ దూరమయ్యాడు. తనపై ఐసీసీ విధించిన సస్పెన్షన్‌ను పాక్ కెప్టెన్ అంగీకరించాడు. 'జాతి వివక్షను ప్రేరేపించే ఎలాంటి చర్యలనైనా ఐసీసీ ఉపేక్షించదు. ఫెల్కువాయోను ఉద్దేశిస్తూ సర్ఫరాజ్ చేసిన వ్యాఖ్యలను పరిగణనలోకి తీసుకున్నాం. మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించిన సర్ఫరాజ్ తీరును తప్పుబడుతూ సస్పెన్షన్ నిర్ణయం తీసుకోవడం జరిగింది' అని ఐసీసీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ రిచర్డ్‌సన్ పేర్కొన్నాడు. కాగా దక్షిణాఫ్రికాతో ఆదివారం జరిగిన నాల్గో వన్డేలో పాకిస్థాన్ 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

సిరీస్ లక్ష్యంగా..

హ్యాట్రిక్ గెలుపుపై భారత్ కన్ను

న్యూజిలాండ్‌కు చావోరేవో

నేడు మూడో వన్డే



ఉదయం 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో

జట్ల అంచనా

భారత్: కోహ్లీ(కెప్టెన్), రోహిత్, ధవన్, రాయుడు, ధోనీ, జాదవ్, హర్దిక్, కుల్దీప్, భువనేశ్వర్, షమీ, చాహల్.

న్యూజిలాండ్: విలియమ్సన్(కెప్టెన్), గప్టిల్, మన్రో, టేలర్, లాథమ్, నికోలస్, సాంట్నర్, బ్రేస్‌వెల్, సోధీ, ఫెర్గుసన్, బౌల్ట్.

మౌంట్ మౌంగనూయి: ప్రపంచకప్ మెగా టోర్నీకి ముందు భారత్ తమకు అందివచ్చిన అవకాశాలన్నింటినీ సద్వినియోగం చేసుకుంటున్నది. మెగా టోర్నీ నాటికి మిగిలిన వన్డేల ద్వారా తమ లోటుపాట్లు, జట్టు కూర్పు, సమతూకంపై దృష్టిసారించింది. ఓవైపు రెగ్యులర్ ఆటగాళ్లకు మ్యాచ్ ప్రాక్టీస్ కల్పిస్తూనే ఇంకా ఓ అంచనాకు రాలేకపోతున్నా..మిడిలార్డర్‌లో ఎవరిని ఆడించాలన్న దానిపై కన్నేసింది. న్యూజిలాండ్‌తో ఐదు వన్డేల సిరీస్‌లో ఇప్పటికే 2-0 ఆధిక్యంలో ఉన్న కోహ్లీసేన...హ్యాట్రిక్ విజయంతో సిరీస్‌ను ఖాతాలో వేసుకోవాలన్న కసితో ఉన్నది. తమ గెలుపు జోరును కొనసాగిస్తూ సోమవారం మౌంట్ మౌంగనూయిలోని బే ఓవల్ మైదానంలో జరిగే మ్యాచ్‌లో కివీస్‌ను ఓడించేందుకు పూర్తిస్థాయిలో సిద్ధమైంది. భవిష్యత్తు బిజీ పర్యటనలను దృష్టిలో పెట్టుకుని కెప్టెన్ విరాట్ కోహ్లీకి మిగిలిన రెండు వన్డేలతో సహా టీ20 సిరీస్‌కు విశ్రాంతినిచ్చిన సంగతి తెలిసిందే. మరోవైపు సొంతగడ్డపై పరిస్థితులకు పూర్తి అలవాటుపడ్డ కివీస్ జట్టు భారత్‌కు దీటైన పోటీనివ్వడంలో ఘోరంగా విఫలమవుతూ వస్తున్నది. గత రెండు వన్డేల్లో కివీస్ జట్టు స్థాయి మేరకు రాణించలేక వరుస ఓటములు మూటగట్టుకుంది. సిరీస్‌లో నిలువాలంటే గెలిచిన తీరాల్సిన మూడో మ్యాచ్‌లోనైనా పుంజుకోవాలన్న పట్టుదల విలియమ్సన్ గ్యాంగ్‌లో కనిపిస్తున్నది.

హార్దిక్ రీఎంట్రీ!

ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా పునరాగమనానికి వేళయింది. ఓ టెలివిజన్ ప్రీమియర్ షోలో మహిళలపై అనుచిత వ్యాఖ్యల వివాదం నుంచి ఊరట పొందిన హార్దిక్ మూడో వన్డేలో ఆడే అవకాశాలు కనిపిస్తున్నాయి. అందివచ్చిన అవకాశాలను సరిగ్గా సద్వినియోగం చేసుకోలేకపోతున్న తమిళనాడు ఆల్‌రౌండర్ స్థానంలో హార్దిక్ జట్టులోకి రావడం ఖాయంగా కనిపిస్తున్నది. దీంతో జట్టు బ్యాటింగ్ మరింత బలోపేతం కావడంతో పాటు బౌలింగ్ పరంగా కలిసిరానుంది. బ్యాటింగ్ పరంగా చూసుకుంటే ఈ సిరీస్‌కు ముందు ఫామ్‌లేమితో సతమతమైన ధవన్..మళ్లీ టచ్‌లోకి రావడం మెగా టోర్నీకి ముందు జట్టుకు కలిసొచ్చే అంశంగా మారింది. రెండు వన్డేల్లోనూ అర్ధసెంచరీలతో ధవన్ రాణించడం జట్టు విజయావకాశాలను మెరుగుపర్చింది. తొలి వన్డేలో విఫలమైనా..మలి వన్డేలో బ్యాటు ఝులిపించిన ముంబైకర్ రోహిత్‌శర్మ..ధవన్ అండగా చెలరేగితే కివీస్ బౌలర్లకు కష్టాలు తప్పకపోవచ్చు. వీరిద్దరి తర్వాత కెప్టెన్ విరాట్ కోహ్లీ, అంబటి రాయుడు, ధోనీ, జాదవ్ తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తున్నారు. నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు వస్తున్న రాయుడు అటు టాపార్డర్‌కు, మిడిలార్డర్‌కు సంధానకర్తగా వ్యవహరిస్తున్నాడు. ఇక ఆస్ట్రేలియాతో సిరీస్‌లో మునుపటి ఫామ్‌ను అందిపుచ్చుకున్న ధోనీ మెరుపులు మెరిపిస్తున్నాడు. ఇన్నింగ్స్ ఆఖర్లో వచ్చినా..జట్టుకు కీలక పరుగులు కొల్లగొడుతున్నాడు. యువ సంచలనం శుభ్‌మన్ గిల్ అరంగేట్రంపై కూడా టీమ్ మేనేజ్‌మెంట్ ఆలోచిస్తున్నది. స్పిన్ ట్విన్స్‌గా ప్రాచుర్యంలోకి వచ్చిన చాహల్, కుల్దీప్ యాదవ్..కివీస్ బ్యాట్స్‌మెన్‌కు కొరకరాని కొయ్యగా తయారయ్యారు. తమదైన స్పిన్ నైపుణ్యంతో ముప్పుతిప్పలు పెడుతున్నారు. రెండు మ్యాచ్‌ల్లో మొత్తం 20 వికెట్లు నేలకూలితే..అందులో 12 వికెట్లు వీరి ఖాతాలోనే పడ్డాయి. ముఖ్యంగా చైనామన్ కుల్దీప్ బంతులకు కివీస్ బ్యాట్స్‌మెన్ దగ్గర సమాధానమే లేకుండా పోయింది. వీరికి తోడు పేసర్లు భువనేశ్వర్, షమీ ఆదిలోనే వికెట్లు తీయడంతో న్యూజిలాండ్ కోలుకోలేకపోతున్నది. రెండో వన్డేలో ఆఖర్లో బ్రేస్‌వెల్ అర్ధసెంచరీతో ఆశలు రేపినా లాభం లేకపోయింది.

గెలిచి నిలుస్తారా?

న్యూజిలాండ్ జట్టు గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నది. కొట్టిన పిండిలాంటి సొంత ఇలాఖాలో సత్తాచాటలేక చతికిల పడుతున్నది. ప్రత్యర్థికి భారీ లక్ష్యాన్ని నిర్దేశించడంలో విఫలమవుతుండటంతో పాటు బౌలింగ్‌లోనూ ఆకట్టుకోలేకపోతున్నది. విధ్వంసక ఆటతీరుకు మారుపేరైన ఓపెనింగ్ ద్వయం మార్టిన్ గప్టిల్, కొలిన్ మన్రో మెరుపులు మెరిపించలేకపోతున్నారు. అంతోఇంతో ఫామ్‌మీదున్న కెప్టెన్ విలియమ్సన్, రాస్ టేలర్ బ్యాటు ఝులిపిస్తున్నా..సహచరుల నుంచి సహకారం కరువైంది. దీనికి తోడు వికెట్లు తీయగల బౌలర్లు కివీస్ జట్టుకు కరువయ్యారు.

పిచ్, వాతావరణం

మూడో వన్డేకు వేదికైన బే ఓవల్ పిచ్ స్పిన్‌కు అనుకూలించే అవకాశముంది. వర్ష సూచనలు లేవు, ఎండ కాయనుంది.

సైనాదే ఇండోనేషియా టైటిల్

గాయంతో వైదొలిగిన మారిన్



జకార్తా: భారత స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్.. ఇండోనేషియా మాస్టర్స్ టైటిల్‌ను సొంతం చేసుకున్నది. కాలి గాయం కారణంగా ఒలింపిక్ చాంపియన్ కరోలినా మారిన్ (స్పెయిన్) ఆదివారం జరిగిన టైటిల్ పోరు నుంచి తప్పుకుంది. ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన మారిన్ సైనా కుదురుకోకముందే 2-0 ఆధిక్యంలోకి వెళ్లింది. హైదరాబాద్ అమ్మాయి ర్యాలీలతో కాస్త పోరాటం చేసినా.. బ్యాక్‌లైన్ గేమ్‌లో తప్పిదాలు మారిన్ ఆధిక్యాన్ని 6-2కు పెంచాయి. ఇదే జోరుతో మరో రెండు పాయింట్లు సాధించిన మారిన్ స్కోరు 9-2 ఉన్న దశలో సైనా షాట్‌ను రిటర్న్ చేసే క్రమంలో అదుపు తప్పింది. బలమంతా కుడి కాలు మీద పడటంతో మోకాలు మెలితిరిగింది. నొప్పితో విలవిలలాడిన స్పెయిన్ ప్లేయర్ కోర్టులోనే కూలబడింది. ప్రాథమిక చికిత్స అనంతరం తిరిగి మ్యాచ్‌ను మొదలుపెట్టినా నొప్పిని భరించలేకపోయింది. దీంతో స్కోరు 10-4 ఉన్న దశలో మారిన్ మ్యాచ్ నుంచి తప్పుకోవడంతో సైనాను విజేతగా ప్రకటించారు. దీంతో రెండేండ్ల తర్వాత సైనా తొలి బీడబ్ల్యూఎఫ్ టైటిల్‌ను చేజిక్కించుకుంది. చివరిసారి 2017లో మలేషియా ఓపెన్‌ను గెలుచుకుంది.

పుజార అజేయ సెంచరీ

కర్ణాటక: రంజీ ట్రోఫీలో సౌరాష్ట్ర జట్టు ఫైనల్ బెర్తుకు మరింత చేరువైంది. కర్ణాటక నిర్దేశించిన 279 పరుగుల లక్ష్యఛేదన కోసం దిగిన సౌరాష్ట్ర..పుజార(108 నాటౌట్) సెంచరీకి తోడు షెల్డన్ జాక్సన్(90 నాటౌట్) అర్ధసెంచరీతో 3 వికెట్లకు 224 పరుగులు చేసింది. వినయ్ కుమార్(2/48) ధాటికి 23 పరుగులకే దేశాయ్(9), పటేల్(0), జడేజా(0) వికెట్లు కోల్పోయిన సౌరాష్ట్రను పుజార సూపర్ సెంచరీతో ఆదుకున్నాడు. జాక్సన్‌తో కలిసి నాలుగో వికెట్‌కు 201 పరుగుల అజేయ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 237/8తో రెండో ఇన్నింగ్స్‌కు దిగిన కర్ణాటక మరో రెండు పరుగులు జతకలిపి 239 పరుగులకు ఆలౌటైంది. ధర్మేంద్రసిన్హ్ జడేజా(5/78) ఐదు వికెట్లతో రాణించాడు.



ఆదివారం నిజామాబాద్ జిల్లా నాగారంలో తెలంగాణ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలను ప్రారంభించి మాట్లాడుతున్న జాతీయ అథ్లెటిక్స్ కోచ్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేశ్.

రోస్టన్‌కు ఎనిమిది వికెట్లు

ఇంగ్లండ్‌పై విండీస్ ఘనవిజయం

బ్రిడ్జ్‌టౌన్: వెస్టిండీస్ విజయాల బాట పట్టింది. వరుస ఓటములతో కూనరిల్లుతున్న కరేబియన్లు ఎట్టకేలకు చిరస్మరణీయ విజయాన్ని చవిచూశారు. ఇంగ్లండ్‌తో జరిగిన తొలి టెస్ట్‌లో విండీస్ 381 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. సొంతగడ్డపై పరుగుల పరంగా ఇదే భారీ విజయం కాగా..ఓవరాల్‌గా మూడో అత్యుత్తమ గెలుపుగా రికార్డుల్లోకెక్కింది. మూడు టెస్ట్‌ల సిరీస్‌లో 1-0తో ముందంజ వేసింది. విండీస్ నిర్దేశించిన 628 పరుగుల లక్ష్యఛేదన కోసం నాలుగో రోజు(శనివారం) రెండో ఇన్నింగ్స్‌కు దిగిన ఇంగ్లండ్..ఆఫ్ స్పిన్నర్ రోస్టన్ చేజ్(8/60) ధాటికి 246 పరుగులకు కుప్పకూలింది. పిచ్ పరిస్థితులను తనకు అనుకూలంగా మలుచుకుంటూ రోస్టన్ సుడులు తిరిగే స్పిన్‌తో ఇంగ్లిష్ జట్టు పేకమేడను తలపించింది. చేజ్ స్పిన్ విజృంభణతో 31 పరుగుల తేడాతో ఆఖరి 6 వికెట్లను చేజార్చుకుంది. ఈ వెస్టిండీస్ స్పిన్నర్ కెరీర్‌లో ఇవే అత్యుత్తమ గణాంకాలు కావడం విశేషం. అజేయ డబుల్ సెంచరీతో రాణించిన జాసన్ హోల్డర్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

పీఎస్‌యూ బీమా సంస్థలకు సాయం

న్యూఢిల్లీ, జనవరి 27: రాబోయే బడ్జెట్‌లో ప్రభుత్వ రంగ జనరల్ ఇన్సూరెన్స్ సంస్థల కోసం రూ.4,000 కోట్ల మూలధన సాయాన్ని కేంద్రం ప్రకటించే అవకాశాలున్నాయి. 2019-20 ఆర్థిక సంవత్సరానికిగాను కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 1న ఈ టర్మ్‌లో తన చివరి బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబోతున్నది. ఎన్నికలకు ముందు వస్తున్న ఈ మధ్యంతర బడ్జెట్‌లో మూడు ప్రభుత్వరంగ బీమా సంస్థలైన నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ, ఒరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతో రూ.4 వేల కోట్ల నిధులను కేటాయించనున్నట్లు ఆర్థిక సేవల విభాగ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. అధిక క్లయిములు, నష్టాల మధ్య జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలు, ముఖ్యంగా ప్రభుత్వ రంగ బీమా సంస్థలు ఆర్థిక ఇబ్బందుల్ని చవిచూస్తున్న విషయం తెలిసిందే.

సీపీఎస్‌ఈల్లో ఈడబ్ల్యూఎస్ కోటా

న్యూఢిల్లీ, జనవరి 27: కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ (సీపీఎస్‌ఈ)ల ఉద్యోగాల్లో ఆర్థికంగా బలహీన వర్గాల (ఈడబ్ల్యూఎస్)కు 10 శాతం రిజర్వేషన్లు వచ్చే నెల నుంచి అమల్లోకి రానున్నాయి. ఖాళీల భర్తీ కోసం జరిగే అన్ని ప్రత్యక్ష నియామకాల్లో ఈ 10 శాతం కోటా ఫిబ్రవరి 1 నుంచి వర్తిస్తుందని ప్రభుత్వ రంగ సంస్థల శాఖ (డీపీఈ) తెలియజేసింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 339 సీపీఎస్‌ఈలున్నాయి. గతేడాది మార్చి 31 నాటికి వీటిలో మొత్తం పెట్టుబడుల విలువ రూ.13.73 లక్షల కోట్లపైమాటే. 2017-18 ఆర్థిక సంవత్సరం వివరాల ప్రకారం ఈ సంస్థల్లో 10.88 లక్షల మంది ఉద్యోగులున్నారు. క్యాజువల్, కాంట్రాక్టు కార్మికులు అదనం. 2016-17లో ఈ సంఖ్య 11.55 లక్షలుగా ఉన్నది.

నేడు బ్యాంక్ అధిపతులతో
పీయూష్ భేటీ



న్యూఢిల్లీ, జనవరి 27: కేంద్ర ఆర్థిక మంత్రిగా అదనపు పదవీ బాధ్యతలు నిర్వహిస్తున్న పీయూష్ గోయల్ ఆర్థికరంగం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై దృష్టి సారించారు. దీంట్లోభాగంగా సోమవారం బ్యాంకింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రభుత్వరంగ బ్యాంకుల అధిపతులతో ఆయన సమావేశంకాబోతున్నారు. సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతుండటం, మరోవైపు ఈ వారం చివర్లో ప్రవేశపెట్టనున్న మధ్యంతర బడ్జెట్‌కు ముందు జరుగుతున్న ఈ సమావేశం మరింత ప్రాధాన్యతను సంతరించుకున్నది. ఈ సమావేశానికి రిజర్వు బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ హాజరుకాబోతున్నారు. వచ్చే నెల 7న దాస్ తన తొలి పరపతి సమీక్షను ప్రకటించబోతున్నారు. క్యాన్సర్ వ్యాధి చికిత్సకోసం అమెరికాకు వెళ్లిన కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ స్థానంలో పీయూష్ గోయల్ ఈ బుధవారం అదనపు బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. ప్రధానంగా జరుగుతున్న ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వ పథకాల తీరుతెన్నులు, ఎంఎస్‌ఎంఈలకు రుణాల మంజూరు, మొండి బకాయిల సమస్య, బ్యాంకుల ఆర్థిక పరిస్థితి వంటి అంశాలపై చర్చించనున్నట్లు తెలుస్తున్నది. అంతేకాకుండా గడిచిన తొమ్మిది నెలలో దేశ ఆర్థిక పరిస్థితి గురించి సమీక్షించనున్నారు. మొండి బకాయిలను వసూలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన చర్యల వల్ల మార్చి 2018 నాటికి రూ.23 వేల కోట్లు వసూలయ్యాయి. ఇదే క్రమంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో రూ.60,700 కోట్లు రికవరీ చేశాయి బ్యాంకులు. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో వసూలైన దాంతో పోలిస్తే రెండింతలు పెరిగాయి. 31-90 రోజుల మధ్యకాలంలో రుణాలను తిరిగి చెల్లించని వాటిని నిరర్థక ఆస్తులుగా గుర్తించడంతో రికవరీ భారీగా పెరిగాయి, జూన్ 2017న రూ.2.25 లక్షల కోట్లుగా ఉన్న పీఎస్‌బీల మొండి బకాయిలు ఆ మరుసటి ఏడాది చివరినాటికి రూ.87 వేల కోట్లకు తగ్గాయి.

ఎయిర్ ఇండియాలోకి రూ.1,500 కోట్లు!



న్యూఢిల్లీ, జనవరి 27: నిధులు లేక సతమతమవుతున్న ప్రభుత్వరంగ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియాను ఆదుకోవడానికి సిద్ధమైంది కేంద్ర ప్రభుత్వం. ఈవారంలో సంస్థకు రూ.1,500 కోట్ల నిధులను కేటాయించే అవకాశం ఉన్నదని ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. సంస్థను ఆర్థికంగా ఆదుకోవడానికి రూ.2,345 కోట్ల నిధుల కేటాయింపునకు గత నెలలో పార్లమెంట్ ఆమోదం తెలిపింది. దీనిపై పౌర విమానయాన మంత్రిత్వ శాఖ అధికారి మాట్లాడుతూ..ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇలా నిధులను కేటాయించడం ఇది రెండోసారని పేర్కొన్నారు. ప్రస్తుతం సంస్థకు రూ.55 వేల కోట్ల అప్పు ఉన్నది.

అరబిందో 5 లక్షల బీపీ బాటిళ్ల రీకాల్

AUROBINDO

న్యూఢిల్లీ, జనవరి 27: ప్రముఖ ఔషధాల తయారీ సంస్థ అరబిందోకు అమెరికా నియంత్రణ మండలి యూఎస్‌ఎఫ్‌డీఏ గట్టి షాకిచ్చింది. అధిక రక్తపోటును నియంత్రించే ఔషధం ప్రస్తుత తయారీ మార్గదర్శకాలకులోబడి లేకపోవడంతో సంస్థ 5 లక్షల బాటిళ్ల ఈ మందులను వెనక్కి తీసుకుంటున్నట్లు సంస్థ ప్రకటించింది. వీటిలో 1,62,301 బాటిళ్ల అమ్లోడిపైన్, వాల్సర్టన్ ట్యాబ్లెట్లు ఉండగా, 3,12,095 బాటిళ్ల వాల్సర్టన్, హైడ్రోక్లోరోథైజ్డ్ ట్యాబ్లెట్లు కాగా, 20,604 బాటిళ్ల వాల్సర్టన్ ట్యాబ్లెట్లు ఉన్నాయి. ఈ మూడు రకాల ఔషధాలపై యూఎస్‌ఎఫ్‌డీఏ లేవనెత్తిన అభ్యంతరాలపై అరబిందో ఫార్మా యూఎస్‌ఈ రీకాల్ చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే లుపిన్ 7,215 బాటిళ్ల సెఫాలెక్సిన్‌ను రీకాల్ చేసింది.

ఇప్పట్లో రిటైర్ కాను: అనిల్ అగర్వాల్



న్యూఢిల్లీ, జనవరి 27: మైనింగ్ రంగానికి రారాజుగా వెలుగొందుతున్న అనిల్ అగర్వాల్..ఇప్పట్లో పదవీ విరమణ చేసే ఉద్దేశం కానీ లేదా నాన్-ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పదవిని చేపట్టే ఉద్దేశం లేదని స్పష్టంచేశారు. ప్రస్తుతం దూకుడు మీదున్న 1800 కోట్ల డాలర్ల విలువైన వేదాంత గ్రూపునుంచి తప్పుకోవడం మంచి పరిణామంకాదని ఆయన పేర్కొన్నారు. 64 ఏండ్ల వయస్సు కలిగిన అనిల్ అగర్వాల్ నాలుగు దశాబ్దాల క్రితమే గనుల వ్యాపారాన్ని ప్రారంభించారు. భారత కుబేరుల జాబితాలో ఆయన కూడా ఒకరు. పదవీ విరమణ చేసిన తర్వాత కుమారుడికిగాని, కుమార్తెను గానీ సంస్థలోకి తీసుకువచ్చే అవకాశాలు లేవని పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ప్రస్తుతం అగ్నివేష్(కుమారుడు), ప్రియా(కుమార్తె)లు వారివారి వ్యాపారాల్లో తనముఖలై ఉన్నారని, ప్రియా మాత్రం కంపెనీకి చెందిన కొన్ని కంపెనీల్లో బోర్డు సభ్యురాలుగా ఉన్నప్పటికీ, పూర్తిస్థాయిలో బాధ్యతలు స్వీకరించడానికి పెద్దగా ఆసక్తి చూపడం లేదన్నారు.

దర్యాప్తు అధికారి ఔట్

ఐసీఐసీఐ బ్యాంక్-వీడియోకాన్ కేసులో సమాచారం లీకు అనుమానాలు • దృష్టిసారించిన సీబీఐ.. ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ బదిలీ



న్యూఢిల్లీ, జనవరి 27: ఐసీఐసీఐ బ్యాంక్-వీడియోకాన్ రుణం కేసులో విచారణ రహస్యాలు లీకవుతున్నాయా?.. విలువైన సమాచారాన్ని సీబీఐ అధికారులే బయటకు పంపిస్తున్నారా?.. అంటే అవుననే అనుమానాలే వ్యక్తమవుతున్నాయి. ఈ కేసు ఇన్వెస్టిగేషన్ అధికారిని సీబీఐ బదిలీ చేయడం ఇందుకు బలం చేకూరుస్తున్నది మరి. ఎస్పీ సుధాంశు ధర్ మిశ్రాను జార్ఖండ్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. ఢిల్లీలోని బ్యాంకింగ్, సెక్యూరిటీస్ మోసాల విభాగం నుంచి రాంచీలోని ఆర్థిక నేరాల శాఖకు పంపించారని ఆదివారం సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ కేసులో ఐసీఐసీఐ బ్యాంక్ మాజీ సీఈవో చందా కొచ్చర్, ఆమె భర్త దీపక్ కొచ్చర్, వీడియోకాన్ గ్రూప్ ఎండీ వేణుగోపాల్ ధూత్‌లపై సీబీఐ ఈ నెల 22న ఎఫ్ఐఆర్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. మరికొన్ని సంస్థల పేర్లనూ ఎఫ్ఐఆర్‌లో పెట్టిన సంగతీ విదితమే. అయితే మిశ్రా తీరుపై ముందు నుంచే అనుమానాలున్న సీబీఐ.. 23న ఆయన్ను బదిలీ చేసేసింది. ఎఫ్ఐఆర్‌పై ఆయన సంతకమే ఉండగా, సోదాలకు సంబంధించిన కీలక సమాచారం లీకవ్వకూడదనే మిశ్రాను సాగనంపింది. 24న ఈ కేసు కొత్త దర్యాప్తు అధికారి మోహిత్ గుప్తా నేతృత్వంలో పలుచోట్ల తనిఖీలు జరిగినది తెలిసిందే. కాగా, బీఎస్ అండ్ ఎఫ్‌సీ జాయింట్ డైరెక్టర్ ప్రవీణ్ సిన్హాను కూడా సీబీఐ బదిలీ చేసింది. ఈయన స్థానంలో వీ మురుగేషన్‌ను నియమిస్తున్నట్లు ప్రకటించింది.

ముందు నుంచే అనుమానాస్పదం

కాగా, ఎలాంటి కారణం లేకుండానే కేసు ప్రాథమిక విచారణను మిశ్రా పెండింగ్‌లో పెట్టారని సీబీఐ వర్గాలు చెబుతున్నాయి. ఇందుకు సంబంధించి మిశ్రాపై బలమైన ఆరోపణలే వినిపిస్తుండటం గమనార్హం. ఈ క్రమంలోనే ఆయన్ను బదిలీపై పంపగా, కొత్త అధికారి చేతికి బాధ్యతల్ని అప్పగించారని సీబీఐ వర్గాలు అంటున్నాయి. వీడియోకాన్ గ్రూప్‌నకు రుణాల మంజూరులో చందా కొచ్చర్ క్విడ్‌ప్రోకో (నీకిది-నాకది) ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. బ్యాంకింగ్ నిబంధనలను ఉల్లంఘించి స్వప్రయోజనాల కోసం కొచ్చర్.. వీడియోకాన్ గ్రూప్‌నకు రూ.3,250 కోట్ల రుణాలను మంజూరు చేశారని ఆరోపణలుండగా, బ్యాంక్ ఎండీ, సీఈవో పదవులనూ కోల్పోయారు.

అవినీతి ప్రకంపనలు

సీబీఐలో అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు రావడం ఇది రెండోసారి. గతేడాది అక్టోబర్‌లో సీబీఐలో నెంబర్ 2గా ఉన్న రాకేశ్ ఆస్థానాపై ఓ కేసులో భాగంగా లంచం ఆరోపణలు వచ్చినది విదితమే. ఇది సీబీఐలోని ఇద్దరు అత్యున్నత అధికారుల మధ్య గొడవలకు దారితీసింది కూడా. ఈ నేపథ్యంలో ఇప్పుడు మిశ్రా వ్యవహారం సీబీఐని ఇబ్బంది పెడుతుండగా, దీనిపై సమగ్ర విచారణ చేపడుతున్నామని సీబీఐ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ఐసీఐసీఐ కేసు నెలల తరబడి ఎలాంటి పురోగతి లేకపోవడం కూడా మిశ్రా అవినీతిపై అనుమానాల్ని రేకెత్తిస్తున్నాయి. ఇదిలావుంటే ఐసీఐసీఐ కేసులో ఎఫ్ఐఆర్ నమోదైన రెండు రోజుల తర్వాత కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ.. సీబీఐలో అవినీతి ఆరోపణలపట్ల ట్విట్టర్ వేదికగా స్పందించారు. అత్యాశ, ఉన్మాదం.. దర్యాప్తు అధికారుల నిజాయితీ, నైపుణ్యాన్ని కమ్మేస్తున్నాయని వ్యాఖ్యానించారు.

బడ్జెటే కీలకం..

మార్కెట్లకు దిశానిర్దేశం చేయనున్న ఆర్థిక ఫలితాలు



న్యూఢిల్లీ, జనవరి 27: ఈవారంలో స్టాక్ మార్కెట్లు తీవ్ర ఆటుపోటులకు గురయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరానికిగాను నరేంద్ర మోదీ సర్కార్ ప్రవేశపెట్టనున్న మధ్యంతర బడ్జెట్‌తో పాటు పలు కార్పొరేట్ల ఆర్థిక ఫలితాలు విడుదల చేయనుండటం, అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను మరోదఫా పెంపు వంటి నిర్ణయాలు స్టాక్ మార్కెట్లకు దిశానిర్దేశం చేయనున్నాయని మార్కెట్ విశ్లేషకులు అంచనావేస్తున్నాయి. అమెరికా-చైనా దేశాల మధ్య వాణిజ్య యుద్ధమేఘాలు కమ్ముకుంటుండటం, దేశ వృద్ధిపై పెట్టుబడిదారుల్లో నెలకొన్న ఆందోళనల నేపథ్యంలో సూచీలు తిరోగమనబాట పట్టే అవకాశం ఉన్నదని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. బడ్జెట్‌తో పాటు ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ(ఎఫ్‌వోఎంసీ) కమిటీ సమావేశం, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, ఐవోసీ, హెచ్‌సీఎల్‌ల మూడో త్రైమాసికానికి ప్రకటించనున్న ఆర్థిక ఫలితాలు కూడా కీలకం కానున్నాయి. ఇప్పటి వరకు ప్రకటించిన ఏ సంస్థ కూడా ఆశాజనక ఆర్థిక ఫలితాలను ప్రకటించలేకపోవడంతో స్టాక్ మార్కెట్లలో అనిశ్చిత పరిస్థితి నెలకొంది. వీటికితోడు అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు పెరుగుతుండటం కూడా పెట్టుబడిదారుల్లో ఆందోళనను మరింత తీవ్రతరం చేసింది. దీంతో గడిచిన రెండు వారాల్లో సూచీలు భారీ నష్టాలను మూటగట్టుకున్నాయి. ఈవారంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్, యాక్సిస్, బ్యాంక్ ఆఫ్ బరోడా, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, హెచ్‌డీఎఫ్‌సీ, బజాజ్ ఆటో, ఐసీఐసీఐ బ్యాంక్, హీరో మోటోకార్ప్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్, ఎస్‌బీఐ వంటి బ్లూచిప్ కంపెనీలు తమ మూడో త్రైమాసికపు ఫలితాలను విడుదల చేయబోతున్నాయి. 2019-20 ఆర్థిక సంవత్సరానికిగాను కేంద్ర సర్కార్ ఫిబ్రవరి 1న మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం ఉన్నది. విదేశీ నిధుల ప్రవాహంపై పెట్టుబడిదారులు దృష్టి సారించనున్నారు. ప్రస్తుత నెలకుగాను డెరివేటివ్ కాంట్రాక్టు గడువు గురువారంతో ముగియనుండటం, తయారీ రంగానికి సంబంధించి పీఎంఐ డాటా శుక్రవారం విడుదల కానుండటం సూచీలపై ప్రభావం చూపనున్నాయి. గడిచిన వారంలో సెన్సెక్స్ 361 పాయింట్లు, నిఫ్టీ 126 పాయింట్లు నష్టపోయాయి.

పదింటిలో నాలుగు...

గడిచిన వారంలో స్టాక్ మార్కెట్లో లిస్టైన టాప్-10 కంపెనీల్లో నాలుగింటి మార్కెట్ క్యాపిటలైజేషన్ విలువ రూ.54,456.69 కోట్ల మేర పెరిగింది. వీటిలో ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ అత్యధికంగా లాభపడింది. ఆర్ఐఎల్‌తోపాటు టీసీఎస్, హెచ్‌యూఎల్, కొటక్ మహీంద్రా బ్యాంక్ లాభపడగా..హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐటీసీ, హెచ్‌డీఎఫ్‌సీ, ఇన్ఫోసిస్, ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంకులు భారీగా నష్టపోయాయి. ఆర్ఐఎల్ నికర విలువ రూ.40,123 కోట్లు పెరుగగా, టీసీఎస్ రూ.6,998 కోట్లు, కొటక్ మహీంద్రా రూ.5,321.77 కోట్లు, హెచ్‌యూఎల్ రూ.2,013 కోట్లు మేర పెరిగాయి.

ఆకట్టుకోని గోల్డ్ ఈటీఎఫ్‌లు

గతేడాది గోల్డ్ ఎక్స్చేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్) నుంచి మదుపరులు రూ.570 కోట్లకుపైగా పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. ఇలా పెట్టుబడులను వెనుకకు తీసుకోవడం వరుసగా ఇది ఆరో ఏడాది కావడం గమనార్హం. కాగా, 2017తో పోల్చితే గోల్డ్ ఫండ్స్ ఆధ్వర్యంలోని ఆస్తుల విలువ 2018లో 6 శాతం పడిపోయి రూ.4,571 కోట్లకు చేరిందని ఆంఫీ లెక్కలు చెబుతున్నాయి.

కొనసాగుతున్న ఎఫ్‌పీఐల ఉపసంహరణ

విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల(ఎఫ్‌పీఐ) నిధుల ఉపసంహరణ కొనసాగుతున్నది. ప్రస్తుత నెలలో ఇప్పటివరకు దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి ఎఫ్‌పీఐలు రూ.6 వేల కోట్లను తరలించుకుపోయారు. భవిష్యత్తులో మరిన్ని నిధులు తరలించుకుపోయే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. గతేడాది అక్టోబర్‌లో రూ.28,900 కోట్లను ఉపసంహరించుకున్న ఎఫ్‌పీఐలు..ఆ మరుసటి రెండు నెలల్లో రూ.8,584 కోట్ల మేర నిధులను దేశీయ డెబిట్, ఈక్విటీ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టారు. జనవరి 1-25 మధ్యకాలంలో ఎఫ్‌పీఐలు రూ.5,880 కోట్ల నిధులను ఉపసంహరించుకున్నట్లు స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ వద్ద ఉన్న సమాచారం మేరకు తెలిసింది. అంతర్జాతీయ దేశాల్లో జరుగుతున్న పరిణామాలకు తోడు దేశీయ సార్వత్రిక ఎన్నిలకు దగ్గర పడుతుండటంతో ఇన్వెస్టర్లలో ఆందోళను మరింత తీవ్రతరం చేసిందని వినోద్ నాయర్ అభిప్రాయపడ్డారు. నూతన సంవత్సరం తొలి నెలలోనే ఎఫ్‌పీఐలు నిధులను తరలించుకోవడం దేశ ఆర్థిక వ్యవస్థకు మంచిదికాదని, భవిష్యత్తులో వేచి చూసి దోరణిలో వారు ఉండే అవకాశం ఉందన్నారు. క్రూడాయిల్ ధరలు, రూపాయి గమనం, దేశీయ ఆర్థిక స్థితిగతులు, గ్లోబల్ ట్రేడ్‌వార్‌తో ఎఫ్‌పీఐల్లో ఆందోళన నలెకొన్నదని ఆయన పేర్కొన్నారు.

భారత్‌కు అప్పగించం!

- చోక్సీ ఇప్పుడు ఆంటిగ్వా పౌరుడు
- ఆయన్ను బలవంతంగా తీసుకుపోలేరు
- అక్కడి సీనియర్ ప్రభుత్వ అధికారి వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, జనవరి 27: 'మెహుల్ చోక్సీ ఇప్పుడు ఆంటిగ్వా పౌరుడు. ఆయన్ను బలవంతంగా ఎవరూ భారత్‌కు తీసుకుపోలేరు' అని ఆంటిగ్వా-బార్బుడా ప్రధాని కార్యాలయం సిబ్బంది చీఫ్ మ్యాక్స్ హర్స్‌ట్ అన్నారు. చోక్సీని అరెస్టు చేయడానికి కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) వర్గాలు ప్రత్యేక ఎయిర్ ఇండియా విమానంలో వస్తున్నారన్న వార్తల నేపథ్యంలో ఓ జాతీయ మీడియా చానెల్‌తో హర్స్‌ట్ పైవిధంగా స్పందించారు. అంతేగాక భారత దర్యాప్తు సంస్థల అధికారులు కరేబియన్ దీవులకు రావచ్చన్న సమాచారం తమకు లేదన్న ఆయన బహుశా వెస్టిండీస్‌లో ఈ నెలాఖరున ప్రారంభమయ్యే క్రికెట్ మ్యాచ్‌లను చూడటానికి భారతీయులు వస్తున్నారేమోనని వ్యాఖ్యానించారు. అయితే ఇందులో ఎవరైనా భారత ప్రభుత్వ అధికారులు ఉన్నారా? అన్నది తమకు తెలియదని సెయింట్ జోన్స్ నుంచి టెలిఫోన్‌లో ఇండియా టుడే టీవీకి హర్స్‌ట్ చెప్పారు. మొత్తానికి ఓ చార్టెడ్ ఎయిర్‌క్రాఫ్ట్‌లో క్రికెట్ మ్యాచ్‌ను వీక్షించేందుకు ఇండియా నుంచి వస్తుండటం బాగుందన్నారు.

భారత పౌరసత్వాన్ని వదులుకున్నాడు

మెహుల్ చోక్సీ భారత పౌరసత్వాన్ని వదులుకున్నాడని హర్స్‌ట్ స్పష్టం చేశారు. 59 ఏండ్ల చోక్సీ గతేడాది ఆంటిగ్వా పౌరసత్వాన్ని పొందగా, అప్పుడే గయానాలోని భారత హైకమిషన్‌కు తన రద్దయిన ఇండియన్ పాస్‌పోర్టు (జెడ్3396732)ను అప్పగించేశాడని గుర్తుచేశారు. ఈ క్రమంలో 177 డాలర్ల ఫీజునూ చోక్సీ చెల్లించాడని చెప్పారు. తనను అప్పగించాలన్న భారత్ అభ్యర్థనపైనా ఆంటిగ్వా కోర్టుల్లో చోక్సీ న్యాయపోరాటం చేస్తున్నట్లు తెలిపారు. 2017 నవంబర్‌లో పెట్టుబడుల ద్వారా ఆంటిగ్వా పౌరసత్వం కోసం చోక్సీ ప్రయత్నించగా, 2018లో అది దక్కింది. జూలైలో చోక్సీ తమ దేశంలోనే ఉన్నాడని ఆంటిగ్వా అధికార వర్గాలు ధ్రువీకరించాయి. నిరుడు జనవరిలో కుటుంబంతో సహా చోక్సీ దేశం విడిచి పారిపోయిన సంగతి విదితమే. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) రూ.14,000 కోట్ల కుంభకోణంలో గీతాంజలి జెమ్స్ అధినేత మెహుల్ చోక్సీ ప్రధాన నిందితుల్లో ఒకరిగా ఉన్న విషయం తెలిసిందే. దేశీయ బ్యాంకింగ్ చరిత్రలోనే అతిపెద్దదిగా చెప్పుకోబడుతున్న పీఎన్‌బీ స్కాంలో చోక్సీ మేనల్లుడు, వజ్రాల వ్యాపార సంస్థ ఫైర్‌స్టార్ డైమండ్ అధిపతి నీరవ్ మోదీ కూడా ప్రధాన నిందితుడేనన్నదీ విదితమే. కాగా, బ్యాంకులకు రూ.7,000 కోట్లను ఎగవేసి పారిపోయిన విన్సమ్ డైమండ్స్ అధినేత జతిన్ మెహతా కూడా కరేబియన్ దీవుల్లోనే ఉన్నాడని తెలియడంతో చోక్సీ, మెహతాల కోసం సీబీఐ, ఈడీలు అక్కడికి వెళ్లాలని చూస్తున్నారు. తిరుగు ప్రయాణంలో ఐరోపాలో ఉన్నాడని తెలుస్తున్న నీరవ్ మోదీ కోసం కూడా గాలింపులు చేపట్టనున్నారు. భారత్‌తో ఎలాంటి ఒప్పందాలు లేకపోవడంతో కరేబియన్ దీవుల పౌరసత్వాన్ని పొందుతూ ఆర్థిక నేరగాళ్లు తప్పించుకుంటున్నారు. వీరిని రప్పించడం భారత్‌కు తలనొప్పిగా పరిణమిస్తున్నది.

రూ.3.73 లక్షల కోట్లు

- 2020 నాటికి చేరుకోనున్న మీడియా-ఎంటర్‌టైన్‌మెంట్ రంగం
- అసోచామ్-పీడబ్ల్యూసీ సంయుక్త సర్వే వెల్లడి




న్యూఢిల్లీ, జనవరి 27: దేశంలో మీడియా-ఎంటర్‌టైన్‌మెంట్ రంగం శరవేగంగా పుంజుకుంటున్నది. 2022 నాటికి ఈ రంగం 52,683 మిలియన్ డాలర్లకు చేరుకోనుందని ఒక సర్వే వెల్లడించింది. మన కరెన్సీలో ఇది రూ.3.73 లక్షల కోట్లు. రోజురోజుకు సంపాదన పెరుగుతుండటం, జనాభా, అన్ని ఫార్మెట్లలో కంటెంట్ వినియోగం ఊపందుకోవడం ఈ రంగం పుంజుకోవడానికి ప్రధాన కారణమని అసోచామ్-పీడబ్ల్యూసీ సంయుక్త సర్వే విశ్లేషించింది. సంప్రదాయక మీడియాలో టీవీ, సినిమాలు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో ఓవర్-ది-టాప్(ఓటీటీ) సేవలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపింది. వచ్చే నాలుగేండ్లకాలంలో దేశీయ వీడియో ఓటీటీ మార్కెట్... టాప్-10 ప్రపంచ మార్కెట్లో ఒకటిగా ఉండనున్నదని తెలిపిన సర్వే..2022 నాటికి ఓటీటీ మార్కెట్ 823 మిలియన్ డాలర్లకు(రూ.5,363 కోట్లు) ఎగబాకనున్నదని పేర్కొంది. 2017లో 11.7 శాతం వృద్ధితో 30,364 మిలియన్ డాలర్లుగా ఉన్న మీడియా-ఎంటర్‌టైన్‌మెంట్ ఇండస్ట్రీ..2022 నాటికి 52,683 మిలియన్ డాలర్లకు చేరుకోనున్నదని నివేదిక అంచనావేస్తున్నది. ప్రతియేటా సగటున రెండంకెల వృద్ధిని నమోదు చేసుకుంటున్నదని పేర్కొంది. వచ్చే నాలుగేండ్లలో కూడా మొత్తం ఎంటర్‌టైన్‌మెంట్ ఇండస్ట్రీలో టీవీ, సినిమా, ఓటీటీల వాటా 46 శాతంగా ఉండనున్నదని తెలిపింది. ఓటీటీ సేవలతో పాటు వీడియో-ఆన్-డిమాండ్(వీవోడీ)లు కీలక పాత్ర పోషిస్తున్నాయని, అలాగే ప్రొడక్షన్ బడ్జెట్ కంపెనీలైన నెట్‌ఫ్లిక్స్, అమెజాన్‌లు సంప్రదాయక స్టూడియోలను ఏర్పాటు చేయడం కూడా పోటీ మరింత పెరుగడానికి ప్రధాన కారణమని పీడబ్ల్యూసీ ఇండియా పార్టనర్ ఫ్రాంక్ డీసౌజా తెలిపారు.

సర్వేలోని పలు ముఖ్యాంశాలు..

- అంతర్జాతీయంగా ఓటీటీ మార్కెట్ 10.1 శాతం వృద్ధిని నమోదు చేసుకోనున్నది.
- భారత్ విషయానికి వస్తే 297 మిలియన్ డాలర్ల(రూ.1,932 కోట్లు) నుంచి 823 మిలియన్ డాలర్లకు(రూ.5,363 కోట్లు) చేరుకోనున్నది. సగటున 22.6 శాతం వృద్ధి నమోదవనున్నది.
- వీటిలో వీవోడీ చందదారులు కీలకపాత్ర పోషించనున్నారు. గడిచిన పదేండ్లలోప్రపంచవ్యాప్తంగా వీవోడీకి మంచి డిమాండ్ నెలకొన్నది.
- భారత్‌లో అత్యధిక వృద్ధిని నమోదు చేసుకుంటున్న మొబైల్ వీడియో అడ్వర్టైజింగ్ సగటున 32.8 శాతం వృద్ధితో 317 మిలియన్ డాలర్లకు(రూ.2,064 కోట్ల) చేరుకోనుందన్న అంచనా.
- డాటా వినిమయం 71,67,103 మిలియన్ల మెగాబైట్ల నుంచి 10,96,58,793 మిలియన్ మెగాబైట్లకు చేరుకోనున్నది.
- డాటా టారిఫ్ ధరలు తక్కువగా ఉండటం, స్మార్ట్‌ఫోన్ల వినిమయం ఊపందుకోవడంతో వీవోడీ అభివృద్ధిదారులకు ప్రయోజనం చేకూరనున్నది.
- తలసరి భారతీయుడిపై పెట్టే ఖర్చు 32 డాలర్లకు చేరుకోనున్నది. ఇది చైనాలో పెడుతున్న 222 డాలర్‌తో పోలిస్తే చాలా తక్కువ.

కస్టమర్లకు లాభం

- రిలయన్స్ ఈ-కామర్స్ ప్రవేశంపై మోహన్‌దాస్ పాయ్
- ధరలు మరింత తగ్గవచ్చునని అంచనా



బెంగళూరు, జనవరి 27: దేశీయ ఈ-కామర్స్ రంగంలోకి రిలయన్స్ ఇండస్ట్రీస్ రాకను ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్‌వో టీవీ మోహన్‌దాస్ పాయ్ స్వాగతించారు. ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) ఆన్‌లైన్ మార్కెట్‌లోకి రావడం వల్ల వినియోగదారులకు పెద్ద ఎత్తున లాభమని అభిప్రాయపడ్డారు. ఆయా ఉత్పత్తుల ధరలు మరింత తగ్గవచ్చునన్న ఆయన.. విదేశీ సంస్థల ఆధిపత్యానికీ బ్రేకులు పడవచ్చునని అంచనా వేశారు. 'అన్ని విధాలుగా బలంగా ఉన్న రిలయన్స్ రాకతో డిజిటల్ రంగంలో గొప్ప మార్పులే కనిపించవచ్చు. విదేశీ సంస్థల ప్రాబల్యం తగ్గిపోవచ్చు. పోటీ పెరిగి వినియోగదారులకు లాభం చేకూరుతుంది' అని పీటీఐకిచ్చిన ఓ ఇంటర్వ్యూలో పాయ్ అన్నారు. 'రిలయన్స్ నిజంగా బలమైన సంస్థ. పెట్టుబడి, సాంకేతికత, నెట్‌వర్క్స్, ఔట్‌లెట్లు, దూరదృష్టి వంటి అంశాల్లో ఏ సంస్థకైనా గట్టి పోటీనివ్వగలదు' అన్నారు.

జియోతో చక్కని అవకాశం

ఆన్‌లైన్ మార్కెట్‌లోకి రావాలన్న ముకేశ్ అంబానీ ఆలోచనకు జియో ఊతమివ్వగలదని పాయ్ ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. దేశీయ టెలికం రంగంలో 4జీ సేవలతో రిలయన్స్ జియో సృష్టించిన సంచలనాలు తెలిసిందే. ఇంటర్నెట్‌ను అందరి చెంతకు చేర్చిన ఘనత జియోదేనంటే అతిశయోక్తి ఎంతమాత్రం కాదు. దేశవ్యాప్తంగా జియో సేవలు అందుబాటులో ఉండగా, ఇంటర్నెట్ ఆధారిత ఈ-కామర్స్ మార్కెట్‌లోకి రిలయన్స్ వస్తే.. దేశ ఆన్‌లైన్ మార్కెట్ స్వరూపం కూడా మారిపోగలదని పాయ్ అన్నారు. జియోకున్న వినియోగదారుల సంఖ్య రిలయన్స్ ఆన్‌లైన్ కొనుగోళ్లకూ దోహదం చేస్తుందని పేర్కొన్నారు. ఇటీవలి వైబ్రంట్ గుజరాత్ సమ్మిట్‌లో ముకేశ్ అంబానీ మాట్లాడుతూ.. 'భారత్‌ను విదేశీ సంస్థల చేతుల్లో పెట్టకూడదు' అంటూ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆన్‌లైన్-టు-ఆఫ్‌లైన్ వేదిక ఏర్పాటు యోచనలో ఉన్నామని చెప్పిన సంగతీ విదితమే.

ప్రత్యర్థులకు గట్టి పోటీనే

నానాటికి వృద్ధి చెందుతున్న భారతీయ రిటైల్ మార్కెట్‌లో ఆన్‌లైన్ వ్యాపారం వాటా అంతాఇంతా కాదు. అమెజాన్, వాల్‌మార్ట్ తదితర విదేశీ సంస్థల పెత్తనం ఎక్కువైపోతున్న తరుణంలో రిలయన్స్ వంటి దిగ్గజం రాక మొత్తం ఈ-కామర్స్ మార్కెట్ ముఖచిత్రాన్నే మార్చివేయగలదన్న అభిప్రాయాలు సర్వత్రా వినిపిస్తున్నాయి. చైనా ఆన్‌లైన్ మార్కెట్ దిగ్గజం అలీబాబా మాదిరి సంస్థ రిలయన్స్ కాగలదన్న అంచనాలూ వ్యక్తమవుతున్నదీ విదితమే. ఈ క్రమంలో రిలయన్స్ రాకతో ముఖ్యంగా సరఫరా వ్యవస్థ బలపడుతుందని, చిన్నచిన్న గ్రామాలకూ ఆన్‌లైన్ మార్కెట్ విస్తరించే అవకాశాలున్నాయంటున్నారు పాయ్. ఇప్పటికే భారీ డిస్కౌంట్లతో తీవ్ర పోటీ ఉన్న ఆన్‌లైన్ మార్కెట్‌లోకి రిలయన్స్ వస్తే మరిన్ని రాయితీలకు దారితీయవచ్చునని, ధరలు పడిపోయి, కస్టమర్లకు విపరీతమైన లాభం చేకూరే వీలుందన్నారు.

బతుకుదారి తెలిసిందక్కడే!

జ్ఞాపకాలు నెమరువేసుకున్న నాగార్జునసాగర్ ఏపీఆర్జేసీ పూర్వ విద్యార్థులు

సోమాజిగూడలో అలుమ్ని అసోసియేషన్ ప్రత్యేక సమ్మేళనం

రూ.1.65 కోట్లతో లైబ్రరీ, మౌలిక వసతులు కల్పిస్తామని వెల్లడి

ఖైరతాబాద్:

ఎందరో ప్రముఖులను ప్రపంచానికి అందించిన కళాశాల అది. వేలాది మంది విద్యార్థుల ఉన్నత ప్రయాణానికి వేదిక అది. అదే నాగార్జునసాగర్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ. టీచర్లు, డాక్టర్లు, ఇంజినీర్లు, లాయర్లు, పోలీసు ఉన్నతాధికారులు, రాజకీయ నేతలు.. ఇలా అనేక రంగాల ప్రముఖులు ఆ చదువులమ్మ చెట్టు నీడలో ఎదిగినవారే. తెలంగాణ డీజీపీ మహేందర్‌రెడ్డి సైతం ఈ కాలేజీ విద్యార్థే. వారంతా తమ ఉన్నతికి కారణమైన విద్యాసంస్థను అభివృద్ధి చేయాలని సంకల్పించారు. పూర్వ విద్యార్థుల సంఘం(అలుమ్ని అసోసియేషన్)గా ఏర్పడ్డారు. కాలేజీలో మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నారు. ఆదివారం అలుమ్ని అసోసియేషన్ సభ్యులు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటుచేసుకున్నారు. వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఒకేచోటికి చేరి మరోసారి తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆఫ్ఘనిస్థాన్‌లోని కాబుల్‌లో ఇటీవల జరిగిన ఉగ్రవాదుల బాంబు దాడిలో అమరుడైన ఐఎఫ్‌ఎస్ అధికారి వీ వెంకటేశ్వర్‌రావు ఈ కాలేజీ విద్యార్థే. ఆయనకు కేంద్ర ప్రభుత్వం కీర్తిచక్ర ప్రకటించింది. సమావేశంలో భాగంగా అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఏ సత్యనారాయణ, అధ్యక్షుడు ఏ సైదారెడ్డి, ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎంబీవీ ప్రసాద్, కార్యదర్శి నాగాచారి, గోపాల్‌రావు, డాక్టర్ వివేక్‌వర్ధన్, డాక్టర్ చంద్రకాంత్ తదితరులు వెంకటేశ్వర్‌రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశ, విదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులందరం కలిసి రూ.1.65 కోట్లు సేకరించామని, లైబ్రరీ, ఓపెన్ ఎయిర్ థియేటర్ నిర్మాణం చేపట్టామని, మరమ్మతులు చేయిస్తున్నామని, ఫర్నిచర్ సమకూర్చుతున్నామని తెలిపారు. మాజీ ఫిజికల్ డైరెక్టర్ సీ చంద్రకాంత్‌రెడ్డి స్మారకార్థం స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించనున్నట్టు చెప్పారు.



కాబుల్‌లో ముష్కరుల దాడిలో వీరమరణం పొందిన వీవీ (వీ వెంకటేశ్వర రావు) చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఏపీఆర్జేసీ పూర్వ విద్యార్థులు

రేకుల షెడ్డు కిందే చదువుకున్నాం



నేను 1975-77 మొదటి బ్యాచ్‌లో చదివాను. రేకుల షెడ్డు ఉండేది. చదువు మాత్రం కార్పొరేట్ విద్యకంటే అత్యున్నతంగా ఉండేది. విలువలతో కూడిన విద్య అందించడం మా ఉన్నతికి దోహదపడింది. 1987లో గ్రూప్-1 పరీక్షలు రాసి డీఎస్పీగా ఎంపికయ్యాను. ఏపీ ఆర్జేసీలో చదువడం నా అదృష్టంగా భావిస్తున్నా. పీవీ నరసింహారావు నాడు నాటిన మొక్క నేడు వృక్షంగా ఎదిగి ఎందరో విద్యార్థులకు దారిచూపింది. నాతోపాటు చదువుకున్నవారెందరో వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. మా కాలేజీ అభివృద్ధికి సహకారం అందించడం ధర్మంగా భావిస్తున్నాను.

- మల్లారెడ్డి, తెలంగాణ పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ డైరెక్టర్

అటానమస్ స్టేటస్ తీసుకొస్తాం



మాది 1978-80 బ్యాచ్. ప్రస్తుతం మహావీర్ దవాఖానలో దంత వైద్య నిపుణుడిగా పనిచేస్తున్నాను. డీజీపీ మహేందర్‌రెడ్డి నా సహ విద్యార్థి. ఈ కాలేజీకి చెందిన దాదాపు 1,500 మంది విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా స్థిరపడ్డారు. ఎందరినో ఉన్నతులుగా తీర్చిదిద్దిన ఈ కాలేజీ అభివృద్ధే లక్ష్యంగా పెట్టుకున్నాం. అలుమ్ని తరఫున దాదాపు రూ.1.5 కోట్లు సేకరించాం. పదో షెడ్యూల్‌లో ఉన్న ఈ కళాశాలను అటానమస్ స్థాయికి తీసుకురావాలన్నది మా అసోసియేషన్ లక్ష్యం.

- డాక్టర్ చంద్రకాంత్, దంత వైద్య నిపుణుడు

ఏపీఆర్జేసీలో చదువడం నా అదృష్టం



1981-83లో నాగార్జునసాగర్ ఏపీఆర్జేసీలో సీఈసీ చదివాను. ఈ కాలేజీలో చదువుకోవడం నా అదృష్టం. అక్కడ నేర్చుకున్న విద్యే నేను జర్నలిస్టుగా, బ్యాంకు మేనేజర్‌గా ఎదిగేందుకు దోహదపడింది. నేను వివిధ పత్రికల్లో పనిచేశాను. సేవింగ్స్, బ్యాంకింగ్, మ్యూచువల్ ఫండ్స్, జీవిత బీమా తదితర అంశాలతో కూడిన మనీ పర్స్ పేరుతో మూడు పుస్తకాలు రాశాను.

- రాజేంద్రప్రసాద్, ఎస్బీఐ మేనేజర్

ప్రత్యేక గౌరవం ఇచ్చేవారు



1975-77 మొదటి బ్యాచ్ విద్యార్థిని నేను. పదో తరగతిలో రాష్ట్రస్థాయిలో టాప్ ర్యాంకులు సాధించినవారికే ఈ కాలేజీలో సీటు దొరికేది. అధ్యాపకులు మమ్మల్ని ఎంతో ప్రోత్సహించేవారు. సబ్జెక్టుకే పరిమితం కాకుండా విలువలతో కూడిన విద్యనందించేవారు. ఏపీఆర్జేసీలో చదివినవారికి దేశంలో ఎక్కడికి వెళ్లినా ప్రత్యేక గౌరవం దక్కేది. నేను 1983లో ఐఆర్ఎస్‌గా ఎంపికై రైల్వేలో చేరాను. దక్షిణమధ్య రైల్వేలో చీఫ్ జనరల్ మేనేజర్‌గా రిటైర్ అయ్యాను.

- లక్ష్మీనారాయణ, మాజీ చీఫ్ జనరల్ మేనేజర్, దక్షిణమధ్య రైల్వే

గల్లీల్లో పక్కాగా గస్తీ

- 'ఎలక్ట్రానిక్ బీట్ సిస్టం'తో పెరిగిన విజిబుల్ పోలీసింగ్
- పోలీస్ స్టేషన్ల పరిధిలోని ముఖ్యమైన పాయింట్లు జియోట్యాగ్
- ప్రజల్లో భరోసా నింపుతున్న నూతన విధానం



ట్యాబ్ ద్వారా టీఎస్‌కాప్ యాప్‌లో గస్తీ వివరాలు నమోదు చేస్తున్న బ్లూకోట్స్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: యూనిఫాంలో ఉన్న పోలీసు అధికారి రోజూ వీధుల్లో కనిపిస్తుంటే సామాన్యులకు భరోసా పెరుగడంతోపాటు తప్పుచేసేవారిలో భయం కలుగుతుంది. ఈ ఆలోచనతోనే చాలా ఏండ్లుగా బీట్ విధానాన్ని అమలుచేస్తున్నారు. బీట్ కానిస్టేబుల్ వచ్చి ఆ ప్రాంతంలో గస్తీ నిర్వహించి అక్కడే పాయింట్‌బుక్‌లో సంతకాలు చేసి, వారు వచ్చినట్టుగా స్థానికులతో సంతకం చేయించుకొని వెళ్తుంటారు. ఈ విధానాన్ని సులభతరం చేసేలా.. పోలీసు గస్తీ పెరిగేలా డీజీపీ మహేందర్‌రెడ్డి 'ఎలక్ట్రానిక్ బీట్ సిస్టం' ప్రవేశపెట్టారు. ఇందులోభాగంగా పెట్రోలింగ్ కార్లు, బ్లూ కోల్ట్స్ సిబ్బంది వారి పోలీసు స్టేషన్ల పరిధిలో గుర్తించిన పాయింట్లకు రోజులో మూడుసార్లు వెళ్లి గస్తీ చేయాల్సి ఉంటుంది. అనంతరం తమ వద్ద ఉన్న ట్యాబ్‌లో లేదా మొబైల్ ద్వారా టీఎస్‌కాప్ యాప్‌లో గస్తీ సమాచారాన్ని నమోదుచేయాలి.

గస్తీపై సర్వర్‌లో అప్‌డేట్

ఎలక్ట్రానిక్ బీట్ సిస్టంలో భాగంగా ప్రతి పోలీసుస్టేషన్ పరిధిలోని ప్రాంతాలను సెక్టార్లుగా విభజించుకుని.. ముఖ్యమైన పాయింట్లను గుర్తించారు. వాటికి జియోట్యాగ్ చేశారు. బీట్ సిబ్బంది సంబంధిత లొకేషన్ వద్దకు వెళ్లినప్పుడు.. ట్యాబ్‌లోని టీఎస్‌కాప్‌లో ఆ పాయింట్ చూపిస్తుంది. అప్పుడు బీట్ సిబ్బంది గస్తీకి వచ్చిన వివరాలను అందులో నమోదుచేస్తారు. వేరే చోట ఉండి యాప్ ఓపెన్ చేసినా.. సంబంధిత పాయింట్ కనిపించదు. ఈ సమాచారం ఎప్పటికప్పుడు సర్వర్‌కు చేరుతుంది. ఎస్‌హెచ్‌వో నుంచి ఉన్నతాధికారుల వరకు ఆ సమాచారాన్ని ఎవరైనా, ఎప్పుడైనా పరిశీలించే వీలుంటుంది. సిబ్బంది ఒక ప్రాంతానికి మూడు షిఫ్టుల్లో మూడుసార్లు వెళ్లాల్సి ఉంటుంది. దీంతో ఆ ప్రాంతాల్లో పోలీసులు నిత్యం కనిపిస్తుంటారు. ఫలితంగా నేరాలు అదుపులో ఉంటాయి. మరోవైపు సిబ్బంది ఎక్కువసార్లు ఏ పాయింట్‌కు వెళ్లారు? ఏ పాయింట్‌కు వెళ్లడం లేదు? అనే నివేదికలను డీజీపీ కార్యాలయం విశ్లేషించి ప్రతీ వారం ఆయా పోలీస్ స్టేషన్లకు పంపుతారు. ఎలక్ట్రానిక్ బీట్ సిస్టంతో క్షేత్రస్థాయి సిబ్బందిపై పనిభారం తగ్గడంతోపాటు విజిబుల్ పోలీసింగ్, పారదర్శకత పెరుగుతున్నదని అధికారులు చెప్తున్నారు.

కమిషనరేట్ల వారీగా ఎలక్ట్రానిక్ బీట్ విధానం అమలు ఇలా

కమిషనరేట్	ఈ-బీట్ పాయింట్ బుక్స్	బ్లూకోట్స్/ పెట్రోకార్ల సంఖ్య
సైబరాబాద్	4,805	166
రాచకొండ	3,009	144
హైదరాబాద్	7,533	370
కరీంనగర్	1,905	47
ఖమ్మం	1,748	63
నిజామాబాద్	1,801	98
రామగుండం	1,931	96
సిద్దిపేట	1,989	52
వరంగల్	2,582	110

ఇవీ ప్రధాన విధులు..



ఎలక్ట్రానిక్ బీట్ సిస్టంలో భాగంగా పెట్రోకార్ల సిబ్బంది, బ్లూకోట్స్ సిబ్బందికి ప్రధానంగా ఐదు విధులను అప్పగించారు.

- డయల్ 100కు వచ్చే ఫిర్యాదుల గురించి స్థానిక పెట్రోకార్ల సిబ్బందికి, బ్లూకోట్స్‌కు వెంటనే వెళ్తుంది. సమాచారం అందినవెంటనే వారు సమస్య ఉన్న ప్రాంతానికి చేరుకోవాల్సి ఉంటుంది.
- వారి పర్యవేక్షణలోని ప్రాంతంలో ఉన్న పాత నేరస్థుల కదలికలపై నిఘా పెడుతారు. వారు స్థానికంగా ఉంటున్నారా? ఏం చేస్తున్నారు? వంటి వివరాలను నిత్యం తెలుసుకుంటారు.
- పోలీసులు నిరంతరం ప్రజల మధ్య ఉండటంతో నేరాలు అదుపులో ఉంటున్నాయి. నేరాల నివారణకు ఇది ఎంతో ఉపయోగపడుతున్నది. పోలీసులు తమకు అండగా ఉన్నారన్న ధీమా సామాన్యుల్లో కనిపిస్తుంది.
- బీట్ సిబ్బంది వారి ఏరియాల్లోని వివిధ వర్గాలతో తరచూ సమావేశాలు నిర్వహించడం, స్థానిక సమస్యలు తెలుసుకుని పోలీసుల తరఫున పరిష్కారాలు కనుగొనడం. నేరాల నియంత్రణలో పౌరుల పాత్ర మరింత పెంచడం.
- స్థానిక పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం అందించడం, నేరాలు జరిగే ప్రాంతాలను ముందస్తుగానే గుర్తించడం.

నమస్తే తెలంగాణ
జిందగీ
సోమవారం 28 జనవరి 2019 WWW.NTNEWS.COM /nt.zindagi



రాష్ట్రం కోసమే రాజశ్యామల యాగం

ప్రజాక్షేమమే పరమావధి

రాజశ్యామల అమ్మవారు మిగిలిన దేవీ స్వరూపాల్లా కాదు. ఈ దేవీ అవతారమే భిన్నం. రాజశ్యామల దేవత.. వనదుర్గ అమ్మవార్ల ఆరాధన దేశంలో ఎక్కడా కనిపించవు. విశాఖలోని శారదాపీఠంలోనే రాజశ్యామల ఆలయం ఉన్నది. పూర్వం రోజుల్లో రాజశ్యామల ఆరాధన, ఉపాసన చాలా ఉండేది. రాజశ్యామల ఉపాసన చేసే ఏకైక పీఠం శారదాపీఠం. ప్రజలు సుభిక్షంగా ఉండాలని సీఎం కేసీఆర్ హోమయాగాదులు చేస్తున్నారు అంటున్న విశాఖ శారదా పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి వారితో ఆత్మీయ సంభాషణ.

'ప్రజా జీవితంలో ప్రజలకు సేవ చేయాలనుకునేవారే రాజశ్యామల హోమం చేస్తారు. కేసీఆర్ గారు అందుకే చేస్తున్నారు. హోమాలను అందరూ చేయలేరు. ప్రతీ హోమానికి కొన్ని ప్రత్యేకతలుంటాయి. ఎవరు ఎలాంటి హోమం చేయాలనేది నిర్ణయించడానికి కొన్ని పద్ధతులు ఉన్నాయి. ఎవరైనా.. ఏదో ఒక హోమం చేస్తే సరిపోతుంది అనుకుంటుంటారు చాలామంది. అది తప్పు. ధర్మపరిరక్షణే పీఠాల లక్ష్యం. ధార్మిక పీఠాలు సమాజంలో భాగం' అని అంటున్నారు రాజశ్యామల అమ్మవారి ఉపాసకులు, తెలుగు రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా పేరుగాంచిన విశాఖ శారదాపీఠాధిపతి స్వామి స్వరూపానందేంద్ర సరస్వతి. తెలంగాణ, ఆంధ్ర విడిపోతుందని తాను 2007లోనే చెప్పానని, జ్యోతిషాన్ని ఒక సబ్జెక్టుగా కాకుండా తపస్సును కూడా జోడించినపుడే జ్యోతిషం వాస్తవం అవుతుందని ఆయన అంటున్నారు.

రాజశ్యామల హోమం ఎందుకు చేస్తారు?
రాజ్యక్షేమం కోరేవారు రాజశ్యామల హోమం చేస్తారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసమో.. వ్యాపారాల కోసమో.. మరొకటో ఆశించి చేస్తే దీనివల్ల ప్రయోజనం ఉండదు. ఇది చేయాలంటే ప్రత్యేకత ఉండాలి. ఆ చేసేవారు స్వయంగా ఉపాసకుడై ఉండాలి. చేయించుకునేవారు రాజ్యక్షేమం కోసం చేయాలి.

మంత్రఫలం ఉంటుందంటారా?
అవును. యజ్ఞ, యాగాదులను చేయించే పీఠాధిపతులు గొప్ప ఉపాసకులైతే, చేసే వారిలో నిష్ఠ ఉంటే, రాజుల/యాగకర్తలో నిజాయితీ ఉంటే మంత్రఫలం ఉంటుంది. దీంట్లో ఏ ఒక్కదాంట్లో తేడా వచ్చినా ఉపయోగం ఉండదు. ఈ మూడింటి శక్తి కలిసినపుడు ఖచ్చితంగా ఉపయోగం ఉంటుంది. దీనికి ఉదాహరణ అయుత చండీయాగమే. కేసీఆర్ అప్పుడు చేయించిన యాగంతో మంచి జరిగింది. పార్టీ పరంగా కావచ్చు. ప్రభుత్వ పరంగా కావచ్చు. ఆయన సాధించిన విజయాలు.. వాటి ఫలితాలు అందరూ చూస్తూనే ఉన్నారు. యాగాలు.. హోమాల విలువ ఆయనకు తెలుసు కాబట్టే తన కోసం కాకుండా ప్రజా సంక్షేమం కోసం చేస్తున్నారు. నేను ముందే చెప్పినట్లు ఆయనకు అమ్మవారి అనుగ్రహం కూడా ఉన్నది.

సహస్ర చండీయాగం: కలియుగంలో చండీ, వినాయకులు మహాశక్తివంతులు. చండి ఐశ్వర్యాన్ని ఇస్తుంది. క్రియాశక్తిని ఇస్తుంది. రుద్రుడు ఎటువంటి ఆపదలు, అనారోగ్యం లేకుండా చూస్తాడు. ఈ రెండింటికీ కలిపి విలువకట్టలేని శక్తిని ఇచ్చేది రాజశ్యామల. లోక కళ్యాణానికి, రాజ్యసంరక్షణకు, సుభిక్షానికి ఈ యాగం ఉపయోగపడుతుంది. యాగం తలపెడితే చాలు.

సామాజిక కేంద్రం
దేశవ్యాప్తంగా సనాతన ధర్మాన్ని పరిరక్షించడంతోపాటు అనేక సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలను శారదా పీఠం చేపడుతున్నది. గిరిజన గ్రామాల్లో ఉచితంగా మందులు ఇస్తున్నాం. 400 గోవులను గిరిజనులకు ఇచ్చాం. బట్టలు ఉచితంగా ఇచ్చే పథకం పెట్టాం. కుల, మతాలకు అతీతంగా విద్యార్థులను చదివిస్తున్నాం. గుంటూరు, విశాఖపట్నం, హైదరాబాద్ సహా అనేక ప్రాంతాల్లో వేదపాఠశాలలు నిర్వహిస్తున్నాం. దేశవ్యాప్తంగా 72 అనుబంధ పీఠాలు ఏర్పాటు చేశాం. మరింత విస్తరణ జరుగుతున్నది.

పీఠాధిపతులకు ప్రజలతో సంబంధం ఏంటి అంటున్నారుగా కొందరు?
లోకానికి, సమాజానికి కంటకంగా మారిన కొందరు నోటికి వచ్చినట్లు పీఠాల గురించి, పీఠాధిపతుల గురించి మాట్లాడుతుంటారు. పీఠాలు సమాజానికి దూరంగా ఉండవు.. మేం సమాజహితం కోరేవాళ్లమే. మేం కూడా ప్రజల్లో భాగమే. మేం కూడా తల్లిదండ్రులకు పుట్టి.. సమాజంలో పెరిగిన వాళ్లమే. మేం ఆత్మసాక్షాత్కారం పొందినవాళ్లం. మాకు సమాజహితం తప్ప మరేమీ పట్టవు. ధార్మిక ఆలోచనే మాది. కొందరు రాజకీయనాయకులు తమ గుప్పిట ధార్మిక సంస్థలను పెట్టుకుంటున్నారు. దీనివల్ల నష్టం జరుగుతుంది. ఇది సరికాదని చెబుతున్నాం.

పీఠాలు, పిఠాధిపతుల ద్వారానే ధర్మ పరిరక్షణ జరుగుతున్నదంటారా?
పీఠాలు, పీఠాధిపతులు మాట్లాడుతున్నారు కాబట్టే ధర్మపరిరక్షణ జరుగుతున్నది అనేది వందకు వంద శాతం వాస్తవం. మేం పాలనా విషయాల్లో జోక్యం చేసుకోం. శృంగేరి, కంచి, శారదాపీఠంతో సహా ఎవరూ అనవసరంగా పాలనా వ్యవహారాల్లో జోక్యం చేసుకున్న దాఖలాలు లేవు. మా తపన ధర్మపరిరక్షణే. సమాజహితం కోరేవాళ్లమే. మేమేమీ రాజకీయ లబ్ధి ఆశించేవాళ్లం కాదు. ధర్మపరిరక్షణకు విరుద్ధంగా ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకుంటే మేం ఖచ్చితంగా ప్రశ్నిస్తాం. ప్రజలను చైతన్యం చేస్తాం.

హిందూధర్మ సంస్థలపైనా విమర్శలున్నాయి కదా?
కాషాయ జెండా పెట్టుకున్నంత మాత్రాన హిందూ ధర్మరక్షకులు కాలేరు. చాలామందికి ఇదొక కార్యక్రమం అయిపోయింది. కాషాయ జెండా పెట్టుకొని హిందూ ధర్మపరిరక్షకులు అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ఇది సరి కాదు. హిందువులకు ఆయువుపట్టు గోవులు. బీజేపీకి నిజాయితీ ఉంటే, ఈ నేల మీద, ఈ నీటిపై అభిమానం ఉంటే గోవును జాతీయ పశువుగా ప్రకటించాల్సింది. గోరక్షణ జరిగినపుడే హిందూమతం నిలబడినట్టు. గోవులను చంపి దేవాలయాల చుట్టూ తిరిగితే సరిపోదు. గో ధర్మం గొప్పది. పీఠాల ఆధీనంలో ఉన్న దేవాలయాలను, ప్రభుత్వ ఆధీనంలో ఉన్న దేవాలయాలను చూడండి. ప్రభుత్వ ఆధీనంలోని దేవాలయాల్లో పూజా, నిత్యానుష్ఠాన కార్యక్రమాలు కేవలం ప్రభుత్వ డ్యూటీగానే ఉంటున్నాయి. అదే పీఠాల పరిధిలో ఉండే దేవాలయాల్లో చూడండి. తేడా కనపడుతుంది.



భగీరథుడు కేసీఆర్


మిషన్ కాకతీయ.. మిషన్ భగీరథ సహా అన్ని పథకాలు మూడేండ్లలో పూర్తవుతాయి. కేసీఆర్ తెలంగాణ భగీరథుడు అవబోతున్నారు. అమ్మవారి సంపూర్ణ అనుగ్రహం కూడా ఆయనకు ఉన్నది.

రాజశ్యామల దేవి గురించి?
రాజశ్యామల అమ్మవారు సంక్షేమం, అభివృద్ధిని ఇచ్చే దేవత. అనేక రూపాలతో అమ్మవారి ఆరాధన జరుగుతుంది. గ్రామదేవత మొదలు కామేశ్వరి అమ్మవారు వరకు అనేక రూపాల్లో అమ్మవారిని కొలుస్తుంటాం. రాజశ్యామల అమ్మవారు నానుడిలో ఉండడం చాలా తక్కువ. రాజశ్యామల మాత సామాన్యులకు సంబంధించినది కాదు. శత్రుపీడ తొలగిపోవాలని, దేశం సస్యశ్యామలం కావాలని పూర్వం రాజులు రాజశ్యామల యాగం చేసేవారు. ఇది చాలా పవర్‌ఫుల్. ప్రజాసంక్షేమం కోసం మంత్రులు, ముఖ్యమంత్రులు చేస్తుంటారు. సంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధిని కాంక్షించి చేసే యాగం ఇది. పరిపాలకుడికి అమ్మవారు అనుగ్రహం ఇస్తుంది.

తెలంగాణ ఏర్పడుతుందని అప్పుడెప్పుడో చెప్పినట్టున్నారు?
తెలంగాణ, ఆంధ్ర విడిపోదని చాలామంది జ్యోతిషం చెప్పారు. పెద్దపెద్ద స్వాములు కూడా చెప్పారు. జ్యోతిషంగా చెప్తే ఫలితం కనపడదు. జ్యోతిష్యానికి తపస్సు కలిస్తేనే ఫలితం కనపడుతుంది. 'విద్యా తపోభ్యం భూతాత్మ' అని శాస్త్రం చెబుతున్నది. విద్యకు తపస్సు కలిస్తేనే ఉపయోగం. ఇంజినీరింగ్, డాక్టర్ చదువుకున్నట్లుగా జ్యోతిషం చెప్తే అవ్వదు. కేసీఆర్‌గారి జాతకం, ఆయన ఆలోచనా విధానాన్ని అంచనా వేసి అమ్మవారి అనుగ్రహంతో మేం రాష్ట్ర విభజనకు అనేక సంవత్సరాల ముందే, రాష్ట్ర విభజన జరుగుతుందని 2007 నవంబరులోనే చెప్పాం. మా శారదాపీఠం ఒక్కటే ఆనాడు తెలంగాణ విభజన తప్పదని చెప్పింది. మాపై అనేకమంది అనేక రకాలుగా వ్యాఖ్యలు చేశారు. అవన్నీ ఇప్పుడు పటాపంచలయినట్టే కదా?

యాగాలు కేసీఆర్‌గారు ఎక్కువగా చేస్తున్నట్లున్నారు కదా? ఆయన పాలనాతీరుపై మీ స్పందనేంటి?
అవును. కేసీఆర్‌కు అమ్మవారి అనుగ్రహం ఉంది. ఆయన ఊరికే చేయడంలేదు. యాగం గురించి తెలిసే చేస్తున్నారు. యాగాలకు విశ్వసనీయత ఉంది. మంత్రాలకు చింతకాయలు రాలుతాయా అనేవాళ్లు కూడా ఉన్నారనుకోండి. అది వేరే విషయం. మీకో సంగతి చెప్తాను. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నపుడు, 2004కు పూర్వం ఉమ్మడి రాష్ట్రంలో దుర్భిక్షం నెలకొన్నది. వర్షాలు లేవు. ఆ తర్వాత రాజశేఖర్‌రెడ్డి అధికారంలోకి వచ్చారు. రాష్ట్రంలోని నాలుగుమూలాల్లో వరుణ యాగం చేయించాం. పత్రికల్లో అయితే వరుణ యాగమా? మేఘమథనమా? అంటూ ఏవేవో కథనాలు రాశారు. కానీ, మేం నిర్వహించిన వరుణయాగంతో వర్షాలుపడ్డాయి. అప్పుడు పడ్డ వర్షాలతో యాగాలను అపహాస్యం చేసేవాళ్ల నోళ్లు మూతపడ్డాయి. కేసీఆర్ ముఖ్యమంత్రి అవ్వకముందు కూడా యాగాలు చేశారు. పదవుల కోసమో..

అష్టబంధన మహాకుంభాభిషేకం




విశాఖపట్నంలోని శారదాపీఠంలో ఫిబ్రవరి 10వ తేదీ నుంచి అష్టబంధన మహాకుంభాభిషేక మహోత్సవాన్ని నిర్వహిస్తున్నాం. 14వ తేదీన కామ్య సిద్ధి హోమంతో కార్యక్రమాలు ముగుస్తాయి. రాజశ్యామల యాగంతోపాటు వనదుర్గ యాగాన్ని కూడా నిర్వహిస్తున్నాం.

ఏదో రాజకీయ ఉద్దేశాలతోనో ఆయన యజ్ఞ, హోమాలు చేయడంలేదు. ఆయనకు భక్తిభావం ఎక్కువ. దేవుడిని నమ్ముకున్న వ్యక్తి. ఆయనపై అపవాదులు సరికాదు. కేసీఆర్ ఎందరికో ఆదర్శం. ఎంత ఎదిగినా భగవంతుడి వద్ద, గురువు వద్ద సామాన్యులమే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ఇదో గొప్ప గుణం. చిన్న పదవి వస్తేనే చాలామంది అహంకారంతో మాట్లాడుతుంటారు. కానీ, కేసీఆర్ అలా కాదు.. ఆయన నడవడిక ఎందరికో ఆదర్శం. నిజాయితీ ఉన్న వ్యక్తి, దేశం కోసం, దైవకృప కోసం హోమాలు చేస్తున్నారు. హిందుత్వమని చెప్పుకుంటున్న బీజేపీనో, ప్రధాన మంత్రినో ఎప్పుడైనా ఈ తరహా యాగాలు చేశారా? కేసీఆర్ ప్రతిదాన్నీ భగవంతుడి కృపగా భావిస్తారు. కేసీఆర్ ఓ దమ్మున్న నాయకుడు. దేశంలో ఇలాంటి నేత లేరు. తెలుగునాట ఇలాంటి నాయకుడు ఉండడం మనకు భాగ్యం, అదృష్టం.


... సతీష్ ఓరుగంటి
చీఫ్ ఆఫ్ బ్యూరో, నమస్తే తెలంగాణ

గుండె ఎందుకు ఫెయిల్ అవుతుంది?



మా చెల్లెలు వయస్సు 33 సంవత్సరాలు. పెండ్లయి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఐదారేండ్లుగా ఆమెకు తీవ్రమైన ఆయాసం వస్తున్నది. అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి. మొదట్లో దీనిని అస్తమా అని పొరబడ్డాం. పెద్దాసుపత్రిలో చూయిస్తే హార్ట్ ఫెయిల్యూర్‌గా నిర్ధారించారు డాక్టర్లు. ఈ వ్యాధి ఎందుకొస్తుంది? దీనికి శాశ్వత చికిత్స లేదా? హార్ట్ ఫెయిల్యూర్ అయితే చావు కోసం ఎదురుచూడటమా? ఏమైనా పరిష్కారం ఉందా? దయచేసి తెలుపగలరు.
- వినోద, మామిడిపల్లి

వినోదగారూ.. మీ చెల్లెలు సమస్య బాధాకరం. హార్ట్ ఫెయిల్యూర్ అనేది ఒక్కొక్కరిలో ఒక్కోలా ఉంటుంది. ముఖ్యంగా మహిళల్లో కొందరికి ప్రెగ్నెన్సీ సమయంలోనో.. ప్రసవ సమయంలోనో గుండె అనారోగ్యానికి గురవుతుంది. ఏ మాత్రం తీవ్ర అసౌకర్యానికి గురయినా హాస్పిటల్‌కు వెళ్లడం అనేది ముఖ్యమైన చర్య. గుండెకు నష్టం చేయడంలో హైబీపీ, షుగర్, కరోనరీ డిసీజెస్ కారణం అవుతాయి. జెనెటిక్ మజిల్ డిజార్డర్, మితిమీరిన మద్యపానం అలవాటు, స్థూలకాయం వంటివి కూడా గుండె వైఫల్యానికి కారణం అవుతున్నాయి. గుండెకు రెండు విధాలుగా నష్టం జరుగుతుంది. ఒకటి గుండె పంపింగ్ సామర్థ్యం క్షీణించడం వల్ల.. రెండోది కండరాలు గట్టి పడటం వల్ల. అలసిపోయినప్పుడు లేదా పడుకున్నప్పుడు శ్వాస అందకపోవడం.. మితిమీరిన అలసట.. ఒళ్లు వాపు రావడం వంటి లక్షణాలు గుండె వైఫల్యానికి సంకేతాలుగా భావించవచ్చు. దీనిని గుర్తించడానికి హెమో గ్రామ్ సెక్రేటినైస్, థైరాయిడ్ తీరు, ఎలక్ట్రోలైట్స్ రక్తంలో చక్కెర, బీఎస్పీ, ఈసీజీ, ఎలక్ట్రోకార్డియోగ్రఫీ వంటి నిర్ధారణ పరీక్షలు జరుపుతారు. కొన్నిసార్లు కార్డియాక్ ఎంఆర్ఐ పెట్‌స్కాన్, మయోకండ్రియాల్ బయాప్సీ చేయాల్సి ఉంటుంది. అన్ని వ్యాధుల మాదిరిగానే హార్ట్ ఫెయిల్యూర్‌నూ ముందుజాగ్రత్తలతో నిరోధించడమే ఉత్తమం. అధిక రక్తపోటు, మధుమేహంను నియంత్రించడానికి పోషకాలతో కూడిన పరిమిత ఆహారం తీసుకోవాలి. వ్యాయామం చేయాలి. వ్యాధి లక్షణాలు తెలుసుకొని ముందుగానే గుండెవ్యాధి నిపుణులను కలవడం ద్వారా ప్రయోజనం ఉంటుంది. కాబట్టి మీరు చింతించకుండా ముందు సమస్య పరిష్కారానికి మార్గాలు ఆలోచించండి. జీవన్‌దాన్‌లో పేరు నమోదు చేసుకోవడం అవసరం. హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్ తర్వాత కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే మీరు బాధపడినట్లుగా.. చావు కోసం ఎదురుచూడాల్సిన అవసరం రాదు. మీ చెల్లెలు జీవితకాలం గణనీయంగా పెంచవచ్చు.



డాక్టర్ పవన్ పొద్దార్
సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్
యశోద హాస్పిటల్స్


చుండ్రు తగ్గేందుకు..

- డాండ్రఫ్ సమస్య అధికంగా ఉన్నవారు కొబ్బరినూనె, వేపనూనెలను కలిపి జుట్టు కుదుళ్లకు బాగా పట్టించాలి. 20 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడగాలి. దీంతో జుట్టుకు తగిన పోషణ అందడంతో పాటు వెంట్రుకలు మెత్తగా తయారవుతాయి. ఒత్తుగా పెరుగుతాయి.
- కొబ్బరినూనెలో నిమ్మకాయ పిండి గోరువెచ్చగా చేసి మాడుకు పట్టించి అర గంట తర్వాత కడిగేయాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తూ ఉంటే క్రమంగా చుండ్రు సమస్య పూర్తిగా తగ్గిపోతుంది.
- కొందరు తలస్నానం చేశాక జుట్టు పూర్తిగా ఆరకముందే హెయిర్ డ్రయర్లు ఉపయోగిస్తారు. ఇలా చేయడం వల్ల జుట్టు క్రమంగా బలహీనపడుతుంది.
- పుల్లటి పెరుగును తలకు పట్టించి గంట సేపటి తర్వాత కడిగేయాలి. ఇలా చేయడం వల్ల పెరుగులోని యాంటీ ఫంగల్ గుణాలు చుండ్రుపై పోరాడతాయి. జుట్టుకు తగిన బలాన్ని ఇస్తాయి.
- అదేవిధంగా కొందరి జుట్టు నిర్జీవంగా పాలిపోయినట్లు ఉంటుంది. దీని నుంచి విముక్తి కలగాలంటే తరచూ చల్లదనాన్నిచ్చే నూనెను తలకు రాస్తూ ఉంటే జుట్టు కుదుళ్లు బలపడి రక్త ప్రసరణ జరిగి చుండ్రు సమస్య తగ్గుముఖం పడుతుంది. అంతేకాకుండా దుమ్ము, ధూళి నుంచి. సూర్యుడి నుంచి ప్రసరించే అల్ట్రావైలెట్ కిరణాల నుంచి జుట్టును సంరక్షిస్తుంది.

ఉదయం లేచింది మొదలు దుమ్ము, ధూళి, కాలుష్యానికి ఇబ్బందులు పడుతూ ఉంటాం. వీటితో పాటు మారుతున్న ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో మార్పు కూడా జుట్టు ఊడిపోవడానికి ప్రధాన కారణాలు. తీసుకునే ఆహారంలో సమతుల్యత లేకపోవడంతో జుట్టు బలహీనపడుతుంది.. డాండ్రఫ్ వల్ల క్రమంగా కుదుళ్లు దెబ్బతిని ఊడిపోతుంటాయి. కొన్ని చిట్కాలు పాటించడం వల్ల జీవం పోయిన జుట్టును తిరిగి కాపాడుకోవచ్చంటున్నారు నిపుణులు.



నమస్తే తెలంగాణ
నిపుణ
[హైదరాబాద్]
సోమవారం 28 జనవరి 2019



పరీక్షలకు ఆరు నియమాలు

ఇంటర్, పదోతరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షల సమయం సమీపిస్తున్నది. ఇన్నిరోజులు కాలేజీలో పాఠాలు, పరీక్షలు, రివిజన్‌తో ఇంటర్ విద్యార్థులు సమయం గడిపారు. కాలేజీలు ముగిసి ప్రిపరేషన్ హాలిడేస్ వచ్చాయి. ఇప్పటిదాకా కాలేజీలో ఉపాధ్యాయుల సమక్షంలో ప్రిపరేషన్‌ను కొనసాగించారు. అయితే ఇప్పుడు ఇంటి వద్దే కూర్చుని చదవాలి. దీంతో ఇక లెక్చరర్స్ ఉండరు.. మనమే కదా చదువుకునేది అనే భావన చాలామంది విద్యార్థుల్లో ఉంటుంది. ఇలాంటి వారిలో కొందరు పుస్తకం పట్టుకోగానే నిద్రలోకి జారుకునేవారూ ఉంటారు. అసలే బోర్డ్ ఎగ్జామ్స్.. అందులోనూ కీలకమైన ప్రిపరేషన్ టైమ్. కాబట్టి నిర్లక్ష్యం వీడాలంటే ఏం చేయాలి, ఎలా చదివితే ప్రిపరేషన్‌ను పూర్తిచేయవచ్చు అనే విషయాల గురించి తెలుసుకుందాం....


ఇంటర్ పరీక్షలు ముగియగానే ఎంసెట్, నీట్, జేఈఈ వంటి రాష్ట్ర, జాతీయ స్థాయి ప్రవేశపరీక్షలు ఉంటాయి. ఇవన్నీ ఇంటర్ సిలబస్‌తోనే ఉంటాయి కాబట్టి బోర్డు ఎగ్జామ్స్ పూర్తికాగానే పుస్తకాలను పక్కనపడేసే అవకాశం లేదు. దీంతోపాటు ఎక్కువ మంది కాలేజీలకు కూడా వెళ్లకుండా ఇంటివద్దే ఉండి చదువుకుంటారు. అందువల్ల ఇంట్లో ప్రిపరేషన్ కొనసాగించేటప్పుడు త్వరగా అలసిపోడంతోపాటు ఏకాగ్రతను కోల్పోకుండా, నిద్రలోకి జారుకోకుండా ఉండటానికి మనం కూర్చునే కుర్చీ-టేబుల్, గదిలో వెలుతురు, తీసుకునే ఆహారం, చదివే పద్ధతి వంటివన్నీ ముఖ్యమైనవే. దీంతోపాటు పరీక్ష తేదీ దగ్గరపడుతున్నప్పుడు మనపై నమ్మకం కోల్పోకుండా ఉండాలి. అందువల్ల కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే ఇలాంటి వాటి నుంచి సులభంగా బయటపడి, పరీక్షలను సక్సెస్‌ఫుల్‌గా పూర్తిచేయవచ్చు.

లైటింగ్‌తోనే చదువులో వెలుగు

- తరగతి గదిలో చుట్టూ గోడలకు ఆకర్షణీయమైన రంగులు, చార్టులు ఉండటం, ఉపాధ్యాయులు చెప్పే విధానంవల్ల విద్యార్థులకు పాఠాలు శ్రద్ధగా వినాలనే ఆసక్తి ఏర్పడుంది. అలాగే ప్రిపరేషన్ సమయంలో విద్యార్థులు ఏకాగ్రతతో చదువు కొనసాగించాలంటే ఇంటివద్ద ఉండే వాతావరణం కూడా ప్రధానమైనది. అందువల్ల చదివేటప్పుడు గది లేదా స్టడీ రూమ్‌లో మంచి వెలుతురు ఉండేలా చూసుకోవాలి. వెలుతురు సహజసిద్ధంగా వచ్చేలా ఉంటే ఇంకా మంచిది. అది ఏకాగ్రతతో ప్రిపరేషన్‌ను కొనసాగేలా సానుకూల ప్రభావం చూపుతుంది. దాంతోపాటు కంటిపై ఒత్తిడిని తగ్గిస్తుంది. అందువల్ల గదికి కిటికీ ఉంటే దానికి సమీపంలో స్టడీ టేబుల్ ఏర్పాటుచేసుకోవాలి.
- సాధారణంగా చాలా మంది విద్యార్థులు స్టడీ టేబుల్‌పై టేబుల్ ల్యాంపును ఉపయోగిస్తారు. దీంతో తాము చదివే పుస్తకంపై మాత్రమే వెలుతురు ఉంటుంది. గదిలో మిగిలిన ప్రాంతం మొత్తం చీకటిగా ఉంటుంది. ఇది విద్యార్థుల ఏకాగ్రతను దెబ్బతీయడంతోపాటు, త్వరగా నిద్రకు ఉపక్రమించేలా చేస్తుంది. అందువల్ల గది మొత్తం వెలుతురు సరిగా ఉండేలా చూసుకోవాలి.

తక్కువ ఆహారం.. ఎక్కువ నీరు

- పరీక్షల సమయం కాబట్టి ఎక్కువగా అంటే కడుపు నిండా తినకూడదు. సాధారణంగానే రోజూ తిన్న తరువాత మనకు కళ్లు మూసుకుపోతుంటాయి. అందువల్ల రుచికరమైన ఆహారం ఉందికదా అని ఎక్కువగా తింటే మగతగా ఉంటుంది. ఇది మన ఏకాగ్రతను దెబ్బతీస్తుంది. నిద్ర మబ్బులో ఉన్నప్పుడు చదవకూడదు. అయితే దీన్ని అధిగమించాలంటే అసలే తినకుండా ఉండొద్దు. కొద్ది మొత్తంలో ఆహారం తీసుకోవాలి.
- నీళ్లు తగిన మోతాదులో తీసుకుంటే నిత్యం ఆరోగ్యంగా ఉండవచ్చు. అందువల్ల ప్రిపేరషన్ సమయంలో ఆహారం తక్కువగా తీసుకున్నప్పటికీ నీరు ఎక్కువ తాగితే మంచిది. దీనివల్ల ఒకే దగ్గర ఎక్కువసేపు కూర్చునే అవకాశం ఉండదు. కాలకృత్యాలు తీర్చుకోవడానికి విరామం దొరుకుతుంది. కాబట్టి కంటికి కొద్దిసేపు విశ్రాంతితోపాటు, శరీరంలో కదలికలు ఉంటాయి. దీంతో అలసిపోయామనే భావన రాదు. అదేవిధంగా నీరు ఎక్కువగా తీసుకోవడం వల్ల మెదడు క్రియాత్మకంగా ఉండటంతోపాటు, గ్రహించే శక్తి కూడా అధికమవుతుంది.
- పొద్దున్నే లేచి ఎక్కువసేపు చదువుతూ ఉంటాం. కాబట్టి మధ్యాహ్నం కొద్దిసేపు కునుకు తీస్తే మంచిది. దీనివల్ల నిద్రమబ్బు తొలగిపోవడంతోపాటు మెదడుకు, కంటికి తగినంత విశ్రాంతి లభిస్తుంది. దీంతో రాత్రి పొద్దుపోయే వరకు చదువుకోవడానికి అవకాశం ఉంటుంది.
- ఎక్కువసేపు ఒకే దగ్గర, ఒకేలా కూర్చుని చదువుతూ ఉండకూడదు. దీనివల్ల త్వరగా అలసిపోయి మగతలోకి జారుతున్నట్లు అనిపించినప్పుడు కుర్చీ నుంచి లేచి చేతులు, కాళ్లు ఆడిస్తూ గదిలో కొద్దిసేపు తిరగాలి. కేవలం కూర్చునే కాకుండా కొద్దిగా అటూ ఇటూ తిరుగుతూ కూడా చదవాలి. దీనివల్ల ఏకాగ్రత పెరగడంతోపాటు నిద్రమబ్బు కూడా తొలగిపోతుంది



సిట్టింగ్ కూడా ముఖ్యమే!

- మనం కూర్చునే విధానం కూడా ఏకాగ్రతపై ప్రభావం చూపుతుంది. పరీక్షల కోసం ఎక్కువ సేపు చదవాలనుకున్నప్పుడు ఇది ప్రధాన అంశంగా మారుతుంది. అందుకే చదువుకునేటప్పుడు బెడ్‌పై కాకుండా కుర్చీ, దాని ముందు టేబుల్ ఉండేలా చూసుకోవాలి. మనం వెనుకకు ఆనుకుని నిటారుగా కూర్చునేలా ఆ కుర్చీ ఉండాలి. దీనివల్ల ఏకాగ్రత కోల్పోకుండా చదువుకోవచ్చు. అదేవిధంగా మనం నిటారుగా కూర్చుని పుస్తకాన్ని టేబుల్‌పై పెట్టుకొని చదవడం వల్ల మన కళ్లతోపాటు చేయి, తల కూడా నిత్యం కదులుతూ ఉంటాయి. దీంతో మనం క్రియారహితంగా మారకుండా ఉంటాం. అదే బెడ్‌పై కూర్చుని లేదా పడుకుని చదివినట్లయితే పుస్తకంపై ఎక్కువగా శ్రద్ధ నిలుపలేం. దీంతో అది నిద్రకు దారితీస్తుంది. అందువల్ల ఎక్కువ సేపు చదవడం లేదా ఒక అధ్యాయాన్ని పూర్తి చేయాలనుకున్నప్పుడు కుర్చీలో కూర్చుని చదవడం మంచిది.

త్వరగా పడుకోవడం.. త్వరగా నిద్రలేవడం

- అమెరికాకు చెందిన ప్రముఖ రచయిత బెంజమిన్ ఫ్రాంక్లిన్ చెప్పిన 'ఎర్లీ టు బెడ్, ఎర్లీ టు రైజ్ మేక్స్ ఎ మ్యాన్ హెల్తీ, వెల్తీ అండ్ వైజ్' అనే నానుడి విద్యార్థులకు చక్కగా పనికివస్తుంది. త్వరగా పడుకుని, త్వరగా లేవడంవల్ల మనం ఆరోగ్యంగా ఉండటంతోపాటు, తెలివైనవారిగా, సంపన్నులుగా మారవచ్చు. పొద్దున్నే లేవడంవల్ల ప్రశాంతవాతావరణంలో ఎక్కువసేపు చదువుకోవచ్చు. అనవసరమైన ఆలోచనలు మన దరికి చేరవు కాబట్టి మనసు ప్రశాంతంగా ఉంటుంది. చదివిన విషయాలు ఎక్కువ కాలం గుర్తుండిపోతాయి. జర్మనీలోని హిడెల్‌బర్గ్ యూనివర్సిటీ ఆఫ్ ఎడ్యుకేషన్‌కు చెందిన బయాలజీ ప్రొఫెసర్ క్రిస్టోఫర్ రాండ్లర్ అధ్యయనం ప్రకారం వేకువజామునే నిద్ర లేచేవారే జీవితంలో విజయం సాధించినట్లుగా తేలింది. ఇలాంటివారు రాబోయే సమస్యలను ముందుగా గుర్తించగలగడంతోపాటు, వాటిని తగ్గించుకోవడానికి ప్రయత్నిస్తారు. జీవితంలో ఎప్పుడూ యాక్టివ్‌గా (క్రియాశీలకంగా) ఉండటంతోపాటు ఉద్యోగంలో మెరుగైన ప్రదర్శనను కనబర్చడం, ఎక్కువ జీతాలు అందుకోవడం, విజయవంతంగా జీవితాన్ని గడిపేవారిలా ఉంటారు. అందువల్ల రాత్రి సమయంలో 'వీలైనంత త్వరగా పడుకుని, త్వరగా లేవడం' మంచిది.
- వేకువజామున లేవడం అనే అలవాటు ఎంతోమేలు చేస్తుంది. రోజులో ఎక్కువ సమయం ఉన్నట్లుగా అనిపిస్తుంది. ఈ విధానం వేదకాలం నుంచే అమలులో ఉన్నది. ప్రస్తుతం వ్యక్తిత్వ వికాస (పర్సనాలిటీ డెవలప్‌మెంట్) నిపుణులు కూడా దీన్ని రికమెండ్ చేస్తున్నారు.



రాసి చూసుకోవాలి

- అదే పనిగా ఎక్కువసేపు చదువుతూ ఉండటం వల్ల విసుగు వచ్చే అవకాశం ఉంది. అది అలసిపోయామనే భావనతోపాటు నిద్రమబ్బుకు దారితీస్తుంది. దీనినుంచి బయటపడాలంటే మనం కేవలం స్పెక్టేటర్‌గానే ఉండకూడదు. చదివిన విషయాన్ని రాసి చూసుకోవాలి. ఇలా పెన్ పేపర్ వర్క్ చేయడంవల్ల మెదడు ఎప్పుడూ పనిచేస్తూనే ఉంటుంది. దీనికి తోడు రాసి చూసుకుంటాం కాబట్టి చదివిన విషయాన్ని మరోసారి మననం (రీకాల్) చేసుకునే అవకాశం ఉంటుంది. దీంతో వాటిని త్వరగా మర్చిపోకుండా ఉండటంతోపాటు మళ్లీ చదివినప్పుడు సులభమవుతుంది.
- గట్టిగా బయటికి చదవడం మంచిది. ఇది బద్ధకాన్ని దూరం చేస్తుంది. ఇలా బయటికి చదడం వల్ల ఆ విషయాలను మనకి మనమే వినవచ్చు. కాబట్టి నిద్రలోకి జారుకునే అవకాశాలు తక్కువగా ఉంటాయి. అదేవిధంగా ప్రిపరేషన్ సమయంలో ఆయా విషయాలను ఉపాధ్యాయులు వివరించినట్లుగా మనకి మనం ఎక్స్‌ప్లెయిన్ చేసుకోవాలి. దీంతో ఆ అంశాలు ఎక్కువకాలం గుర్తుండటంతోపాటు గ్రహించే శక్తి (లెర్నింగ్ పవర్) పెరుగుతుంది, ఏకాగ్రత కోల్పోకుండా ఉండవచ్చు.
- కఠినంగా ఉండి, ఎంత చదివినా గుర్తుంచుకోవడానికి కష్టంగా ఉన్న టాపిక్స్‌ను రాత్రిపూట చదవకుండా ఉండటమే మంచిది. ఇలాంటి పాఠాలు లేదా విషయాలను మనసు ప్రశాంతంగా, యాక్టివ్‌గా ఉన్న సమయంలోనే చదవాలి. రాత్రి సమయాల్లో మనకు ఇష్టమైన అంశాలను లేదా సులభంగా ఉండే టాపిక్స్‌ను చదవాలి.

ఎఫెక్టివ్ లెర్నింగ్ కోసం...

- ఏదైనా విషయాన్ని అభ్యసించడానికి విద్యార్థులు అనేక మార్గాలను అనుసరిస్తూ ఉంటారు. చాలా ప్రయత్నాల అనంతరం సమర్థమైన అభ్యసనం కోసం వారికి సరిపోయే విధానాన్ని ఎంపిక చేసుకుంటారు. ఇలాంటి సందర్భాల్లో విద్యార్థులకు కొన్ని సలహాలు సూచనలు అవసరమవుతుంటాయి. ఏవిధంగా చదివితే, ఎలాంటి అంశాలను ఎంపిక చేసుకుంటే ఈజీగా ప్రిపరేషన్‌ను ముందుకు తీసుకుపోవచ్చు, పరీక్షల్లో ఎక్కువ మార్కులు స్కోర్ చేసుకోవచ్చు అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలి.
- మనకు ఉన్న జ్ఞానాన్ని బట్టి చదివే అంశాన్ని ఎంపిక చేసుకోవాలి. మనకు అప్పటికే తెలిసిన విషయం లేదా సబ్జెక్ట్ అయితే దానిని శ్రద్ధతో చదవచ్చు. దీంతో వాటిని నేర్చుకోవడం సులభం అవుతుంది. పరీక్షల్లో వాటికి సంబంధించిన ప్రశ్నలు వచ్చినప్పుడు త్వరగా జవాబులు రాయవచ్చు. విద్యార్థి తనకు మ్యాథ్స్‌లో త్రికోణమితి (ట్రిగ్నామెట్రీ) అధ్యాయంపై ఇంట్రెస్ట్ ఉంటే దానితోనే ప్రిపరేషన్‌ను ప్రారంభించాలి. దాని నుంచి కఠినంగా ఉండే చాప్టర్లకు వెళ్లాలి. ఇలా చేయడంవల్ల మనపై మనకు నమ్మకం పెరిగి ప్రిపరేషన్ విజయవంతంగా పూర్తిచేయడంతోపాటు పరీక్షల్లో కూడా ఎక్కువ మార్కులు సాధించడానికి అవకాశం ఉంటుంది.
- సారూప్యం ఉన్న అంశాలను ఒకదానితో ఒకటి పోల్చుకుని చదవాలి. దీనివల్ల అలాంటి విషయాలను చదవడం తొందరగా పూర్తిచేయవచ్చు. పటాలు, బొమ్మలకు సంబంధించి కొన్ని ముఖ్యమైన విషయాలను (బండ గుర్తులు) గుర్తుంచుకోవాలి. వాటిని ఆధారంగా చేసుకుని పటాలు లేదా బొమ్మలను కచ్చితంగా, సులభంగా గీయవచ్చు. దీంతో సమయం ఆదా కావడంతోపాటు ఎక్కువ స్కోర్ చేయడానికి అవకాశం ఉంటుంది.



- 'ప్రాక్టీస్ మేక్స్ మ్యాన్ పర్ఫెక్ట్' అంటారు. అందువల్ల చదివిన విషయాలను ప్రాక్టీస్ చేయడంవల్ల మర్చిపోకుండా ఉంటాం. ఒక చాప్టర్ చదవడం పూర్తయిన తర్వాత దానికి సంబంధించిన అంశాలను రాసిచూసుకోవాలి. దీంతోపాటు మాక్ టెస్టులు, మోడల్ పేపర్లు, స్టడీ మెటీరియల్‌లో పరీక్షలు రాసి, చేసిన తప్పులను సరిదిద్దుకోవచ్చు. పరీక్ష అనే భయం క్రమంగా తొలగిపోతుంది.
- స్వీయ నియంత్రణ, క్రమశిక్షణ కూడా పరీక్షల్లో విజయం సాధించడంపై ప్రభావం చూపుతుంది. ప్రిపరేషన్ సమయంలో టీవీ చూడటం, స్నేహితులతో గడపటం, సెల్‌ఫోన్‌తో కాలక్షేపం చేయడం కాకుండా చదవడంపై శ్రద్ధ ఉంచాలి. రోజువారీ కార్యక్రమాలపై నియంత్రణ ఉండాలి. ఇష్టమైన ఆహారం అందుబాటులో ఉన్నప్పుడు దాన్ని తక్కువగా తీసుకోవడమే మంచిది.
- విద్యార్థులు స్వీయ ప్రేరణ పొందడం (సెల్ఫ్ మోటివేషన్) కూడా ముఖ్యమైనదే. వారి లక్ష్యాలను చేరుకోవడానికి అది విద్యా సంబంధమైనది అయినా, మరే ఇతర విషయానికి సంబంధించినది అయినా తనకు తానుగా ప్రేరణ పొందడం చాలా అవసరం. మోటివేషన్ అనేది కేవలం తల్లిదండ్రులు, స్నేహితుల నుంచే కాకుండా వారి సొంతంగా కూడా ఉండాలి. ఇది వారిలో నమ్మకాన్ని పెంపొందించేదిగా ఉంటుంది. దీనివల్ల తాము నిర్దేశించుకున్న లక్ష్యాలవైపు పయనించేలా చేస్తుంది.

... ✍ గణేష్ సుంకరి

దేశ రక్షణకు డేగ కన్ను

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మరో మైలురాయిని దాటింది. ఇస్రో శాస్త్రవేత్తలు పీఎస్ఎల్వీ-సీ44 రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించారు. ఈ రాకెట్ రెండు ఉపగ్రహాలను అంతరిక్షంలోకి మోసుకెళ్లింది. శ్రీహరికోటలోని సతీశ్‌ధావన్ స్పేస్ రిసెర్చ్ సెంటర్ మొదటి లాంచింగ్ ప్యాడ్ నుంచి నిర్వహించిన ఈ ప్రయోగం వివరాలు నిపుణ పాఠకుల కోసం...



- పీఎస్ఎల్‌వీ-సీ44 రాకెట్ ప్రయోగానికి సంబంధించిన కౌంట్‌డౌన్ జనవరి 23 రాత్రి 7:37 గంటలకు మొదలైంది. సరిగ్గా 28 గంటలపాటు కొనసాగిన కౌంట్‌డౌన్ ముగియగానే జనవరి 24 అర్ధరాత్రి 11:37 గంటలకు రాకెట్ నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి దూసుకెళ్లింది. ఈ రాకెట్ ద్వారా ఇమేజింగ్ శాటిలైట్ మైక్రోశాట్-R, తమిళనాడుకు చెందిన ఓ హైస్కూల్ విద్యార్థులు రూపొందించిన కలాంశాట్-V2 ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యలో ప్రవేశపెట్టారు. ఇది పీఎస్ఎల్‌వీకి 46వ ప్రయోగం కాగా.. 2019 ఏడాదిలో ఇస్రో చేపట్టిన తొలి ప్రయోగం.

ప్రయోగం ఎలా?

- జనవరి 24 అర్ధరాత్రి 11:37 నిమిషాలకు పీఎస్ఎల్‌వీ-సీ44 రాకెట్ మొదటి దశ ఇంజిన్‌ను మండించారు. సెకను వ్యవధిలో రాకెట్‌కు ఇరువైపులా ఉన్న రెండు స్ట్రాపాన్ మోటార్లు మండటం ప్రారంభించాయి. రాకెట్ సెకనుకు 451.9 మీటర్ల వేగంతో ప్రయాణం మొదలుపెట్టింది.
- సరిగ్గా 13 నిమిషాల 26 సెకన్లకు, భూమికి 277 కిలోమీటర్ల ఎత్తులో 'మైక్రోశాట్-R' ఉపగ్రహాన్ని నిర్ణీత కక్ష్యలో ప్రవేశపెట్టింది. అనంతరం ఉపగ్రహం బెంగళూరులోని 'ఇస్రో టెలిమెట్రీ ట్రాకింగ్ & కమాండ్ నెట్‌వర్క్ (ISTRAC)' కంట్రోల్‌లోకి వచ్చింది. అప్పటికి రాకెట్ వేగం సెకనుకు 7.74 కిలోమీటర్లకు పెరిగింది. - తర్వాత రాకెట్‌లోని 4వ దశ మరింత పైకి దూసుకెళ్లింది. సరిగ్గా ఒక గంట 40 నిమిషాలకు 450 కిలోమీటర్ల ఎత్తులో 'కలాంశాట్-V2' ఉపగ్రహాన్ని నిర్ణీత కక్ష్యలోకి చేర్చింది.
- భవిష్యత్తులో ఇస్రో చేపట్టబోయే ప్రయోగాల కోసం పీఎస్ఎల్‌వీ-సీ44లోని 4వ దశ అంతరిక్షంలో ఒక తాత్కాలిక వేదికను ఏర్పర్చింది. ఈ వేదికను ఉపయోగించుకున్న తొలి ఉపగ్రహంగా 'కలాంశాట్-V2' గుర్తింపు పొందింది. 'కలాంశాట్-V2' ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టేటప్పటికి రాకెట్ వేగం సెకను 7.63 కిలోమీటర్లకు చేరింది.

పీఎస్ఎల్‌వీ-సీ44 ప్రత్యేకత

- పీఎస్ఎల్‌వీ దేశానికి సంబంధించిన మూడో శ్రేణి రాకెట్. దీని ఎత్తు - 44 మీ. వెడల్పు -2.8 మీ. దీనిలో మొత్తం నాలుగు దశలు ఉంటాయి. 1993, సెప్టెంబర్ 20న పీఎస్ఎల్‌వీ శ్రేణికి చెందిన రాకెట్‌ను తొలిసారి ప్రయోగించారు. తొలి ప్రయోగం విఫలమైంది. అయితే 1994 అక్టోబర్‌లో చేపట్టిన రెండో ప్రయోగం మొదలు.. 2017 జూన్‌లో 40వ ప్రయోగం వరకు వరుసగా 39 ప్రయోగాలు విజయవంతమయ్యాయి. పీఎస్ఎల్‌వీ శ్రేణికి చెందిన రాకెట్లతో ఇస్రో ఇప్పటి వరకు 48 స్వదేశీ ఉపగ్రహాలను, 209 విదేశీ ఉపగ్రహాలను ప్రయోగించింది. అంతేగాక రెండు స్పేస్‌క్రాఫ్ట్‌లను కూడా పీఎస్ఎల్‌వీ రాకెట్ల ద్వారా ప్రయోగించారు. 2008లో చంద్రయాన్-1 పేరుతో చంద్రునిపైకి ఒక స్పేస్‌క్రాఫ్ట్‌ను, 2013లో మంగళ్‌యాన్ పేరుతో మార్స్ పైకి మరో స్పేస్ క్రాఫ్ట్‌ను ఇస్రో ప్రయోగించింది.

ప్రయోగ విశేషాలు

- సాధారణంగా పీఎస్ఎల్‌వీ రాకెట్‌కు ఆరు స్ట్రాపాన్ బూస్టర్లు ఉంటాయి. రాకెట్‌ను వేగంగా ఆకాశంలోకి తీసుకెళ్లడానికి ఇవి ఉపయోగపడుతాయి. కానీ పీఎస్ఎల్‌వీ-సీ44లో రెండు స్ట్రాపాన్ బూస్టర్లను మాత్రమే ఉపయోగించారు. ఉపగ్రహాల బరువు, ఖర్చును తగ్గించుకోవడం కోసం ఇలా చేశారు. ఇస్రో ఈ తరహా రాకెట్‌ను ఉపయోగించడం ఇదే తొలిసారి. ఈ రాకెట్‌కు 'పీఎస్ఎల్‌వీ- డీఎల్'గా నామకరణం చేశారు.
- పీఎస్ఎల్‌వీ-సీ44 ప్రయోగంలో బరువును తగ్గించి, పరిమాణాన్ని పెంచడానికి 4వ దశలో అల్యూమినియం ట్యాంక్‌ను వినియోగించారు.
- ఉపగ్రహాన్ని ప్రయోగించిన తర్వాత రాకెట్ 4వ దశ వ్యర్థపదార్థంగా అంతరిక్షంలో ఉండిపోతుంది. కానీ పీఎస్ఎల్‌వీ-సీ44లోని 4వ దశ మాత్రం ఇతర ప్రయోగాలకు ఉపయోగపడేలా రోదసిలో తాత్కాలిక వేదికను (ఆర్బిటాల్ ప్లాట్‌ఫాం) స్థాపించింది. ఈ ఆర్బిటాల్ ప్లాట్‌ఫాం సుమారు ఆరు నెలలపాటు ఇస్రో ప్రయోగాలకు పనికొస్తుంది.
- ఈ ప్రయోగం ద్వారా ప్రపంచంలోనే అత్యంత తేలికైన 'కలాంశాట్-V2' ఉపగ్రహాన్ని అంతరిక్షంలో ప్రవేశపెట్టారు. 2017లో నాసా కూడా 64 గ్రాముల బరువున్న కలాంశాట్ తొలి వెర్షన్‌ను ప్రయోగించింది. దీనికి గులాబ్‌జామూన్ అని పేరుపెట్టారు. కానీ ఇది నిర్దేశిత కక్ష్యలోకి చేరలేదు.

ఉపగ్రహాల ప్రత్యేకత

మైక్రోశాట్-R

- మైక్రోశాట్-R ఉపగ్రహాన్ని సైనిక అవసరాల కోసం రూపొందించారు. ఈ ఉపగ్రహం బరువు 740 కిలోలు. ఇది ఇమేజింగ్ శాటిలైట్. దీనిలో ఉండే శక్తిమంతమైన కెమెరాలతో ఇది ఫొటోలు తీస్తుంది. ఇది రక్షణ రంగానికి సేవలు అందిస్తుంది. డీఆర్‌డీవో రక్షణ విభాగంలో ఈ ఉపగ్రహ సేవలను వినియోగించుకోనున్నారు.

కలాంశాట్-V2

- ఇది అత్యంత తేలికైన ఉపగ్రహం. చెన్నైలోని ఓ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థుల బృందం దీన్ని తయారుచేసింది. ఈ ఉపగ్రహం బరువు 1.2 కిలోలు. పరిమాణం 10 సెం.మీల క్యూబ్. రూ.12 లక్షల ఖర్చుతో కేవలం ఆరు రోజుల్లో ఈ శాటిలైట్‌ను రూపొందించారు. నానోశాటిలైట్లను కమ్యూనికేషన్లో ఎలా వినియోగించుకోవచ్చన్న దానిపై పరిశోధనలు చేయడానికి దీన్ని ప్రయోగించారు. ఇలాంటి చిన్న శాటిలైట్లు విపత్తు సమయాల్లో సహాయక చర్యలకు ఉపయోగపడనున్నాయి. ఈ ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపడానికి ఇస్రో ఒక్క రూపాయి కూడా తీసుకోలేదు.

III.
నమస్తే తెలంగాణ
నిపుణ
[హైదరాబాద్]
సోమవారం 28 జనవరి 2019

విద్య ఉద్యోగ సమాచారం


ఎస్‌సీఐలో మెరైన్ ఇంజినీర్లు



ముంబైలోని షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎస్‌సీఐ)-మారిటైమ్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్‌లోని జీఎంఈ కోర్సు ద్వారా గ్రాడ్యుయేట్ మెరైన్ ఇంజినీర్ కోసం అవివాహిత పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- మొత్తం ఖాళీల సంఖ్య-40 (జనరల్-20, ఓబీసీ-11, ఎస్సీ-6, ఎస్టీ-3)
- **పోస్టు పేరు:** గ్రాడ్యుయేట్ మెరైన్ ఇంజినీర్
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి 50 శాతం మార్కులతో మెకానికల్ ఇంజినీరింగ్‌లో బీఈ/బీటెక్ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణత. పదోతరగతి/ఇంటర్ స్థాయిలోని ఇంగ్లిష్ సబ్జెక్టులో కూడా 50 శాతం మార్కులు తప్పనిసరిగా ఉండాలి.
- **వయస్సు:** 2019 ఏప్రిల్ 1 నాటికి 28 ఏండ్లకు మించరాదు. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఐదేండ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది
- **స్టయిఫండ్:** రూ. 15,000/- (ట్రెయినింగ్ పీరియడ్‌లో)
- **అప్లికేషన్ ఫీజు:** రూ.1000/- (ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.100/-)
- **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
- ఆబ్జెక్టివ్ రాతపరీక్షలో క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ టెస్ట్, ప్రొఫెషనల్ నాలెడ్జ్ టెస్ట్, ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ రీజనింగ్ ఎబిలిటీ టెస్ట్ అంశాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. రెండు గంటలలో పూర్తిచేయాలి.
- ప్రతి విభాగంలో కనీస అర్హత మార్కులను సాధించాలి.
- రాతపరీక్షలో మెరిట్ సాధించిన వారిని 1:3 నిష్పత్తిలో ఇంటర్వ్యూకు పిలుస్తారు.
- **దరఖాస్తు :** ఆన్‌లైన్‌లో
- ఆన్‌లైన్‌లో పంపిన హార్డ్‌కాపీ దరఖాస్తులను ప్రింట్ తీసి సంబంధిత పర్సనల్ అధికారికి పంపాలి.
- **చివరితేదీ :** ఫిబ్రవరి 11
- **రాతపరీక్ష తేదీ:** ఫిబ్రవరి 17
- **వెబ్‌సైట్ :** www.shipindia.com

ఐఎస్ఐలో ప్రవేశాలు



కోల్‌కతాలోని ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ (ఐఎస్ఐ) 2019-20 విద్యా సంవత్సరానికిగాను డిగ్రీ/పీజీ, డిప్లొమా, రిసెర్చ్ ఫెలోషిప్స్ ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది.

మూడేండ్ల డిగ్రీ (ఆనర్స్) కోర్సులు
- బ్యాచిలర్ ఆఫ్ డిగ్రీ (స్టాటిస్టిక్స్, మ్యాథమెటిక్స్)

రెండేండ్ల పీజీ డిగ్రీ కోర్సులు
- మాస్టర్ ఆఫ్ పోస్టు గ్రాడ్యుయేట్ (స్టాటిస్టిక్స్, మ్యాథమెటిక్స్, క్వాంటిటేటివ్ ఎకనామిక్స్, క్వాలిటీ మేనేజ్‌మెంట్ సైన్స్, లైబ్రరీ & ఇన్ఫర్మేషన్ సైన్స్, ఎంటెక్ (కంప్యూటర్ సైన్స్, క్రిప్టాలజీ & సెక్యూరిటీ, క్వాలిటీ, రిలియబిలిటీ అండ్ ఆపరేషన్స్ రిసెర్చ్)

పీజీ డిప్లొమా కోర్సులు
- కంప్యూటర్ అప్లికేషన్, స్టాటిస్టికల్ మెథడ్స్ అండ్ అనాలిసెస్

రిసెర్చ్ ఫెలోషిప్ కోర్సులు
- స్టాటిస్టిక్స్, మ్యాథమెటిక్స్, క్వాంటిటేటివ్ ఎకనామిక్స్, కంప్యూటర్ సైన్స్, క్వాలిటీ, రిలియబిలిటీ అండ్ ఆపరేషన్స్ రిసెర్చ్, ఫిజిక్స్ అండ్ అప్లయిడ్ మ్యాథమెటిక్స్, జియాలజీ, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, బయాలజికల్ సైన్స్.
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ/సంస్థ నుంచి ఇంటర్ బ్యాచిలర్ డిగ్రీ, మాస్టర్ డిగ్రీ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణత.
- **అప్లికేషన్ ఫీజు:** రూ.1250/-, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, పీహెచ్‌సీ అభ్యర్థులకు రూ. 625/-
- **ఎంపిక:** ఐఎస్ఐ అడ్మిషన్ టెస్ట్ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి 5 నుంచి ప్రారంభం
- **చివరితేదీ:** మార్చి 12
- **అడ్మిషన్ టెస్ట్:** 2019 మే 112
- **వెబ్‌సైట్:** www.isical.ac.in

బిమ్‌టెక్‌లో పీజీడీఎం



నోయిడాలోని బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీ (బిమ్‌టెక్) 2019 విద్యాసంవత్సరానికిగాను పీజీడీఎం, డాక్టోరల్ ప్రోగ్రామ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ప్రకటన విడుదల చేసింది.

కోర్సు సీట్ల వివరాలు
- పీజీడీఎం (రెండేండ్ల ఎంబీఏకు సమానం)-240 సీట్లు
- పీజీడీఎం-ఇంటర్నేషనల్ బిజినెస్-60 సీట్లు
- పీజీడీఎం-ఇన్స్యూరెన్స్ బిజినెస్ మేనేజ్‌మెంట్-60 సీట్లు
- పీజీడీఎం-రిటైల్ మేనేజ్‌మెంట్-60 సీట్లు
- డాక్టోరల్ ప్రోగ్రామ్ (ఎఫ్‌పీఎం, ఈఎఫ్‌పీఎం)
- **అర్హతలు:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ (10+2+3 విధానంలో) 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత. ఫైనల్ ఇయర్ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **ఎంపిక:** క్యాట్, జీమ్యాట్/మ్యాట్, గ్జాట్, సీమ్యాట్, ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** జనవరి 31
- **వెబ్‌సైట్ :** www.bimtech.ac.in/admissions

'ఫారెస్ట్'లో పీజీ డిప్లొమాలు



భోపాల్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ మేనేజ్‌మెంట్ (ఐఐఎఫ్ఎం)లో పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి ప్రకటన విడుదలైంది.

కోర్సులు:
- పీజీ డిప్లొమా ఇన్ ఫారెస్ట్రీ మేనేజ్‌మెంట్ (పీజీడీఎఫ్ఎం)
- పీజీ డిప్లొమా ఇన్ సస్టెయినబిలిటీ మేనేజ్‌మెంట్ (పీజీడీఎస్ఎం)
- **అర్హతలు:** పై రెండు కోర్సులకు కనీసం 50 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత. ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు ఉంటే సరిపోతుంది. ప్రస్తుతం ఫైనల్ ఇయర్ పరీక్షలకు హాజరుకానున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే వీరు జూన్ 30 నాటికి డిగ్రీ సర్టిఫికెట్ దాఖలు చేయాలి. క్యాట్-2018 / ఎక్స్‌ఏటీ-2019 దరఖాస్తు చేసుకొని ఉండాలి. ఈ స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసి రాతపరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రవేశాలు కల్పిస్తారు.
- ఈ రెండు కోర్సులు రెండేండ్ల ఫుల్‌టైం రెసిడెన్షియల్ కోర్సులు
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 20
- **వెబ్‌సైట్:** www.iifm.ac.in

ప్యాకేజింగ్‌లో డిప్లొమా కోర్సు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్ (ఐఐపీ) డిప్లొమా కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **కోర్సు:** డిప్లొమా ఇన్ ప్యాకేజింగ్ (డీపీసీ)
- **అర్హతలు:** సైన్స్, ఇంజినీరింగ్, టెక్నాలజీ, కామర్స్, ఆర్ట్స్‌ల్లో డిగ్రీ పూర్తిచేసి, పరిశ్రమలో ప్రొడక్షన్, పర్చేజ్, మార్కెటింగ్, క్వాలిటీ కంట్రోల్ విభాగాల్లో కనీసం ఏడాదైనా పనిచేసిన అనుభవం ఉండాలి.
- **కోర్సు కాలవ్యవధి:** 18 నెలలు
- **కోర్సు:** ఇంటెన్సివ్ ట్రెయినింగ్ సర్టిఫికెట్ కోర్సు ఇన్ ప్యాకింగ్ (ఐటీసీ)
- **కాలవ్యవధి:** మూడు నెలలు
- **అర్హతలు:** ఇంటర్/ఐటీఐ లేదా డిప్లొమా లేదా డిగ్రీ ఉత్తీర్ణత.
- **ప్రవేశాలు:** మొదట వచ్చిన వారికి మొదట
- **దరఖాస్తు:** ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** జనవరి 31
- **వెబ్‌సైట్:** www.iip-in.com

కింగ్.. డిజిటల్ మార్కెటింగ్



ఏదైనా ఉత్పత్తిని విక్రయించాలంటే దాని గురించి ప్రజలకు తెలియజేయాలి. ఒకప్పుడు పేపర్లు, పోస్టర్ల ద్వారా తెలియపర్చేవారు. కానీ నేటి సాంకేతిక యుగంలో ఈ-మెయిల్, ఫేస్‌బుక్, ట్విటర్, వాట్సాప్ ద్వారా వివిధ రకాల ఉత్పత్తులను ప్రచారం చేస్తున్నారు. సంప్రదాయిక మార్కెటింగ్‌లో జరిగిన విప్లవ మార్పే ఈ డిజిటల్ మార్కెటింగ్. ఈ నేపథ్యంలో డిజిటల్ మార్కెటింగ్ అంటే ఏమిటి? దాని గురించి కోర్సులు తదితరాల వివరాలు నిపుణ పాఠకుల కోసం ప్రత్యేకం..

డిజిటల్ మార్కెటింగ్ అంటే..
- కంపెనీలు, సంస్థలు తమ ఉత్పత్తుల గురించి సెర్చ్ ఇంజిన్లు, వెబ్‌సైట్లు, ఫేస్‌బుక్, ఈ-మెయిల్, సెల్‌ఫోన్లు, సోషల్ మీడియా వంటి వాటి ద్వారా ప్రజలకు తెలియజేయడాన్ని డిజిటల్ మార్కెటింగ్ అంటారు.
- 1990, 2000 నుంచి డిజిటల్ మార్కెటింగ్ అభివృద్ధి చెందింది. ప్రతి వ్యాపార ప్రకటనకు టెక్నాలజీనే ఉపయోగిస్తున్నారు. ప్రజల రోజువారీ జీవితాల్లో టెక్నాలజీ ఒక భాగమైనందున సంస్థలకు చెందిన వస్తువుల ప్రచారం కోసం డిజిటల్ మార్కెట్ అనేది చాలా అవసరంగా మారింది. దీంతో డిజిటల్ మార్కెట్‌కు గిరాకీ పెరిగింది.
- ప్రస్తుతం విద్య, వైద్యం, వినోదం తదితర ఏ రంగంలోనైనా డిజిటల్ మార్కెటింగ్ అనేది కీలకంగా మారింది. ఎక్కడ చూసినా సాంకేతికత రాజ్యమేలుతుంది. దీంతో కంపెనీలు తమ ఉత్పత్తులు, సంస్థల అభివృద్ధి ప్రచారాల కోసం డిజిటల్ మార్కెటింగ్‌పై దృష్టి సారిస్తున్నాయి. తక్కువ ఖర్చుతో తమ ఉత్పత్తులను ప్రజల ముందుకు తీసుకువచ్చేందుకు దీన్ని గుర్తిస్తున్నాయి. కాబట్టి దీన్ని కెరీర్‌గా ఎంచుకుంటే భవిష్యత్తుకు భరోసా ఉంటుంది.
- డిజిటల్ మార్కెటింగ్‌కు ఎక్కువగా ఉపయోగపడేది ఇంటర్నెట్. దీంతోపాటు టెక్స్ట్ మెసేజెస్, యాప్‌లు, ఎలక్ట్రానిక్ బిల్‌బోర్డులు, డిజిటల్ టెలివిజన్, రేడియో మొదలైనవి కూడా డిజిటల్ మార్కెటింగ్‌కు చాలా అనువైన సాధనాలు.

డిజిటల్ మార్కెటింగ్ ఎందుకంత ముఖ్యం
- స్మార్ట్‌ఫోన్ వచ్చినంక ప్రపంచాన్ని మొత్తం అరచేతిలోనే చూస్తున్నారు. దీంతో వినియోగదారులు ఎక్కడైనా, ఎప్పుడైనా, వారు కోరుకున్న ప్రదేశాల్లో ఉత్పత్తుల గురించి తెలుసుకోవచ్చు. సంస్థల ఉత్పత్తులను డిజిటల్ మార్కెటింగ్ ద్వారా ప్రమోషన్ చేయడంతో దేనివల్ల ప్రయోజనం కలుగుతుంది, దేనివల్ల ప్రయోజనం లేదు అనే అంశాలను విశ్లేషించుకోడానికి వీలుపడుతుంది.
- వినోదం, వార్తలు, షాపింగ్, సామాజిక సంబంధాలు వంటి వాటిలో డిజిటల్ మార్కెటింగ్ దినదినాభివృద్ధి చెందుతుంది. కాబట్టి ప్రతి ఉత్పత్తి గురించి వినియోగదారుల ముంగిటకు తెచ్చేందుకు కంపెనీలు డిజిటల్ మార్కెటింగ్‌ను ఒక సాధనంగా ఉపయోగించుకుంటున్నాయి.
- దీనివల్ల ఉత్పత్తి గురించి వినియోగదారుల ద్వారా వారి స్నేహితులు, బంధువులు, వారి గ్రూపులోని వారికి తెలియడంతో వారు కూడా దాని గురించి ఆరా తీసే అవకాశం ఉంటుంది. అంటే తక్కువ ఖర్చులో ఎక్కువ లాభం అన్నమాట.



డిజిటల్ మార్కెటింగ్‌కు ఉండాల్సిన నైపుణ్యాలు
- డిజిటల్ మార్కెటింగ్‌కు కంటెంట్ రైటింగ్, గ్రాఫిక్ డిజైన్, డాటా విశ్లేషణ, టెక్నికల్, వెబ్ డెవలపింగ్ వంటి నైపుణ్యాలు ఉండాలి.
- **కంటెంట్ రైటింగ్:** డిజిటల్ మార్కెటింగ్‌లో కంటెంట్ రైటింగ్ అనేది చాలా కీలకం. కంపెనీ గురించి, కంపెనీ అందించే ఉత్పత్తులు, సేవల గురించి వినియోగదారుడిని ఆకట్టుకునేలా క్లుప్తంగా, స్పష్టంగా, సూటిగా రాయాలి. వస్తువులు, సేవల ప్రత్యేకతలు కంటెంట్ రైటింగ్‌లో కళ్లకు ఉట్టిపడేలా కనిపించాలి. కంటెంట్ ఏ ఫార్మాట్‌లో ఉన్నప్పటికీ ముందు రాతపూర్వకంగా దాన్ని సిద్ధం చేయాలి. అందుకే కంటెంట్ అనేది డిజిటల్ మార్కెటింగ్ కార్యకలాపాలకు ఇంధనం లాంటిది. ఇమేజ్, ఆడియో, వీడియో, ఇన్ఫోగ్రాఫిక్, ఈ-బుక్స్, బ్లాగ్‌ల వంటి మొదలైన ఫార్మాట్లలో కంటెంట్ ఉంటుంది.
- **గ్రాఫిక్ డిజైనింగ్:** కంటెంట్‌ను అందంగా, ఆకర్షణీయంగా విజువలైజ్ చేయడమనేది గ్రాఫిక్ డిజైనర్ల విధి. కాబట్టి గ్రాఫిక్ డిజైనింగ్‌పై ప్రాథమిక అవగాహన ఉండాలి. ఇంకా ఫొటోషాప్ వచ్చినవాళ్లు గ్రాఫిక్ డిజైనింగ్ నేర్చుకుంటే చాలా ఉపయోగకరంగా ఉంటుంది. బ్యానర్ యాడ్స్, జిఫ్ ఇమేజ్, ఇన్ఫోగ్రాఫిక్స్ వంటి చోట్ల కూడా గ్రాఫిక్ డిజైనర్ల అవసరం ఉంటుంది.

ఉద్యోగావకాశాలు
- ప్రస్తుతం అత్యధిక ఉద్యోగావకాశాలు కల్పిస్తున్న రంగాల్లో డిజిటల్ మార్కెటింగ్ ఒకటి. విద్య, వైద్యం, వినోదం, రియల్ ఎస్టేట్ వంటి ఏ రంగంలోనైనాసరే డిజిటల్ మార్కెటింగ్ ప్రధానంగా మారింది. కాబట్టి ఈ రంగంలో లక్షల మంది నిపుణులు అవసరమని పలు సర్వేలు చెబుతున్నాయి. డిజిటల్ మార్కెటింగ్ నిపుణులు లేకపోవడంతో కంపెనీలు తమ ఉత్పత్తులను, సేవలను మార్కెటింగ్ చేయలేకపోతున్నాయి. దీంతో డిజిటల్ మార్కెటింగ్ నేర్చుకున్నవారికి ఉద్యోగావకాశాలు పుష్కలంగా లభిస్తున్నాయి.
- డిజిటల్ మార్కెటింగ్‌లో శిక్షణ తీసుకున్నవారు కంటెంట్ రైటర్లు, యానిమేటర్లు, గ్రాఫిక్ డిజైనర్లు, వెబ్ డెవలపర్లు, డాటా అనలిస్టులు, డిజిటల్ మార్కెటింగ్ మేనేజర్లు, కంటెంట్ మార్కెటింగ్ మేనేజర్లు, సోషల్ మీడియా మార్కెటింగ్ ఎక్స్‌పర్ట్స్, సెర్చ్ ఇంజిన్ మార్కెటర్స్, సెర్చ్ ఇంజిన్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్స్‌గా వారివారి నైపుణ్యాన్ని బట్టి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఇవేకాకుండా సోషల్ మీడియా మార్కెటింగ్, కంటెంట్ మార్కెటింగ్, కమ్యూనిటీ మేనేజ్‌మెంట్, డిజిటల్ అకౌంట్ మేనేజ్‌మెంట్, అఫిలియేట్ మార్కెటింగ్, కంటెంట్ స్ట్రాటజీ, డిజిటల్ అడ్వర్టయిజింగ్, డిజిటల్ మార్కెటింగ్ స్ట్రాటజీ, ఈ-మెయిల్ మార్కెటింగ్, మొబైల్ కామర్స్, ఈ-కామర్స్, ఇన్ఫో గ్రాఫిక్స్, ఇన్‌బౌండ్ మార్కెటింగ్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్, వెబ్ అనలిటిక్స్, యూజర్ ఎక్స్‌పీరియన్స్ వంటి విభాగాల్లో కూడా ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయి.
- స్మార్ట్‌ఫోన్ల రాకతో మనదేశంలో కూడా ఇంటర్నెట్‌ను ఎక్కువగా వినియోగిస్తున్నారు. ప్రపంచాన్ని అరచేతిలో చుట్టేస్తున్నారు. ఆన్‌లైన్ షాపింగ్, వినోదం, వార్తలు, సామాజిక అంశాలు తెలుసుకోవడంలో డిజిటల్ మీడియా ప్రధాన వనరుగా మారింది. దీంతో డిజిటల్ మార్కెటింగ్ అనేది ఎవర్‌గ్రీన్ ఉపాధిగా మారింది.
- ఫ్రీలాన్సర్‌గా కూడా ఉపాధి పొందవచ్చు. అంటే ఒక నిర్ణీత డిజిటల్ మార్కెటింగ్ పని కోసం గాని, ఒక ప్రాజెక్ట్ కోసం గాని పనిచేయడం. ఎవరిదైనా వ్యాపారాన్ని ఆన్‌లైన్‌లోకి తీసుకెళ్లాలనుకుంటే తక్కువ ఖర్చుతో ఎలా ప్రమోట్ చేయవచ్చో యజమానికి తెలపడం.
- డిజిటల్ మార్కెటింగ్ మీద మంచి నైపుణ్యం ఉంటే సొంతంగా డిజిటల్ మార్కెటింగ్ ఏజెన్సీని ప్రారంభించి నలుగురికి ఉపాధి కల్పించవచ్చు.

కోర్సులు-సంస్థలు
- అమెరికాలోని ఎమిరిటస్ యూనివర్సిటీ పీజీ డిప్లొమా ఇన్ డిజిటల్ బిజినెస్ కోర్సును అందిస్తుంది. ఇది 9 నెలల కోర్సు. 2019, మార్చి 4 దరఖాస్తులకు చివరితేదీ. ఇతర వివరాలకు www.emeritus.org వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
- నోయిడాలోని అమైటీ యూనివర్సిటీ పీజీ డిప్లొమా ఇన్ మార్కెటింగ్ మేనేజ్‌మెంట్ స్ట్రాటజీ కోర్సును ఆఫర్ చేస్తుంది. ఇది 12 నెలల కోర్సు. 2019, మార్చి నుంచి బ్యాచ్ ప్రారంభంకానున్నది. ఇతర వివరాలకు www.amity.edu వెబ్‌సైట్‌ను చూడవచ్చు.
- ముంబైలోని నర్సీమోంజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఇన్ డిజిటల్ మార్కెటింగ్ కోర్సును అందిస్తుంది. ఇది 6 లేదా 11 నెలల ఆన్‌లైన్ ప్రోగ్రామ్. ఇతర వివరాలకు www.nmims.edu వెబ్‌సైట్‌ను చూడవచ్చు.
- ప్రైవేట్ కంప్యూటర్ శిక్షణ సంస్థ ఎన్ఐఐటీ వివిధ కోర్సులను అందిస్తుంది. ఇతర వివరాలకు వెబ్‌సైట్ www.niitdigitalmarketing.comలో సంప్రదించవచ్చు.
- హైదరాబాద్‌లో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ డిజిటల్, సోషల్ మీడియా మార్కెటింగ్‌పై స్వల్పకాలిక కోర్సులను అందిస్తుంది. అన్నపూర్ణ ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ ఫిల్మ్ అండ్ మీడియా అడ్వర్టయిజింగ్, డిజిటల్ మార్కెటింగ్‌లో మాస్టర్స్ ఇన్ మాస్ కమ్యూనికేషన్ కోర్సును అందిస్తుంది.
- ఇవేకాకుండా డిగోమైండ్స్, డిజిటల్ గన్నెట్, పీపీసీఆర్‌ఏ, డీఎస్ఐఎం, ఇంటర్‌పబ్లికో, డిజిక్రాగ్, శంకర్‌రెడ్డి, ఇంక్ రిజల్ట్స్ వంటి ప్రైవేట్ సంస్థలు డిజిటల్ మార్కెటింగ్‌లో శిక్షణ ఇస్తున్నాయి.

- **టెక్నికల్ స్కిల్స్:** డిజిటల్ మార్కెటింగ్ టెక్నాలజీతో ముడిపడి ఉంది. కాబట్టి టెక్నికల్ స్కిల్స్ కూడా ఉండాలి. ఎందుకంటే వెబ్‌సైట్ డెవలప్ చేయాలంటే వెబ్‌సైట్ టెక్నాలజీపై అవగాహన అవసరం ఉంటుంది.
- **డాటా విశ్లేషణ:** ఎంతమంది ఏయే వెబ్‌సైట్లను వీక్షిస్తున్నారు, తమ వెబ్‌సైట్‌ను చూసేవారు ఎంతమంది, ఏ వస్తువులను వినియోగదారులు ఇష్టపడుతున్నారు వంటి విషయాలను విశ్లేషించి డాటాను తయారుచేయాలి. ఇందుకు సంబంధించి మంచి డాటా స్కిల్స్ ఉండాలి.

రిక్రూటర్స్
- గూగుల్, డెల్, మైక్రోసాఫ్ట్, ఏటీ అండ్ టీ, ఈఎంసీ2, సెర్చ్ హోల్డింగ్ కార్పొరేషన్, ఎన్‌బీసీ యూనివర్సల్, హనీవెల్, ఈబే, వీఎంవేర్ వంటి కంపెనీలు డిజిటల్ మార్కెటింగ్ కోర్సు చేసినవారిని రిక్రూట్ చేసుకుంటున్నాయి.



- వీరికి ప్రారంభంలో నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు వేతనం లభిస్తుంది. తర్వాత పనితీరు, అనుభవాన్ని బట్టి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు జీతం లభిస్తుంది.

... సత్యం చాపల

సైన్స్ ఎడ్యుకేషన్‌లో పీహెచ్‌డీ



ముంబై టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రిసెర్చ్ (టీఐఎఫ్ఆర్) పీహెచ్‌డీ కోర్సులో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **వివరాలు:** టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రిసెర్చ్‌లోని హోమిబాబా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్ ఈ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తుంది.
- **కోర్సు:** పీహెచ్‌డీ
- **పరిశోధన విభాగాలు:** టీచింగ్ అండ్ లెర్నింగ్ ఆఫ్ సైన్స్ అండ్ మ్యాథ్స్ (ప్రైమరీ నుంచి డిగ్రీ వరకు), విజువల్ అండ్ స్పాటియల్ మోడ్స్ ఆఫ్ లెర్నింగ్, సైన్స్-టెక్నాలజీ-సొసైటీ- ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్- సైన్స్ ఆఫ్ లెర్నింగ్ అండ్ కంప్యుటేషనల్ మీడియా, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, మ్యాథ్స్, ఆస్ట్రానమి, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ ఎడ్యుకేషన్ తదితర విభాగాలు ఉన్నాయి.
- **అర్హతలు:** ఎమ్మెస్సీ (ఏదైనా సబ్జెక్టు) లేదా ఎంటెక్/ ఎంఏ/ఎంఎస్‌డబ్ల్యూలో సోషల్ లేదా బీహేవియరల్ సైన్సెస్/సైకాలజీ లేదా లింగ్విస్టిక్స్, సోషియాలజీ, ఎకనామిక్స్, ఆంత్రోపాలజీ. ఎంఈడీ (సైన్స్/సోషల్ సైన్సెస్).
- **స్కాలర్‌షిప్స్:** రిజిస్ట్రేషన్ వరకు నెలకు రూ.25,000/-, పోస్ట్ రిజిస్ట్రేషన్ తర్వాత నెలకు రూ.28,000/- వీటికి అదనంగా 30 శాతం హెచ్‌ఆర్‌ఏ, ఏడాదికి ఒకసారి కంటింజెన్సీ కింద రూ.32వేలు ఇస్తారు.
- **ఎంపిక:** అర్హులైన అభ్యర్థులకు రాతపరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహించి ఎంపిక చేస్తారు.
- **రాతపరీక్ష కేంద్రం:** రాష్ట్రంలో హైదరాబాద్
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 31
- **రాతపరీక్ష తేదీ:** మే 19
- **వెబ్‌సైట్:** http://www.hbcse.tifr.res.in

సుడోకు

డైలీ సుడోకు 49 సమాధానం

4	8	9	1	6	3	5	2	7
1	5	6	7	8	2	3	9	4
7	2	3	4	9	5	8	6	1
6	3	7	8	1	9	4	5	2
8	4	5	2	3	7	6	1	9
9	1	2	6	5	4	7	8	3
2	6	4	5	7	1	9	3	8
3	7	8	9	2	6	1	4	5
5	9	1	3	4	8	2	7	6

డైలీ సుడోకు -50


	1		6				9	
	8			3				2
5		7						4
1	2						7	
			1				5	
9					8			
		2			3	4		1
6	5	1						7
							6	

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

నమస్తే తెలంగాణ
చిత్రం
[హైదరాబాద్]
సోమవారం 28 జనవరి 2019

ట్రాన్స్‌జెండర్ పాత్రలో..


అమితాబ్ బచ్చన్

రాఘువ లారెన్స్ కథానాయకుడిగా నటించి దర్శకత్వం వహించిన 'కాంచన' చిత్రం తమిళ, తెలుగు భాషల్లో పెద్ద విజయాన్ని సొంతం చేసుకున్నది. హారర్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ చిత్రాన్ని బాలీవుడ్‌లో రీమేక్ చేసేందుకు లారెన్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ రీమేక్‌లో అక్షయ్‌కుమార్ కథానాయకుడిగా నటించనున్నట్లు సమాచారం. తమిళ మాతృకలో శరత్‌కుమార్ చేసిన ట్రాన్స్‌జెండర్ పాత్ర కోసం బాలీవుడ్ దిగ్గజ నటుడు అమితాబ్‌బచ్చన్‌ను తీసుకున్నట్లు తెలిసింది. నటనకు ప్రాధాన్యమున్న ఛాలెంజింగ్ పాత్ర కావడంతో ఈ సినిమాలో నటించడానికి అమితాబ్‌బచ్చన్ సంసిద్ధత వ్యక్తం చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. కరీనాకపూర్ కథానాయికగా నటించనున్నట్లు తెలిసింది. లారెన్స్ దర్శకత్వంలో రూపొందనున్న ఈ చిత్రం ఈ ఏడాది ద్వితీయార్థంలో సెట్స్‌పైకి రానున్నట్లు సమాచారం. ఈ సినిమాతో లారెన్స్ బాలీవుడ్ చిత్రసీమలో దర్శకుడిగా ఎంట్రీ ఇస్తున్నారు.


వరుణ్‌తేజ్‌పై క్లాప్‌నిస్తున్న ఆయన సోదరి నిహారిక

వరుణ్‌తేజ్ 'వాల్మీకి'

వరుణ్‌తేజ్ కథానాయకుడిగా 14 రీల్స్ ప్లస్ పతాకంపై రూపొందుతున్న చిత్రం 'వాల్మీకి'. హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట నిర్మిస్తున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో లాంఛనంగా ఈ చిత్రం ప్రారంభమైంది. పూజా కార్యక్రమాల అనంతరం హీరో వరుణ్‌తేజ్‌పై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి నిహారిక కొణిదెల క్లాప్‌నివ్వగా, రామ్ బొబ్బ కెమెరా స్విఛాన్ చేశారు. వి.వి.వినాయక్ గౌరవ దర్శకత్వం వహించారు. దర్శకుడు సుకుమార్ పూజా కార్యక్రమాల్ని నిర్వహించారు. సినిమాకు సంబంధించిన పూర్తి వివరాల్ని త్వరలో వెల్లడిస్తామని చిత్రబృందం ప్రకటించింది. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్, సినిమాటోగ్రఫీ: అయానంకా బోస్, కథ: కార్తీక్ సుబ్బరాజు, స్క్రీన్‌ప్లే: మధు, చైతన్య, ఆర్ట్: అవినాష్ కొల్ల, ఎడిటింగ్: ఛోటా.కె.ప్రసాద్, ఫైట్స్: రామ్ లక్ష్మణ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: హరీష్ కట్టా.

తెలుగులో అరంగేట్రం!


పరిణీతి చోప్రా

యువతరంలో మంచి ఫాలోయింగ్ ఉన్న బాలీవుడ్ కథానాయికల్లో పరిణీతిచోప్రా ఒకరు. 'ఇషక్‌జాదే' 'గోల్‌మాల్ ఎగైన్' 'నమస్తే ఇంగ్లాండ్' చిత్రాలు ఈ భామకు చక్కటి గుర్తింపును తీసుకొచ్చాయి. అందం, అభినయం మేలికలయికగా సొగసరి అభిమానుల్ని మెప్పిస్తున్నది. పరిణీతిచోప్రా దక్షిణాది అరంగేట్రం గురించి గత కొంతకాలంగా వార్తలొస్తున్నాయి. అయితే అవేవి కార్యరూపం దాల్చలేదు. తాజా సమాచారం ప్రకారం ఈ సుందరి రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న 'ఆర్.ఆర్.ఆర్' చిత్రంలో కథానాయికగా నటించనున్నట్లు తెలిసింది. ఎన్టీఆర్, రామ్‌చరణ్ కథానాయకులుగా నటిస్తున్న ఈ భారీ మల్టీస్టారర్ ప్రస్తుతం చిత్రీకరణ జరుపుకుంటున్నది. ఇద్దరు హీరోలపై కొన్ని కీలక ఘట్టాలను తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో బాలీవుడ్ కథానాయికల్ని తీసుకునే ఆలోచనలో దర్శకుడు రాజమౌళి ఉన్నట్లు తెలిసింది. హిందీలో కూడా భారీ స్థాయిలో ఈ సినిమాను విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. అందుకు తగినట్లుగానే హిందీ చిత్రసీమలో మంచి ఫాలోయింగ్‌ను ఉన్న నాయికల్ని ఎంపిక చేసుకోవాలనుకుంటున్నారట. ఇద్దరు కథానాయికల్లో తొలుత పరిణీతి చోప్రాను ఖరారు చేశారని తెలిసింది. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాల్ని త్వరలో వెల్లడించనున్నారు. ప్రస్తుతం పరిణీతిచోప్రా హిందీలో 'కేసరి' 'జబారియా జోడీ' అనే చిత్రాల్లో కథానాయికగా నటిస్తున్నది.

'ప్రేమ, రాజకీయ ఇతివృత్తాలతో కూడిన సినిమాలంటే నాకు చాలా ఇష్టం. దర్శకుడిగా అలాంటి కథలతో సినిమాలు చేయడమే సౌకర్యంగా భావిస్తాను' అని అన్నారు వెంకీ అట్లూరి. ఆయన దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'మిస్టర్ మజ్ను'. అఖిల్, నిధి అగర్వాల్ జంటగా నటించారు. బి.వి.ఎస్.ఎన్ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో వెంకీ అట్లూరి పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ విశేషాలివి...

ఏఎన్నార్ పాత్ర స్ఫూర్తితో..


వెంకీ అట్లూరి

సినిమాకు లభిస్తున్న స్పందన చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది. కుటుంబ బంధాలు, వినోదంతో పాటు అఖిల్ నటనను ప్రతి ఒక్కరూ ఆస్వాదిస్తున్నారు. 'ప్రేమ్‌నగర్' సినిమాలో అక్కినేని నాగేశ్వరరావు పాత్రను స్ఫూర్తిగా తీసుకొని ఈ కథ రాసుకున్నాను. చరిత్రలో మజ్ను జీవితం విషాదంగా ముగిసిపోయింది. అందుకు భిన్నంగా ఈ సినిమాను హ్యాపీ ఎండింగ్‌తో ముగించాం. తుంటరి లవర్‌బాయ్‌గా అఖిల్ ఈ సినిమాలో కనిపిస్తారు. అందుకే టైటిల్ ముందు మిస్టర్ అనే పదాన్ని జోడించాం. నిర్మాత, అఖిల్‌తో పాటు టీమ్ అందరూ సినిమా ఫలితం పట్ల సంతృప్తితో ఉన్నారు. ఈ సినిమాకు తొలి ప్రేక్షకుడు హీరో నాగార్జున. తొలుత కథ వినడంతో పాటు షూటింగ్ పూర్తయిన తర్వాత సినిమా చూసి బాగుందని మెచ్చుకున్నారు. తెలుగు చిత్రసీమలో ఉన్న రెండో సినిమా సెంటిమెంట్‌ను దృష్టిలో పెట్టుకొని షూటింగ్ మొదలుపెట్టినప్పుడు చాలా టెన్షన్ పడ్డాను. ఇప్పుడా భయం పోయి ధైర్యం వచ్చింది.

విమర్శలు స్వీకరించాల్సిందే..

ఈ సినిమాపై కొన్ని విమర్శలు వినిపించాయి. సగటు ప్రేక్షకుల నుంచి కాకుండా సమీక్షకుల నుంచే ఆ మాటలు వినిపించాయి. వారే నా 'తొలి ప్రేమ' సినిమా బాగుందని రాశారు. అప్పుడు ఆనందపడి ఇప్పుడు వారిపై కోపం తెచ్చుకోవడం సరికాదనిపించింది. ఆ విమర్శల్ని స్వీకరిస్తున్నాను. సినిమా అందరికి నచ్చాలని లేదు.

రెండో టేక్ తీసుకోలేదు..

'తొలిప్రేమ'తో పాటు ఈ సినిమా విషయంలో కథా పరంగా నిర్మాత దిల్‌రాజు విలువైన సూచనలు ఇచ్చారు. ఆయన మనవడు అరాన్ష్ ఈ సినిమాలో చిన్న పాత్రను పోషించారు. ఏడాదిన్నర వయసే కానీ అర్షాన్ చాలా హుషారుగా కనిపిస్తాడు. నా నమ్మకానికి తగినట్లుగానే అరాన్ష్ రెండో టేక్ తీసుకోకుండా సన్నివేశాన్ని పూర్తిచేశారు.

మణిరత్నం నాకు స్ఫూర్తి..

నటనతో పోలిస్తే కథలు, మాటలు రాయడంలోనే నాకు ఎక్కువ సంతృప్తి దొరుకుతుంది. 'స్నేహగీతం' సినిమాకు సంభాషణలు రాశాను. ఆ తర్వాత దర్శకత్వంపై దృష్టి సారించాను. మణిరత్నం, త్రివిక్రమ్ ప్రభావం నాపై చాలా ఉంది. సంభాషణలు రాయడంలో, సినిమా రూపకల్పనలో వారిని స్ఫూర్తిగా తీసుకుంటాను.

ఎన్టీఆర్‌తో సినిమా..


తదుపరి సినిమా కోసం కథలు సిద్ధం చేసుకుంటున్నాను. మైత్రీ మూవీస్‌తో పాటు ఇతర నిర్మాణ సంస్థలతో కొన్ని కమిట్‌మెంట్స్ ఉన్నాయి. అఖిల్‌తో మరో సినిమా చేయాలని అనుకుంటున్నాను. ఎన్టీఆర్‌తో మంచి అనుబంధం ఉంది. దర్శకుడిగా మరింత అనుభవం సంపాదించుకున్న తర్వాత తప్పకుండా ఆయనతో సినిమా చేస్తాను. నాగార్జున నటించిన గీతాంజలి, శివ, అన్నమయ్య సినిమాలంటే నాకు చాలా ఇష్టం. కుదిరితే ఆయనతో సినిమా చేస్తాను.

నానికి జోడీగా..?

మలయాళ చిత్రం 'ఒరు ఆడార్ లవ్'లోని ఓ సన్నివేశంలో తన కన్నుగీటుతో దేశ వ్యాప్తంగా పాపులారిటీని సొంతం చేసుకుంది ప్రియా ప్రకాష్ వారియర్. 'లవర్స్ డే' పేరుతో తెలుగులో ఈ చిత్రం ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకురాబోతోంది. తొలి చిత్రం విడుదలకు ముందే ప్రియా ప్రకాష్ వారియర్ తెలుగులో బంపర్ ఆఫర్‌ను సొంతం చేసుకుందని తెలిసింది. గత ఏడాది రెండు చిత్రాల్లో మాత్రమే నటించిన హీరో నాని ఈ సంవత్సరం సినిమాల విషయంలో స్పీడు పెంచారు. ప్రస్తుతం 'మళ్లీ రావా' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రూపొందుతున్న 'జెర్సీ' చిత్రంలో నటిస్తున్న నాని ఈ సినిమాతో పాటు విక్రమ్ కె. కుమార్ చిత్రాన్ని కూడా అంగీకరించిన విషయం తెలిసిందే. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీమేకర్స్ సంస్థ నిర్మించబోతోంది. ఫిబ్రవరిలో చిత్రీకరణ ప్రారంభం కానున్న ఈ చిత్రం కోసం నానికి జోడీగా ప్రియా ప్రకాష్ వారియర్‌ను దర్శకుడు ఇటీవల సంప్రదించారని, ఈ చిత్రంలో నటించడానికి ఆమె సుముఖంగా వుందని, త్వరలో మరిన్ని వివరాలు వెల్లడవుతాయని తెలిసింది.


ప్రియా ప్రకాష్ వారియర్

గోవిందుడి వినోదం


సప్తగిరి

సప్తగిరి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'వజ్ర కవచధర గోవింద'. అరుణ్ పవార్ దర్శకుడు. శివ ఫిలిమ్స్ పతాకంపై నరేంద్ర, జీవీఎస్ రెడ్డి నిర్మిస్తున్నారు. వైభవీ జోషి కథానాయిక. ఆదివారం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'ఇందులో సప్తగిరి చిలిపి దొంగ పాత్రలో కనిపిస్తాడు. అతని పేరు గోవిందు. ఒక లక్ష్య సాధన కోసం గోవిందు ఏం చేశాడన్నది ఆద్యంత వినోదాత్మకంగా సాగుతుంది. సప్తగిరి బాడీలాంగ్వేజ్‌కు చక్కగా సరిపోయే కథ ఇది. కథానుగుణంగానే టైటిల్ పెట్టాం యాక్షన్, సెంటిమెంట్‌తో పాటు చక్కటి హాస్యంతో అందరిని నవ్విస్తుంది' అన్నారు. 'ఎనభైశాతం చిత్రీకరణ పూర్తయింది. మిగతా సన్నివేశాలను కర్ణాటకలోని ఓ గుడిలో తెరకెక్కిస్తాం. టైటిల్ అందరిని ఆకట్టుకుంటున్నది' అని నిర్మాత తెలిపారు. అర్చనా వేద, టెంపర్ వంశీ, అప్పారావు, అవినాష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కథ: జి.టి.ఆర్.మహేంద్ర, సంగీతం: విజయ్ బుల్గానిన్, కెమెరా: ప్రవీణ్ వనమాలి, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: ఆరుణ్‌పవార్.

రొమాంటిక్ ప్రేమకథ!


మిషాన్, హేమలత

మిషాన్ జైన్, హేమలతా రెడ్డి జంటగా శుక్లా ప్రొడక్షన్స్ పతాకంపై సంజయ్ జాదవ్ ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వి.యస్.ఫణీంద్ర దర్శకుడు. టాకీ పార్ట్ పూర్తయింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'యువతను ఆకట్టుకునే అంశాలతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. రొమాంటిక్ ప్రేమ కథతో ఆద్యంతం ఆసక్తికరంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. నాయకనాయికల పాత్రలు కొత్త పంథాలో సాగుతూ బోల్డ్‌గా వుంటాయి. రాజా రవీంద్ర కీలక పాత్రలో నటిస్తున్నారు. విభిన్నమైన కథతో రూపొందుతున్న ఈ చిత్రం తప్పకుండా అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుందనే నమ్మకముంది. ఫిబ్రవరి 4 నుంచి పాటల చిత్రీకరణ మొదలుపెడతాం. దీంతో షూటింగ్ మొత్తం పూర్తవుతుంది' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: జి.కె. గోపీనాథ్ కాకర్ల, సంగీతం: హర్ష ప్రవీణ్, ఎడిటింగ్: రామారావు జె.పి, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: వి.యస్. ఫణీంద్ర.

రెండు మనసుల ప్రయాణం


చంద్రశేఖర్, ఆది, రవిచంద్ర

ఆది పినిశెట్టి దర్శకత్వం వహిస్తున్న చిత్రం ' ఈ 2 మనసులు'. రవిచంద్ర, సుమయ జంటగా నటిస్తున్నారు. చంద్రశేఖర్.ఎస్ నిర్మిస్తున్నారు. శనివారం హైదరాబాద్‌లో టీజర్‌ను చిత్రబృందం విడుదలచేసింది. దర్శకుడు మాట్లాడుతూ 'ప్రేమ, కుటుంబ బంధాలకు ప్రాధాన్యమున్న చిత్రమిది. రెండు మనసుల ప్రణయ మధురిమలకు అందమైన దృశ్యరూపంగా ఉంటుంది. డెబ్బై శాతం చిత్రీకరణ పూర్తయింది. చివరి షెడ్యూల్‌ను ఫిబ్రవరిలో చిత్రీకరిస్తాం. వేసవిలో సినిమాను విడుదల చేస్తాం' అని చెప్పారు. నూతన నటీనటులు, సాంకేతికనిపుణులతో తెరకెక్కించిన చిత్రమిదని, రొటీన్ భిన్నంగా సరికొత్త ప్రేమ కథతో తెలుగు ప్రేక్షకుల్ని అలరిస్తుందని నిర్మాత చెప్పారు. రంగి, మహేష్, కాదంబరి కిరణ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: నందన్‌కృష్ణ, సంగీతం: జీవీఎం గౌతమ్.

అంధుడి సమరం


శివ కంఠంనేని

'సస్పెన్స్ థ్రిల్లర్ కథాంశంతో తెరకెక్కిన చిత్రమిది. ప్రారంభం నుంచి ముగింపు వరకు ఆద్యంతం ప్రేక్షకులను ఉత్కంఠకు లోనుచేస్తుంది' అని అన్నారు శివ కంఠంనేని. ఆయన ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'అక్కడొకడుంటాడు'. శ్రీపాదవిశ్వక్ దర్శకత్వం వహించారు. రామ్‌కార్తిక్, శివహరీష్, అలేఖ్య, రసజ్ఞదీపిక నాయకానాయికలు. కె.శివశంకరరావు, రావుల వెంకటేశ్వరరావు నిర్మించారు. ఫిబ్రవరి 1న ఈ చిత్రం విడుదలకానుంది. ఈ సందర్భంగా ఇటీవల హైదరాబాద్‌లో శివ కంఠంనేని పాత్రికేయులతో ముచ్చటిస్తూ 'విహారయాత్రకు వెళ్లిన ఓ ప్రేమజంట అనుకోకుండా ప్రమాదంలో చిక్కుకుంటారు. ఆ విపత్తు నుంచి తప్పించుకునే క్రమంలో అడవిలో అడుగుపెట్టిన వారికి అక్కడ ఎలాంటి అనూహ్య పరిణామాలు ఎదురయ్యాయి?. ఓ ఫారెస్ట్ ఆఫీసర్ సహాయంతో సురక్షితంగా ఎలా బయటపడ్డారన్నది ఆకట్టుకుంటుంది. ఇందులో అంధుడిగా నా పాత్ర ఛాలెంజింగ్‌గా ఉంటుంది. ప్రతినాయక ఛాయలతో సాగే మంచివాడిగా నటనకు ఆస్కారమున్న పాత్రలో కనిపిస్తాను. నటుడిగా గతంలో దాదార్ ఎక్స్‌ప్రెస్, అంకురం, మహాజనానికి మరదలుపిల్ల వంటి సినిమాలు చేశాను. కొంత విరామం తర్వాత నేను ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా ఇది. డీమానిటైజేషన్, డ్రంకన్‌డ్రైవ్, నల్లధనంతో పాటు పలు సామాజిక అంశాలను స్పృశిస్తూ వినూత్నమైన పాయింట్‌తో దర్శకుడు శ్రీపాదవిశ్వక్ ఈ సినిమాను తెరకెక్కించారు. ఇటీవల విడుదలైన పాటలకు మంచి స్పందన లభిస్తున్నది. కొత్తదనం కోరుకునే ప్రతి ఒక్కరిని ఈ సినిమా మెప్పిస్తుంది' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రావుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.